
శ్రీ మాతృ కృప

గడ్డిపల్లి అభ్యుదయము




డా॥ వి. మన్‌మోహన్ రెడ్డి గారి సౌజన్యంతో

ది మదర్స్ ఇంటగ్రల్ స్కూల్


విద్యానగర్, హైద్రాబాద్ - 44.

శ్రీ మాతృ కృప - గడ్డిపల్లి అభ్యుదయము



గడ్డిపల్లి అభ్యుదయ భాగ్యవిధాతలు


శ్రీ మాతారవిందులు



శ్రీ మాతృ కృప

గడ్డిపల్లి అభ్యుదయము

శ్రీ గంటా గోపాలరెడ్డి గారి జీవిత విశేషములు





రచన, కూర్పు :

జలదంకి సురేంద్రాచార్యులు

ది మదర్స్ ఇంటగ్రల్ స్కూల్

విద్యానగర్, హైద్రాబాద్ - 44.






శ్రీ మాతృ కృప

గడ్డిపల్లి అభ్యుదయము

శ్రీ గంటా గోపాలరెడ్డి గారి జీవిత విశేషములు



రచన, కూర్పు :

జలదంకి సురేంద్రాచార్యులు


ది మదర్స్ ఇంటగ్రల్ స్కూల్


విద్యానగర్, హైద్రాబాద్ - 44.

TO DOWNLOAD THE BOOK CLICK THE LINK GIVEN IN THE DESCRIPTION.....

ఈ పుస్తకము DOWNLOAD చేయాలనుకుంటే DESCRPTION లో

ఇవ్వబడిన LINK CLICK చేయండి........






Sri Matri Kripa - Gaddipally Abhyudayamu

శ్రీ మాతృ కృప - గడ్డిపల్లి అభ్యుదయము

శ్రీ గంటా గోపాలరెడ్డి గారి జీవిత విశేషములు

ప్రథమ ముద్రణ	:	ఫిబ్రవరి 2011
ప్రతులు	:	2000
వెల	:	అమూల్యము
స్వామ్యములు	:	శ్రీ అరవింద సొసైటి, పుదుచ్చేరి.
ప్రకాశకులు	:	ది మదర్స్ ఇంటగ్రల్ స్కూల్ విద్యానగర్, హైద్రాబాద్ - 44.
ప్రాప్తి స్థానములు	:	డా॥ గంటా గోపాలరెడ్డి శ్రీ అరవింద కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి, మం॥ గరిడేపల్లి, జి॥ నల్గొండ. - 508 201
ముద్రణ	:	శ్రీ వాసవి ప్రింటర్స్, సిద్ధిపేట. ఫోన్ : 9848192125

అంకితం



"All Nature dumbly calls to her alone
To heal with her feet the aching throb of life"
- Savitri

శ్రీమాత చరణారవిందములకు
ఓ పూజా పుష్పంగా ...

- రచయిత



గడ్డిపల్లి అభ్యుదయ రథసారథి

డా॥ గంటా గోపాల రెడ్డి గారు

ధర్మపత్ని శ్రీమతి రత్నమాల గారు



డా॥ గోపాలరెడ్డి గారి ధర్మపత్ని శ్రీమతి రత్నమాల గారు

నల్గొండ జిల్లాలోని తుంగతుర్తి వీరి జన్మస్థలము. ఆ గ్రామము లోని శ్రీ రాంరెడ్డి - రంగనాయకమ్మ దంపతుల ముద్దుబిడ్డ శ్రీమతి రత్నమాల. వీరి జననం 1938 సం॥లో జరిగినది. వీరు గ్రాడ్యుయేషన్ చదువుచున్నపుడు, 1953 సం॥లో, డా॥ గోపాలరెడ్డి గారితో వివాహము జరిగినది. చదువు అంతటితోనే ఆగిపోయినది.

సంసార జీవితము సుఖప్రదముగా సాగినది. ఈ దంపతులకు ఒక పుత్రుడు, యిర్వురు కుమార్తెలు కలిగినారు. కుమారుడు అజిత్, కుమార్తెలు మీరా, లక్ష్మి. డా॥ గోపాలరెడ్డి గారు అమెరికా నుండి ఉన్నత చదువులను పూర్తి చేసుకొని వచ్చిన పిమ్మట, కుమారుడైన అజిత్‌ను చదువునకై పాండిచ్చేరిలోని శ్రీ అరవిందాశ్రమ విద్యాలయంలో చేర్చినారు. అతని విద్య పూర్తి అయిన పిదప అతడు శ్రీమాత సన్నిధిలో వుండుటకు, ఆశ్రమములో చేరిపోయెను. కుమార్తెలు యిర్వురు ఉన్నత విద్యనార్జించి, గృహస్థాశ్రమాన్ని స్వీకరించి, తమ భర్తలతో అమెరికాలో నివాసముంటున్నారు.

డా॥ గోపాలరెడ్డి గారు నిరంతరం గడ్డిపల్లి ప్రాజెక్టు పనులందు నిమగ్నులగుట వలన, వారి వ్యవసాయ నిర్వహణా బాధ్యతలను వారి సహధర్మచారిణి శ్రీమతి రత్నమాల గారే, ఒక మేనేజరు, యిద్దరు సహాయకుల సహకారముతో చూచు చున్నారు. స్థానిక పాఠశాలలో చదివే ఒకరిద్దరు విద్యార్థులను తమ ఇంటిలోనే వుంచుకొని చదివించుచున్నారు. ఆ పిల్లలు అమ్మగారికి ఇంటి పనులందు సహాయపడుదురు.

తమ పాలేర్లకు, యిరుగు పొరుగు వారికి సహాయపడుచు, వారి కష్టము లలో పాలు పంచుకొందురు. ప్రతినిత్యం సాయం సమయములలో సమీపమందే యున్న 'శ్రీ అరవింద ధ్యాన మందిరము'న ధ్యాన మొనరించెదరు. శ్రీమాతార విందుల గ్రంథముల పఠనము నందు ఆసక్తిని కనబరచెదరు.



శ్రీ అరవిందాశ్రమము, పుదుచ్చేరి నుండి దివ్యమాత ప్రసాదించిన,
పరమ పవిత్రమైన శ్రీ అరవిందుల దేహాంశములను (Relics)
గడ్డిపల్లి తీసుకవస్తున్న డా॥ గోపాలరెడ్డి, ప్రొ॥ వి. మధుసూదన్ రెడ్డి ...
సాగనంపుచున్న ఆశ్రమ పెద్దలు



గడ్డిపల్లి ధ్యానమందిరములో పరమపూజ్య
శ్రీ అరవిందుల పవిత్ర దేహాంశముల (Relics) ను
ప్రతిష్ఠించుచున్న చిన్నారులు, చి॥ మీరా, చి॥ లక్ష్మి, కుటుంబ సభ్యులు,
ఆశ్రమ పెద్దలు మరియు బంధుమిత్రులు

శ్రీ మాతృ కృప - గడ్డిపల్లి అభ్యుదయము

విషయ సూచిక

* * *

శ్రీ అరవిందుల వెలుగులో

గ్రామీణ వికాసానికి ఆద్యుడు గోపాల్ భాయ్

ఒక సందర్భములో శ్రీమాత తమ శిష్యులకు మూడు సూత్రాలతో కూడిన ఒక దివ్య సందేశము నిచ్చియున్నారు.

అవి To know is Good.
To Live is better.
To be, that is perfect.

ఈ మూడు సూత్రాలను ఆచరించిన అదృష్టశాలురు ఎవరైనా శ్రీ అరవిందులు దర్శించిన దివ్యమానవ సమాజ ఆవిష్కరణలో అగ్రగాములు కాగలరనుటలో ఏమాత్రం సందేహం లేదు. అవును. తెలుసుకొనడం మంచిదే. ఇలా తెలుసుకోవాలనే ఆకాంక్ష కలగడం కూడా అంత సాధారణ విషయము కాదు. అలాగే అలా తెలుసుకున్న దానితో ఆగిపోకుండా దానిని ఆచరించడం మరింత గొప్ప విషయం. అయినా అంతటితో పని పూర్తి కాలేదు. ఆ ఆచరణతో మమేకమై అదే జీవితం కావడం, ఆ ఆచరణకు ఒక ప్రతీకగా నిలవడం అదే పరిపూర్ణత అంటే.

శ్రీ అరవిందుల యోగం జీవితాన్ని నిరసించేది కాదు. జీవితాన్ని కాదని అన్నింటినీ త్యజించి సన్యాసం స్వీకరించి, ముక్తి పథాన్ని వెదుక్కొనడంతో సరిపెట్టుకొనేది కాదు. జీవితం అనేది భగవంతుని ప్రసాదం. ఆ జీవితాన్ని అన్నిరంగాలకూ విస్తరింపజేయడం, జీవన సమృద్ధిని సాధించడం, దానిని భగవంతునికి కర్మ క్షేత్రంగా నివేదించడం తద్వారా ఈ జీవితం ద్వారా ఆతడే విధంగా అభివ్యక్తం కాదలచుకున్నాడో ఆ విధంగా అయ్యేందుకు సంసిద్ధం గావడం. ఈ సృష్టికి మూలం అదే. ఒకడే అయిన భగవంతుడు తాను అనేకంగా మారాలి. ఆ అనేకం ద్వారా తనలోని అనంత కోటి సంపదను ఆవిష్కరించి ఆనందించాలి. అంతే తప్ప వచ్చినచోటికి వెళ్ళడంతో సరిపెట్టుకోదు. అలా ఒక ప్రక్క ఆయనతో ఒకటిగా వుంటూనే, అనేకంలో వ్యవహరించడం అనేది దైవ సంకల్పం. వెరసి శ్రీ అరవిందుల యోగం ముక్తితో సరిపెట్టుకొనేది మాత్రమే గాక, ఆ అనేకం ద్వారా తనలోని బహు విధ సంపదను ప్రకటించడం. అందుకు కావలసింది సమర్థత కాదు. సంసిద్ధత. సమర్థత అందరికీ వుంది. సంసిద్ధం కావడం మాత్రమే సాధకునివంతు.

* * *

శ్రీ అరవిందుల వెలుగులో

గ్రామీణ వికాసానికి ఆద్యుడు గోపాల్ భాయ్

ఒక సందర్భములో శ్రీమాత తమ శిష్యులకు మూడు సూత్రాలతో కూడిన ఒక దివ్య సందేశము నిచ్చియున్నారు.

అవి To know is Good.
To Live is better.
To be, that is perfect.

ఈ మూడు సూత్రాలను ఆచరించిన అదృష్టశాలురు ఎవరైనా శ్రీ అరవిందులు దర్శించిన దివ్యమానవ సమాజ ఆవిష్కరణలో అగ్రగాములు కాగలరనుటలో ఏమాత్రం సందేహం లేదు. అవును. తెలుసుకొనడం మంచిదే. ఇలా తెలుసుకోవాలనే ఆకాంక్ష కలగడం కూడా అంత సాధారణ విషయము కాదు. అలాగే అలా తెలుసుకున్న దానితో ఆగిపోకుండా దానిని ఆచరించడం మరింత గొప్ప విషయం. అయినా అంతటితో పని పూర్తి కాలేదు. ఆ ఆచరణతో మమేకమై అదే జీవితం కావడం, ఆ ఆచరణకు ఒక ప్రతీకగా నిలవడం అదే పరిపూర్ణత అంటే.

శ్రీ అరవిందుల యోగం జీవితాన్ని నిరసించేది కాదు. జీవితాన్ని కాదని అన్నింటినీ త్యజించి సన్యాసం స్వీకరించి, ముక్తి పధాన్ని వెదుక్కొనడంతో సరిపెట్టు కొనేది కాదు. జీవితం అనేది భగవంతుని ప్రసాదం. ఆ జీవితాన్ని అన్నిరంగాలకూ విస్తరింపజేయడం, జీవన సమృద్ధిని సాధించడం, దానిని భగవంతునికి కర్మ క్షేత్రంగా నివేదించడం తద్వారా ఈ జీవితం ద్వారా ఆతడే విధంగా అభివ్యక్తం కాదలచుకున్నాడో ఆ విధంగా అయ్యేందుకు సంసిద్ధం గావడం. ఈ సృష్టికి మూలం అదే. ఒకడే అయిన భగవంతుడు తాను అనేకంగా మారాలి. ఆ అనేకం ద్వారా తనలోని అనంత కోటి సంపదను ఆవిష్కరించి ఆనందించాలి. అంతే తప్ప వచ్చినచోటికి వెళ్ళడంతో సరిపెట్టుకోదు. అలా ఒక ప్రక్క ఆయనతో ఒకటిగా వుంటూనే, అనేకంలో వ్యవహరించడం అనేది దైవ సంకల్పం. వెరసి శ్రీ అరవిందుల యోగం ముక్తితో సరిపెట్టుకొనేది మాత్రమే గాక, ఆ అనేకం ద్వారా తనలోని బహు విధ సంపదను ప్రకటించడం. అందుకు కావలసింది సమర్థత కాదు. సంసిద్ధత. సమర్థత అందరికీ వుంది. సంసిద్ధం కావడం మాత్రమే సాధకునివంతు.

అలాంటి సంసిద్ధతను తెలిపి తానే అది కావడం, జీవన సమృద్ధిని తానెన్ను కున్న రంగంలో సాధించేందుకు, తనను తాను అంకితం చేసుకొనడం అనే అరుదైన సాహసయాత్ర చేస్తున్న మహోన్నతుడు మన గోపాల్‌రెడ్డి భాయ్ సాబ్. గీతలో శ్రీకృష్ణుడు చెప్పినట్లు "మనుష్యాణాం సహస్రేషు" వేలాది మంది సాధకులలో ఆ ఒక్కడు గోపాల్‌భాయ్.

ఇంతకూ ఆయనేం చేసినట్లు ?

గోపాల్‌భాయ్ అమెరికాలో ఉండగా తమ్ముడు ప్రొ॥ మధుసూదన్ రెడ్డి ఉపన్యాసాలను, శ్రీ అరవిందులకు అత్యంత సన్నిహితుడు గానే గాక, వారి రాజకీయ జీవితంలోనూ, ఆధ్యాత్మిక జీవితంలోనూ గూడా అనుంగు శిష్యుడైన శ్రీ ఎ.బి. పురానీ గారి ఉపన్యాసాలకు ప్రభావితుడై, భారతదేశం తిరిగివచ్చాక శ్రీ అరవిందుల విచారధారను ఆచరణలో చూపించాలని తాపత్రయపడ్డారు. తన స్వగ్రామం నల్గొండ జిల్లా గడ్డిపల్లిని కేంద్రంగా చేసుకొని పరిసర గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు పూనుకున్నారు.

అది మహాత్మాగాంధి శతజయంతి సంవత్సరం. మహాత్ముని పేరుతో ఏ పని తలపెట్టినా ప్రభుత్వం నుండి ప్రభుత్వ రంగ సంస్థల నుండి ఎంతో ప్రోత్సాహం లభించే సమయం. నాగార్జునసాగర్ డాం నుండి ఈ గ్రామాల గుండా లాల్‌బహదూర్ కెనాల్ వెళ్తుంది. కానీ ఈ గ్రామాలన్నీ మెరక ప్రాంతంలో వున్న కారణంగా ఆ నీరు అక్కడి భూములకు అందే అవకాశం లేదు. అందుకే గోపాల్‌భాయ్ మహాత్మాగాంధి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమును ప్రారంభించి ఒక బృహత్తర ప్రాజెక్టు ద్వారా గడ్డిపల్లి పరిసర గ్రామాల బీడు భూములకు నీరు అందించే కార్యక్రమం చేపట్టారు. దాదాపు పాతిక ట్రాక్టర్లతో పని చేయించి ఆ ఊసర క్షేత్రాలను పంటభూములుగా మార్చే ఏర్పాటు చేసాడు. శ్రీమాత నన్ను గోపాల్‌భాయ్‌కి చేదోడు వాదోడుగా వుండమని ఆదేశించారు. నేను వారితో కలిసి పనిచేసేందుకు గడ్డిపల్లి చేరుకున్నాను.

నాకు చేతనైన రీతిలో ఆ స్కీము క్రింద వచ్చే గ్రామాల ప్రజలను శ్రీ అరవిందుల విచారధార పట్ల చైతన్యవంతులను చేయడం, డిపార్టుమెంటల్ స్టోర్స్‌ను ప్రారంభించి, ఆ గ్రామాలన్నింటికి సరసమైన ధరలకు నిత్య జీవితావసర వస్తువులను సరఫరా చేయడం, శ్రీ అరవింద హైస్కూల్ ద్వారా ఆ గ్రామాల పిల్లలకు విద్యాబుద్ధులు కల్పించడం, తరచు ఆ గ్రామాలకు చెందిన వారిని ఆశ్రమానికి తీసుకువెళ్ళడం,

వారందరికీ అవసరమైన శ్రీ అరవింద సాహిత్యాన్ని అందించడం, ఉపన్యాసాలను ఇప్పించడం చేస్తుండే వాడిని.

గోపాల్‌భాయ్ వస్తుతః సోషలిస్టు సిద్ధాంతాలకు ప్రభావితుడైన మేధావి. అయితే తత్వతః శ్రీ అరవిందుల జ్ఞానగంగలో పునీతుడైన జ్ఞాని. ఈ రెండింటికి పొత్తు కుదిరి తీరాలి. కానీ ఇంకా గోపాల్‌భాయ్ ఊహలకు సరిపోయినంతగా అక్కడి ప్రజలు చైతన్యవంతులు కాలేదు. అయినా సరే, రష్యాలో లాగా సమిష్టి వ్యవసాయ క్షేత్రాలను ప్రారంభించిన సాహసి. ఈ విషయంలో గోపాల్‌భాయ్ తొందరపడుతున్నారని నేను అపుడపుడు వారించాను. అయినాసరే, భాయ్ సాబ్ తన పట్టుదల వీడలేదు. ఈ ప్రయోగం విజయవంతమైతే యావత్తు రాష్ట్రంలోనే గాక, అఖిలభారతావనికే ఒక ఆదర్శవంతం అవుతుందనీ మొదట్లో ఒడిదుడుకులున్నా సరే ! రాను రాను ఇందులోని జీవన సౌలభ్యాన్ని అర్థం చేసుకొన్న భారత ప్రజా జీవితంలో ఎంతో చైతన్యం వస్తుందనీ ఆయన ఆశించారు. ఆయనొక ఆశాజీవి. ఆదర్శవాది. అంతేకాదు, కార్యశూరుడు గూడా.

కానీ దురదృష్ట వశాత్తు నేను ఊహించినట్లుగానే మనషులింకా అందుకు సిద్ధంగా లేరు. మనిషి మారితేనే సమాజం మారుతుంది. సమాజం అనుకూలంగా మారితేనే వ్యక్తి మారతాడు. ఏది ముందు ? ఏది వెనక ? ఈ రెండు ఒకదాని మీద మరొకటి ఆధారపడి వున్నాయి.

మనిషికి స్వేచ్ఛ అవసరం. సమత అవసరం. ఈ రెండూ ఒనగూడి నపుడే సౌభ్రాతృత్వం సమకూరుతుంది. అపుడే ఆదర్శ సమాజం ఏర్పడుతుంది. దానికి చట్టాలూ, శాసనాలూ, ప్రభుత్వాలూ, న్యాయవ్యవస్థ, రక్షణ వ్యవస్థ ఏమీ పనికి రావు. అందుకు కావలసింది భౌతిక – ఆధ్యాత్మికాల సమన్వయం. అది సాంప్రదాయక యోగాల వల్ల, మతాల వల్ల సమకూడదు. భౌతిక – ఆధ్యాత్మికాలు వేరు వేరు కాదు. అవి ఒకే నాణానికి బొమ్మా, బొరుసూ లాంటివి. ఆ విధంగా మానవుడు చైతన్యవంతుడు కావాలి. ఆ పని శ్రీ అరవిందుల విచారధార తోనే సాధ్యం. అంతే కాదు, అది అనితరసాధ్యం.

అందుకే శ్రీమాత "తెలుసుకోవడం మంచిదే. దానిని ఆచరించడం మరింత మంచిది. అదే కావడం – అదీ పరిపూర్ణత అంటే" అన్నారు. ఇదంతా క్రమంగా జరగాలి. ఉన్నపళంగా పరిపూర్ణ మానవుడు గానీ, పరిపూర్ణ సమాజంగానీ ఉనికిలోకి రావు.

గోపాల్‌భాయ్ ఏం చేశారు ? ఆయన సాధించిన విజయాలేమిటి ? పొరపాట్లు ఏమిటి ? అనేవి ఈ గ్రంథంలో వివరంగా పొందుపరచబడింది. శ్రీ గోపాల్‌భాయ్ గురించి కొన్ని వివరాలను అందించి మిత్రుడు, తెలుగు పండితుడు, శ్రీ అరవిందుల పూర్ణయోగ పథంలో తన జీవితాన్ని పండించు కుంటున్న శ్రీ సురేంద్రాచారిని వారి జీవిత చరిత్రను గ్రంథస్థం చేయమని కోరాను. నాకు తెలుసు. జీవిత చరిత్రను వ్రాయడం అంత తేలిక గాదని. ప్రతివ్యక్తికి ఉద్ధతి పతనాలు, వెలుగు చీకట్లు ఉంటాయి. ఇంక బహుముఖ ప్రజ్ఞాశాలి, అటు శ్రీ అరవిందుల విచారధారతో తడిసి ముద్దవుతూ, ఇటు ప్రజా జీవితంతో మమేకమవుతూ, సోషలిస్టు భావాలను పుణికిపుచ్చుకున్న గోపాల్‌భాయ్ లాంటి ధన్యజీవి జీవితాన్ని గురించి వ్రాయడం అంత తేలికగాదు. అయినా నా కోరిక మేరకు ఆచారి తన కృషిలో పరిపూర్ణతను సాధించాడు. అందుకే కార్యభారం ఆ భాయ్‌సాబ్ మీద పెట్టాను. ఆరోగ్యం సరిగా సహకరించకున్నా స్వయంగా 'గడ్డిపల్లి' వెళ్లి గోపాల్‌భాయ్ ని ఇంటర్వ్యూ చేసి, ఆ పరిసరాలను కూలంకషంగా పరిశీలించి, అక్కడి కొంతమంది పెద్దలను కూడా కలిసి విషయాలను సేకరించి, ఈ గ్రంథాన్ని సమగ్రంగా పూర్తి చేయడంలో ఆచారి భాయ్‌సాబ్ విజయం సాధించారు. అందుకు ఆ భాయ్‌సాబ్ కృషిని అభినందిస్తున్నాను.

అందరూ గోపాల్‌భాయ్‌లు కాలేరు. అలా అయితే దివ్యమానవ సమాజం ఉనికిలోకి రావడానికి అట్టేకాలం పట్టదు. కానీ గోపాల్‌భాయ్ అత్యంత సాహసి. శ్రీమతారవిందుల అనుంగుబిడ్డ. శ్రీ అరవిందుల విచారధార నేపథ్యంలో గ్రామీణ వికాసం కోసం ప్రయత్నించిన వారు. నాకు తెలిసి భారతావనిలో మరొకరు లేరు. ఇంత వయోవృద్ధులైనా, తన దీక్షను విడనాడలేదు. శ్రీ అరవిందుల దివ్య మానవ సమాజ స్థాపనలో తనపట్టు వీడలేదు. తన జీవితకాలంలో తాననుకున్న ఆదర్శ సమాజాన్ని చూడలేక పోయినా, అందుకు పటిష్టమైన పునాదులు వేసాడు. ఒక నాటికి గోపాల్‌భాయ్ కోరిక నెరవేరి తీరుతుంది. ఆయన వెలిగించిన ఈ దీపం, ఈ జీవనజ్యోతి నిరంతరం వెలుగుతూనే వుంటుంది. భావితరాలకు వెలుగుబాట చూపుతూనే వుంటుంది. శ్రీమాతరవిందుల విచారధారలో జీవించేందుకు దిశా నిర్దేశం చేస్తూనే వుంటుంది. వారికి మరింతకాలం ఆయురారోగ్యాదులను ప్రసాదించ మని శ్రీమాతను ప్రార్థిస్తూ ...

మీ ...

మన్‌మోహన్ రెడ్డి

(దాదాజీ)

శ్రీ అరవిందాశ్రమం

తేది : 21-02-2011

మన కాలపు 'భగీరథుడు'

అవి నేను నిజామాబాద్ జిల్లా బోధన్ తాలూకాలోని కోటగిరిలో పంచాయతీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న రోజులు. 1974, ఫిబ్రవరి నెలలో దాదాజీ (డా॥ మన్‌మోహన్ రెడ్డి గారు) "భాస్కర్‌భాయ్ ! గడ్డిపల్లిలో మార్చి 29 నుండి ఏప్రియల్ 4 వరకు 'మాత – జాతర' జరుగుతుంది. నీవు తప్పక రావాలి" అని ఉత్తరం వ్రాసారు.

శ్రీమాత పేరుతో జాతరా ! ఇదేమిటి ? మళ్ళీ మనం వెనక్కు వెళ్ళు తున్నామా ? శ్రీమాతరవిందులు భవిష్యత్తు గురించి చెప్పారు గదా ! భవిష్యద్ మానవజాతి గురించి చెప్పారు గదా ! అందుకు కావలసిన యోగ ప్రణాళికను అందించారు గదా ! మరి మనం జాతరలు చేసి వెనక్కు వెళ్ళి, శ్రీమాతారవిందుల పూర్ణ యోగాన్ని తిరిగి సాంప్రదాయాల వైపు మళ్ళించే ప్రయత్నం చేస్తున్నామా ? అంటే సాంప్రదాయ యోగాలు తక్కువనికాదు. కానీ శ్రీమాతారవిందులకు గూడా గుళ్ళూ గోపురాలూ కట్టించి, పూజలు చేసి, కొబ్బరికాయలు కొట్టి, హారతులిచ్చి, గుడికి తాళాలు వేయడం, వారిని ఆ విధంగా ఆరాధించి అంతటికే పరిమితం చేయడం నాకు నచ్చని విషయం. 'జీవితమంతా యోగమే' అని కదా వారు చెప్పింది. జీవితాన్ని ఆధ్యాత్మకమనీ, వ్యావహారికమనీ విభజించడం శ్రీ అరవిందుల యోగంలో పొసగని విషయం.

సరే ! గడ్డిపల్లి పెద్దలు ముఖ్యంగా దాదాజీ డా॥ గోపాల్‌రెడ్డి గారూ ఏం చేస్తున్నారో చూద్దామని మరికొంతమంది మిత్రులతో బయలుదేరాను.

నల్గొండ జిల్లా గరిడేపల్లి (అప్పటికింకా మండల వ్యవస్థ రాలేదు) సమీపంలోని గడ్డిపల్లి చేరుకున్నాం. అదొక ఒంటి స్థంభంపైన గంధపు గిన్నె ఆకారంలో చిన్న మందిరం. ఆ మందిరంలో శ్రీ అరవిందుల పవిత్ర అవశేషాలు. ఓ 15-50 మంది సాధకులు ప్రశాంతంగా కూర్చొని ధ్యానం చేసుకోవచ్చు. అక్కడికి చేరుకొనేందుకు స్థంభం చుట్టూ మెట్ల అమరిక. చుట్టూ పచ్చని పొలాలు. అల్లంత దూరంలో కనిపించే చిన్న చిన్న కొండలు. అక్కడే ఓ పెద్ద గోదాము. రైతులకు కావలసిన ఎరువుల బస్తాలు. పండిన ధాన్యం నిలువ చేసుకొనేందుకు చక్కని ఏర్పాట్లు. నిత్య జీవితావసర వస్తువులు లభించే ఏర్పాటు. మరొక ప్రక్కన శ్రీ అరవిందు స్కూలు, హాస్టలు. సాధకుల కోసం చిన్న చిన్న క్వార్టర్స్.

మహాత్మాగాంధి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు క్రిందకు వచ్చే 7 గ్రామాలు, దాదాపు 700 మంది రైతులు. 7000 ఎకరాల భూమి. కొన్ని వేల వ్యవసాయ ఆధారిత కుటుంబాలు.

శ్రీమాత మార్చి 29న తొలిసారి పాండిచ్చేరి వచ్చి శ్రీ అరవిందులను దర్శించారు. అలాగే శ్రీ అరవిందులు ఏప్రియల్ 4వ తేదీన పాండిచ్చేరిలో తమ పవిత్ర పాదం మోపారు. అందుకే ఈ రెండు రోజుల మధ్యనున్న ఏడు రోజులను అక్కడి ప్రజలు పండుగగా జరుపుకుంటారు. పరిసర గ్రామాల నుండి ప్రభలు కట్టుకొని వచ్చి శ్రీ అరవిందుల ధ్యానమందిరం చుట్టూ ప్రదక్షిణాలు చేయించి, కొబ్బరికాయలు కొట్టి, డప్పు వాద్యాలతో ఆటపాటలతో సంబరాలు జరుపుకుంటారు. ఆ ఏడు రోజులూ అక్కడ ఓ జాతర. చిన్న చిన్న దుకాణాలు. ఆటలు, పాటలు, లంబాడీ డాన్సులు. ఓ సంతను తలపింప జేస్తుంది ఆ కోలాహలం. పాటలన్నీ శ్రీ మాతారవిందుల మీదనే ఆ గ్రామీణ బాణీలు కట్టి పాడుకుంటారు. సాయంత్రం వరకు ఆ సంబరాలు జరుపుకొని, అక్కడే భోజనాలు ముగించుకొని, స్టేజి ముందుకు చేరతారు. అక్కడ చిన్నచిన్న నాటికలు, జానపదుల కోలాటాలు, అవీ అయ్యాక శ్రీ మాతారవిందులను గురించి వారికి ఉపన్యాసాల రూపంలో తెలియచెప్తారు. శ్రీమాతా రవిందుల మహాత్మ్యాల గురించి వారు చెప్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. ఎన్నో ఆపదలలో వారు శ్రీమాతను తలచుకోగానే ఆ ఆపదలు తొలగిపోయిన తీరు అద్భుతంగా వుంటుంది.

ఓసారి ఓ చెఱుకు తోటను కొంత మేర కొట్టారు. ఎండిపోయిన చెఱుకు ఆకుకు ఎలాగో నిప్పు అంటుకుంది. అది మొత్తం చెఱుకుతోటకు అంటుకొని తగల బడిపోయేలా గాలివాటం వుంది. ఆ ప్రమాదాన్ని గ్రహించిన అక్కడి రైతులు కూలీలు ఎక్కడివారు అక్కడే కూర్చుని శ్రీమాతను ఈ ఆపదనుండి కాపాడమని ప్రార్థించారట. గాలివాటం చెఱుకు తోట వైపు గాక దిశమార్చుకుంది. ఆ విధంగా నష్టం వాటిల్లకుండా ఆ ఆపద గడిచింది. అలాంటివే అక్కడివారు ఎన్నో కథలు కథలుగా చెప్తుంటే విని ఆశ్చర్యపోవడం మావంతు అయింది.

ఇలాంటివే ఎన్నో విశేషాలు, మహాత్మ్యాలు. ఇవన్నీ చెప్పేది మేధావులు కాదు. పండితులు కాదు, అట్టే చదువుకున్నవారు కూడా కాదు. కల్పనాశక్తి ఉన్నవారు అంతకన్నా కాదు.

ప్రొ॥ మధుసూదన్ రెడ్డి, డా॥ నడకర్ణి, మేమూ, దాదాజీ, గోపాల్‌రెడ్డి గారి నాయకత్వంలో ఆయా గ్రామాలను చూచేందుకు వెళ్ళినపుడు, గ్రామ పొలిమేరల నుండి డప్పు వాయిద్యాలతో సాదర స్వాగతం ఇచ్చి గ్రామాలలోకి తోడ్కొని వెళ్ళారు అక్కడివారు. వారి అనుభవాలు వింటుంటే చాలా ముచ్చట వేసింది. శ్రీమాత వారిని ఆయా సందర్భాలలో ఆదుకొన్న తీరును వారు వివరిస్తుంటే, శ్రీమాతను గురించి ఎంతో కొంత చెప్పాలని వచ్చిన మాకు శ్రీమాతను గురించి వారే మాకు చెప్తున్నారు. వారికి యోగం గురించి తెలియకపోవచ్చు. సూపర్‌మైండ్ గురించి తెలియకపోవచ్చు. శ్రీమాతారవిందుల జీవిత విశేషాల గురించి తెలియకపోవచ్చు, కానీ వారి వారి జీవితానుభవాల ద్వారా వారే, ఆ మహా అవతారపురుషుల గురించి తెలుసుకొని, వారికి ఏదైనా చెప్పాలని వచ్చినవారికి వారే చెబుతుంటే వినడం మావంతు అయింది. అదొక వింత అనుభవం. అనుభవం ద్వారా వారికి ఏర్పడిన విశ్వాసం, ఆరాధనా భావం ఎంతో గొప్పది. మనం వారికి చక్కెర తీపి ఇలా వుంటుందని చెప్పాలని వెళ్తే, ఆ చక్కెరలో తీయదనాలను ఆరగించి వారే చెప్పడం విని నోళ్ళు వెళ్ళ బెట్టడం మావంతు అయింది. పైగా వారు మాపట్ల చూపిన అభిమానం, గౌరవం చూసి, మేమేదో శ్రీమాత ప్రతినిధులుగా వారివద్దకు వచ్చినంతగా వారు సంబరపడి పోతున్నారు.

"గోపాల్‌రెడ్డి గారూ ! మీరు ఇక్కడ సాధించింది ఏమిటో ఒక్క మాటలో చెప్పండి" అంటే "అంతకు ముందు, అంగీ (చొక్కా)లు అంటే ఏమిటో ఎరగనివారు ఇపుడు చక్కగా వాటిని ధరించి మూడుపూటలా కడుపునిండా తింటూ జీవిస్తున్నారు. ఇంతకుముందు రైతుకూలీలుగా జీవిస్తూ వచ్చినవారు, ఇపుడు రైతులుగా తృప్తిగా జీవిస్తున్నారు" అన్నారాయన. ఆయనకు మనసులోనే జేజేలు చెప్పుకున్నాం.

ఇదంతా 35 సం॥ల ముందుమాట. ఇటీవల మళ్ళీ అటువెళ్ళలేదు. కానీ అక్కడివారు వ్యావహారికంగానే గాక, ఆధ్యాత్మికంగా గూడా ఎంతో వికసించారు. గోపాల్‌రెడ్డి గారు శ్రీ అరవింద కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసారు. వారి కృషి ఇంకా నిరంతరాయంగా జరుగుతూనే వుంది.

ఎప్పుడో భగీరథుడు ఆకాశగంగను భూమికి దించి తన పూర్వీకులకు ఉత్తమ లోకాలను సంప్రాప్తింప జేసారని విన్నాం. ఇక్కడ శ్రీ ఘంటా గోపాల్‌రెడి గారు కృష్ణానదీ జలాలను దారి మళ్ళించి బీడుభూముల్ని సస్యశ్యామలం చేయడం మాత్రమే

గాక, అక్కడ ఏమాత్రం విద్యాగంధం లేనివారిని చైతన్యవంతుల్ని చేసి, వారికే తెలియకుండా వారిని శ్రీమాతారవిందుల వెలుగుబాటలోకి మళ్లించారు. వారి లాంటి వారు మనకు ఇంకా ఇంకా కావాలి. వారి కృషి వుంటే ఈ భారతావని శ్యామల విప్లవంతో బాటు ఆధ్యాత్మిక విప్లవం గూడా వెల్లివిరుస్తుంది. ఆ విధంగా భౌతిక ఆధ్యాత్మికాలు వేరు కాదనీ, ఒకే తత్వానికి బొమ్మా - బొరుసు అనే మాటలతో కాదు, చేతలలో నిరూపించి ఈ భారతావని ప్రపంచానికే వెలుగుబాట చూపించగలదు. డా॥ ఘంటా గోపాల్‌రెడ్డి గారి వంటి మహనీయుల చరిత్రను అందరికీ అర్థం అయ్యేలా ఎంతో పరిశోధన సలిపి, ఆరోగ్యం సహకరించకున్నా సరే - తెలుగువారికి అందించడంలో శ్రీమాతకృపతో కృతకృత్యుడైన మిత్రులు సురేంద్రాచారి గారికి, వారిని వెన్నుతట్టి అందుకు ప్రోత్సహించిన దాదాజీకి, నిత్య కృషీవలుడు డా॥ ఘంటా గోపాల్ రెడ్డి గారికీ, మనందరికీ శ్రీమాతారవిందుల అనుగ్రహ ఆశీస్సులు సదా లభించుగాక యని ప్రార్థిస్తూ ...

మీ ...

కొంగర భాస్కరరావు

సావిత్రి భవన్
శ్రీ అరవిందాశ్రమం
తెనాలి.

'వినయాంజలి'

శ్రీఅరవిందులు, శ్రీమాత ధరణిపై అవతరించిన అవతార ద్వయము. వీరి అవతార కార్యము మానసిక చేతన కన్న ఉన్నతమైన చైతన్యమును భూమండలముపై ప్రతిష్టించుట.

సృష్ట్యాదిగా, యింతవరకు అవతరించి, అభివ్యక్తమైన చైతన్య కక్ష్యలు - పదార్థము, ప్రాణము, మనస్సు. ఇవే కాక యింక నాలుగు చైతన్య కక్ష్యలున్నవి. అవి, అతిమానసము, ఆనందము, చిత్, సత్ కక్ష్యలు. ఈ కక్ష్యలన్నిటిని 'ఏడు లోకములు'గా చెప్పుకొందుము. ఇవన్నీ పదార్థమందు నిక్షిప్తమై యున్నవి. దైవ ప్రణాళిక ప్రకారము, ఈ చైతన్యము పదార్థము నుండి ప్రభవించి ఒక్కొక్కటిగా ఆవిష్కృతము కావాల్సియున్నవి. ప్రప్రథమంగా పదార్థం నుండి 'ప్రాణం' ఉత్పన్న మైనది. ఫలితంగా వనస్పతులు, వివిధములైన జీవ జంతువులు, చిన్నవి, పెద్దవి పుట్టుకొచ్చినవి. తరువాత ప్రాణం నుండి 'మనస్సు' వెలువడినది. ఈ మనస్సును అభివ్యక్తం చేయు తొలి మానవజీవులు, ఆది మానవులు అవనిపై ఉనికిలోకి వచ్చారు. ఆదిమానవులు, కాలగతిలో సంస్కారమునకు గురియై ఆధునిక మానవులుగా రూపాంతరం చెందినారు. ఇదంతా సృష్టి పరిణామ క్రమం.

మానవుడు పరిణతి చెంది, తన మనస్సును ఆయుధంగా చేసి, అద్భుత కార్యములను సాధించు చున్నాడు. కాలనియతి ననుసరించి చైతన్యము ఈ స్థాయిలోనే స్తంభించి పోరాదు. ముందుకు సాగాలి. మానసిక స్థాయికి పైన వున్నది 'అతి మానసిక చైతన్యము' అది దిగి రావలసిన సమయము కూడా ఆసన్నమైనది. మానసిక చైతన్య కక్ష్య నుండి, ఉన్నత చైతన్య కక్ష్యను అనగా అతిమానసిక చైతన్యమును ఆవిష్కరించుటకు మరొక 'అవతారము' దిగి రావాలి. అందుకొరకు అరుదెంచిన వారే శ్రీ అరవిందులు, శ్రీమాత. అవతార ద్వయము. 'అతిమానస' అవతారము. శ్రీమాతారవిందులు తమ సాధనను 'అధోచేతన' స్థాయి నుండి ఆరంభించినారు. ఒక్కొక్క మెట్టును అధిగమించుచు, 1926 నవంబర్ 24 నాడు శ్రీ అరవిందులు 'అధిమానస' స్థాయి చైతన్యమును భూమండలంపై ప్రతిష్టించినారు. ఇంతవరకు

యోగులు, మునులు, మహర్షులు ఈ చైతన్యమును తమ స్వంతం చేసుకొని వున్నారు. కాని దానిని ధరణిపై ప్రతిష్టింప చేయలేదు. దీనినే "శ్రీకృష్ణ చైతన్య"మని, ఈ దినమును 'సిద్ధిదినము' గా వ్యవహరించు చున్నాము.

శ్రీ అరవిందులు ఇంతటితో తృప్తి చెందలేదు. తన గమ్యము 'అతి మానసము'. దాని కొరకు ఏకాంత వాసములో తపస్సు చేసినారు. అసాధ్యమైన దాని సాధనలో తన శరీరమునే 5-12-1950 నాడు ఆహుతి యిచ్చినారు. అనంతరము ఆ బాధ్యతను చేపట్టిన శ్రీమాత తన కఠోర తపస్సుతో 'అతిమానసము' (Super Mind) ను 29-2-1956 నాడు అవనీ తలములో అవతరింప చేసి ప్రతిష్ఠించి నారు. అనితర సాధ్యమై ఈ కార్యమును, అనేక ప్రయాసలకోర్చి, దైవమునే ధరణిలో ప్రతిష్ఠించినారు. దీని 'లక్ష్యము - "రూపాంతరప్రక్రియ". 'నిమ్న చైతన్య'ము స్థానమున 'ఉన్నత చైతన్యము'ను స్థాపించుటనే రూపాంతర'మందుము. ఆనాటి నుండి ఈ ప్రక్రియ మనకు తెలియకుండనే జరుగుచున్నది. అద్భుతములు ఆవిష్కారమగుచున్నవి. వాని కోవలోనిదే మన గడ్డిపల్లి అద్భుతం. శ్రీమాత అనుగ్రహము. 'శ్రీఅరవింద కర్మధార' శక్తితో డా॥ గంటా గోపాలరెడ్డి గారి మాధ్యమము ద్వారా గత 40 సం॥లుగా కొనసాగుచున్నది. అక్కడ అనేక అద్భుతములు వెలసినవి. అసాధ్యమనుకున్న కార్యములు 'అవలీలగా సాధింపబడినవి'. అనేక సంవత్సరాలుగా తాతల తరము నుండి అనుభవించిన కష్టములు దూరమైనవి. ఆధునిక సౌకర్యములతో అందరు ఆనందముగా, 'అమ్మ' కురిపించు సిరసంపదలతో, ఆబాలాదులు హాయిగా నున్నారు.

గడ్డిపల్లి అద్భుతములు ఏవిధంగా జరిగినవో అవి స్థానికులకు నిత్యం ప్రత్యక్ష మైనవే; వానిని కథలు కథలుగా చెప్పుకొని, శ్రీమాత అనుగ్రహమును వేనోళ్ళ కొని యాడుదురు. వారితోనే ఆ కథలు ముగియరాదని, ఎల్లెడలనున్న శ్రీ అరవింద భక్తులకు, సాధకులకు తెలియబరచ వలెనని, గడ్డిపల్లిలో రానున్న తరముల వారికి చారిత్రక సత్యముగా భద్రపరుచవలెనని, మన దాదాజీ (డా॥ వి. మన్మోహన రెడ్డి) సంకల్పించారు. ఆ బాధ్యతను నాపై మోపినారు. విషయమునంతా మౌఖికంగాను, వ్రాతపూర్వకంగాను తెలిపినారు. శ్రీమాతను మనసారా నమ్మి పనిని ప్రారంభించాను. అంతే ! వనరులన్నీ వాటంతటవే సమకూరినవి.

సందర్భానుసారముగా శ్రీ కొంగర భాస్కరరావు గారు అందించిన సూచనలకు కృతజ్ఞుడను. గడ్డిపల్లి వెళ్లి శ్రీ గోపాలరెడ్డి గారిని సందర్శించనిదే, నా రచనకు పూర్ణత్వము చేకూరదని తలచినపుడు, ఆ ప్రయాణమునకు సహకరించిన మిత్రులు, శ్రీ బి. నరేందర్ పోస్టుమాస్టర్, శ్రీ సిద్ధిరాం శివకుమార్, అధ్యాపకులు గారలకు కృజ్ఞతలు.

గడ్డిపల్లి చరిత్రను రచించుటకు ప్రోత్సాహించిన దాదాజీకి కృతజ్ఞతాపూర్వక వందనములు.

గ్రంధమును అందంగా ముద్రించి సకాలంలో అందించిన శ్రీ వాసవి ప్రింటర్స్ అధినేత జి. శ్రీనివాస్ గారికి, మిత్రులు పి. ఆంజనేయులుకు కృతజ్ఞతలు.

సిద్ధిపేట
వికృతి నామ సంక్రాంతి
15-01-2011

సుజన విధేయుడు
జలదంకి సురేంద్రాచార్యులు
వైస్ చైర్మన్
శ్రీ అరవింద సొసైటి, ఆం.ప్ర. కమిటి.





Dr. G.Gopal Reddy
SECRETARY
Sri Aurobindo Institute of Rural Development &
Chairman
Farmers' Service Co-operative Society & Aurobharathi
GADDIPALLY - 508 201, Garidepally Mandal,
Nalgonda Dist. Ph : Resi : 08683 - 237434,
Off : 08683 - 237443, Fax : 237563, Mobile : 9951566956
E Mail : saird_gaddipalli@yahoo.com

శ్రీ అరవిందులు, శ్రీమాత ఎవరు ?

శ్రీ అరవిందుల జీవిత సంగ్రహం

శ్రీ అరవిందులు 1872 ఆగస్టు 15న కలకత్తాలో జన్మించారు. విద్యాభ్యాసం కోసం తండ్రి కృష్ణధనఘోష్ ఆయనను ఏడేళ్ల ప్రాయంలోనే ఇంగ్లండ్‌కు పంపారు. శ్రీ అరవిందులు ఇంగ్లండ్‌లో 14 సంవత్సరాల పాటు విద్య అభ్యసించారు. 1893 జనవరిలో ఇండియా తిరిగివచ్చి బరోడాలో ఉద్యోగంలో చేరారు. భారతదేశ విముక్తికై రాజకీయాలలో చురుకుగా పాల్గొనే నిమిత్తం ఆయన బరోడాలోని ఉద్యోగానికి రాజీనామా చేసి కలకత్తా చేరారు. 1908 మే నెలలో అలీపూర్ కుట్ర కేసులో బ్రిటిష్‌వారు ఆయన్ని అరెస్టు చేసి జైలుకు పంపారు. 1909 మేలో ఆయన విడుదలయ్యారు. జైలులో ఆయన భగవద్గీత, ఉపనిషత్తులు చదివి, యోగాభ్యాసం చేశారు. ఆయన భవిష్యత్తును నిర్ణయించే ఆధ్యాత్మిక అనుభవాలు ఆయనకు కలిగాయి. జైలులోనే ఆయనకు శ్రీకృష్ణ సాక్షాత్కారం కలిగింది.

1910లో భగవంతుని ఆదేశంపై పాండిచెర్రి చేరుకొన్నారు. 1910 నుండి 1914 వరకు ఆయన పూర్ణయోగాన్ని అభ్యసించారు. 'ఆర్య' అనే ఆధ్యాత్మిక పత్రిక ద్వారా మానవాళికి ఆయన సరికొత్త సందేశం అందించారు. మానవాళికి ఒక దివ్య భవితవ్యం ఉన్నదని ప్రబోధిస్తూ 'దివ్యజీవనం' (Life Divine) అనే గ్రంథాన్ని, దానిని సిద్ధింప చేసుకోవడానికి 'యోగసమన్వయం' అనే గ్రంథాన్ని దివ్య భవితవ్యం వైపు మానవ సమాజ ప్రస్థానం సూచిస్తూ 'మానవ ఆవృత్తి' (Human Cycle) అనే గ్రంథాన్ని, మానవాళి అంతా ఒక్కటే అనే సత్యాన్ని ప్రవచిస్తూ 'మానవ ఐక్యతాదర్శం' అనే గ్రంథాన్ని వ్రాశారు. అంతే కాదు, భారతీయ సంస్కృతి, నాగరికత ప్రాభవాన్ని, వేద, గీత, ఉపనిషత్తులలోని రహస్యాలను అందిస్తూ మరి కొన్ని ఉద్గ్రంథాలు రచించారు. ఇవన్నీ ఒక ఎత్తు ఆయన రాసిన 'సావిత్రి' కావ్యం ఒక ఎత్తు. 'సావిత్రి' మంత్ర కావ్యంలో ఆయన దివ్య జీవన ఆదర్శాన్ని గూర్చి కమనీయంగా గానం చేశారు. ఇంకా ఎన్నో వందలాది కవితలు వ్రాశారు. 'భవిష్యత్ కవిత' అనే ప్రమాణిక గ్రంథం వ్రాశారు. అవన్నీ ఆయన వినూత్న దర్శన దీప్తి శిఖలు. శ్రీ అరవిందుని ఆధ్యాత్మిక తత్వదర్శనం, యోగ దర్శనం నాలుగు విధాలైన మహనీయ సిద్ధులపై (Realisations) ఆధారపడి వున్నాయి. 1910లో పాండిచెర్రి రాకముందే ఆయనకు రెండు సిద్ధులు కలిగాయి. 1908లో లేలే (Lele) అనే మహారాష్ట్ర యోగితోపాటు ధ్యానం చేస్తుండగా

నిశ్శబ్ద, కాల రహిత పరబ్రహ్మ అనుభవం కలిగింది. ప్రపంచం అసత్యమనే భావన కలిగింది. కాని తరువాత అలీపూర్ జైలులో ఉండగా ఆయనకు మరో సిద్ధి కలిగింది. సృష్టిలోని సకల జీవులు, సృష్టి సర్వస్వం బ్రహ్మమయంగా ఆయనకు కనిపించాయి. భగవంతుని విశ్వ చైతన్య సాక్షాత్కారం కలిగింది.

1912లో పాండిచెర్రిలో మూడవ సిద్ధి కలిగింది. పరబ్రహ్మ చైతన్యంలో చాలా సేపు నివసించడం ఆ అనుభవంలోని విశేషం. ఉన్నత చైతన్య భూమికలలోకి ఆరోహించి, ఆ భూమికలోని శక్తిని భౌతిక చైతన్యస్థాయికి తీసుకుని రావడం సాధ్యమైనది. ఈ ప్రక్రియ చాలా కాలం కొనసాగింది. 1926 నవంబర్ 24న శ్రీ అరవిందుని తపస్సు వల్ల తనలోకి, సృష్టి భౌతిక శ్రేణి లోకి శ్రీకృష్ణ భగవానుడే దిగి వచ్చాడు. దీనిని ఆయన 'అధిమానస' (overmind) సంసిద్ధి అని పేర్కొన్నారు. దీనికన్నా ఉన్నతంగా భాసిస్తున్న "అతి మనస్సు" (supermind) కోసం ఆయన తన తపస్సును ఉధృతం చేశారు. ఆ అత్యున్నత మహాశక్తి భూమి పైకి దిగినప్పుడు మానవాళి కలలు కన్న పరిపూర్ణత్వం సిద్ధిస్తుందని శ్రీ అరవిందులు ప్రవచించారు. 1926 నుండి శ్రీ అరవిందులు ఆ సిద్ధి కోసమే తమ జీవితాన్ని ధార పోశారు. అతి మానసం భూమికి రావడం కోసమే ఆయన 1950 డిసెంబర్ 5న దేహపరిత్యాగం చేశారు. ఆనాడు ఆయన దేహం అతి మానస సువర్ణ తేజంతో మెరిసి పోయింది. ఆయన దేహం కుళ్లి పోకుండా నాలుగైదు రోజులు అదే కాంతితో భాసించింది. ఇది మానవ చరిత్రలోనే అపూర్వ ఘట్టం. దివ్య జీవనం గూర్చి కలలు కని రాయడమే కాకుండా, దానిని ప్రతి ఒక్కరికి అందుబాటులోకి తేవడం కోసం ఆయన జీవితమంతా శ్రమించారు. 'All life is yoga' అని, శ్రీ అరవిందులన్నారు. శ్రీ అరవిందాశ్రమాన్ని మనం దర్శిస్తే అక్కడ 'దివ్య జీవనాన్ని' కళ్ళారా తిలకించవచ్చు.

శ్రీ అరవిందులు వ్రాసిన రచనలు చిరస్మరణీయాలు, రోజూ మననం చేసుకునే మహనీయ సత్యాలు, మంత్రాలు. అవి - ఆనందమే అసలు జీవన రహస్యం. ఆనందం గూర్చి నేర్చుకో. నువ్వు భగవంతుని తెలుసుకొన్నట్లే. సృష్టి ఆనందమయ దైవం.

భగవంతుడు దిగిరాకా తప్పదు. మానవుడు ఆయనను కలుసుకోకా తప్పదు. ఈ రెండూ సంభవమే. వారి సమాగమంలో విశేషం ఏమిటంటే, మానవ ప్రకృతిలోకి భగవంతుడు చొచ్చుకుని పోతాడు. మనిషి భగవంతుని చైతన్యంలో (Consciousluy)

మునిగి ఆనందిస్తాడు. అప్పుడు కూడా అతనికి ఎరుక వుంటుంది. అయితే ఈ సమాగమంలో మనిషి ఆత్మ అంతరించి పోనవసరం లేదు. ఇన్ని యుగాల అన్వేషణ,



ఆకాంక్ష, బాధలు, ఆనందం - వీటి సాఫల్యం మానవాత్మ అంతరించి పోవడం కోసం కాదు సుమా ! అదే గనుక భగవంతుని లక్ష్యమైతే ఇన్ని యుగాల విశ్వలీలాఖేలాన్ని ఆయన ప్రారంభించి వుండే వాడు కాదు.

ఒక అస్తిత్వం ఆనందం కోసం కోటానుకోట్ల రూపాలు దాల్చింది, తనను తాను ఆ రూపాల నుండి వీక్షించి మురిసి పోవడం కోసం. అది ప్రారంభం. మధ్యలో ఈ వియోగం, ఈ విభజన ఏమిటి ? అనేకత్వంగా మెరిసే ఈ సృష్టి ఏకత్వం వైపు, అజ్ఞానం ఒక జ్యోతిర్నివహం వైపు, బాధ ఊహకు అందని ఆనందం వైపు ప్రయాణి స్తున్నాయి. అదే మనం ఇప్పుడు చూస్తున్న ప్రపంచం.

చివరికి ఏమవుతుంది ? తేనె తనను తాను రుచి చూసుకున్నట్లు, తేనె బిందువులు అన్నీ కలిసి ఒక దాని నొకటి రుచి చూసినట్లు, అవన్నీ కలిసి తేనెపట్టునే రుచి చూసినట్లు, భగవంతుడు, మానవాత్మా, విశ్వంతో కలిసి సాగుతున్న ఈ దివ్య రూపకం చివరికి ఆ మాధుర్యంలోకి, ఆ అమృత ఆనంద పారవశ్య ధారలలోకి ముగిసిపోతుంది. ఆ మాధుర్యం అంతులేనిదిగా మిగిలిపోతుంది. ఒక విశ్వ వైణికుడు సృష్టి వీణను శ్రుతి చేస్తున్నప్పుడు వెలువడిన అపస్వరాలే మన జీవితంలో అనుభవించే బాధాగ్ని జ్వాలలు.

ప్రేమ, శక్తి, జ్ఞానం, ఆనందం - ఇవన్నీ కలిసిన ఒక విశ్వరాగం మధురాతి మధురమైన అమృత నాదంగా మారి ఆత్మలన్నీ పులకించి పోతాయి. అది దైవం నిర్దేశించిన సృష్టి చివరి ఘట్టం.

(సావిత్రి సౌజన్యంతో ...)

★★★

విశ్వజనని శ్రీమాత

ఫ్రాన్స్ దేశపు రాజధాని పారిస్ నగరంలో 1878 ఫిబ్రవరి 21 తేదీన ఓ దివ్యతేజం, మారిస్ అల్ఫాసా, మాథిలోనే దంపతులకు ఒక బాలికగా జన్మించినది. తల్లిదండ్రులు ఆమెకు మిర్రా అల్ఫాసా అని పేరు పెట్టినారు. ఆమె 4 సంవత్సరాల వయస్సులోనే ఒక చిన్న కుర్చీలో కూర్చొని కన్నులు మూసికొని మౌనంగా ధ్యానం చేస్తున్నట్లు కూర్చునేది.

'అకాడమీ జూలియన్' సంస్థ విద్యార్థినిగా చిత్రకళా రంగములో నైపుణ్యమును సంపాదించినది. ఆ చిన్నవయస్సులోనే తాను అందరి వలె కాక ఈ ప్రపంచంలో ఏవో ఒక ప్రత్యేక కార్యము సాధించాల్సి వుందని, తనలో ఏదో మహాశక్తి పని చేయు చున్నదని ఆమెకు అనిపించేది. దానికి తోడు అసాధారణ అనుభవాలు కలుగుతుండేవి. కొందరు ఆధ్యాత్మిక గురువులు ఆమెకు కలలో కనిపించి ఏవో సూచనలు ఇచ్చెడివారు. ఆమె తనకు తరచుగా మార్గము చూపుతున్న వ్యక్తి రూపాన్ని కాగితంపై చిత్రించినది. ఆ రూపాన్ని ఆమె 'కృష్ణా' అని పిలుచుకునేది. ఆమె గుప్త విద్యలలో గూడా ప్రావీణ్యతను సంపాదించినది. అందుకొరకు ఆమె 1906, 1907 సంవత్సరములలో అల్జీరియా దేశము వెడలినది. అక్కడి 'మాక్స్ థి యోన్', అతని భార్య 'అల్మా' నుండి ఆ విద్యలను నేర్చుకున్నది. అంతేగాక ఆమెకు అయాచితంగా, అతీంద్రియ శక్తులు కూడా వశమైనవి.

1912 సం॥లో మిర్రా పండ్రెండు మంది సభ్యులతో పారిస్ నగరమందు ఒక ఆధ్యాత్మిక స్వాధ్యాయ కేంద్రమును స్థాపించినది. దానికి ఆమె "కాస్మిక్ సంఘం" అని పేరు పెట్టినది. ఆ కేంద్రం యొక్క ముఖ్యఆదర్శములు -

"సామూహికంగా ఒక అనువైన ప్రదేశములో సత్య ప్రతిష్ఠ కొరకు, భగవంతుని బిడ్డలుగా ఎదుగుతూ, ఒక నూతన జాతి ఆవిర్భావం దిశగా పయనించే ఒక ఆదర్శ సమాజాన్ని స్థాపించడం",

"విశ్వములో గల వివిధ జాతుల మధ్య సమన్వయం సాధించి, శాంతి సామరస్యాలతో జీవించుటకు కృషి చేయడం",

"ఇంత వరకు అందుబాటులో లేకుండా ఉండి పోయిన విశ్వశక్తులను భూమిపైకి అవతరింప చేయడం"

ఇవీ ఆ కాస్మిక్ సంఘ సభ్యులకు 'అమ్మ' అందించిన ఆదర్శములు.

'కాస్మిక్ సంఘ' సభ్యులకు ఇవి ఆమోదకరమే అయినా, వీని కొరకు వారు సమయమును చాలినంత యివ్వలేకుండుట - తమ జీవితావసరములను తీర్చుకొనుట

కొరకే పరిమిత మగుటతో వారు తమ నిస్సహాయతను ప్రకటించగా - ఇలాంటి వారి కొరకు, జీవితావసరాలను గురించి ఆలోచించాల్సిన అవసరం లేని ఒక వ్యవస్థను ఎప్పటికైనా ఏర్పాటు చేయాలనే దృఢ సంకల్పం ఆమెలో జనించినది.

ఆమె చిన్ననాటి నుండే తన వేదనను - "సర్వేశ్వరా ! ఈ భూమి ఈతి బాధలతో కృంగి పోవుచున్నది. మానవులు అల్లాడి పోవుచున్నారు. ఈ అంధకారాన్ని నీవు తప్ప మరెవరూ ఛేదించలేరు. ఈ చీకట్లను పారద్రోలి, మానవాళిని కాపాడుము" అని పరాత్పరునకు నివేదించేది.

ఆమెకు భారతదేశంలోని యోగులను దర్శించాలని సంకల్పము కల్గినది. తన భర్తయైన పాల్‌రిచర్డ్‌తో కల్సి 1914 మార్చి 29 తేదీన పాండిచేరిలో మొదటిసారి శ్రీ అరవిందులను దర్శించినారు. తరచుగా తనకు స్వప్నంలో సాక్షాత్కరించి, అనేక సూచనలు చేసిన 'కృష్ణుడు' ఆయనేనని గుర్తు పట్టినారు. అంతేగాక తాను ఏ ఆశయాలనైతే కాస్మిక్ సంఘ సభ్యుల ముందుంచినదో, ఆ జీవితాశయాలను శ్రీ అరవిందుల ఆశీస్సులతో సాధించగలనన్న విశ్వాసం ఆమెకు కల్గినది. మరొక ఆశ్చర్యకర విషయమేమంటే - ఏ ఆశయ సిద్ధికోసం తాను కృషి చేయాలనుకున్నదో సరిగ్గా అలాంటి ఆశయాల సాధన కోసమే శ్రీ అరవిందులు కూడా ప్రయత్నిస్తున్నారన్న ప్రగాఢమైన నమ్మకం ఆమెకు కల్గింది. శ్రీ అరవిందులు కూడా ఆమెను తన కృషిలో భాగం పంచుకోగల సమర్థురాలిగా, శక్తి స్వరూపిణిగా, దివ్యమాతగా గుర్తించారు. వారి ఇర్వురి సాధనాశయములు ఏక రూపము అయినవే. ఇర్వురిలోను గల చేతన ఒక్కటే. విశ్వలీలా ఖేలనము కొరకు ఆ చేతన రెండుగా చీలిపోయి ఈ పుడమిపై శ్రీమాత, శ్రీ అరవిందులుగా ఆవిష్కారము చెందినారు. ఇక ఇర్వురి సమాగమములో పరిణామ ప్రక్రియ ఊపందుకోనున్నది. తర్వాత ఆమె రెండవ ప్రపంచ యుద్ధ కారణంగా ఫ్రాన్స్‌కు తిరిగి పోయినారు. తదుపరి యుద్ధానంతరం ఆమె ఒక్కరే, శ్రీ అరవిందుల సన్నిధిలో స్థిరంగా వుండుట కొరకు 1920 సం॥ము ఏప్రిల్ 24న భారత దేశానికి తిరిగి వచ్చినారు. ఆనాటి నుండి శ్రీమాత ఆశ్రమాన్ని వదలి వెళ్లలేదు.

1926 సం॥లో శ్రీ అరవిందులు తమ తపస్సులో అతి ముఖ్యమైన 'అధి మానస' సిద్ధిని సాధించినారు. కాని అది వారి లక్ష్యం కాదు. అంతకంటే పైస్థితి చేరుటకు తాను ఏకాంతంలోనికి వెళ్లాలి. తనశక్తిని స్వీకరించి, దానిని ప్రపంచహితంకోసం ఉపయోగించే పని కొరకు శ్రీ అరవిందులు, శ్రీమాతను ఎన్నుకున్నారు. దీనితో శ్రీ అరవిందాశ్రమానికి శ్రీకారం జరిగినది. శ్రీమాత చిన్ననాడు 'కాస్మిక్ సంఘము' సభ్యుల కొరకు ఏర్పాటు చేయాలనుకున్న సంస్థ వ్యవస్థకు కూడా పునాది పడినది. ఆనాటి నుండి ఆమె నందరు మదర్‌గా పిలువ సాగినారు.

మానవుల మనస్సులో దాగియున్న నిగూఢ సృజనశీలతను వెలికి తీయాలి. ఈ 'మనస్సు' స్థానంలో దానికన్న పై స్థాయికి చెందిన 'అతిమానసము' (Supermind) ను అవతరింప చేసిన, మనిషి 'అతిమానవుని'గా రూపాంతరం చెంది, ఈ పుడమి పరంధామంగా మారుతుందనేది "శ్రీమాతారవిందుల" దివ్య దర్శనము.

శ్రీ అరవిందులు 1926 సం॥లో ఏకాంతవాస తపస్సులోకి పోయిన పిమ్మట వారితో నున్న సాధక బంధువుల బాధ్యత శ్రీమాతపై పడినది. సాధకుల యోగ క్షేమముల కొరకే ఆశ్రమ వ్యవస్థ ఏర్పడినది. ఆశ్రమానికి అధినేత్రి శ్రీమాత. 1950 డిసెంబర్ 5వ తేదిన అతిమానస శక్తిని అవతరింప చేసేందుకు శ్రీ అరవిందులు తమ శరీరాన్ని వ్యూహాత్మకంగా విడిచిపెట్టారు. ఆ తరువాత 6 సం॥ములకు 'అతి మానసిక శక్తి' అవతరణకు ఉన్న ఆటంకాలను శ్రీమాత తొలగించారు. ఆ శక్తి అవనిలో అవతరించి రూపాంతర ప్రక్రియను ప్రారంభించినది. దానికి శ్రీమాత తనలోనే శ్రీకారం చుట్టినారు.

పరిణామ క్రమం ఒక వ్యక్తికి మాత్రమే సాధ్యం కాదు. సామూహిక ప్రయత్నం కావాలి. తాను నిరంతరం వికసించుచు విశ్వశక్తులతో అనుసంధానం సాధించుచు మిగిలిన ప్రపంచానికి అందించాలి. అలా ప్రయత్నించే సమాజంలోనే దివ్యశక్తి అవతరించును. దివ్యమానవజాతి ఉనికిలోకి వస్తుందని భావించిన శ్రీమాత అరోవిల్ వంటి అంతర్జాతీయ నగర సంస్థను స్థాపించారు. సాధకులను రాబోయే నూతన మానవ సమాజానికి అనుగుణంగా తీర్చిదిద్దడం అరోవిల్ లక్ష్యం. శ్రీమాత ఫ్రాన్స్ దేశంలో పుట్టినా, భారతదేశం వేదికగా మానవాళి వికాసం కొరకు అహరహం కృషి చేసి, 1973 నవంబర్ 17న శరీరాన్ని వదిలినారు. శ్రీమాతారవిందుల తేజస్సు, శక్తి ప్రభావం నిత్య సత్యాలు; నిత్యానుభవాలు. వాటిని అందుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. అప్పుడే ఈ మానవజాతి దివ్యమానవ జాతిగా రూపాంతరం చెందును.

మన గడ్డిపల్లిలో కూడా శ్రీమాతారవిందుల తేజస్సు, శక్తి, ప్రభావాల వలన ఈ రకమైన రూపాంతర ప్రక్రియ గత 40 సం॥లుగా సాగుచున్నది. అందుకొరకే దాదాజీ తమ పత్రికలో ఇదే సత్యాన్ని ప్రకటించినారు. అదేమనగా "గడ్డిపల్లి గ్రామీణ భారతమునకు అరోవిల్" అనివర్ణించినారు. దీనిని సాకార మొనరించి, యదార్థరూపమును ప్రపంచానికి చూపించవలసిన బాధ్యత గడ్డిపల్లి యువతపై, అచటి ప్రజలందరిపై నున్నదను సత్యమును విస్మరించరాదు. శ్రీమాతారవిందుల శక్తిని యిచట ప్రతిష్ఠించిన డా॥ గోపాలరెడ్డి గారు ధన్యులు.



అతిమానసము

అతిమానసము అంటే సత్య చైతన్యం. ప్రస్తుత పరిణామానికి పునాది అయిన, అజ్ఞానం నుండి స్వేచ్ఛ పొందిన చైతన్యం అది. అతిమానసం అంతా విజ్ఞానమయం. అసత్యం, అనిశ్చితత్వం ఏకోశాన ఉండవు. గట్టి పునాదులపై సత్యచైతన్యాన్ని గనుక నెలకొల్పితే, దివ్యజీవనపరిణామం ఒక ఆనందంవైపు పురోగమనం. కాంతి నుండి ఆనందం వైపు ఒక మహాప్రస్థానం అవుతుంది. అతిమానసంలో పూర్ణ దైవత్వం భాసిస్తుంటుంది. ఈ అతిమానసం దివ్యజీవన సంభావ్యతలను (సత్యచేతనలో) సఫలం చేస్తుంది. ఈ అతిమానస స్పర్శవల్ల పృథ్వీతత్వం, పృథ్వీజీవనం మార్పు చెందుతాయి. మనస్సును అది దివ్య ఆలోచనా రోచిస్సులవైపు, జీవితాన్ని ప్రగాఢమైన, నిజమైన భావోద్వేగాలవైపు, కర్తృత్వం వైపు, మహోన్నతమైన లక్ష్యాలవైపు, ఆశయాలవైపు సముద్ధరిస్తుంది.

అధిమనస్సుకు (Overmind) : పృథ్వి పరిణామక్రమంలో అచేతనను పూర్తిగా మార్చగల శక్తి లేదు. ఒక అతిమానసశక్తి మాత్రమే అచేతనను మార్చివేయగలదు. దివ్యజీవనాన్ని సుస్థిరంగా సంస్థాపించగలదు.

శ్రీ అరవిందులు.

శ్రీ మాతృ కృప - గడ్డిపల్లి అభ్యుదయము

గడ్డిపల్లి అద్భుత మహిమలు

(The Gaddipally Miracle)

ఆంధ్రప్రదేశ్‌లో 'గడ్డిపల్లి' గ్రామంలో మహా అద్భుతమైన విషయాలు సంఘటిల్లినట్లు ఈ శీర్షిక మనకు సూచించుచున్నది.

గడ్డిపల్లి గ్రామము, ఆరు పరిసరగ్రామాలచే పరివేష్టింపబడి ఒక గుత్తిలాగున్న వాని మధ్యలోనున్నవి. ఆ గ్రామాలు నల్లగొండ జిల్లాలోని హుజూర్‌నగర్, సూర్యాపేట తాలూకాకు చెందినవి. ఇది రాజధానియైన హైద్రాబాదు నగరమునకు 110 మైళ్ల దూరమున గలదు. ఈ గ్రామము 1969 సం॥ నాటికి పూర్తిగా వెనుకబడిన గ్రామము. ఈ గ్రామానికి చేరుటకు రోడ్డు రవాణా సౌకర్యం కాని, గ్రామంలో మంచినీటి సరఫరా వసతిగాని, విద్యుత్, విద్యాసౌకర్యములు మొదలగునవి ఏ వసతి లేనట్టి కుగ్రామము. ఈ గ్రామములో గల భూమిలో మూడవ వంతు మాత్రమే వ్యవసాయమునకు అనుకూలంగా, అదైనా వర్షాధారమే, ఎకరానికి రమారమి రూ॥ 50/– విలువ గల పంట మాత్రమే దిగుబడి. ఈ దుస్తరమైన స్థితిలో, ప్రజలు భయంకరమైన కష్టాలతో జీవితాలను కొనసాగించు చుండిరి.

కృష్ణానదికి నాగార్జున కొండ వద్ద ఆనకట్ట కట్టి 'నాగార్జున సాగరము' యేర్పాటు చేయబడినది. దానిలోనుండి దూరప్రాంతాలకు నీటిని కొనబోవు పెద్ద పెద్ద కాలువలను త్రవ్వి సాగునీటి సౌకర్యము కల్పించబడినది. పెద్దదైన (ఎడమ) లాల్‌బహదూర్ కాలువ లక్షలాది గ్యాలన్ల నీటిని పంట పొలాలకు చేరవేయుటకు గడ్డిపల్లి గ్రామ శివారు గుండా పోవుచున్నది. కాని అది అచటి భూమి లెవెల్‌కు చాలా దిగువగా పోవుట వలన, అచటి దాహార్తులైన ప్రజలకు అందుబాటులో లేకుండా, ఎండమావి లోని నీటి మాదిరి అయినది. భూవసతి 7130 ఎకరములు కల్గియున్న 720 రైతాంగమునకు దురదృష్టమే దాపురించినది.

అట్టి తరి, అపుడొక అద్భుతము సంభవించినది. అది శ్రీమాత యొక్క "శ్రీ అరవిందుల కర్మధార" (Sri Aurobindo's Action) – యొక్క బ్రహ్మాండమైన శక్తి. దివ్యమైన ఈ రెండు శక్తులు – దైవము వైపునకు తెరచివున్న గ్రహణసామర్థ్యం కల్గివున్నట్టి వారి ద్వారా మాత్రమే సిద్ధించగలవు. ఎవరావ్యక్తులు ? మరి వారేమి

చేసినారు ? కావున మనము ముందుగా రెండవ అంశమును పరిశీలించెదము.

గడ్డిపల్లి గ్రామములో ఒక నూతన పద్ధతి పుట్టుకొచ్చినది. కేవలము రెండు సంవత్సరముల, అతి స్వల్ప కాలములోనే 6,000 ఎకరాల భూమి, M.G.L.I. ప్రాజెక్టు వలన సాగు నీటిని పొంది, సువిశాల సస్యశ్యామల క్షేత్రంగా రూపొందినది. కరువు పీడిత స్థితి నుండి కొలది కాలంలోనే 720 మంది రైతులు సంపన్న స్థితికి చేరువైనారు. ఇక ఈ సంవత్సరము రైతులు రూ. 50 లక్షలు గడించారు. ఇదెంతటి అద్భుతమో కదా !

ఇప్పుడిక మనము అక్కడి ప్రజలను చూద్దాం ! ఈ గడ్డిపల్లి గ్రామములో, ఆ గ్రామానికి చెందిన వ్యక్తి ఒకరు డా॥ గోపాలరెడ్డి అనే వారు. 6 సంవత్సరాలు అమెరికాలో వుండి వ్యవసాయ విద్యనార్జించి, 'హవాయి' యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పట్టాను సాధించి స్వదేశానికి తిరిగి వచ్చిన పిమ్మట – ఆం.ప్ర. వ్యవసాయ విశ్వ విద్యాలయములో 'అగ్రానమీ'లో అసోసియేట్ ప్రొఫెసరుగా పని చేసినారు. గ్రామము లోని ప్రజలందరిలో అధిక విద్యావంతుడు. వ్యవసాయరంగానికి చెందిన పనులన్నింటిని క్షుణ్ణంగా తెలిసినవాడు. కావున అతడు శక్తివంతుడు. అయితే ఇక ఆరంభమెట్లు జరగాలి ? చాలా సంవత్సరాలుగా అతడు శ్రీమాత వైపు మరలి వున్నవాడు. ఆమె అనుగ్రహంలోనే వుంటూ, ఆ తల్లి ఆశీస్సులతోనే సంరక్షింపబడుతూ ముందుకు సాగుచున్నాడు. వారు "శ్రీ అరవిందుల కర్మధార" (Sri Aurobindo's Action) – గురించి వినియున్నారు. ఎవరైనా మొక్కవోని విశ్వాసముతో "శ్రీ అరవిందుల కర్మధార" శక్తి పట్ల, అద్భుతమైన దాని చర్యపట్ల, సుదృఢ విశ్వాసమును కల్గియుందురో, వారికి ఎట్టి కష్టములు ఎదురైనను, అన్నింటిని అవలీలగా అధిగ మించెదరని తెల్సినది. అట్టి అజేయమైన విశ్వాసము డా॥ గోపాలరెడ్డి గారి దరి చేరినది. "శ్రీ అరవిందుల కర్మధార" శక్తి ప్రవాహము ఆరంభమైనది. ఆనాటి నుండి ఆయన పనిలో ఎట్టి అవరోధము కాని ఆటంకము కాని ఎదురు పడలేదు.

అక్కడున్న 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైద్రాబాద్' సంస్థ సలక్షణుడు, సమర్థుడైన అధికారి, యస్.కె. దత్తా గారిచే నిర్వహించబడుచున్నది. వారితో మన డాక్టరు గారు విశ్వసనీయంగా జతకట్టి, పరస్పర విశ్వాసముతో సాగుచు, తమ కార్యమునందు దైవము సంపూర్ణంగా సహాయ పడగలదని, సంపూర్ణ విశ్వాసమును కల్గియున్నారు. డా॥ గోపాలరెడ్డి గారు, గడ్డిపల్లిలో సాధించదలచిన మహా అద్భుతమైన ప్రాజెక్టు

పనికి కావలసిన ధనము రూ॥ 97 లక్షలు. ఇట్టి ధనము, వారికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైద్రాబాదు నుండి నిరభ్యంతరంగా సమకూరినది. ఇదెంతటి మహా అద్భుతమో గమనించ గలరు ! డాక్టరు గోపాలరెడ్డి గారు స్వయంగా ప్రభుత్వ వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో చర్చించి అందరి సలహాలను స్వీకరించి, తాను తలపెట్టిన ప్రాజెక్టును ప్రయోజనకరముగాను, పొదపుగా చక్కగా నుండునట్లు, రూపొందునట్లు చేసినారు. దీనిని అమలు పరచుటకు ముందుగా అచటి 720 మంది రైతాంగము యొక్క విశ్వాసమును చూరగొని వారి ఆమోదము పొందవలసి యుండును గదా ! ఈ పని అసాధ్యమైనదని కష్టతరమైన కార్యముగా కొందరు భావించారు. కాని ఇది శ్రీమాత అనుగ్రహము & 'శ్రీ అరవింద కర్మధార' యొక్క శక్తి వలన కొనసాగుచున్న పని గదా ! రాజకీయ ప్రభావములు, వత్తిడులు ఈ బృహత్కార్యమును ఆటంక పరచుటకు, ప్రథమ దశలో ఎదురైనా తర్వాత తొలగిపోయినవి. రైతులందరు తమ పాత కక్షలను దురభిమానమును దులిపివేసి, పరస్పర శతృత్వమును విడనాడి, అంతా ఒక సహకార సంఘంగా యేర్పడినారు. అప్పుడు గాని ప్రాజెక్టు రూపొందుటకు వీలు కలుగును.

గడ్డిపల్లి ప్రాజెక్టులో ముందుగా చేపట్ట వలసిన పని, ఆ గ్రామ శివారు నుండి, అచటి భూమి లెవెల్‌కు దిగువగా పారుతున్న కాలువ నీటిని పైకెత్తాలి. దానికొరకు ముందుగా 80' × 10' × 30' ప్రమాణంలో లోతైన బావులు కావాలి. ఈ పనిని అచటి రైతాంగము, రాక్షస బలముతో దివారాత్రములు ఏకం చేసి, ఏడు రోజుల్లో పూర్తి చేసినారు. తమ ముందు ఏర్పడిన మొదటిదైన గడ్డు సమస్యను వారు అవలీలగా ఎదుర్కొని విజయం సాధించారు. అద్భుతమైన కార్యమిది గదా !

ఈ కార్యము పూర్తయినది కదా ! ఇక మన పనికి ఎదురేమి లేదు అని అనుకొనుటకు వీలు లేదు. మరొక సమస్య వారి ముందుకు వచ్చినది. అది 'విద్యుచ్ఛక్తి'. ఈ ప్రాంతానికి ఎన్నో ఆమడల దూరములో గల ఆ శక్తిని తేవాలి. ఈ ప్రదేశానికి ఆశక్తిని తేవాలంటే 33 కె.వి. లైను లాగి సబ్‌స్టేషన్ నిర్మించాలి. ఈ పనులకు రూ॥ 12 లక్షలు అంచనా వేయబడినది. సాధారణంగా ఈ పని చేయాలంటే నెలలు, ఏండ్లు పట్టును. అది కూడా అధికారుల చలువపైనే ఆధారము. కాని ఇక్కడి పరిస్థితి అదికాదు. శ్రీమాతారవిందుల దివ్యశక్తి ప్రభావమక్కడ చోటు చేసికొని యున్నందున, అచటి సబ్‌స్టేషన్ నిర్మాణముతోపాటు, లైను లాగబడి, నీటిని తోడుటకు అమర్చిన పంపులకు, విద్యుత్తు అతి తక్కువ కాలములో అందించ బడినది.

300 హెచ్.పి. గల 3 పంపులు, 200 హెచ్.పి. గల 2 పంపులు మొదటి తడవ బిగింప బడినదవి. అవి 45 అడుగుల లోతు నుండి నీటిని అవలీలా తోడి పోసినవి. ఈ నీరు సాగునకై పొలాలలకు చేర్చబడినది.

ఈ నీటిని మొదట అచటి రైతులచే అతి తక్కువ సమయంలో నిర్మింపబడిన రెండు ప్రధాన కాలువల లోనికి వదల బడినది. ఇక అక్కడ నుండి అద్భుతమైన రీతిలో రైతాంగముచే త్రవ్వబడియున్న 4.5 కిలోమీటర్ల మేరకు నీటిని అందించి, ఆపైన 15 మైళ్ల వరకు పిల్ల కాలువల ద్వారా నీరు చేర్చబడినది.

ఈ విధముగా శుష్కించియున్న, దాహార్తి గల అచటి నేలకు, నూతనంగా అందిన నీటితో, పచ్చదనము సర్వత్రా యేర్పడి రైతు భాగ్యోదయమునకు బాట సుగమ మైనది. ఏండ్ల తరబడి కడుదీనముగా సాగిన వారి బ్రతుకులకు ఒక్క పెట్టున అందిన అభ్యుదయము ఆ రైతులను ఆనందోత్సాహమలలో ముంచెత్తినది. ఇది మరియొక మహాద్భుతము కాదా !

మనము, యిక్కడ ముఖ్యంగా గమనించ వలసినది – గడ్డిపల్లి దాని పరిసర గ్రామ ప్రజలకు కేవలము భౌతిక సంపద మాత్రమే అందుట కాదు, అంతే మోతాదులో దానికి తోడుగా ఆత్మసంపద అభివృద్ధి జరిగినది. ఆధ్యాత్మిక విప్లవమే వెల్లువలా వచ్చి పడినది. గడ్డిపల్లిలో సంభవించిన ప్రతి సంఘటన ఒక మహా అద్భుతమే కాని సాధారణ విషయమేమి కాదు. అట్టి అభివృద్ధికి కారణమైన ఆధ్యాత్మిక శక్తిపట్ల ప్రజల హృదయములందు అంకురించిన కృతజ్ఞతా భావము ననుసరించి, ఆ శక్తిని ప్రతి నిత్యం ఆరాధించుటకు వీలుగా 'ఆరాధనామందరిము' (Shrine) నొకదానిని నిర్మించి, పవిత్రమైన శ్రీ అరవిందుల దేహాంశములను (Relics) శ్రీ అరవిందాశ్రమము నుండి తెచ్చి, అందు నిక్షిప్తం చేయాలని సంకిల్పించారు.

ఈ విధమైన ప్రజల ఆకాంక్ష అతి త్వరలోనే రూపము దాల్చినది. ఆరాధనా మందిరము వెలసినది. అందు శ్రీ అరవిందుల దేహాంశములు (Relics) తేది 4-4-1972లో ప్రతిష్ఠించుట జరిగినది. ఆశ్రమము నుండి శ్రీ కీరిట్ జోషి గారు ఈ ఉత్సవమున కరుదెంచినారు. అపూర్వము, అత్యంత నూతనమైన ఈ ఉత్సవములో పాల్గొనుటకు చుట్టూవున్న పరిసర గ్రామముల నుండి 10 వేలకు పైగా జనము అరుదెంచినారు. దూరదూర గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ రెండెడ్ల బండ్లను, బసవన్నలను అలంకరించుకొని, మరి కొందరైతే 'ప్రభ'లను బండ్లపై అమర్చుకొని

అరుదెంచినారు. వివిధ రంగుల ఝండాలతో అలంకరించుకొని వచ్చిన బండ్లు అచటి మైదానము నిండా వుండి పండుగ శోభను సమకూర్చినవి. శ్రీ అరవిందులు సర్వదా ఆనందోత్సాహములతో సాగిపోవుటను 'Sunlit path' - "సూర్యపథము" – అని అనేవారు. శ్రీ అరవిందులన్నట్లుగానే అచటి ప్రజలు స్పందించినారు. డా॥ గోపాలరెడ్డి గారి నేతృత్వములో వారికి సమకూరిన సంపదను సక్రమముగా వినియోగించుచున్నారు.

గడ్డిపల్లి సొసైటి వ్యవసాయ ట్రాక్టర్లను, లారీలను, కార్లను కలిగియున్నది. వాని నన్నింటిని మంచి స్థితిలో నుంచుటకు అనగా చెడిపోయినపుడు బాగు చేయుట, సర్వీసింగ్ చేయుటకు సెంటర్లు కూడా నున్నవి. యువశక్తిని సంసిద్ధ పరచుటకు ఒక శిక్షణా సంస్థను కూడా నెలకొల్పినారు. ముందు ముందు అక్కడ ఒక నూతన ఆదర్శప్రాయమైన ఆధునిక గ్రామాన్ని, ప్రస్తుతమున్న ధనిక, పేద తారతమ్యమలతో కాకుండా, సంపూర్ణ జీవనానికి తోడ్పడుటకు గాను, సంపన్న గృహములతో నిర్మింప చేయాలను ప్రతిపాదన వారి ముందున్నది. ఆ గ్రామములోని గృహములన్నీ ఆధునిక వసతులతో సమాజ జీవనానికి అనుకూలంగా నుండునట్లు, అన్ని సౌకర్యములను కల్గియుండునట్లుగా – ఆరోగ్యకేంద్రమ, విద్యాలయములు, ఆటల మైదానం, ఆడిటోరియం, వర్కుషాపు, లాండ్రీ, కిచెన్, చేతి వృత్తులు, ఐస్‌క్రీమ్ పార్లర్లు, స్విమ్మింగ్ పూల్ మొదలగు వానితో మనిషియొక్క అవసరములను తీర్చగలిగి నట్లుండును. ఇలాంటి గ్రామాల్లో నివసించుట, పనిచేయుట వలన, అక్కడున్న వారికి అన్ని సౌకర్యాలను అనుభవించువారికి ఎవరికి కూడా పట్టణానికి పోవాలనెడి కోరిక పుట్టదు. నిజమునకు పట్టణవాసులకే తిరిగి గ్రామాలకు తరలిరావాలనెడి కోరిక పుట్టగలదు.

ప్రస్తుతమనకు ఈ పనులన్నీ సాధ్యాలే. ఇక ముందు ముందు యిక్కడ చేపట్టబడే పనులన్నీ కూడా సాధింప బడతాయి. ఇక్కడ పని చేయుచున్న "శ్రీమాత అనుగ్రహం", మరియు "శ్రీ అరవిందుల కర్మధార" వల్లనే మానవమనస్సు అసాధ్యాలనుకున్నవన్నీ సాధింప బడుటయే మహిమాద్భుతము (Miracle) అని అర్థము. "శ్రీ అరవిందుల కర్మధార" (Sri Aurobindo's Action) అనునది, యదార్థమునకు దేశ స్వరూపాన్ని ఏ విధంగా మార్పు చేయనున్న దనుటకు, గడ్డిపల్లిలో సంఘటిల్లిన విశేషములన్నీ సజీవమైనవి. ప్రదర్శనాపూర్వకమైన నిలువెత్తు నిదర్శనములు. ఈ 'శక్తి' యొక్క నిరంతర ఉనికి నిలువరించి యున్నందున, ప్రజలు స్వల్పకాలములో

సమకూర్చుకొన్న ఆకస్మిక ధన సంపదలు, వారి సమతౌల్యాన్ని దెబ్బతీయునేమో యని భయపడ నక్కర లేదు. ఈ సంఘటనను గూర్చి ముందుగానే దర్శింపబడినది.

ఇప్పుడిక, ఉజ్వలమైన ఈ గడ్డిపల్లి ఉదాహరణనే భారతదేశము అనుసరించ నున్నది. ఒరిస్సా రాష్ట్రమందు ఈ విధమైన అభిలాషకు సృష్టి జరిగినది. దానిని గూర్చి మేము తర్వాత వ్రాయగలము. కాని ఈ విధమైన స్థితియే మన దేశమందు అంతటా నెలకొని యున్నది. గడ్డిపల్లిలో మాత్రము "శ్రీ అరవింద కర్మధార" యదార్థముగా అభివ్యక్తమైనది. 85% ప్రజలు గ్రామాలందు నివాసముంటున్నార. ఈ శక్తిని మనము వారివైపు మళ్ళించి, వారి దరిచేర్చుట ఎంతేని అవసరమై యున్నది. అప్పుడు గాని, ప్రస్తుతము మనదేశమున్న బడుగు స్థితి నుండి బలసంపన్న దేశముగా చేయాలని అభిలషించినచో "శ్రీ అరవింద కర్మధార" శక్తిని వారివైపు మళ్ళించ వలసి యుండును. తద్వారా భారతము తన నిజగమ్యమును "సిరులు పొంగే భరతభూమి" చేరగలదు. గడ్డిపల్లి ఉదాహరణతో ప్రేరణ పొందిన వారందరక మా ఆహ్వానమ. అట్టివారు ఎవరైనా మాకు తెలిసినచో ఈ మార్గములో మనమందరము కల్సి భారత దేశాన్ని భవ్యమైన పరమ వైభవమైన గమ్యానికి ఏ విధంగా చేర్చవలసి యుండునో నిర్ణయించెదము. ఆ కార్యములో సహకరించ దలచిన వారందరకు మా స్వాగతము.

- ఉదార్ పింటో

"Gaddipally Miracle" అను ఈ వ్యాసము 1972 సం॥ము మే నెలలో "Sri Aurobindo's acton" - అను ఆశ్రమ పత్రికలో ప్రచురించ బడినది. ఆ పత్రికా సంపాదకులు శ్రీ ఉదార్ గారు గడ్డిపల్లిని సందర్శించి, అచటి స్థితిగతులను అవగాహన చేసికొని, శ్రీమాత మహిమలను ఒక్కొక్కటిగా దర్శించి, అపారమైన ఆ జగన్మాత దయవలన మాత్రమే అచటి సంఘటనలు కార్యరూపము దాల్చినవని గ్రహించినారు. శ్రీమాత ఎన్నుకున్న ఉపకరణము మాధ్యముగా జరిగిన వానినన్నింటిని "శ్రీమాత అద్భుత మహిమలు"గా, లోకానికి చాటినారు. ప్రజల పక్షమున తన ఉపకరణమును నిలబెట్టి, వారి ద్వారా ప్రజల ఆకాంక్షను స్వీకరించి, దైవ నిర్దేశితమైన కార్యాన్ని తిరిగి వారి ద్వారానే కొనసాగించి, ప్రజల జీవనమును పరిణామము చెందించిన ఘనత శ్రీమాతది కాక మరెవ్వరిది ?

గడ్డిపల్లి ప్రజల్లో ప్రభవించిన భక్తి ప్రపత్తులు, వారు శ్రీమాతకు శరణాగతు లగుట మొదలు, అచట చోటుచేసుకున్న అన్ని సంఘటనలు – ఆ "దివ్యమాత అవ్యాజ అనుగ్రహము" మరియు "శ్రీ అరవింద కర్మధార శక్తి" యొక్క ప్రభావము కారణంగా సిద్ధించినవి. మహిమాన్వితమైన శ్రీమాతారవిందుల ప్రభావము గడ్డిపల్లి క్షేత్రముపై ఆచ్ఛాదించినట్లున్నది. ఆ కారణంగానే అక్కడ ఆరంభించిన కార్యములు నిర్విఘ్నముగా కొనసాగుచున్నవి.

అభ్యుదయ పరముగా నేడు గడ్డిపల్లి వైభవము రాష్ట్ర దేశ ఎల్లలన అధిగమించి, అంతర్జాతీయ స్థాయికి ఎదిగి పోయినది. 40 సంవత్సరాల నాడు ఆకలికి అలమటించిన అచటి ప్రజల నేడ భోగభాగ్యమలతో తులతూగుచున్నారు. వారి జీవితములు శ్రీమాతారవిందుల అనగ్రహము వలన రూపాంతరము చెందినవి. ఆ ప్రజల మధ్యనుండే తన ఉపకరణముగా శ్రీ గోపాలరెడ్డిని ఎంపిక చేసి, ఆది నుండే అతనిని సంసిద్ధ పరచినది. అతని హృదయంలో 'అమ్మ'పై అచంచలమైన భక్తి భావము నింపి, తన కార్యము సాధింపబడునట్లు తర్ఫీదు నిచ్చి, అతని నాయకత్వములో ప్రజలను నడిపించునట్లు చేసి, సంఘటిత శక్తి ద్వారా సాధింపబడినట్లు తనవైభవ లీలను తానే చాటుకొన్నది ఆ జగన్మాతకాక మరెవ్వర ?

దేవ కార్య నిర్వహణకై నియమింపబడి దైవ ఉపకరణముగా పేర్కొనబడిన ఆ గోపాలరెడ్డి ఎవరు ? చరిత్రపుటల కెక్కిన వారి ఘనత ఏమిటి ? మొదలగు విషయముల తెల్సుకొన వలెననెడి అభిలాష, ఆ క్షేత్రమును సందర్శించాలనెడి కోరిక ఎవరికైనా కలుగక మానదు. ఆ విషయమలను దృష్టి యందుంచుకొని ఈ ప్రయత్నమనకు పూనుకొన్నాను. ఇదంతయు ఆ జగన్మాత ప్రేరణ, ప్రోత్సాహము వల్లనే నాలో కల్గినది. నా అవగాహన మేరకు ఆదర్శప్రాయమైన డాక్టరు గారి జీవిత విశేషమలను భావితరాలకు అందించాలని, దాదాజీ ఆదేశానుసారము చేసిన ప్రయత్నమిది.

★★★

శ్రీ గంటా గోపాలరెడ్డి గారి జీవిత విశేషములు

రచనా ఆవశ్యకత

శ్రీ అరవిందులు శ్రీమాత ఆధునిక యుగములో అవతరించిన అవతార ద్వయం. వీరు యిర్వురు ఒకే చైతన్యము గలవారు. ఆధునిక ప్రపంచంలోని అపూర్వమైన, విపత్కాల సమస్యలను పరిష్కరించుటకై వారు అరుదెంచినారు. ఏమిటా విపత్కాల పరిస్థితి ? పాశ్చాత్య దేశీయులు, మహోన్నతమైన, సుఖ దాయకమైన, విలాసవంతమైన, అద్భుతమైన పట్టణ నాగరికతను నిర్మించి, ప్రపంచాని కందించ గల్గిరే కాని, శాంతిని ఆవిష్కరించలేక పోయారు. పాశ్చాత్య దేశాలు ఐశ్వర్య వంతమైనవే, కాని ప్రస్తుత విషమ సమస్యలను పరిష్కరించలేక పోయినవి. జటిలమైన యిట్టి సమస్యలను భారతీయ నాగరకత కూడా ఒడ్డున బడవేయలేదు. ప్రాక్ పశ్చిమాలు రెండూ పరిష్కరించ వీలు కానటువంటి సంకటావస్థలోనికి నెట్టబడినాము. మనము ఆర్థికంగా సంపన్నులమైనాము. ఆధునిక సౌకర్యములను ఆనందంగా అనుభవించు చున్నాము. కాని శాంతి మాత్రము మనకు ఆకాశ కుసుమమే అయినది. దీనికి పరిష్కారం కావాలి. శ్రీరాముడు, శ్రీకృష్ణుని అనంతరం వచ్చిన అవతారం శ్రీ అరవిందులది. వీరు మనకు తేటతెల్లంగా చెప్పిన సత్యం – మానవుడు మధ్యంతర జీవి. పరిణామము యింకా కొనసాగుచునే యుంది. ఈ పరిణామము యిదే విధంగా, అతిమానస జీవుల ఆవిర్భావము వరకు సాగగలదు. అతి మానస జీవులనగా, సంపూర్ణ పరిపూర్ణతను సంతరించుకొన్నవారు. వారు మాత్రమే సంతృప్తికరమైన పరిష్కారమును చూపగల సమర్థులు.

మన ప్రాంతమున, శ్రీమాతారవిందుల దివ్యజ్యోతిని వెలిగించి, ప్రజ్వలింప చేసినవారు, Prof. V. మధుసూదన రెడ్డి గారు. వీరు హైద్రాబాదులోని ఉస్మానియా విశ్వ విద్యాలయములో తత్వశాస్త్ర ఆచార్యులుగా పని చేసినవారు. వీరు శ్రీ మాతారవిందుల అనుంగుబిడ్డ. వారి చరణముల వద్ద తన జీవితమును సమర్పించు కొన్న ధన్యజీవి. అనన్య భక్తి ప్రపత్తులను కలిగిన భాగ్యశాలి; విశిష్టమైన శిష్యుడు. శ్రీ అరవిందుల దర్శన శాస్త్రమును ఔపోసన బట్టినవాడు కావున ఆ తత్త్వమును, మన దేశమందే గాక ఖండాంతరములందును వ్యాప్తి చేసిన ఘనుడు. వారి మేథోపరమైన స్థాయికి తగినట్లుగా, వినూత్నము, విలక్షణమైనట్టి శ్రీ అరవిందుల దర్శనమును విశ్వ మందంతటా వ్యాప్తి చేయుట కొరకు, శ్రీమాత వారికి 'Institute of Human Study' అను సంస్థను, మరియు "New Race" అను పత్రికను ప్రసాదించినారు. వారి

నుండి మనము, అనేకమార్లు గంభీరము, గతి శీలమైన రీతిలో, శ్రీమాతారవిందుల తత్వమును వినుటతో మనమంతా అదృష్టవంతుల మైనాము. శ్రవణానందముగాను, అతి సరళంగాను, మన భాషలో, మధురముగా, ఈ దర్శనాన్ని అందించిన మరొక మహనీయులు శ్రీ తెన్నేటి పూర్ణచంద్రరావు గారు. గత ముప్పదేండ్లుగా ఈ మహనీయుల ఉపన్యాసములను విన్నాము. అనేకమారులు అక్కడక్కడ జరిగిన శిబిరములందు, మహాసభలందు పాల్గొంటూనే యున్నాము. వీటన్నిటి ఫలితముగా శ్రీ అరవింద తత్త్వమును సైద్ధాంతికంగా మాత్రమే గ్రహించ గల్గినాము. కాని అనుభవ పూర్వకంగా కాదు. దేనినైనా, అనుభవ పూర్వకముగా గ్రహించనంత వరకు అవి సమగ్రము కానేరదు. ఒక అంశమును సంపూర్ణంగా అవగాహన చేసికొనుటకు, సిద్ధాంత పరము, అనుభవ పూర్వకమైన యిరు పార్శ్వములు అవసరమైనవే. ప్రస్తుతము మనము అనుభవ రాహిత్య అవగాహనతో కొట్టుమిట్టాడుతు, కొంత నిరుత్సాహమునకు లోనయిన మాట వాస్తవము.

మన అదృష్టంకొద్దీ, ఈ పరిస్థితులలో ఒక ఆశావహకిరణము వలె, నల్లగొండ జిల్లాలో, భూమాత భక్తుడైన రైతుబిడ్డ తెరపైకి వచ్చి, ఉపయోగితావాదముతో, ఆచరణాత్మక, అనుభవ పూర్వక, క్రియాత్మక కార్యనిర్వహణకు పూనుకొనుట ముదావహము. ప్రస్తుతము ఆయన అదే జిల్లాలోని గడ్డిపల్లిలో పని చేయుచున్నారు. ఆయన అమెరికాలో నున్నపుడు, శ్రీ అరవింద తత్త్వ నిష్ణాతులైన, శ్రీ A.B. పురాణి; మరియు Prof. మధుసూదన రెడ్డి గారల చైతన్య పూరిత, సృజనాత్మక ప్రసంగములను విని, వానికి ప్రభావితులై శ్రీ అరవింద తత్త్వమునకు ఆకర్షితులైనారు. శ్రీ గోపాలరెడ్డి గారు మొట్టమొదటిసారిగా, శ్రీ అరవిందులను గురించి వినుట, వారి సమగ్ర దర్శనమును గురించి తెల్సుకొనుట సంభవించినది. డా॥ గోపాలరెడ్డి గారు సామాన్య వ్యక్తేమి కాదు. ఆయన ఆధ్యాత్మిక భావ సంపూర్ణుడు. శ్రీ అరవిందుల తత్త్వ పరిచయముతో, వారిలోని ఆధ్యాత్మిక ధార, ఒక్కసారిగా పెల్లుబికినది. అందునా, శ్రీ అరవిందుల దర్శనములోని 'సమగ్రత' (Integral) ఆయనను మరింత ప్రభావితున్ని చేసినది. ఉన్నత విద్యార్జనకై అమెరికాలో నివాసముండుట వలన వారికి ఉన్నత స్థాయిలో ప్రణాళికలను రూపొందించు భావన వంటపట్టినది. డా॥ గోపాలరెడ్డి గారు అమెరికా నుండి "అగ్రానమీ"లో Ph.D. పట్టాను పొంది, విజయవంతంగా, తిరిగి వచ్చిన వెంటనే హైద్రాబాదులో Prof. మధుసూదన రెడ్డి గారిని కలిసి, తాను నిర్వహించవలసిన కర్తవ్యమును నిర్దేశించుకొనుటకు వారితో సమాలోచన గావించెను. డా॥ గోపాలరెడ్డి గారి అంతరంగంలో, అలజడి చెలరేగుచుండెను. ఆయన సదా

భారతీయ ఆధ్యాత్మికత యొక్క భవిష్యత్తును గూర్చి ఆలోచించు చుండిరి. ఆశ్చర్యకరమైన విషయమేమంటే, తానొక వ్యవసాయ శాస్త్ర విద్యార్థియై యుండి, నిరంతరం భారతమాత యొక్క పునరుజ్జీవము, పరమ వైభవమైన ఆధ్యాత్మిక భారతావని ఆవిష్కరణ ఎలా జరుగును ? ఏమి చేయాలి ? వ్యవసాయ శాస్త్రము నందు పారంగతుడను, నా చదువు ఈ దేశానికి ఏ విధముగా ఉపయోగపడగలదు ? అత్యంత శోభాయమానంగా గతము నందు వర్ధిల్లిన భారత దేశము తన స్వధర్మమైన ఆధ్యాత్మికతను సాధించుట ఎట్లు ?

ఆం.ప్ర. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఆచార్య పదవి :

డా॥ గోపాలరెడ్డి గారి అంతరంగములో భారతదేశమునకు సంబంధించిన బహువిధములైన ఆలోచనలు బయటకు తొంగి చూస్తున్న ఆ సమయంలోనే, ఆం.ప్ర. వ్యవసాయ విశ్వవిద్యాలయములో ఆచార్య పదవి, వారిని వరించినది. (1969) అసోసియేట్ ప్రొఫెసరుగా వారు 'Agronomy' డిపార్టుమెంటు మరియు 'Soil Science' లలో స్నాతక, పూర్వోత్తర విద్యార్థులకు పాఠములను బోధించినారు. అంతేగాక తన అవగాహన ననుసరించి, కో-ఆర్డినేటర్‌గా, వ్యవసాయ కళాశాల యొక్క 'అకడమిక్ ప్లాన్'ను సంసిద్ధపరచుటలో చురుకైన చొరవను చూపి, ఆధునిక స్థితి కనుకూలముగా దానిని రూపొందించినారు.

ఆనాటి 'గడ్డిపల్లి' స్థితి గతులు :

గడ్డిపల్లి, నల్లగొండ జిల్లాలోని, హుజూర్ నగర్ తాలూకా యందు ఒక చిన్న గ్రామము. నాగార్జునసాగర్ ఎడమ కాలువ, గడ్డిపల్లి గ్రామ శివారులో నుండి పోవుచున్నది. కాని ఏమి లాభం ? గడ్డిపల్లి చుట్టుముట్టు వున్న భూములు బీళ్లుగానే మిగిలి పోయినవి. రైతులు తమ ఇండ్ల నుండి బయటికి వచ్చి చూచినపుడు వారికి కనబడు దృశ్యము, బీడు పడియున్న భూములు ఒకవైపు, మరొకవైపు కాలువ నిండా పొంగి పొరలు కృష్ణమ్మ పరుగులు. ఈ రెండింటిని చూచి, రైతులు కలకల చెందుచు "అయ్యో ! మేమెంతటి నిర్భాగ్యులము" అని వగచుట తప్ప వారికి మరేమి మిగుల లేదు. మృగతృష్ణ ప్రాయము వలె దాహార్తిని తీర్చుకోలేని దురవస్థ వారిది. అనాదిగా ఆధారమైన ఋతుపవనములే వారికి శరణ్యము. తమ భాగ్యములో యింతే వున్నది గాబోలు ! అన్న రైతుల వగపు, తన చిన్న నాటి నుండి, మన గోపాలరెడ్డి గారు చూచుచున్న విషయమే. ఈ సమస్యల నుండి మనము కొంత ముందుకు వచ్చి చూడాల్సిన అవసరమున్నది. అదేమన, గడ్డిపల్లి, దాని పరిసర గ్రామముల భూములు

మెరుగైనవే, వాని కొరత నీరు లేని తనము, అక్కడ నీరు లేదా ? ఉన్నది. కాని ఉపయోగము లేదు. ఈ రెండింటి విషయమును ప్రక్కకు పెట్టి పరిష్కార దిశగా ఆలోచించినపుడు, యిక్కడ డా॥ గోపాలరెడ్డి గారు రంగప్రవేశము అవసరమైనది. వారు వ్యవసాయ శాస్త్రములో అత్యున్నచదువులను, అధ్యయనం చేసినవారు ఉన్నత స్థాయిలో ప్రణాళికలను రూపొందించి, భూ, సంబంధ సమస్యలను పరిష్కరించుటలో సిద్ధహస్తులు. వారు స్వదేశమునకు తిరిగివచ్చిన నాటి నుండి, తమ జన్మభూమి వ్యవసాయ సమస్యలు, మనఃశాంతి లేకుండా చేసినవి. దీనికి సంబంధించిన భావనలు, ఆలోచనలు వారి మనస్సునందు నిరంతరం మెదులు చుండెను; నిరంతర సంభావనలు, అంతరంగంలో మెదులుచుండుట వలన – ఆ బీడు భూముల సాగుకు సంబంధించిన అమూల్య ఆలోచనొకటి తటుక్కున వారి మదిలో స్ఫురించెను. అదే "లిఫ్టు ఇరిగేషన్" – ఎత్తిపోతల నీటితో సాగుచేయు పద్ధతి. భారీ ప్రాజెక్టుకు చెందిన పంట కాలువ, గ్రామ పొలిమేరల గుండా, జీవనది వలె నిరంతరం ప్రవహించుచున్నది. దానిని సద్వినియోగ పరచుకొనుట కన్న, మరొక మార్గము లేదన్నది తేలిపోయినది. ఈ విషయమును గడ్డిపల్లి దాని పరిసర గ్రామముల రైతులకు, ప్రజలకు, వివరముగా దాని మంచి చెడులను వివరించినారు. దీనికి వారంతా ముక్త కంఠముతో తమ అంగీకారమును తెలిపినారు.

డా॥ గోపాలరెడ్డి గారు దీనికి సంబంధించిన సంపూర్ణ ప్రణాళికను రూపొందించి, గడ్డిపల్లితో ఏడు గ్రామముల ప్రజలు దీనిని బలపరుస్తున్నట్లు వారి ఆమోద అంగీకార పత్రములతో సహా, ఆనాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విన్నివించారు. ప్రభుత్వ వ్యవసాయ శాఖ మంత్రి, ఉన్నతాధికార గణములతో చర్చించి, దాని సాధ్యాసాధ్యతలను, అందుకు రైతులందించు సహకారాన్నీ, వగైరా విషయాలను వివరించి, ప్రభుత్వమును "లిఫ్టు ఇరిగేషన్" పద్ధతి ద్వారా నీటిపారుదల అవకాశమును కల్పించుటకు అంగీకరింప చేయుట జరిగినది.

ఫలితముగా ఆం.ప్ర. ప్రభుత్వ పబ్లిక్ వర్క్స్ (P.W.D.) డిపార్టుమెంటు (ప్రాజెక్టు వింగ్) ద్వారా G.O.Ms. No. 194, తేది : 31-5-1969, సానుకూలముగా విడుదల అయినది. దాని ప్రకారం, నాగార్జునసాగర్ ఎడమ కాలువ క్రింద 72.4 మైళ్ల వరకు ఇరుప్రక్కల రమారమి 50 వేల ఎకరాలకు "లిఫ్టు ఇరిగేషన్ పద్ధతి" ద్వారా, నీటి పారుదల అవకాశమునకు మంజూరు యిచ్చినది. ప్రజలందరు, తమకు ప్రభుత్వము కల్పించిన ఈ సౌకర్యమునకు, కృతజ్ఞతలను తెలియచేసుకొన్నారు. శ్రీమాత అనుగ్రహంతో డా॥ గోపాలరెడ్డి గారు సాధించిన ఘన విజయమును వేనోళ్ల పొగిడి,

వారి నాయకత్వమునకు జేజేలు పలికినారు. వారి ఆదేశానుసారము, ముందుకు సాగుటకు కృతనిశ్చయులైనారు. పూర్వము భగీరథుడు గంగామాతను దివి నుండి భువికి తెచ్చినట్లు నేడు డా॥ గోపాలరెడ్డి గారు 'సాగర' జలమును గడ్డిపల్లి భూములలోకి ప్రవహింపజేసి, అపర భగీరథుడుగా అందరి మన్ననలను పొందినారు.

ఆనాడు మహాత్మాగాంధి జయంతి, (2-10-1969) నాగార్జునసాగర్ కాలువలో నుండి నీటిని ఎత్తి పోయుట కొరకు భారీ మోటార్లను, పంపుసెట్లను, అమర్చుట, కాలువల నిర్మాణము యిత్యాది పనులను నిర్వహించుటకు - "మహాత్మాగాంధి లిఫ్టు ఇరిగేషన్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్" సంస్థను స్థాపించుట జరిగినది.

ఆధునిక వ్యవసాయమునకుపయోగపడు యంత్రములను నిర్వహించుటకు, యువకులను తీర్చిదిద్దుటకు 'కృషి విజ్ఞాన కేంద్రము' స్థాపింప బడినది. (1984-85)

ప్రస్తుత కాలమునకు తగినట్లు గడ్డిపల్లిలో "బయోటెక్నాలజీ ప్రాజెక్టు"ను చేపట్టుట జరిగినది. గ్రామీణ భారత నిర్మాణమునకు కావలసిన వివిధ క్షేత్రములందు యువతను సంసిద్ధ పరచుటకు "శ్రీ అరవింద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్" అను సంస్థను నెలకొలిపినారు. ఇంతే గాకుండా, విద్యాలయమును, ఆరోగ్య సంరక్షణకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును, మరెన్నిటినో స్థాపించినారు.

గడ్డిపల్లి ప్రజల ఆధ్యాత్మిక ఆకాంక్షకు తగినట్లు, శ్రీ అరవిందపురము (గడ్డిపల్లి)లో శ్రీ మాతారవిందుల ధ్యానమందిరమును నిర్మించినారు. ప్రజలలో మాతృభావమును జాగృత మొనర్చినారు. ఇన్నివిధములుగా, ఆ గ్రామ నిర్మాణమునకు తపించిన ఆ మహామనీషి డా॥ గోపాలరెడ్డి గారు ఆ ప్రాంత ప్రజల మార్గదర్శి. వారి భాగ్యోదయమును తీర్చిదిద్దిన వైతాళికుడు.

ఇక అసలు విషయానికి రావాలి కదా ! డా॥ గోపాలరెడ్డి గారి జీవిత చరిత్రను వ్రాయుటకు నేనెందుకు పూనుకున్నాను ? దీనికి ప్రధాన కారణమొక్కటే. మాకు, 'గురు భాయి' గా, 40 సంవత్సరముల నుండి, మార్గదర్శనము చేయుచున్న డా॥ మన్మోహన రెడ్డి (దాదాజీ) గారి నుండి అందిన ప్రేరణయే ప్రధానకారణము, అని చెప్పక తప్పదు. ఒక సంవత్సరము క్రితము, అనగా - 2009లో వారు నాకొక సుధీర్ఘ లేఖ వ్రాసినారు. అందులో, నల్లగొండ జిల్లా, గడ్డిపల్లి గ్రామములో జరిగిన

ప్రగతిని గూర్చి, దానికి కారణభూతుడైన డా॥ గోపాలరెడ్డి గారు సాధించిన మహనీయమైన గ్రామాభ్యుదయమును గూర్చి వివరించారు. వారి త్యాగశీలతను వర్ణించినారు. అపార కరుణా సముద్రురాలైన శ్రీమాత అనుగ్రహముతో, ఆమె నేతృతత్వముతోనే సిద్ధించిన ఆ ప్రగతిని విస్పష్టముగా వివరించి, దానినంతా ఉల్లేఖించుచు, డా॥ గోపాలరెడ్డి గారి జీవిత చరిత్రను రచించుట కాదేశించినారు. (ఆ లేఖ పాఠమును, ఈ వ్యాసము చివరలో చేర్చబడినది.) గడ్డిపల్లిలో కొనసాగుచున్న ప్రాజెక్టులన్నీ, సంకల్పించిన విధముగా, నిర్విఘ్నముగా, శ్రీమాత ఆశీస్సులు, అనుగ్రహము వలననే సిద్ధించినవని .... అందరి విశ్వాసము. ఆదిలో జరిగిన అద్భుత మహిమలు ఆ తరము వారిని బాగా ప్రభావము చేసినవి. ఆనాటి, ఆ మహిమలను ఈ తరము వారు కథలు కథలుగా చెప్పుకొని, శ్రీమాత పట్ల తమ కృతజ్ఞతలను ప్రకటించెదరు. అదెప్పుడు జరుగ గలదు ? ఎవరి వలన విన్నను అది ఒక అంశము మాత్రమే కాని పూర్తి వివరములు తెలియుటకు అవకాశము లేదు. ప్రతివారు తమ తమ అనుభవములకే పరిమితము గాకుండా, సంపూర్ణ చరిత్రను తెల్సికొనుట శ్రేయస్కరముగా యుండగలదని విషయము లన్నీ అవగాహన జరిగిన పిమ్మట, వారికి శ్రీమాత, శ్రీ అరవిందులపై ప్రేమాభిమానములు పెరిగి భక్తి భావము బలపడగలదని, మరెందరికో మార్గదర్శనము కాగలదని, ఈ ప్రయోజనము సిద్ధించుటకు, ఏమాత్రం తాత్సారం చేయకుండా, గడ్డిపల్లి కథానాయకుడు, డా॥ గోపాలరెడ్డి జీవిత చరిత్ర రచనకు పూనికతో ప్రయత్నించ వలసినదిగా, దాదాజీ సూచించినారు. శ్రీమాత భక్తులుగా మేము సహయోగులమైనందున, వారి సూచనను సుగ్రీవాజ్ఞగా తలదాల్చి, తక్షణమే అంగీకరించుట జరిగినది.

సమాచార సేకరణ :

శ్రీ దాదాజీ సూచనకు బలము చేకూర్చుటకాయన్నట్లు, మావద్ద నుండి, మా మిత్రులొకరు శ్రీ అందె వెంకట్రామారెడ్డి గారికి విచిత్రమైన కోరిక గల్గినది. అదేమనగా వారికి మన డా॥ గోపాలరెడ్డి గారిని, వారి కార్యక్షేత్రమును చూడాలని, గత ఐదు సంవత్సరాలుగా మేము ఒక్కచోటనే వున్నా వారి విషయమును ఎప్పుడూ ప్రస్తావించలేదు. వారి గడ్డిపల్లి సందర్శనా కోరిక పట్ల నాకు అమితమైన ఆశ్చర్యం కల్గినది. అది కూడా దాదాజీ ఉత్తరమందిన తర్వాత, వారికి గడ్డిపల్లి పోవు మార్గము, డా॥ గోపాలరెడ్డి గారిని, వారి కార్యదీక్షను గురించి క్లుప్తముగా తెలియపరచినాను. తర్వాత వారికొక చిన్న సూచన చేసినాను. వారి జీవిత చరిత్ర వ్రాయాలని యున్నది,

కావున వారి బయోడేటా అడిగి తీసుకరావలసినదిగా కోరుట జరిగినది. వారంరోజుల తర్వాత తిగిరి వచ్చిన వారు నాకు డా॥ గోపాలరెడ్డి గారి బయోడేటాను, వారు వ్రాసిన 'Spiritual Party of India' అను గ్రంథమును తెచ్చి యిచ్చారు. డా॥ గోపాలరెడ్డి గారు ప్రేమతో పంపించిన ఈ రెండు నా రచనకు తోడ్పడినవి. వీనికి తోడుగా పూర్వం దాదాజీ సంపాదకత్వంలో గడ్డిపల్లి నుండే ప్రచురింపబడిన మాస పత్రిక "శ్రీ అరవింద కర్మధార" మిక్కిలి విలువైన సమాచారము నందించినది. ఈ విధముగా వివిధ మార్గముల ద్వారా అందిన సమాచారాన్ని ప్రోది చేసి నా రచనలో పొందు పరచినాను. ఈ చిత్తు ప్రతిని 2010 ఆగస్టు దర్శనానికి ఆశ్రమమును సందర్శించినపుడు దాదాజీ దానిని క్రమబద్ధ మొనరించి శీర్షికల నామక్రమమును తెల్పినారు. వాని నన్నిటిని క్రమపద్ధతిలో చేర్చి ఈ రచనను సాగించినాను. పైన నాకు దాదాజీ నుండి అందిన లేఖ ఈ జీవిత చరిత్ర రచనకు మూలము అని పేర్కొని యుంటిని ఆంగ్లములోని ఆ లేఖను యదాతదముగా అనువదించి యిక్కడ చేర్చుట జరిగినది.

డా॥ మన్మోహన రెడ్డి గారి లేఖ

శ్రీ అరవిందాశ్రమము
30-3-2009

ప్రియమైన,
సురేంద్రాచార్యులు - నమస్తే.

నీ ఆరోగ్యం విషయములో నాకు చాలా చింతగా యున్నది. శ్రీమాత కార్యాన్ని చిత్తశుద్ధితో చేయగలిగిన వాడవు నీవు ఒక్కడవేనని నా నమ్మకము. డా॥ గోపాలరెడ్డి, గడ్డిపల్లి గారి జీవితము, వారొనరించిన ఘనకార్యములన్నీ, నీవు బాగుగా ఎరుగుదువు. వారు అక్కడ అద్భుత రీతిలో, శ్రీమాత కార్యమున నిమగ్నులై యున్నారు. ఆ కార్యసాధనలో, వారు పదే పదే ప్రభుత్వము వారిని సంప్రదించి, అవసరమైన నిధులను తెచ్చుచున్నారు. వీనిని గ్రామ సీమల అభివృద్ధి కొరకు వినియోగించు చున్నారు. గ్రామసీమల అభ్యున్నతికై వారు అహర్నిశలు శ్రమ పడుచున్నారు. ప్రస్తుత ప్రభుత్వములు పట్టణ ప్రాంతముల అభివృద్ధికి మరిన్ని నిధులను, గ్రామ సీమల అభ్యున్నతికి చాలి చాలని ధనమును వెచ్చించుచున్నారు. డా॥ గోపాలరెడ్డి గారు, ప్రభుత్వము నుండి లభించు వనరులనన్నిటిని రాబట్టుచున్నారు. గ్రామ నిర్మాణం కొరకు చాలా సంస్థలను స్థాపించి నడిపించు చున్నారు. అందులో మొదటిది మరియు

ప్రధానమైనది 'మహాత్మాగాంధి లిఫ్టు ఇరిగేషన్ సొసైటి' (M.G.L.I.) ఇది 1969 సం॥లో స్థాపితమైనది. లిఫ్టు ఇరిగేషన్ కొరకు అమర్చిన మోటార్లు పంపుసెట్లు పాతవైపోయినవి. వాని నన్నటిని మార్చి పెద్దవాని నమర్చుటకు మన ప్రభుత్వము $17^1/_2$ కోట్ల రూపాయలను మంజూరు చేసినది. పాతవి పనికి రాకుండా అయినందున, వాని స్థానములో మూడంతల ఎక్కువ సామర్థ్యంతో పని చేయువానిని బిగించి, ఈ మధ్యనే చాలా పెద్ద పైపులను అమర్చినారు. నేను, 15-7-09 నాడు అచటికి వెళ్లి చూచినాను. నూతనముగా అమర్చిన పైపుల గుండా నీరు వ్యవసాయక్షేత్రాలకు ఉరుకులిడుచున్నవి. చాలా ఆనందం కలిగినది. ఆ పైపుల నిండా ప్రవహించేది శ్రీమాత అనుగ్రహమే నని నాకు సంతృప్తి కలిగినది.

ఆ ప్రాంతమంతా పచ్చని పైరులతో పొంగి పొరలు చున్నట్లున్నది. ఈనాడు ఇక్కడి రైతుల ముఖము నందు ఆనందము, తృప్తి పొంగుచు తొణికిస లాడుచున్నది. అంతటా నూతన గృహ సముదాయములు వెలిసినవి. నూతన శోభను సంతరించు కున్నవి. గడ్డిపల్లి, పూర్వము నేనిచటనున్న దానికన్న మిన్నగా, రూపాంతరము చెందినది. ఇచటి విశాలమైన రోడ్లు, వాని కిరువైపులు రకరకాల దుకాణ సముదాయములు వెలసినవి. ప్రజలు తమ తమ పనులందు నిమగ్నులైయున్నారు. కొందరు సిమెంటుతో ఇటుకలను తీర్చి దిద్దుచున్నారు. స్త్రీ జనము వారి నియమిత కార్యములందు నిమగ్నులు ప్రతి వారిలో ఆనందము, సంతృప్తి తొణికిస లాడుచున్నది. ఆ వ్యవసాయ క్షేత్రము లందు 30 ట్రాక్టర్లు నిరంతరం పని చేయుచున్నవి.

"శ్రీ అరవింద కృషి విజ్ఞాన కేంద్రము" మరియొక సంస్థ; ఇది ప్రభుత్వ సంస్థ అయినను డా॥ గోపాల రెడ్డి గారి ఆధ్వర్యంలో పని చేయుచున్నది.

"గిరిజన సంక్షేమ సంస్థ" ఆ ప్రాంతములోని 'లంబాడి' వారి యోగక్షేమముల కొరకు స్థాపించబడినది.

"బయో టెక్నాలజీ ప్రాజెక్టు" అనునది వేరొక సంస్థ. గడ్డిపల్లి వ్యవసాయ క్షేత్రములో దీని అవసరమును గుర్తించి Prof. G. సత్యనారాయణ గారు యేర్పరచి, పర్యవేక్షించు చున్నారు. ప్రస్తుతము దీని ఆధ్వర్యంలో ఒక ప్రయోగశాల పని చేయు చున్నది. ముందు ముందు దీనిలో భాగముగా "బయో టెక్నాలజీ కళాశాల"ను స్థాపించ వలయునని Prof. G. సత్యనారాయణ గారు పట్టుదలతో యున్నారు.

"శ్రీ అరవింద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్ మెంట్" అనునది మరొక సంస్థ. ఇది శ్రీమాత వర ప్రసాదము. దీని స్థాపనకు సంబంధించిన పత్రములను

ఆనాడే ఆమె పరిశీలించి దానిపై తన సంతకమును పెట్టి, ఆమోదించి, డా॥ గోపాల రెడ్డి గారిని ఆశీర్వదించినారు. గడ్డిపల్లిలో, గ్రామీణాభ్యుదయమునకు వెలసిన సంస్థలు, భవిష్యత్తులో దీని ఆధ్వర్యంలోనే పని చేయును. ఈ సంస్థ పెరిగి పెద్దదై ఒకనాటికి, "Deemed Rural University" గా రూపొందగలదు. గ్రామీణుల ఆశయాలకు, ఆకాంక్షలకు, సాకారమును ప్రసాదించే కల్పవృక్షము కాగలదు.

డా॥ గోపాలరెడ్డి గారి జన్మదిన ఉత్సవ కమిటి

మన కథానాయకుడు డా॥ గోపాలరెడ్డి గారు 79 సంవత్సరములు గల యువకులు. వచ్చే ఏడాదికి 80 యేండ్లు నిండున్నవి. ఈ జయంతిని భారీ ఎత్తున నిర్వహించి, వారిని ఘనముగా సన్మానించ దలచినాను. అందుకొరకు దిగువ పెద్దలతో ఒక కమిటి కూడా యేర్పాటైనది. వారి అంగీకారమును కూడా పొందినాను. డా॥ గోపాలరెడ్డి గారి జన్మదినోత్సవ కమిటి సభ్యులు –

1. డా॥ వి. మన్మోహన రెడ్డి – శ్రీ అరవిందాశ్రమము.
2. ప్రొ॥ జి. సత్యనారాయణ – హైద్రాబాద్
3. శ్రీ వి. రామమోహన రెడ్డి – సూర్యాపేట.

నీ పాత్ర : నీవొక చిత్తశుద్ధి గల భక్తుడవు. డా॥ గోపాలరెడ్డి గారి అభిమానివి. ఈ 80వ జన్మదిన సందర్భముగా వారికి, వారి జీవిత చరిత్రను అందించాల్సి యున్నది. కావున నీవు వారి జీవిత చరిత్రను రచించ వలసి యున్నది. దానికి సంబంధించిన సమాచారమును సేకరించుటకు కృషి చేయాలి. దాని ముద్రణా వ్యయమును నేనే భరించగలను. నీ ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని కోరుచు, "శ్రీమాత ఆశీస్సులు" పంపుచున్నాను ... ఈ పనికి నేను నిన్ను ఎంపిక చేసినాను. ఇందుకు నీవే తగిన వాడవు.

ఇది శ్రీమాత కార్యముగా భావించాలి. ఆమే నీకీ పని అప్పగించినది. ఆమెను మనసారా ప్రార్థించి పని ప్రారంభించు. నీవు పూర్తిగా కోలుకున్న పిమ్మట గడ్డిపల్లి కూడా వెళ్లాల్సి యుండును. అచటి అభిమానుల ద్వారా సమాచారాన్ని సేకరించాలి. వరుస క్రమంలో దానిని గ్రంధస్థం చేయాలి. ఉదాత్తమైన ఈ కార్యాన్ని చేపట్టుట అత్యంత సంతోష దాయక విషయము కాగలదు. డా॥ రెడ్డి గారు నిస్వార్థ పరుడు; ఉన్నత చరిత్ర గల మహామనీషి. కావున నీవు ఈ కార్యాన్ని తలదాల్చి, పూర్తి చేయవలయునని నేను కోరుచున్నాను.

ఇట్లు
దాదాజీ.

జీవిత చరిత్ర రచనా ప్రయోజనము

ప్రపంచ పరిస్థితులు, అనూహ్యామైన మార్పులతో, సంక్లిష్ట స్థితిలో కూరుక పోయినవి. నాగరకతయొక్క విభాగములన్నిటను, అశాంతి, అస్పష్టత రాజ్యమేలు చున్నది. భారత దేశములోని పరిస్థితులు కూడా దీనికి భిన్నము కావు. మన భారతీయ నాయకులు అన్నింటా విదేశములను, అందు ముఖ్యంగా పాశ్చాత్యులనే అనుకరించు చున్నారు.

మన రాష్ట్రము – ఆంధ్రప్రదేశ్‌లో – శ్రీ అరవింద ఉద్యమము నకు ఊపునిచ్చి, నూతన చైతన్యంతో నింపుటకు సంకల్పించి, శ్రీ అరవింద తత్త్వ బోధనలకు, ప్రయోగాత్మకముగా ప్రదర్శించి, గ్రామీణ భారతిని సుసంపన్నం చేసిన డా॥ గోపాల రెడ్డి గారి జీవిత చరిత్ర రచన ద్వారా, ఆ పని చేయనెంచి, వారినే కథానాయకునిగా స్వీకరించుట జరిగినది. వారు శ్రీ అరవిందుల బోధనలకు నిర్దిష్ట రూపము. వారి ప్రతిచర్య శ్రీ అరవిందుల సందేశమును ప్రసారం చేయుచున్నది. ప్రపంచ వ్యాప్తముగా నైతే నేమి, మన భారతదేశము నందైతేనేమి, సర్వత్రా వ్యాపించియున్న సంక్లిష్ట స్థితి, నన్ను కొంత కలవరానికి గురి చేసినది. అయినను, కోల్పోయిన నా చైతన్యమును కూడగట్టుకొని, ఈ సున్నిత సమయంలో, విషయములన్నీ అంధకారమయంగా గోచరించు చున్నవేళ, నా నిర్ణయమేమన కనీసము మన రాష్ట్రములోనైనా శ్రీ అరవిందుల దర్శనమును, బోధనలను, వ్యాప్తి చేయాలని వీనిని ప్రయోగాత్మకముగా దర్శింప చేసినచో నేను తలపెట్టిన ఈ ఉద్యమవ్యాప్తి జనుల హృదయాలలో, మిక్కిలి ప్రతిభా వంతముగా ఆలోచింప జేయగలవని, ఈ కార్యానికి నేను ఎన్నుకున్న పదములు రెండు. 1) డా॥ గోపాలరెడ్డి, 2) శ్రీ అరవిందుల బోధనలు. ఈ రెండు పదములు ఒకదానికి మరొకటిగా నిలుచునవి. ఈ రెండు ఒకే ముడిలో బంధింపబడి, ఒకటి లేకుండా మరొకటి ఉండలేని స్థితి కలిగినట్టివి. ఈ రెండింటిలో ఏ ఒక్కదాన్ని కాదన లేను. ఈ రెండూ నాకు కావలసినవే; ముఖ్యమైనవే. అందుకని, వందలాదిగా శ్రీమాత అద్భుత మహిమలు చోటు చేసికొన్న, గడ్డిపల్లి లోని డా॥ గోపాలరెడ్డి గారి జీవిత చరిత్రను వ్రాయుటకు ఎన్నుకొనుట జరిగినది. శ్రీ అరవిందుల బోధనలకు, శ్రీమాత మహిమలకు, ఇది ఉపకరించాలని ఆకాంక్షించుచు, పాఠక లోకము నా సాహసాన్ని మన్నించి, ఆశీర్వదించాల్సినదిగా అర్థిస్తూ ...

సుజన విధేయుడు,

జలదంకి సురేంద్రాచార్యులు

వైస్ చేర్మన్, శ్రీ అరవింద సొసైటి, ఆంధ్రప్రదేశ్ కమిటి.

బాల్యము - విద్యాభ్యాసము

ఆంధ్రప్రదేశ్‌లోని నల్లగొండ జిల్లా తెలంగాణా ప్రాంతములో నున్నది. హైద్రాబాదుకు సరిహద్దు జిల్లా యగుట వలన, రాజకీయముగాను, విద్యారంగము లోను మిక్కిలి చైతన్యవంతమైనది. 1956 సం॥ భాషా రాష్ట్రాల అవతరణకు పూర్వము, నిజాం రాజ్యమైన హైద్రాబాదు సంస్థానములో అంతర్భాగముగా యుండేది. ఈ జిల్లాలోని ప్రభుత్వ విద్యా సంస్థలన్నీ చైతన్యవంతులైన విద్యార్థి గణమును తీర్చిదిద్ది విజ్ఞానవంతులైన పౌరులను దేశానికిచ్చినవి. ఆనాడు ఈ జిల్లా ఆర్థికముగా వెనుక బడినదిగానే యుండెను. తర్వాత కాలమున జిల్లాలో నాగార్జున సాగరము ప్రాజెక్టు అవతరించిన మూలమున, కరువు కాటకములను దులిపివేసి, అన్నపూర్ణగా అవతరించినది.

ఈ జిల్లాలోని హుజూర్‌నగర్ తాలూకాలోని 'గడ్డిపల్లి' అను గ్రామమందలి శ్రీ గంటా అనంతరెడ్డి శ్రీమతి వెంకటనర్సమ్మ దంపతులు సంపన్నకుటుంబమునకు చెందినవారు. 1932 సం॥లో, ఫిబ్రవరి 14వ తేదీన వారికొక మగశిశువు కలిగెను. తల్లిదండ్రులా బాలునికి గోపాలరెడ్డియని నామకరణము చేసి, అల్లారు ముద్దుగా పెంచుకొనిరి. అతి చురుకైన ఆ బాలుని బాల్యచేష్టలు తల్లిదండ్రులకు ఆనందమును కలుగచేసెడివి. దినదిన ప్రవర్ధమానముగా పెరుగుచు 5 సంవత్సరముల ప్రాయము వాడాయెను.

విద్యాభ్యాసము :

బాలుడైన గోపాలరెడ్డికి, తల్లిదండ్రులు సంప్రదాయానుసారము అక్షరా భ్యాసము చేయించి, స్థానిక పాఠశాలలో ప్రవేశ పెట్టినారు. గడ్డిపల్లిలోని పాఠశాలలో 1,2 తరగదులు చదివిన పిమ్మట, గ్రామీణ వాతావరణములో చదువుట కన్న, పట్టణ ప్రాంతములోని పాఠశాలలో చదివిన వారికి మంచి విద్య, చైతన్యపూరితమైన జ్ఞాన మందునని భావించిన తల్లిదండ్రులు మన గోపాలరెడ్డిని హైద్రాబాద్ నగరములోని నృపతుంగ విద్యాలయములో చేర్పించినారు. అక్కడ ఆ బాలుడు 2 సం॥ల కాలము విద్యార్జన చేసి, 3,4 తరగతులను పూర్తి చేసెను. ఈ విధముగా ప్రాథమిక విద్య విజయవంతముగాను, చైతన్యవంతముగాను పూర్తి చేసి, అన్ని విషయములందు ఉత్తమశ్రేణిలో ఉత్తీర్ణుడాయెను. అప్పుడాతనిని ఉన్నత పాఠశాలలో చేర్పించుట సమంజసమని భావించిన తలిదండ్రులు, 'వివేక వర్ధనీ విద్యాలయము'లో 5వ తరగతిలో

ప్రవేశ పెట్టినారు. ఆనాటి నుండి వరుసగా 6 సం॥ల కాలము, అనగా 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదివి బోర్డు పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడై కళాశాల విద్యార్జనకు అర్హత సంపాదించెను.

కళాశాల విద్య :

గోపాలరెడ్డి రైతు కుటుంబమునకు చెందినవాడు. వారికి భూవసతి కూడా చాలినంత గలదు. వ్యవసాయమందు ఆసక్తి గలవాడు. అందుకే అతనిలో వ్యవసాయ శాస్త్రమునే చదువ వలయుననెడి పిపాస పెరిగినది. కావున అన్ని విధములుగా ఆలోచించి, వ్యవసాయ విశ్వవిద్యాలయములో చేరుటకు దృఢ నిశ్చయుడయ్యెను. సంకల్పమైతే చేసెను, కాని, స్వరాష్ట్రములో వ్యవసాయ శాస్త్రము అధ్యయనము చేయుటకు అవకాశములు అంతంత మాత్రమే యున్నందున, అన్యరాష్ట్రములందే చదువ వలయునని నిశ్చయించుకొని, ప్రతిష్ఠాత్మకమైన విద్యాలయమునకై అన్వేషించి, ఉత్తర భారతములోని సుప్రసిద్ధ అలహాబాద్ విశ్వవిద్యాలయమందలి అగ్రికల్చరల్ ఇన్‌స్టిట్యూట్ లో ప్రవేశమును సంపాదించి, 1948 నుండి 1952 సం॥ వరకు శ్రద్ధగా అధ్యయనము గావించి, ఉన్నతశ్రేణిలో ఉత్తీర్ణతను సాధించెను. 1952 సం॥లో B.Sc. (Agrl) పట్టాను సాధించి విజయోత్సాహముతో స్వరాష్ట్రమునకు తిరిగి వచ్చెను. తను సాధించిన విద్య, పొందిన అనుభవములను గురించి తలపోయుచు, వానిని ఆచరణలో పెట్టి ఆశించిన ఫలములను సమాజమునకు అందించవలయుననెడి ఆశయాన్ని సిద్ధింప చేసికొనుటకు హైద్రాబాద్ రాష్ట్ర ప్రభుత్వమునకు విశదపరచి, వ్యవసాయ శాఖలో ఉద్యోగమును పొందెను.

★ ★ ★

ప్రభుత్వ ఉద్యోగ బాధ్యతలు

అవి స్వరాజ్యమవతరించిన తొలి రోజులు. హైద్రాబాద్ రాష్ట్రము నిజాం ప్రభువుల పాలన నుండి విముక్తమై భారత యూనియన్‌లో అంతర్భాగమైనది. దేశభక్తి ప్రపూరితులైన ప్రజలు పాలకులు యావద్భారత దేశమును, శీఘ్రగతిని, అభివృద్ధి పరచుటకు పంచవర్ష ప్రణాళికలను రచించిరి. దీనికి అనుబంధముగా దేశాభివృద్ధిని సాధించుటలో ప్రథమ పంచవర్ష ప్రణాళికా కాలము 1952 నుండి 1957 వరకు ప్రప్రథమ ప్రాధాన్యతను "ఆహార కొరత నివారణ"గా చేపట్టి వ్యవసాయ విస్తరణకు పెద్దపీట వేసినారు.

వ్యవసాయ విస్తరణాధికారి :

అలహాబాద్ విశ్వవిద్యాలయము నుండి, వ్యవసాయ శాస్త్రములో B.Sc. పట్టా పుచ్చుకొని వచ్చిన మన గోపాలరెడ్డికి, హైద్రాబాద్ ప్రభుత్వము వారు 'వ్యవసాయ విస్తరణాధికారి' (Agricultural Extension Officer) పదవిని, హార్టికల్చర్ డిపార్టు మెంటులో 6 మాసములు నల్లగొండ జిల్లాలోనే కట్టబెట్టినారు. నూనూగు మీసాల నూత్న యవ్వనములో నున్న వారు నూతనోత్సాహముతో, పదవీ బాధ్యతలను చేపట్టి కార్యరంగమున దుమికి, 1952 సం॥ నుండి 1958 వరకు అత్యున్నత ప్రమాణములతో, అందించినవారి సేవలకు ప్రతిగా హైద్రాబాద్ ప్రభుత్వము 'మెరిట్ సర్టిఫికేటు' (Merit Certificate) ను బహూకరించి, వారిపై ప్రశంసల జల్లు కురిపించినది. అంతేగాక, నల్లగొండ జిల్లా 'వ్యవసాయ విస్తరణాధికారి' గా అత్యుత్తమ సేవలను అందించి, వ్యవసాయ రంగమును, ప్రగతిపథములో నడిపించినందుకు, 1954-55 మరియు 1955-56 సం॥లలో ప్రభుత్వము వారు గోపాలరెడ్డికి "నగదు పురస్కారము"ను యిచ్చి సత్కరించినారు.

విశిష్టమైన వారి సేవా నిరతి :

గోపాలరెడ్డి 'వ్యవసాయ విస్తరణాధికారి'గా నల్లగొండ జిల్లాలో, వ్యవసాయ రంగ అభివృద్ధికై ఒక వినూత్నమైన విప్లవమునే సృష్టించి నారనుటకు, వారు చేపట్టిన దిగువ కార్యక్రమాలే తార్కాణముగా నిలుచును.

1. ఆధునిక వ్యవసాయం, సాంకేతిక శాస్త్ర పద్ధతిలో సాగాలని, రైతాంగమునకు శిక్షణ యిచ్చుట.
2. రైతుల వ్యవసాయ క్షేత్రాలందు, ప్రయోగాత్మక వ్యవసాయ ప్రదర్శనల నిర్వహణ.

3. నూతన వ్యవసాయ పద్ధతులను, రైతుల క్షేత్రాలలో, శిక్షణా పూర్వకంగా నిర్వహించి చూపుట.
4. వ్యవసాయ పంటల మెరుగైన దిగుబడికి అవసరమగు ఎరువులను, మందులను, సకాలములో సరఫరా చేయుట.
5. వ్యవసాయ వార్తలను రైతులకు చేరవేయుట.

వ్యవసాయ రంగ అభివృద్ధిని మరియు రైతాంగము యొక్క ప్రయోజనమును దృష్టియందుంచుకొని, పై కార్యక్రమాలను వారు చిత్తశుద్ధితో నిర్వహించుటయే గాక వారి సిబ్బందికి కూడా, రైతుబాంధవులకు అవసరమగు సహాయ సహకారములను, సకాలములో అందించుటకు పురమాయించుటచే, రైతులకు పంటదిగుబడి పెరిగి ప్రయోజనము సమకూరినది. గోపాలరెడ్డి పనికి కూడా గుర్తింపు దక్కినది. ప్రభుత్వ దృష్టి నాకర్షించిన వారి కార్యసరళి రాష్ట్రమందు ఆదర్శప్రాయమై నిలచినది.

★ ★ ★

అమెరికాలో ఉన్నత విద్యనార్జించుట

శ్రీ గోపాలరెడ్డి యందు ఉరకలెత్తిన ఉత్సాహము యింకను పై చదువులు పూర్తి చేసి, పరిశోధనా వ్యాసంగమును కూడా చేపట్టవలయునన్న ఆకాంక్ష పెరిగినది. అవసరానికి అందివచ్చిన అవకాశమన్నట్లు, అమెరికా ప్రభుత్వము వారు మన రెడ్డి గారికి, 1958లో ఉన్నత చదువులకు Full Bright Scholarship ను ప్రధాన మొనరించుట జర్గినది. దానితో వారు అమెరికాలోని, మిన్నెసోటా విశ్వవిద్యాలయములో ప్రవేశాన్ని పొంది, 1958 - 1960 సం॥లో భూమికి సంబంధించిన శాస్త్రమందు, M.Sc. (Soil Science) (పరిశోధనా సహాయకులుగా) పట్టా పొందినారు.

ఆ తర్వాత అదే క్రమంలో గోపాలరెడ్డి గారికి East West Centre Fellowship పై, అమెరికాలోని 'హోనోలూలు' రాష్ట్రమందలి "హో వాయిల్ విశ్వవిద్యాలయము" నందు 1960 - 1964 సంవత్సరముల మధ్యకాలములో వ్యవసాయ శాస్త్రమందు పరిశోధన చేయుటకు ప్రవేశము లభించినది. భూమికి చెందిన శాస్త్రము (Soil Science) నందు పరిశోధనా వ్యాసంగమును విజయవంతంగా నిర్వహించి, Ph.D. పట్టాతో సత్కరింపబడి, విజయ దర్పముతో స్వదేశానికి తిరిగి వచ్చిరి.

భారత దేశమునకు తిరిగి వచ్చుట - (డా॥ గోపాలరెడ్డి గారి మాటలలో)

"1964 సం॥ ఏప్రిల్ 4వ తేదీన అమెరికా నుండి తిరిగి వచ్చి హైద్రాబాదులో దిగినాను. 24-4-1964న దర్శనదినము నాడు ఆశ్రమమునకు చేరుకొని శ్రీమాతను సందర్శించి, ఆ జగన్మాత ఆశీస్సులు పొందినాను. అంతకు ముందే నిర్ణయించిన విధముగా మా ఏకైక కుమారుడు చిరంజీవి అజిత్‌రెడ్డిని ఆశ్రమ పాఠశాల (International Centre of Education) లో 4వ తరగతిలో చేర్పించినాను. అతను అక్కడే చదివి, అనంతరము శ్రీమాత అనుమతితో శ్రీ అరవిందాశ్రమ సభ్యుడుగా చేరిపోయినాడు. ఇది మా అదృష్టము మరియు గర్వకారణముగా భావించుచున్నాము. శ్రీమాత ఒడిలో వానికి ఆశ్రయము దొరికినట్లే, ఆమాత యొక్క సంపూర్ణ అనుగ్రహము మాపై కూడా ప్రసరించినది. అప్పటి నుండి ప్రతి దర్శనమునకు మేము కుటుంబసభ్యులము, ఆశ్రమానికి అమ్మ అనుగ్రహ ఆశీస్సులు పొందుటకు వెళ్ళుచున్నాము.

మేము ఆశ్రమానికి వెళ్లిన ప్రతిమారు, ఆశ్రమ వ్యవసాయ క్షేత్రము (Ashram Lake Farm) ను సందర్శించి, అచటి అభివృద్ధిని చూచుట పరిపాటి అయినది. ఆ క్షేత్రము సువిశాల మైనది. 300 ఎకరములలో విస్తరించి యున్నది. అందులో కొబ్బరి తోట, హార్టీ కల్చర్ పంటలు, అనగా ఫలములు, కూరగాయల, పాలుత్పత్తి తదితరమలైన పంటలను శ్రీ డ్యుమస్ గారి ఆజమాయిషీలో పండించుచున్నారు. ఆ క్షేత్రము యొక్క నిర్వహణ చాలా చక్కగా నున్నది. శ్రీ డ్యుమస్ గారు దక్షిణ ఆఫ్రికానుండి అరుదెంచినవారు. శ్రీ అరవిందుల ఆంతరంగిక శిష్యులు, శ్రీ మాత అనుంగుబిడ్డ. చాలా మారులు నేనాక్షేత్రమును సందర్శించటతో నాకు వారు మిత్రులైనారు. ఆ వ్యవసాయ క్షేత్రమునకు అనుసంధానముగా అక్కడొక 'వ్యవసాయ వృత్తి విద్యా శిక్షణా సంస్థ' (Vocational Agricultural Institution) నేర్పాటు చేసిన బాగుండునని వారితో సూచించగా, ఆ విషయమును శ్రీమాతకు వ్రాసి వారి ఆశీస్సులను పొందవలసినదిగా వారు నాకు సంలహా యిచ్చినారు." ఆ విధమైన సంస్థ ఆశ్రమంలో లేదు. ముందు ముందు తానచటికి వచ్చినపుడు నిర్వహించ వచ్చునను దృష్టితో నుండిరి. తమ కుటుంబమంతా ఆశ్రమానికి తరలి రావాలనే సంకల్పము వారిలో బలముగానే యుండెను. అదే విషయమును తమ భార్యతో కూడా చర్చించి, భవిష్యత్తులో తమ బిడ్డలకిద్దరికి సమగ్ర విద్యలభించగలదని తలచినారు. మొదట ఆమె సంశయించినది. కాని తర్వాత తన అంగీకారమును తెల్పినది.

శ్రీ అరవిందాశ్రమం సందర్శించిన నాటి నుండి శ్రీమాత ప్రభావము గోపాల రెడ్డిపై నిరంతర ముండుటచే, ఆయనలో ఆశ్రమంలో చేరిపోవాలనెడి బలమైన ఆకాంక్ష పని చేయుచునే యున్నది. ఇదే విషయమును సేర్కొనుచు ఆయన శ్రీ మాతకు నొక లేఖ వ్రాసి తన ఆకాంక్షను తెలిపెను. సమాధానముగా శ్రీమాత నుండి ఆశ్రమంలో వుండుటకు అనుమతి లభించినది, కాని ఒక షరతు విధించినది. అదేమనగా "నీ జన్మస్థలముతో సంబంధమును త్రెంచుకొని ఆశ్రమంలో చేరవచ్చునని", తన లేఖపైననే వ్రాసి తన ఆశీస్సులనందించినది. ఆశ్రమంలో చేరుటకు అనుమతి లభించినందుకు ఆనందము, జన్మస్థలముతో సంబంధమును త్రెంచివేయుట అసాధ్యమగుట దుఃఖ దాయకము. ఇప్పుడిక చేయాల్సిన కర్తవ్యము బోధపడక, తన తాతల నుండి సంక్రమించిన భూములను విక్రయించుటకే నిశ్చయించి ప్రయత్నమారంభించెను. కాని ఎవరు ఇంత పెద్ద ఆస్తిని కొనుటకు ముందుకు రాలేదు. ఆ గ్రామములో ఆయనకన్న అధిక సంపన్నులు లేరు. మిగిలిన వారందరు మధ్యతరగతి, పేద వర్గమునకు

చెందినవారే యగుట వలన, తనకు నిరాశే ఎదురైనది. ఎన్నివిధములుగా ఆలోచించినా బోధపడలేదు. విఫల మనోరథుడై చేయునది లేక వగచుచు కాలము గడుపుచుండెను. ఆయనలో క్రమక్రమముగా ఆశ్రమము పోవలయునన్న ఆలోచన అదుగంటినది.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రవేశం –

గోపాలరెడ్డి గారు అమెరికా నుండి తిరిగివచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో 1964లో నూతనంగా వెలసిన వ్యవసాయం విశ్వవిద్యాలయంలో "సైంటిపిక్ పూల్ ఆఫీసర్" (Scientific pool Officer) గా తాత్కాలిక పదవిలో చేరినాడు. అపుడాయన CSIR ఫెలోషిప్‌గా వున్నాడు. ఆరు నెలలకే అసోసియేట్ ప్రొఫెసర్ పదవిని Soil Science & Agricultural Chemstry డిపార్టుమెంటులో పదవిని యిచ్చినారు. ఆనాటి నుండి అదే విశ్వవిద్యాలయములో April 1969 వరకు పని చేసినారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయ అధ్యాపక వృత్తి – వృత్తిలో ప్రవేశము :

డా॥ గోపాలరెడ్డి గారు వ్యవసాయ శాస్త్రములో అత్యున్నత శిఖరములకు అధిరోహించి, అమెరికా నుండి తిరిగి వచ్చిన పిదప, అభివృద్ధి చెందిన అమెరికా దేశములో తాను పొందిన ఉన్నత వ్యవసాయ విద్యాఫలములను, మన దేశీయ విద్యార్థులలో పంచుటకు సంకల్పించుకొన్నారు. హైద్రాబాదులోని వ్యవసాయ విశ్వ విద్యాలయము, వారిని ఆహ్వానించి అధ్యాపక పదవితో సన్మానించినది.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయములో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదవీ బాధ్యతలను చేపట్టి, వ్యవసాయ విద్యకు చెందిన అకడమిక్ ప్లాన్‌ను సంసిద్ధ పరచుటకై తీవ్రమైన కృషి చేసినారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయములో నిర్వహించిన కార్యములు :

1. వ్యవసాయ విద్యలో గ్రాడ్యుయేట్ & పోస్టు గ్రాడ్యుయేట్ తరగతులకు 'అగ్రానమీ' (Agronomy) నందు మరియు భూమికి చెందిన శాస్త్రము (Soil Science) నందు పాఠములను బోధించినారు.
2. విశ్వవిద్యాలయములోని అకడమిక్ కోర్సులకు చెందిన పాఠ్య ప్రణాళికను, సంసిద్ధ పరచుటలో తీవ్ర కృషి చేసినారు.
3. పరిశోధనా మెథడాలోజి రూపొందించుట, భూమిని పునరుద్ధరించుట, దానిని సారవంతము చేయుట, నీటి సంరక్షణ మున్నగు రంగాలందు మెరుగైన ఫలితాలను రాబట్టుటకు కృషి చేసినారు.

4. 6 గురు పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులకు, సహాయకులుగా యుండి, వారికి పరిశోధనా రంగమున ఉత్తమ శిక్షణను అందించినారు.
5. ఆం.ప్ర. వ్యవసాయ విశ్వవిద్యాలయములోని 'అగ్రికల్చర్ ఫ్యాకల్టీ బోర్డు మెంబర్' గాను, మరియు వ్యవసాయ విద్యాలయము యొక్క 'అకడమిక్ కౌన్సిల్ మెంబర్' గాను చురుకైన పాత్ర పోషించినారు.
6. విశ్వవిద్యాలయ గ్రాడ్యుయేట్ మరియు పోస్టు గ్రాడ్యుయేట్ స్థాయి కోర్సులకు 'అకడమిక్ ప్లానింగ్'ను సంసిద్ధ పరచినారు.
7. సాగు చేయు భూక్షేత్రముల అభివృద్ధి మరియు వవ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ కార్యకలాపాల నిర్వహణను చేపట్టినారు.
8. వివిధ అంతర – వ్యవసాయ విశ్వవిద్యాలయ సెమినార్లలోను వర్క్ షాపుల్లోను పాల్గొని అకడమిక్ ప్లానింగ్ పరిశోధనా రంగమునకు చెందిన పద్ధతులను మెరుగు పరచుట, గ్రామీణ వ్యవసాయాభివృద్ధి వంటి అంశము లందు నిశితమైన తమ అభిప్రాయాలను తెలిపినారు.

★ ★ ★

గడ్డిపల్లిలో లిఫ్టు ఇరిగేషన్ యేర్పడుటకు ప్రధాన కారణములు

గడ్డిపల్లి గ్రామములో, లిఫ్టు ఇరిగేషన్ ఉద్యమము ప్రారంభమగటకు 4 ప్రధాన సంఘటనలు చోటు చేసికొన్నవి.

1. శ్రీ గోపాలరెడ్డి గారి చిన్నాన్న గారు ఆయనను స్వార్థపరుడనుట.
2. లింగాల గ్రామమునకు చెందిన శ్రీ మధుసూదన రెడ్డి గారు తమ గ్రామాల వారందరకు లిఫ్టు ఇరిగేషన్ సౌకర్యమును కలుగు చేయుటకు ప్రయత్నించ వలసినదిగా కోరుట.
3. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారి ఔదార్యము, 'నాగార్జున సాగరము' ఎడమ కాలువ నుండి లిఫ్టు ద్వారా నీరు తోడుకొని, వ్యవసాయమునకు అనుమతించి, జీవో విడుదల చేయుట.
4. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయములో పని చేయు ఆచార్యులందరకు లిఫ్టు ఇరిగేషన్ విషయములలో శిక్షణ నిచ్చు - కమ్యూనిటి లిఫ్టు ఇరిగేషన్ సొసైటీలకు, బ్యాంకుల నుండి ఋణ సదుపాయము కల్పించుటకు అంగీకరించుట.

ఈ నాలుగు సంఘటనలు శ్రీ గోపాలరెడ్డి గారిని లిఫ్టు ఇరిగేషన్ దిశగా నడిపించి, ఆ కార్యసాధనకు ఊతము నిచ్చినవి. ఈ విధముగా ఆ మహత్కార్యానికి అంకురార్పణ జరిగినది. వివరములలోకి వెలదాం !

గడ్డిపల్లిలో లిఫ్టు ఏర్పడుటకు ప్రధాన సంఘటన :

శ్రీ గోపాలరెడ్డి గార హైద్రాబాదులోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఉద్యోగం చేస్తున్నపుడ, వారమున కొకమారు గడ్డిపల్లి వచ్చెడివారు. ఒక పర్యాయము తాను గ్రామానికి వచ్చినపడు మిత్రులను, బంధువులందరిని కల్సికొనెడివారు. ఎక్కువగా వారి చిన్నాన్న గారైన గంటా చిన అనంతరెడ్డి గారితో కాలక్షేపము చేయుటలో తమ కుటుంబానికి చెందిన అనేక విషయాలను తెల్సుకొనెడివారు. వారితో మాటల సందర్భమున ఒకమారు "గోపాలరెడ్డీ ! నీవు చాలా అదృష్టవంతుడవు. పెద్ద పెద్ద చదువులు చదివినావు. పెద్ద ఉద్యోగము చేయుచున్నావు. నీవు మన కుటుంబమ నకు గర్వకారణము. నీయంత చదువులు మన కుటుంబములో చదివిన వారెవరున్నారు? నీవే మన కులదీపకుడవు. గంటా వారి వంశకీర్తిని విస్తరింప

చేసినావు. నీవు ధన్యుడవు. చల్లగా వర్ధిల్లు"మని దీవించి మరొక్కమాట కూడ అనెను. "వారీ ! ఎంతైనా నీవు స్వార్థ పరుడివేరా !" మాటల సందర్భములో వారి నోటి నుండి దొర్లినవి. అంతే కాని పనికట్టుకొని అతనిని నిందించాలని గాని, కోపముతోగాని అనిన మాటలు కావవి. వారు ఎల్లపుడు అతి చనువుగాను హాస్యరస భరితముగాను మాట్లాడెదరు. తన చుట్టూ వున్న వారి నందరిని సదా నవ్విస్తుంటారు. ఈ మాటలు గోపాలరెడ్డిలో కలకలమురేపినవి. ఇట్లెందుకన్నాడబ్బా ! అని ఆలోచనలో పడిన ఆయన "ఎందుకు చిన్నాన్నా మీరావిధముగా అంటిరేమి ?" అని ప్రశ్నించాడు. అప్పుడు "గత మూడు సంవత్సరాలుగా మన ప్రాంతములో వర్షములు లేవు, ఘోరమైన కరువు యేర్పడి యున్నది. పంటలు లేవు. భూగర్భ జలములడుగంటినవి. బీద బిక్కి జనము అన్నమో రామచంద్రా ! యని అలమటించుచున్నారు. దారుణమన ఈ పరిస్థితిలో కూడా నీ బావిలో జలమున్నది. 10 ఎకరములలో పంటలు పండు చున్నవి. పైగా నీవు పట్నంలో పెద్ద ఉద్యోగంలో నున్నావు. పైసలు కూడా పుష్కలము. ఇన్ని విధములుగా నీ పరిస్థితి సురక్షితము. మా బ్రతుకులకే ముప్పు యేర్పడినది కాదా ! నీవు ఎన్నడైనా మా గురించి ఆలోచించినావా ? చదువుల్లో పెద్ద చదువు నీది, పైగా పట్నంలోని పెద్దలందరూ నీకెరుక. కావున మాకేదైనా దారి చూపంచ వచ్చుకదా ! నీవు మాగురించి ఎప్పుడైనా ఆలోచించినావా ? నేనన్నది యదార్థము కాదా !" అని వారి చిన్నాన్న గారు యిదంతా వల్లించారు.

ఈ మాటలు మన గోపాలరెడ్డిలో ఆలోచనలను రేకెత్తించినవి. చిన్నాన్న గారి మాటల్లో యదార్థము లేదని కాదు. కాని ఆ పెద్దాయన ఈ విధముగా ఎప్పుడు అనలేదు కదా ! అని వుంటే ఆలోచించేవాడను కదా ! అని తన మదిలోనే అనుకొని, యిప్పటికైనా మించిపోలేదు. రైతాంగమంతా ఐక్యంగా ఒక్కమాటపై వుంటే అందరి బ్రతుకులు బాగుపరచుకొనవచ్చుననవి తన చిన్నాన్నతో అనెను. అందుకు వారు అదెట్లు సాధ్యపడునని ప్రశ్నించారు.

"దేశమంతటా కరువు ఏర్పడినది. దీనిని అధిగమించుటకు ప్రభుత్వము వారు - రైతులు సామూహికంగా లిఫ్టు ఇరిగేషన్ పద్ధతిలో నాగార్జునసాగర్ ఎడమ కాలువ (లాల్‌బహదూర్) నుండి నీరు తోడుకొని వ్యవసాయము చేసికొనుటకు మనకు అవకాశమును కల్పించినారు. ఆ మేరకు ఒక జీవోను విడుదల చేసినది. కలిసి కట్టుగా ప్రయత్నించినపుడది సాధ్యము కాగలదు." అని మన శాస్త్రవేత్త తన చిన్నాన్నకు విన్నవించెను.

సహజముగా సరళ స్వభావం, ఉత్సాహవంతమైన నైజము గల వారి చిన్నాన్నకు అమితానందము కల్గినది. మరొక ఆలోచన లేకుండా యిర్వురు కల్సి ఈ బృహత్తర కార్యాన్ని సాధించుటకు నిర్ణయించుకున్నారు. తాను పట్నంలోను, అధికార గణంతోను సంప్రదింపులు జరుపుటకు పైరవీ చేయుటకు పూనుకొనెద ననగా, ఆ పెద్దాయన గ్రామ రైతులకు యీ విషయాన్ని తెలిపి, వారినే గాక చుట్టూరా వున్న పల్లెల లోని జనాన్ని కూడా నిద్రలేపి సమాయత్త పరచుటకు సిద్ధమైనారు. అదే ఊపులో గ్రామ గ్రామానికి వెళ్లి రైతులకు నీటి విషయము తెలిపి, మనం యిక పంటలు పండించుకొనుటకు మార్గము యేర్పడినట్లు రైతాంగమునకు తెలియ బరచగా వారు వేసే అనేక ప్రశ్నలకు సరియైన సమాధానములిచ్చెను. ఎవరు చేయుదురు ఈ పనినని వారు ప్రశ్నించినపుడు, నేను మరియు మా అన్నకుమారుడు మేమిద్దరము కల్సి 1 + 1 = 11 అని సమాధానము తెలిపి, అందరిని సమాయత్త పరచుపనిని తన భుజానికెత్తుకొనెను. ఈ విధమైన తన చిన్నాన్న ప్రయత్నము తనలో విశ్వాసమును పెంచినది. కార్యసాధన జరుగ గలదని విశ్వాసము కుదిరినది. తన చిన్నాన్న గారిని రైతులను ఆయత్తపరచుటకు తెలిపి తాను నిర్వహించాల్సిన కార్యములను సాధించు దిశలో పట్నం వెళ్లి తన ప్రయత్నములందు మునిగిపోయెను.

లిఫ్టు ఏర్పడుటకు రెండవ సంఘటన – శ్రీ మధుసూదన్ రెడ్డి, లింగాల గారి ప్రోత్సాహము :

గడ్డిపల్లి గ్రామమునకు సమీపములోనే గల మరో చిన్న గ్రామము "లింగాల". అచటి పెద్ద రైతు శ్రీ మధుసూదన్ రెడ్డి గారు. మన రెడ్డిగారికి అత్యంత సన్నిహితుడు, బంధువు కూడాను. గోపాలరెడ్డి గారితో వారు కల్సినపుడు, "నీవు వ్యవసాయ శాస్త్ర వేత్తవు, ఆ డిపార్టుమెంటు వారితో నీకు సంబంధాలున్నవి. నీవు యే విధముగానైనా ప్రయత్నించి మన గ్రామాలకు లిఫ్టు ఇరిగేషన్ సౌకర్యము కల్పించాలి" అని కోరెడివారు. వారి చిన్నాన్న గారు అనుటకు ముందు నుండే అడుగుచుండెను. ప్రయత్నించెదమని బదులు చెప్పుటతోనే గడచిపోయేది. వీరి యిర్వురి ఆలోచన బీజప్రాయములోనే ఆగి పోయినది.

లిఫ్టు ఏర్పడుటకు మూడవ సంఘటన – ప్రభుత్వ అనుమతి జీవో విడుదల :

ఆనాడు మనరాష్ట్రములో యేర్పడిన కరువు పరిస్థితులకు ప్రజలు దుర్భర స్థితులందు చిక్కుకొని తల్లడించు చుండిరి. వర్షములు లేవు. పంటలు లేవు.

పశుగ్రాసమునకు కూడా కొరత యేర్పడినది. మనుష్యులతో పాటు వారినాశ్రయించు కొని యున్న మూగ జీవాలకు కూడా కష్టమే సంభవించినది. ఇట్టి తరి మన ప్రభుత్వము వారు ఔదార్యముతో, నాగార్జునసాగరము యొక్క ప్రధాన కాలువ (లాల్ బహదూర్ కాలువ)కు యిరుప్రక్కన గల బీడు భూములను కమ్యూనిటి లిఫ్టు పద్ధతిలో ఇరిగేషన్ కొనసాగించుకొనుటకు అనుమతించి, జీవో విడుదల చేసినది. ప్రభుత్వము అన్ని విధములుగా సహకరించుటకును, బ్యాంకులు కావలసిన ధనమును ఋణముగా యిచ్చుటకు సౌకర్యము కల్పించబడినది. రైతులు సిద్ధమైతే చాలు. వీని నన్నిటిని సమన్వయ పరచు నాయకత్వం కూడా ముఖ్యమైది.

లిఫ్టు ఏర్పడుటకు నాల్గవ సంఘటన – వ్యవసాయ శాస్త్రవేత్తలకు బ్యాంకు అందించిన శిక్షణ :

బ్యాంకు అధికారులు తమ వాణిజ్యమును విస్తరించుట కొరకు, ప్రభుత్వము వారు లిఫ్టు ఇరిగేషన్ సౌకర్యము కల్పించిన దృష్ట్యా, ఒక యోజనను రూపొందించు కొని, వ్యవసాయశాస్త్రవేత్తలకు, అధికారులకు తాము కల్పించే ఋణసౌకర్యమునకు విధించిన నియమములు, షరతుల వివరమలను వారికి తెలియపరచి, తగు విధముగా రైతు కమ్యూనిటిని సిద్ధపరచుటకు శిక్షణ యిచ్చినారు. వ్యవసాయ విశ్వవిద్యాలయము లోని ఆచార్యులందరకు ఈ శిక్షణ యిచ్చుట వలన, ఆ వివరములను మన రెడ్డి గారు మొదటనే తెల్సియుండుట జరిగినది. ఆ విధముగా లిఫ్టు యేర్పాటుకై అనుకూలించినది.

ఈ విధముగా అన్ని సంఘటనలను పరిశీలించినపుడు, చిన్నాన్న గారి 'విమర్శ' నుండి లింగాల మధుసూదన్ రెడ్డి గారి 'ప్రోత్సాహము', ప్రభుత్వ 'ఔదార్యము', బ్యాంకు వారందించిన 'శిక్షణ' – యివన్నీ మన కథానాయకుని ముందు నుండే సంసిద్ధపరచుటకు తారసిల్లినట్లు అర్థము కాగలదు. దైవలీలను, దైవ సంకల్పమును ఎవరెరుగ గలరు. ఈ మహత్తరమైన కార్యసాఫల్యతకే వారుద్దేశించబడినట్లు ధృవ పడుచున్నది. మహనీయుల వల్లనే కదా మహత్కార్యములు సిద్ధించునది !

గడ్డిపల్లిలో గంటా అనంతరెడ్డి గారి ప్రయత్నములు :

గడ్డిపల్లి లిఫ్టు ఇరిగేషన్ పనిని మన గోపాలరెడ్డి గారు మరియు వారి చిన్నాన్న అనంతరెడ్డి గారు భుజానికెత్తుకొని ఎవరి ప్రయత్నములో వారు నిమగ్నమైనట్లు చెప్పు కున్నాము. వారి వారి పనులలో జరిగిన పురోభివృద్ధిని సమీక్షించి ముందేగుదాము.

ఉత్సాహవంతుడైన వారి చిన్నాన్న గారు ఊరంతా తిరిగి ప్రతిరైతును కల్సి మనకు నాగార్జున సాగరజలము రానున్నది. అందరికి సుఖ సంతోషములు, అతి త్వరలో చేకూరగలవు. మేము యిర్వురము అనగా, మా గోపాలరెడ్డి మరియు నేను కల్సి ప్రయత్నించుచున్నాము. గ్రామములోని రైతులందరి మధ్య ఈ విషయానికి సంబంధించిన చర్చలు తీవ్రమైనవి. గడ్డిపల్లిలోనే కాదు పరిసర గ్రామాలందు కూడా ఈ చర్చలు ముమ్మరమైనవి. నీరు వచ్చుట సాధ్యమా ? అసాధ్యమా ? అని ఎవరిడిగినా మన రెడ్డి ఏమి చెప్పకుండా తనపని తాను చేసుకపోవుచున్నాడు. రైతుల మధ్య నీటి సమస్య మీదనే చర్చలు జరిగినవి. రైతులందరిని పిలిచి ఈ విషయము పై మీటింగు పెట్టుటకు ముందే గోపాలరెడ్డి గారు తన ఉద్యోగమునకు సెలవు పెట్టి సమాచార సేకరణ కుపక్రమించెను. మొదటి పనిగా జీవో కాపీని సంపాదించి, అందులో సాధ్యాసాధ్యాలను పరిశీలించుట, రెండవ పనిగా వోల్టాస్ కంపెనీ వారితో, తమకు భారీ తరహా లిఫ్టు పరికరముల అవసరమును తెల్పుట. గడ్డిపల్లి మరియు పరిసర గ్రామాలకు చెందిన 6,000 ఎకరములకు పారకమునకు తగిన ఇంజన్లను సప్లై చేయుటకు కోరుట జరిగినది. ఆ తర్వాత ఇండియన్ హ్యూం పైపుల కంపెనీ వారిని కల్సి వారు ఏమేరకు పైపుల నిర్మాణము చేయగలరో తెల్సుకొని మనకు అవసరమగు సైజులను వారికి తెలియబరచుట జరిగినది. ఆ తర్వాత అతి ప్రధానమైన పని ఆర్థిక వసతిని సమకూర్చుట. అందుకొరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైద్రాబాదు అఫీసుకు వెడలి జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) గారిని కల్సినారు. వారు మన గోపాలరెడ్డి గారికి పరిచయమున్నవారే. వారు వ్యవసాయ విశ్వవిద్యాలయములో నున్నపుడు బ్యాంకు వారిచ్చిన శిక్షణ సమయములో పరిచయమైన వారగుట వలన వారితో చనువు ఏర్పడినది. ఈ ప్రాజెక్టు పనిలో ముందుకు సాగవచ్చునా యని అడుగగా పోవచ్చునని తెల్పినారు.

గోపాలరెడ్డి గారు ప్రభుత్వము నుండి జీవో కాపిని సంపాదించి వోల్టాస్ కంపెనీ వారిని, ఇండియన్ హ్యూం పైపుల కంపెనీ వారిని ఆపైన స్టేటుబ్యాంక్ ఆఫ్ హైద్రాబాద్ వారితో సంప్రదించి, అన్ని సంస్థల నుండి అనుకూల స్పందన రాగా, ప్రాజెక్టు పని ఆశావహంగానే అనిపించినది. అంతరంగంలో కార్యసాధన తథ్యమని తేలిపోయినది. ఇక మిగిలిన పని జగన్మాత ఆశీస్సులు.

జగన్మాత అనుగ్రహమునకు అభ్యర్థన :

లోగా తాను ఆశ్రమంలో స్థిరపడుటకు సంకల్పించి శ్రీమాత నర్థించెను. గడ్డిపల్లిలోతో సంబంధము త్రెంచుకొని రావచ్చునని శ్రీమాత అనుమతించినది. కాని అది సాధ్యపడలేదు. మరి యిప్పుడేది నిర్ణయము ? తనకు తాను తేల్చుకోలేని స్థితి. మరొక మారు శ్రీమాతనే అర్థించి, దైవేచ్ఛ ననుసరించి, తనకేది సురక్షితమైన మార్గమో తెలుపవలసినదిగా వేడుకొనెను. అందుకు శ్రీమాత "You work at Gaddipally" అని వ్రాసి తన ఆశీస్సులతో పంపించినది. మన గోపాలరెడ్డి గారు ఆ 'ఆశీస్సులను' వట్టి మాటలుగానో లిఖింపబడిన అక్షరాలు గానో చూడక, దాని వెనక ఆధ్యాత్మిక శక్తి, బలము, విజ్ఞానము, సత్యము, జ్ఞానము ప్రేమ యివన్ని వున్నట్లు భావించినాడు. ఇవన్నీ ఆయనలో అజేయమైన విశ్వాసమును, ధైర్యమును బలమును ఆయనకు సంక్రమింప జేసినవి. కార్యసాధనలో వారికెట్టి విఘ్నములు, అవరోధములు యిక్కట్టులు, శతృత్వములు, సహాయ నిరాకరణ లాంటి కష్టములు ఏర్పడవు అన్నట్టి దృఢ నిశ్చయము కల్గినది. "శ్రీమాత ప్రసాదించిన వరములు నాకు రక్షణను కల్పించి, మార్గదర్శనము చేయగలవను విశ్వాసము కలదు కావుననే నా సేవలను గడ్డిపల్లి ప్రాజెక్టునకు – అనగా 6 గ్రామాలకు 6000 ఎకరాల భూమి సాగునకు వినియోగించ దలచినాను" అని అనెను. "ఈ ప్రాజెక్టు పనిని నేను దైవకార్యముగా భావించి, నన్ను నేను ఆ దైవము యొక్క పనిముట్టుగా భావించి, మహనీయమైన ఈ "కృషి యజ్ఞము"నకు నేను సర్వభావేన అంకిత మగుచున్నాను" అని స్పష్టము చేసెను. రైతాంగము మదిలో ఆనందోత్సాహములు నిండెను.

★ ★ ★

గడ్డిపల్లి లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణమునకు పూర్వ సన్నాహము

భారత దేశ ప్రధానమంత్రి ఇందిరాగాంధి భారతీయ బ్యాంకులను జాతీయము చేసినది. ఈ జాతీయ బ్యాంకులు వ్యవసాయ మరియు యితర ప్రాధాన్యతా రంగములకు అధిక మోతాదులో ఋణసౌకర్యములను కల్పించి రైతులకు, తద్వారా దేశ ప్రగతికి తోడ్పడాల్సినదిగా ఆదేశించినారు. "గరీబి హఠావో" – అను నినాదముతో "దారిద్ర్యమును పాఱద్రోలాలని" పిలుపు నిచ్చినది. ఇదే కాలములో మన గోపాలరెడ్డి గారు బ్యాంకు అధికారులతో భేటీ కాగా వారు లిఫ్టు ఇరిగేషన్ లాంటి భారీ ప్రాజెక్టులకు ఋణ సదుపాయమును కల్పించెదమన్నారు.

నల్లగొండ జిల్లా ఎక్కువగా కరువు పీడిత ప్రదేశముగానే పరిగణింప బడినది. 1967 నుండి కఱువు రక్కసి విలయతాండవము చేయుచున్నది. వ్యవసాయ, బోరింగు బావులలోని నీరు అడుగంటినది. ఈ స్థితిలో ప్రభుత్వము ఇరిగేషన్ డిపార్టుమెంటు వారు జీవో ద్వారా, రైతులు సహకార సంఘములుగా యేర్పడి నాగార్జునసాగర్ ఎడమ కాలువ నుండి నీరు తోడి వ్యవసాయమును కొనసాగించవచ్చునని, అందుకు అయ్యేఖర్చు రైతులు బ్యాంకు నుండి ఋణము పొంది భరించవచ్చునని, ఆ జీవోలో పేర్కొనబడినది. ఈ జీవో 1968 లోనే వచ్చినది. కాని ఈ సౌకర్యమును ఎవరూ పొందలేదు. బ్యాంకు అధికారులను "గడ్డిపల్లి లిఫ్టు ఇరిగేషన్" కొరకు ఋణము నడిగినపుడు, వారు 1969 ఫిబ్రవరి నుండి విడుదల చేయుదుమని తెలిపినారు. వొల్టాస్ కంపెనీవారు ప్రాజెక్టకు కావలసిన యంత్ర సామాగ్రిని, "ఇండియా హ్యూం పైపుల కం" వారు అవసరమైన సైజులో అవసరమున్న పంపులను సప్లై చేయుటకు అంగీకరించినారు.

శ్రీ గోపాలరెడ్డి గారు గడ్డిపల్లి రైతాంగము వారందరికి ఈ విషయములను తెలియపరచి, ప్రథమ ప్రయత్నముగా 'సహకార సొసైటీ'ని స్థాపించ వలసియున్నందన 28-2-1969 నాడు అందరు, శ్రీ వేదాంతరావు పట్వారి ఇంటిలో జరుగు సమావేశానికి రావలసినిదిగా ఆహ్వానముల నంపినారు. ఆశ్చర్యకరమైన విషయ మేమనగా, ఒక్కరు కూడా ఆ సమావేశానికి రాలేదు. ఇంత పెద్దకార్యము సాధ్యము కాదన్న సందేహము వారిలో నెలకొన్నది. నిరీక్షించి లాభము లేదని, గోపాలరెడ్డి గారే స్వయముగా ఇల్లిల్లు తిరిగి తన చిన్ననాటి స్నేహితులను అతికష్టముపై ఒక

డజను మందిని శ్రీ వేదాంతరావు గారింట్లో సమావేశ పరచినారు. శ్రీ గోపాలరెడ్డి గారు వారందరకు, గత రెండు నెలల నుండి వారు కొనసాగించిన ప్రతయత్నము లన్నింటిని వివరించిరి. కావలసిన ధనమును లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు కొరకు 'రైతు సహకార సంఘము' నేర్పరచుకొని పొందవచ్చునని తెలిపినారు. మొదట ఆ సంఘమును రిజిస్ట్రేషన్ చేయాల్సివుంది. దానికి వలయు ధనము సభ్యునికి ఒక్కరికి రూ. 10/- చొప్పున గోపాలరెడ్డిగారే చెల్లించుటకు అంగీకరించినారు. సభ్యులందరూ చర్చించి తమ సంఘమునకు, 1969వ సంవత్సరము మహాత్మాగాంధి శతజయంతి సంవత్సర మైనందున తమ సంఘమునకు కూడా "మహాత్మాగాంధి లిఫ్టు ఇరిగేషన్ సహకార సంఘము – గడ్డిపల్లి" అని నామకరణము చేసినట్లు ఏకగ్రీవంగా తీర్మాణమును చేసి ఆమోదించుట జరిగినది. ఈ విధముగా గడ్డిపల్లి తదితర గ్రామముల రైతాంగము 'సహకార సొసైటి' స్థాపనతో "కృషి యజ్ఞము" ఉద్యమ ప్రథమ చరణము నందు కృతకత్యులైనారు.

మహాత్మాగాంధి లిఫ్టు ఇరిగేషన్ సహకార సొసైటి లిమిటెడ్ – గడ్డిపల్లి లో భాగస్వాములైన గ్రామములు :

1.	గడ్డిపల్లి	గరిడేపల్లి మండలము	భూమి విస్తీర్ణము మొత్తము 6,600 ఎకరములు
2.	కుతుబ్‌షా పురము		
3.	లింగాల	పెన్‌పహాడ్ మండలము	
4.	దూపాడు		
5.	మేడారం	నేరేడుచర్ల మండలము	
6.	పతేహ పురమ		

M.G.L.I. సొసైటి రిజిస్ట్రేషన్ కొరకు సిద్ధపరచిన బైలా ప్రత్యేకత :

ఆరు గ్రామాల ప్రజల, ముఖ్యముగా రైతుల అంగీకారముతో యేర్పడిన సహకార సొసైటిని రిజిస్ట్రేషన్ చేయనిది దానికి చట్టబద్ధత రాదు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంటులో ఆ సంఘమువారు యేర్పరచుకున్న నియమ నిబంధనలు చేర్చి, భవిష్యత్తులో ఆ సంఘము వాని ప్రకారము నడచుకొని ప్రగతిని సాధించగలదు. ఆ విధముగా వ్రాసుకొన్న వానిని 'బైలా' అని ఆంగ్లములో పేర్కొందురు. సాధారణముగా ప్రభుత్వము వారు, అందరికి వర్తించేరీతిగా, సాదానియమ నిబంధనలతో ఈ బైలాను రూపొందించి

యుంచెదరు. కాని ఆ రీతిగా యున్న 'బైలా' తమ లక్ష్యసాధన కుపకరించబోదని, విశిష్టమైన వారి ధ్యేయమున కనుకూలముగా, నియమములను ఏరి కూర్చి తమ గమ్యమున కనుకూలముగాను, రైతుల సమగ్ర అభివృద్ధికి తగిన విధముగా మన గోపాలరెడ్డి గారు ఆ 'బైలా'ను సిద్ధము చేసినారు. మానవ మనుగడకవసరమైన రంగములన్నింటిని అందులో చొప్పించినారు. అవి ఆర్థిక, సాంఘిక, విద్యా విషయక, సాంస్కృతిక మరియు ఆధ్యాత్మిక రంగములు. మానవ ప్రగతి ఈ రంగములందన్నిట ఏకబిగిగా అభివృద్ధి జరగాలి కాని ఒకటి తర్వాత మరొకటి కారాదు. ఈ రంగము లన్నిట అభివృద్ధి జరిగినపుడే సంఘము యొక్క సమగ్ర అభివృద్ధి కాగలదు.

లిఫ్ట ఇరిగేషన్ సొసైటి 'బైలా' రిజిస్ట్రేషన్ :

శ్రీ గోపాలరెడ్డి గారు, శ్రీమాత అనుగ్రహంతో రూపొందించిన 'బైలా'ను, మెమోరాండం ఆఫ్ ఆర్టికల్స్‌ను రిజిస్ట్రార్ కార్యాలయంలో "మహాత్మాగాంధి కాంపు హెన్సివ్ ఇంటిగ్రేటెడ్ లిఫ్ట ఇరిగేషన్ కో ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్ - గడ్డిపల్లి" పేరుతో నున్న డాక్యుమెంట్‌ను రిజిస్ట్రేషన్ అధికారికి సమర్పించెను. వారు దానిని చూడగానే "మీరు ఇందులో ఏమేమో వ్రాసినారు. సర్కారు వారు రూపొందించిన దాని వలె లేదు. ఇందులో వ్రాసిన అంశములతో మాకేమి సంబంధం లేదు. మీరు 'లిఫ్ట ఇరిగేషన్' కొరకు గదా దీనిని ఇచ్చినది. కావున ఇది అంగీకరింప బడదని" వాపను చేసెను. ఎంతగానో బ్రతిమాలినా ససేమిరా అన్నారు. అప్పుడిక చేయునది లేక గోపాలరెడ్డి గారు శ్రీమాతను ప్రార్థించారు. "శ్రీమాతా ! నీవు నావెంటనే వున్నావు, నాలోనే వున్నావు, నా మొర ఆలకించవమ్మా, సమగ్రాభివృద్ధి నాకాంక్షించి, మేము రూపొందించు కున్న ఈ బైలాను అంగీకరించునట్లు ఆ అధికారి నొప్పించు మమ్మా ! దీనినాతడు అర్థము చేసుకొనునట్లు చేయుతల్లీ" అని నిరంతర స్మరణ చేసెను. ఆపైన ఈ రిజిస్ట్రారు యొక్క పై అధికారియైన జాయింటు రిజిస్ట్రారు కోఆపరేటివ్ డిపార్టుమెంటు, హైద్రాబాదును కల్సి విన్నవించగా, ఆ 'బైలా'ను ఆమూలాగ్రము చదివినారు. వారిపేరు తురాబ్ హుస్సేన్ గారు. మంచి సంస్కార వంతుడు, అవగాహన శీలి. అన్నిరంగుమలందు ఈ సొసైటి సమగ్రాభివృద్ధిని సాధించాలనుకొనుట తప్పేమి కాదని, ఒక కాపిని వారు ఉంచుకొని మరొక దానిలో "ఇందులో అభ్యంతరకర అంశము ఏమి లేవని, కావున ఈ సొసైటిని యదావిధిగా రిజిష్టరు చేయుటకు జిల్లా అధికారిని ఆదేశించినారు. శ్రీమాత జోక్యములో, అధికారి సొసైటి రిజిస్ట్రేషన్ పనిని పూర్తి గావించినారు. గడ్డిపల్లి సొసైటి అధ్వర్యమన తామను కున్న విధముగా సమగ్రాభివృద్ధి సాధనా దిశగా ప్రథమ సంకటము తొలగిపోయినది.

'బైలా' & మెమోరాండం రిజిస్ట్రేషన్ పూర్తి అయిన తర్వాత శ్రీమాతకు లేఖ వ్రాసి రైతుల కృతజ్ఞతలనందించి, ఆరుగ్రామాల లోని 6600 ఎకరాల సాగునకు లిఫ్ట ఇరిగేషన్ పనిని ప్రారంభించుటకు ఆ తల్లి ఆశీస్సులను, అనుగ్రహమును, నిరంతర మార్గదర్శనము చేయుటకు అర్థించినారు. శ్రీమాత అదే లేఖపై తన అనుగ్రహమును, ఆశీస్సులను అందించుటతోపాటు బ్లెసింగ్ పాకెట్లు కూడా పంపించినది. దీనితో కార్యసాధన సాఫల్యత నొందగలదను దృఢ విశ్వాసము మన రెడ్డి గారికి యేర్పడినది.

సొసైటి రిజిస్ట్రేషన్ సమయములో 11 మంది కనిష్ఠ సంఖ్య సభ్యులే కష్టంగా సమకూరినారు. అందు అధిక సంఖ్యాకులు వారి చిన్ననాటి సహాధ్యాయులు. వీరికి, ప్రతి సభ్యునికి 10+1=11 రూ॥లు చొప్పున మొత్తము రూ. 121-00 రెడ్డి గారే చెల్లించి సభ్యత్వము యిప్పించుట జరిగినది. 11మంది సభ్యులతో జనరల్ మీటింగులను రెగ్యులర్‌గా నిర్వహించుటకు నిర్ణయించారు. జనరల్‌బాడి అయినా, మేనేజింగ్ కమిటీ అయినా ఈ 11 మంది సభ్యులే. ఈ ప్రాజెక్టు నిర్వహణకు కావలసిన అంచనా 1 కోటి రూపాయలు. దీని 'బైలా' కూడా ఆదర్శవంతమైనది. ఇక ముందు చేరే సభ్యులకు 'బైలా'లో రెండు షరతులు విధించబడినవి.

1. ఈ సొసైటిలో సభ్యుడుగా చేరదలచినవారు తనకున్న పొలములో 10% భూమిని సొసైటికి ఇవ్వవలసియుండును. ఈ భూమి రోడ్లకు, మురుగు కాలువల నిర్మాణమునకు, తదితర సొసైటి పనులకు ఉపయోగపడును.

2. ఇక రెండవ నిబంధన - ఈ సొసైటిలో చేరిన ప్రతి సభ్యుడు తనకు పండిన పంట నుండి, ఎకరా ఒక్కంటికి 1 క్వింటాల్ ధాన్యమును ప్రతి పంటకు యివ్వాలి. ఈ ధాన్యము శాశ్వత పథకము. సొసైటికి సభ్యులు చెల్లించే కంట్రీబ్యూషన్ యిదే. దీనితో, ప్రభుత్వము మంజూరి యిచ్చిన నూతన పథకములను అమలు పరచుటకు, రైతుల నుండి అందించబడు వాటా ధనమగును. ఈ పద్ధతి వలన సొసైటి వద్ద ఎప్పటికి సమృద్ధిగా ధనము నిలువ యుండును. సొసైటి యాజమాన్యము నిశ్చింతగా నూతన కార్యక్రమములను నిర్వహించుటకు అవకాశము కల్గియుండును.

ఈ విధమైన సదుపాయము మరే సొసైటిలోను కనిపించదు. అన్ని సొసైటిల లక్ష్యము ఒక్క కార్యమునకే పరిమితమై యుండగా ఈ సొసైటి లక్ష్యము అందుకు భిన్నముగా, సర్వ సమగ్రమైనది. సొసైటి 'బైలా'లోనే ఆర్థిక, సాంఘిక, విద్యా విషయక, సాంస్కృతిక మరియు ఆధ్యాత్మిక, పర్యావరణ రంగములందిన్నట అభివృద్ధి జరిగి,

ఏక కాలములోనే యివన్ని సాధింపబడాలి అని పేర్కొనుట జరిగినది కదా ! అందుకే దీని ప్రత్యేకత ప్రశంసనీయము.

శ్రీ గోపాలరెడ్డి గారు, కో ఆపరేటివ్ డిపార్టుమెంటు చరిత్రలో లేని విధంగా, తాము తమ అవసరముల కనుగుణంగా రూపొందించిన 'బైలా'ను రిజిస్ట్రేషన్ చేయించుట అపూర్వము. శ్రీమాత సంపూర్ణ అనుగ్రహము వల్లనే యిది సాధ్యపడినది. కాని ఆ వెనువెంటనే, మరొక సంకటము కూడా యేర్పడినది. అదేమనగా సహకార సొసైటీలో సభ్యుల లేమి. నూతన సభ్యులెవరు చేరుట లేదు. వారికి కబురంపినా ఒక్కరూ రావడం లేదు. బహుశః వారి మదిలో ఈ ప్రాజెక్టు కార్యము అసాధ్యమైనదిగా అనిపించినదేమో ! ఇది అందరకు కావాల్సింది. ఈ ప్రయత్నము సఫలమైనపుడు అందరకు నీరందును కదా ! దానివలన రైతాంగమునకు లబ్ధి చేకూరుట నగ్న సత్యము. అయినా రైతులు సభ్యులుగా నమోదుగటు లేదు. ఇట్లైన కార్యము జటిలమగును. అని పరిపరి విధములుగా ఆలోచించి, 'అన్యధా శరణం నాస్తి' అనుకొని 'అమ్మ'ను మనసారా యిట్లు ప్రార్థించెను. "శ్రీమాతా ! మా గ్రామాభ్యు దయమునకు అనేక మారులు మిమ్ము ప్రార్థించియే ముందుకు నడుస్తున్నాను. ఎదురైన ఆటంకములు ఒక్కొక్కటిగా తొలగి పోవుచున్నవి. సొసైటి సభ్యులు చేరకుండా కార్య సాఫల్యత ఎట్లు కాగలదమ్మా ? ఈ అవాంతరము నుండి అందరిని అనుకూల మగునట్లు గ్రామాలను గట్టెక్కించుమమ్మా" అని వేడుకొన్నారు. అంతే ఉత్తర క్షణము లోనే అమ్మ నుండి ఆదేశమంది తన హృదయంలోనే స్ఫురించినది. "Do not announce, Act" ఇది జగన్మాత సందేశము. మన రెడ్డిగారికి తన మనమునందేర్పడిన ఆందోళన సద్దుమణిగినది. కార్య నిర్ణయమై పోయినది. కావలసినది కార్యారంభం.

భూమి సర్వే పని ప్రారంభము :

శ్రీమాత అనుగ్రహముతో యీ స్థాయిలో జరగవలసిన పనికి పూనుకున్నారు మన రెడ్డి గారు అదేమన ఈ ఆరు గ్రామాలలో మొత్తముగా ఎంతభూమి కలదో మొదట నిర్ధారణ జరగాలి. ఎస్టిమేట్సు, ప్రాజెక్టు రిపోర్టులు సిద్ధము కావాలి. 1 కోటి రూ.ల ప్లానుతో నిర్వహింపబడాల్సి పనులకు వనరులను కూడా పరిశీలించాల్సి యుంది. రైతుల నుండి అందే కంట్రిబ్యూషన్ ఏమీ లేదాయె. పేద రైతుల నుండి, కరువు కాలములో కంట్రిబ్యూషన్ రాబట్టుట సాధ్యమ కాదనే పండిన పంట నుండి 1 ఎకరమునకు 1 క్వింటాల్ ధాన్యము కారుకు యిచ్చు నిబంధనను 'బైలా'లో చేర్చుట జరిగినది.

క్షేత్ర స్థాయిలో పని ఆరంభం :

శ్రీ గోపాలరెడ్డి గారు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పని చేయుచున్నందున అచటి నుండి రెండు సర్వే పరికరములను అడిగి తీసుకున్నారు. ఎవరో ఒకరి మీద ఆధార పడకుండా ఇరిగేషన్ డిపార్టుమెంటులో 30 సం॥ల అనుభవము గల వ్యక్తి శ్రీ హరిశ్చంద్ర గారిని ఎంపిక చేసినారు. వారికి డిపార్టుమెంటు నుండి ఎంత పొందుతున్నారో అంతే మొత్తాన్ని చెల్లించుటకు డాక్టరు గారు వాగ్దానమొనరించినారు. ఈ పని 3 మాసాల వరకు కొనసాగినా వారికి 1500/- మొత్తము చెల్లించాల్సి యుండును. మరొక 1500/- లేబర్ చార్జీలు అయిన మొత్తము పనికి రూ. 3,000 మించదు. ఇది తనకు అందుబాటు లోనిదే నని వారు తలచినారు.

ఇక సర్వే పని ప్రారంభమైనది. ఇదే సమయంలో వోల్టాస్ కంపెనీ వారు ప్రాజెక్టు కవసరమగు ఎలక్ట్రికల్ & మెకానికల్ పనులకు సంబంధించిన ప్లానులను సిద్ధపరచుచుండగా, పైపుల కంపెనీ వారు కూడా పనిని ప్రారంభించారు. ఈ పనులన్నీ ఏక కాలములోనే జరుగుచున్నందున కార్యసాధనలో ఆలస్యము జరుగబోదు.

ఈ స్థితిలో, పరిస్థితి నంతా గమనించిన రైతాంగము, అందు ముఖ్యముగా సొసైటి సభ్యత్వము పట్ల విముఖత ప్రకటించిన వారు, పునరాలోచనలో పడినారు. తాము సొసైటీలో చేరినా, చేరకున్నా, జరుగవలసని కార్యము త్వరితగతిన కొనసాగు చున్నది. ఈ దశలో మిన్నకుండుట తమకే హాని యని తలచి, ఒక్కొక్కరుగా అందరు తమకు సభ్యత్వమివ్వ వలసినదిగా డాక్టరు గారి నర్థించారు. తమ భూములను కూడా సర్వే చేయించాలని కోరినారు. వారిని సర్వే ఖర్చులకై ఎకరమునకు రూ. 10/- చెల్లించవలసినదిగా చెప్పినారు. దానికంగీకరించి రైతులు సభ్యులుగా చేరుట జరిగినది. ఎప్రిల్ 1969 వరకు సర్వే పూర్తి చేయబడినది.

★ ★ ★

గడ్డిపల్లి ప్రాజెక్టు భూమి సర్వే రిపోర్టును ప్రభుత్వముకు సమర్పించుట

గడ్డిపల్లి తదితర గ్రామాలకు చెందిన మొత్తము భూమిని శాస్త్రీయముగా సర్వే చేయించిన అనంతరం, ఆ వివరమును జిల్లా కలెక్టరు ద్వారా ప్రభుత్వమునకు పంపించాల్సియున్నందున, ఈ వివరములను స్వయముగా మన గోపాలరెడ్డి గారే నల్లగొండ వెళ్ళి కలెక్టరు గారికి సమర్పించుట జరిగినది. దీనిపై కలెక్టరు గారికి, గడ్డిపల్లి సహకార సొసైటీ యింతటి బృహత్తర కార్యమును విజయవంతం చేయగలదా! అను సందేహము కల్గినది. ఇది అసాధ్యము. అని తన మదిలో తలచి, ఆ రిపోర్టును పై అధికారులకు పంపించకుండా తన దగ్గరే అట్టే పెట్టుకొనెను. 3 వారములు గడచిన పిదప కార్యము ఎంతవరకు వచ్చినదని తెల్సుకొనుటకు కలెక్టరు కార్యాలయము నకు పోయినపుడు, తమ రిపోర్టును ప్రభుత్వమునకు పంపించలేదని తెల్సికొని, తమ రిపోర్టును ఇంతకాలము మీ దగ్గర పెట్టుకొనుటలో అర్థము లేదని కలెక్టరు గారినడుగగా కలెక్టరు చిరాకుపడి కోపమునకు రాగా, అపుడు గోపాలరెడ్డి గారు – మీరు రిపోర్టును ఇంతకాలము మీవద్ద ఆపియుంచుట, అడిగినపుడు కోపగించుటలో అర్థము లేదని తెలిపి – తన మదిలో శ్రీమాతను ప్రార్థించుట – "శ్రీమాతా ! జిల్లా కలెక్టరు గారు మా రిపోర్టును ప్రభుత్వమునకు పంపుట లేదు. కావున పై అధికారి ద్వారా మా కార్యాన్ని సానుకూల పరచు తల్లీ" యని పరిపరి విధములుగా ప్రార్థించి, జాయింట్ సెక్రటరీ, హైద్రాబాదు వారిని కల్సినారు. జిల్లా కలెక్టరు ప్రవర్తనను వివరించి, మీరే మాకు అనుమతి యివ్వాలని కోరినారు. ఈ ప్రస్తావనను అధికారి ముందుంచి, నిరంతరము శ్రీమాతను ప్రార్థించినారు. జగన్మాత కృపాకటాక్షము వలన జాయింట్ సెక్రెటరీ గారు, రెడ్డి గారిని రేపు రావలసినదిగా తెలిపెను. మరునాడు ప్రభుత్వము గడ్డిపల్లి సహకార సొసైటీ రైతులకు, నాగార్జున సాగరము ఎడమ కాలువ (లాల్ బహద్దూర్ కాలువ) నుండి లిఫ్టు ద్వారా సాగునకు నీరు తోడుకొనుటకు అనుమతించినది." అని చీఫ్ ఎక్జిక్యూటివ్ ఇంజనీరు గార్కి ఉత్తర్వులిచ్చినది. ఒక కాపీ కలెక్టరు, నల్లగొండ గారికి కూడా యివ్వబడినది. ఈ రెండు ఉత్తర్వులను గోపాలరెడ్డి గారే స్వయంగా తీసుకెళ్ళి కలెక్టరు గార్కి అందజేసెను. వానిని చూచి కలెక్టరు నివ్వెరపోయి యిదెట్లు సాధ్యపడినది అని అరుపులు, కేకలు వేయసాగెను. జిల్లా కలెక్టరు గారి ప్రమేయం లేకుండా, శ్రీమాత దయవలన గడ్డిపల్లి సొసైటీ రైతాంగము ముందుకు పోవుటకు మార్గము సుగమమైనది.

గడ్డిపల్లి ప్రాజెక్టు పనికి ఎస్టిమేటును చేయుటకు, పనులు నిర్వహించుటకు, చీఫ్ ఇంజనీరు గారి అనుమతి కోరుట :

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పి.డబ్ల్యు.డి. శాఖ జాయింట్ సెక్రటరీ గారు జిల్లా కలెక్టరు ప్రమేయం లేకుండా గడ్డిపల్లి సొసైటీకి, నాగార్జున సాగర్ ఎడమ కాలువ నుండి కమ్యూనిటీ లిఫ్టులతో నీరు తోడుకొని ఇరిగేషన్ కొరకు వాడుకొను పద్ధతికి అనుమతి ప్రసాదించిన పిదప, కార్యము కొనసాగుటకై, చీఫ్ ఎక్జిక్యూటివ్ ఇంజనీరు గారికి అనుమతి పత్రమును అందించుటకు నాగార్జున సాగర్ క్యాంప్ ఆఫీసుకు మన డా॥ గోపాలరెడ్డి గారు చేరుకున్నారు. అర్జును వారికందించి, విషయమును వివరించారు. దానిపై ఆ అధికారి, ఈ విషయములో తగిన రీతిగా చర్య తీసుకొన వలసినదని సూపరింటెండెంట్ ఇంజనీరు గారికి వ్రాసెను. ఆ పత్రమును తీసుకొని డా॥ గోపాలరెడ్డి గారు మిర్యాలగూడ క్యాంపునకు చేరి, ఆ పత్రములను వారికర్పించి, వారి పనిని సత్వరమే చేపట్ట వలసినదని కోరినారు. ఆ మరుదినమే వారు ఎక్జిక్యూటివ్ ఇంజనీరును తోడ్కొని వచ్చి, కాలువపై తూము (Sluice) ను నిర్మించుటకు స్థల పరిశీలన చేసినారు. కాలువ గట్టుకు లోపలి భాగములో తూము బావిని, గట్టుకు బయటి వైపు నీరు నిలువ యుండి లిఫ్టు పంపులకు నీరు అందించు విశాలమైన బావిని త్రవ్వుటకు సూచనలిచ్చినారు. కాని తూము ముందు భాగములో పెద్ద బండరాయి యున్నందున అది పగుల కొట్టుటకు సాధ్యము కాదని భూమి లెవెల్‌కు 6 అడుగుల పైనుండే తూము నిర్మాణమునకు, బావి తోడుటకు నిర్ణయించుకొన్నారు. ఆ మేరకు ఎస్టిమేట్లు చేయవలసినదిగా ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ గారిని కోరినారు. వారు తయారు చేసే అంచనాలను రూ. 50,000/- లకు లోపుగా యుండునట్లు కోరినారు. వాస్తవమునకు ఏబది వేల లోపు ధనముతో అది పూర్తి కాదని తెలిసినా, ఈ మేరకే చేయుటకు పదే పదే శ్రీమాతను ప్రార్థించి, ఇంజనీరు గారిని అర్థించారు. అసలు విషయమేమంటే – రూ. 50 వేల లోపు పనులకు 'ఎక్జిక్యూటివ్ ఇంజనీరు' గారే పనులు చేయుటకు అనుమతించవచ్చును. పై లెవెల్‌కు వెళ్ళినచో ఎక్కువ సమయము పట్టును. కావున ఈ లెవెల్‌లోనే వారి పనులు పూర్తి చేయుటకు, ఆ విధముగా కోరనైనది. అయినను కాలువపై ఎట్టి నిర్మాణము తలపెట్టినా అంచనాలతో నిమిత్తం లేకుండా 'చీఫ్ ఇంజనీరు' గారి అనుమతి అవసరమన్నారు. కావున అట్టి అంచనాలతో కూడిన అనుమతించు పత్రములను మోసికొని, సూపరింటెండ్ ఇంజనీరు గారిని, ఆపైన 'చీఫ్ ఎక్జిక్యూటివ్ ఇంజనీరు' గారి వద్దకు మన రెడ్డిగారు చేరి ఆ పత్రములను సమర్పించినారు. దారి పొడుగునా, కార్యము నిరాటంకముగా

కొనసాగాలని శ్రీమాతను స్మరించుచునే యున్నారు. కాని ఆశ్చర్యకరమైన విషయ మేమనగా చీఫ్ ఎక్సిక్యూటివ్ ఇంజనీరు గారు, భారీ నీటిపారుదల ప్రాజెక్టులపై, దక్షిన అమెరికాలో నిర్వహింపబడుచున్న సెమినార్‌లో పాల్గొనుటకు వెళ్లియున్నారు. రెండు వారాల వరకు వారు అక్కడే వుంటారు. ఇది మే నెల, జులై మొదటి తేదీన కాలువలకు నీరు విడుదల చేయుదురు. ఈ లోపు పని పూర్తి కావాలి. ఏమి చేయుట. అని అనేక విధములుగా శ్రీమాతను ప్రార్థించి మార్గము చూపించు మాతాయని స్మరించుచు ఆ రాత్రి గడిచినది. మరునాడు తిరిగి అదే ఆపీసుకు వచ్చి, చీఫ్ ఎక్జిక్యూటివ్ ఇంజనీరు గారి పర్సనల్ అసిస్టెంటును కల్సి, వారి పని యొక్క విలువ 50 వేలకు లోవుగానే యున్నదని, వారికి మన రెడ్డి గారు తెలుపుట, వారు దానిని పరిశీలించి, నిర్మాణ విలువ అంచనాలు 50 వేలకు మించలేదు కావున మీరే ఈ కార్యమునకు అనుమతించవచ్చునని వ్రాసి యిచ్చారు. మన రెడ్డి గారు కోరినది కూడా, 'అమ్మ'ను ప్రార్థించి చెప్పినది కూడా యిదే. ఆ అర్డర్ కాగితమును సూపరింటెండెంట్ ఇంజనీరు గారికి తెచ్చియిచ్చినపుడు, వారు పై అదికారి అనుమతి అవసరమని నొక్కి చెప్పుట జరిగినది. ఇది కానిపని అని చిరాకు పడినారు. కాని శ్రీమాత దయవలన, కొద్దిసేపైన తర్వాత వారి ప్రవర్తనలో మార్పువచ్చినది. శ్రీమాత వారిలో ప్రవేశించి ఏమి చేసినదో కాని, గోపాలరెడ్డి గారి వైపు చూచి, చిరునవ్వుతో ఆ లేఖను దిగువ అధికారియైన ఎక్సిక్యూటివ్ ఇంజనీరు గారికి, ఈ పనికి మీ స్థాయిలోనే మంజూరి యిచ్చి, పనిని చేపట్టవలసినదిగా ఆర్డరు వేసినారు. అపుడు మన గోపాలరెడ్డి గారికి అవధులు లేని ఆనందము కల్గినది. మనసార శ్రీమాతను కొనియాడి తమ కృతజ్ఞతలను తెల్పుకొన్నారు.

క్షేత్ర స్థాయిలో పని ప్రారంభం :

పైన పేర్కొన్న సంఘటనలు 1969 మే నెలలో జరిగినవి. మన రెడ్డిగారు పనిని ప్రారంభించుటకు త్వరపడుచున్నారు. శంకుస్థాపన చేయుటకు మంత్రులనో, మరొక్కరినో పిలువక, పని జరుగవలసినది ఇంజనీర్ల వల్లనేనని 'చీఫ్ ఎక్జిక్యూటివ్ ఇంజనీరు' గారితోనే పనిని ప్రారంభం చేయుటకు సంకల్పించి, వారిని 26వ తేదీనాడు 'గడ్డిపల్లి లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు' పనికి శంకుస్థాపన చేయుటకు రావలెనని ఆహ్వానించి, యిదే విషయమును సూపరింటెండెంట్ ఇంజనీరు గారికి విన్నవించి, వారిని కూడా ఆహ్వానించారు. అట్లే కాలువ పనులు చేయుచున్న ఒక బుల్‌డోజర్‌ను కూడా ఆదివారం నాడు అద్దెకు యివ్వవలసినదిగా కోరినారు. అందుకు యస్.ఇ. గారు అంగీకరించి అనుమతించారు. కాని క్రితం రాత్రి, అనగా శనివారం రాత్రి అసాధారణమైన రీతిలో వర్షము కురిసినది.

బుల్డోజరులు భూమిలో దిగబడుట :

ఆదివారం ఉదయం శ్రీ గోపాలరెడ్డి గారు అద్దెకు మాట్లాడిన బుల్డోజర్ బయలుదేరి నిర్ణీత స్థలమునకు వచ్చి చేరినది. అది చేయవలసిన పని, కాలువ తోడినపుడు ఎత్తిన మట్టి గట్టుపై రాశిగా పోసియున్నది. దాని అడుగుననే తూము నుండి వచ్చిన నీటిని నిలువ యుంచి, పైపులకు అందుబాటులో వుంచుటకు బావిని 100 మీ. పొడవుతోను, 100 మీ. వెడల్పు, 10-12 లోతు కల్గిన బావిని సిద్ధపరుచుట ఈ పనికొరకు బుల్డోజరు వస్తుండగా, నిర్ణీత స్థలమునకు దగ్గరలోనే బురదలో దిగబడినది. దీనిని తీయుటకు మరొక బుల్డోజరును తీసుకవచ్చారు. కాని అది కూడా మొదటి దానివలెనే దిగబడినది. ఈ రెండింటిని బయటకు తీయుటకు మూడవ దానిని తెచ్చి ప్రయత్నించగా అదికూడా దిగబడి పోయినది. వీనిని బయటకు తేవాలంటే మరే ఉపాయము లేదు. మరొక బుల్డోజరు రావలసినదే. నాల్గవది, దాని తర్వాత అయిదవ బుల్డోజరు కూడా అదే మార్గము పట్టినవి. ఈ విధముగా ఆరు బుల్డోజర్లు ఆ స్థలము వద్ద దిగబడి పోయినవి. అందరికందరము విచార సముద్రములో మునిగినాము.

రామకృష్ణారెడ్డి గారు కలుగచేసికొని ఉపాయమును సూచించుట, బుల్డోజర్లను బయటికి లాగుట :

ఆదివారం దినమంతా పనిచేసి, మట్టిని తొలగించి, మరునాడు శంకుస్థాపన ముహూర్తము వరకు భూమిని సిద్ధము చేయాలని అనుకుంటే కథ ఈ విధముగా అడ్డము తిరిగినది. తానొకటి తలచిన దైవమొకటి తలచును అను సామెత యిదే కాబోలు ! కాని యిందులోని మర్మము మాత్రము మనకు తెలియకుండా వున్నది. శ్రీ గోపాలరెడ్డి గారి బంధువు, ఉపాయశాలియైన శ్రీ రామకృష్ణారెడ్డి గారు ఉపాయమును సూచించినారు. అదేమనగా, బుల్డోజరు ముందు చక్రముల క్రింద గుంతలు త్రవ్వించి అందులో రాళ్లు పేర్చినారు. దానిపైన ఒక తాడిచెట్టును కొట్టుకవచ్చి అడ్డంగా పెట్టి, బుల్డోజరును స్టార్ట్ చేయగా అది దుమికి పడుచు ముందుకు సాగిపోయినది. ఈ ఉపాయముతో అన్నింటిని బయటకు రప్పించినారు. ఈ తతంగము ముగిసేవరకు సాయంత్రమైనది. ఇక పని ఎప్పుడు చేయాలి ? ఎట్లు చేయాలి ? మరునాడే శంకుస్థాపన.

శ్రీ రామకృష్ణారెడ్డి గారు కలుగ చేసికొని, 6 బుల్డోజర్ల డ్రైవర్లను కూర్చుండ బెట్టి, ఈ పనిని దైవకార్యముగా భావించి, ఈ రాత్రికి రాత్రే అన్ని బుల్డోజర్లు కలిసి పని పూర్తి చేయాలని వారిని కోరినారు. ప్రతిఫలముగా ఈ ఒక్కరాత్రి పనికి, ఒక్క

నెల వేతనమంత ద్రవ్యము యిచ్చుటకు ఒప్పందము కుదుర్చుకొన్నారు. వాదరందరికి భోజనములేర్పాటు చేయబడినవి. చాలినంత డీజిల్ ఆయిల్ తెప్పించినారు. దివిటీలు వెలిగించారు. పని ప్రారంభమైనది. అందరికందరు నిద్రమాని, పనిపైననే శ్రద్ధను పూని కష్టపడినారు. తెల్లవారేవరకు తూము బావిని, కాలువ గట్టుకు బయట నీటి నిలువయుండే పంపులమర్చు బావిని తోడినారు. గట్టుపై గుట్టగా పడియున్న మట్టి కుప్పను కూడా తొలగించినారు. యధాస్థానమునకు బుల్డోజర్లు చేరిపోయినవి. ఇది గడ్డిపల్లి ప్రాజెక్టు కార్యారంభములో చోటుచేసుకున్న మహిమాన్వితమైన అద్భుతము – పరమాద్భుతము. శ్రీమాత కృప వల్లనే ఆరు బుల్డోజర్లు పని చేసినవి. రైతులు ఒక్క బుల్డోజరునే కోరినారు. ఆ ఒక్కదానితో పని కాదని శ్రీమాత ఆరింటిని బురదలో దిగబెట్టి, ఆ తల్లిగారి అనుగ్రహముతోనే వానిని బయటకు తీసి, ఆరింటితో పని పూర్తి చేయవచ్చునని కాబోలు ! బాహ్యమునకు శ్రీమాత తన అనుగ్రహమును ఈ విధముగా వర్షింపచేసినది. బుల్డోజర్లు దిగబడిపోయినపుడు ఖేదము నొందిన రైతాంగము కార్యాంతమున ప్రమోదభరితులై, శ్రీమాత అనుగ్రహమును తలచుకొనుచు శతాదిక వందనములర్పించి, సర్వదా కాపాడవలసినదిగా వేడుకొన్నారు. ప్రజలందరిలో శ్రీమాతపై భక్తిభావము దృఢముగా యేర్పడినది.

లిఫ్టు ఇరిగేషన్ పనికి శంకుస్థాపన :

డా॥ గోపాలరెడ్డి గారి నాయకత్వములో రైతాంగము కల్సికట్టుగా సహకరించి, అధికార గణమును ఆహ్వానించి, శంకుస్థాపన చేయించుటకు సర్వము సిద్ధము చేయబడినది. ఆనాడు ఉదయం 10–00 గంటలకు 'చీఫ్ ఎక్సిక్యూటివ్ ఇంజనీరు', 'సూపరింటెండెంట్ ఇంజనీరు', 'ఎక్సిక్యూటివ్ ఇంజనీరు' యితర అధికార గణము నిర్ణీత స్థలమున కరుదెంచినారు. పూర్వము ఆ స్థలములోని మట్టి గుట్ట మాయమైనది, తూము బావి, పంపులకు నీరందించు (Intake well) విశాలమైన బావి సంసిద్ధపరచ బడినవి. ఇదంతా ఎట్లు సాధ్యమైనదని, ఒక్క బుల్డోజరు ఒక్కరాత్రిలో యింతపని ఎట్లు చేయగల్గినది ? ఈ ప్రశ్నకు సమాధానము లేదు. రైతాంగము వైపు చూచి మందహాసము చేసి, ఇంత ఘనకార్యమును సాధించినందుకు వారినందరిని అభినందించినారు. ఆనందముతో చీఫ్ ఎక్జిక్యూటివ్ ఇంజనీరు గారు, వేదమంత్ర రావము, ప్రజల జయజయ ధ్వానముల మధ్య శుభముహూర్తమున శంకుస్థాపన చేసినారు. అధికారగణమందరకు విందు భోజనము యేర్పాటు చేయబడినది. శ్రీమాత ఆశీస్సులు, అనుగ్రహంతో నిరాటంకముగా కార్యము కొనసాగినందుకు చేతులెత్తి నమస్కరించి, తమ భక్తిభావమును ప్రకటించారు.

ప్రథమమున సూపరింటెండెంట్ ఇంజనీరు గారు ఒక షరతును విధించినారు. అదేమనగా – రెండు వారములలో బావి నిర్మాణ పని పూర్తికాని పక్షమున, మొత్తము పనిని నిలిపివేసి కాలువగట్టులను తిరిగి యధాప్రకారముగా మూసివేయాలని, లేని యెడల నీరు వదులుటకు ఆలస్యమగును. ఈ రిస్కునకు మన గోపాలరెడ్డి గారు అంగీకరించినారు. వారి మిత్రులు యితర రైతుజనము గ్రామగ్రామానికి వెళ్లి పని చేయుటకు రావలసినదిగా రైతాంగమును పిలిచి మట్టిపనిని నిర్వహించుటకు 4 బ్యాచులుగా మొత్తము 800 మందిని ఏర్పాటు చేసినారు. ఏ అవరోధము లేకుండా పని సాఫీగా, తల్లిగారి అనుగ్రహముతో కొనసాగినది. బావులు రెండు సిద్ధమైనవి.

బావి కూలుట :

ఇప్పుడిక్కడ అసాధారణ రీతిలో జగన్మాత మహిమ అద్భుతరీతిగా దర్శనమైనది. అదేమనగా బావిలో దిగిన 200 మంది పనివారు, మట్టిని ఎత్తిపోసి, పని ముగించుకొని ఒక్కొక్కరుగా 200 మంది పనివారు బావిలోనుండి నిచ్చెనల సహాయమున పైకి చేరినారు. చివరివాడు కూడా క్షేమంగా పైకి చేరిన వెంటనే బావి యొక్క దరి దబాలున కూలినది. గట్టుపైకి చేరిన జనమంతా హాహాకారము లొనరించిరి. ఏమైనది ? ఏమైనది ? అను చుట్టువున్న వారందరు భయం భయంగా పరుగులెత్తి చూడ ఒకపక్క బావి దరి కూలినది. శ్రీమాత దయ, అనుగ్రహము వలన ఎవ్వరికి ఏ గాయము కాలేదు. ఒక్క సెకను కాలము జనము పైకి చేరుటలో ఆలస్యమైనా పెద్ద అపాయము జరిగి యుండెడిది. కాని ఏమి జరుగలేదు. అందరు ఊపిరి పీల్చుకున్నారు. జగన్మాతకు శత సహస్ర వందనములర్పించుకొన్నారు. ఈ విధమైన అద్భుత మహిమల తోనే పనులు జరుగుచున్నవని అందరకు నిదర్శనముగా కనిపించినది. మాతృశ్రీకృప యుంటే మరే భయముండదు కదా !

బావిలో పడిన వ్యక్తి క్షేమంగా బయటికి వచ్చుట :

భారీ యెత్తున కాలువ గట్టుపై పనులు జరుగుచుండెను. అచటి జన సమూహమును చూచిన, దారినపోయే ఒక వ్యక్తి అనుకోకుండానే అచటికి చేరెను. పరిసరాలను అటూఇటూ పరిశీలించి సమీపములో లోతుగా తీయబడిన పెద్దబావి గట్టుపై నిలబడి చూచుచుండెను. అదేమి విచిత్రమోకాని, అతను నిలబడియున్నట్టి దరి అకస్మాత్తుగా దబాలున కూలుటతో ఆ మట్టిగడ్డతో పాటుగా దానిపైనున్న వ్యక్తి కూడా బావిలో పడిపోయెను. ఆ శబ్దమునకు పని చేయుచున్న వ్యక్తులు, ఆ వ్యక్తి అరుపులకు పరుగెత్తికొని వచ్చి చూడగా బావిలో వ్యక్తి పడివున్నాడు. అతడు లోపల

క్షేమంగానే యున్నాడు. ఎక్కడా గాయము గాని బాధగాని లేదు. తగిన ప్రయత్నము చేసి అతనిని బయటికి తీసి పంపించినారు. అతడు క్షేమముగా బతికిబయట పడినందుకు అందరూ శ్రీమాత కరుణగా భావించి అపాయమేమి సంభవించనందుకు 'అమ్మ'కు కృతజ్ఞతలు తెలిపినారు.

శ్రీమాత అనుగ్రహముతో మట్టిపని చేయుచున్నపుడు ఏర్పడిన రెండు రకములైన సంకటములు నిరపాయకరముగా ముగిసినవి. ఈ రెండు సంఘటనలలో ఏ హాని జరిగినా, ముఖ్యముగా ప్రాణహాని జరిగి వున్నచో, అది ప్రజలు పీడాకర మైనదిగాను, దుశ్శకునముగాను భావించి యుండెడివారు. కాని కరుణామయి అయిన ఆ తల్లిగారు అటుల జరుగకుండానే ఆ క్షేత్రముపై అచటి ప్రజలపై తన అనుగ్రహ వర్షమును కురిపించి అభయ ప్రదానము చేసినదాయె ! అందుకని ఏ ప్రమాదము సంభవించదు. ఆ గడ్డపై తలపెట్టిన పనులు దిగ్విజయముగా నెరవేరగలవు.

తూము (Sluice) కాలువపై మరియు బావిపై సిమెంటు స్లాబు వేయుట :

రెండు వారములలో మట్టిపని పూర్తి చేయబడినది. ఇక మిగిలిన పని తూము కాలువపై మరియు లిప్టులకు నీరందించు బావిపై (Intake well) సిమెంటుతో స్లాబు వేయుపని మిగిలి యున్నది. ఇది చాలా భారీపని. సిమెంటు, కంకర కలిపి వానికి కప్పు వేయాల్సిన పని. దూరమున గ్రామములో వర్షము పడుచున్నందున, అది ఇంత వరకు వచ్చినచో కల్పిన సిమెంటు, కంకర వృధా కాగలవు. కావున అసిస్టెంట్ ఇంజనీరు గారు ఆ పనిని ఆపవలెనని చెప్పినారు. కాని వారి సోదరుడైన రామకృష్ణారెడ్డి మాత్రము అంగీకరించక పని ప్రారంభించాడు. శ్రీమాతపై సంపూర్ణ విశ్వాసముతో కాలువకు యిరువైపుల వర్షము పడుచున్నది కాని పని స్థలమునకు 200 మీటర్ల దూరము మాత్రము చినుకు పడుట లేదు. కావున తలచిన పని పూర్తి అయినది. గోపాలరెడ్డి గారు శ్రీమాతను తనమదిలో నిలుపుకొని సదా ప్రార్థించుచు, స్మరించుచు కార్యమును గట్టెక్కించు తల్లీ ! అని వేడుకుంటూనే యున్నారు. ఆ ఇంజనీరు గారు ముస్లిం అగుట వలన తన భాషలో "అల్లాకా షుకుర్ హై" దైవాను గ్రహము కలదని తెలిపినారు. అక్కడున్న వారందరు ఆనందముతో దైవమునకు కృతజ్ఞతలు తెల్పినారు. రెండు రోజుల తర్వాత సిమెంటు క్యూరింగ్ అయినందున ఆ స్లాబుపై మట్టిపోసి గట్టును యదావిధిగా పూర్వము వలె చేసినారు. ఈ పనిని త్వరత్వరగా కాలువలకు నీరు వదలకముందే పూర్తి చేసినారు.

★ ★ ★

గడ్డిపల్లి ప్రాజెక్టు పనుల కొరకు బ్యాంకుల నుండి ఋణమును పొందుట

డాక్టరు గోపాలరెడ్డి గారు చాలా ముందుచూపుతో వ్యవహరించుట వారి అలవాటు. ఏపని చేసినా, ఆ పనికి సంబంధించిన మిగతా పనులను కూడా ఏక కాలములోనే నిర్వహించెదరు. అందుకే ఒకవైపు మట్టిపనులు జరుగుచుండగానే, తూము కాలువ లిఫ్టుపంపులకు నీరందించు బావి పనులు జరుగుచున్నపుడే రైతులకు కావలసిన ధనమును ఋణము రూపములో బ్యాంకుల నుండి పొందుటకు, స్టేటు బ్యాంకు ఆఫ్ హైద్రాబాద్, హుజూర్‌నగర్ బ్రాంచీ వారితో సంప్రదింపులు జరుపగా వారు 'గడ్డిపల్లి లిప్టు ఇరిగేషన్' వారి ప్రతిపాదనలను మన్నించినారు.

గడ్డిపల్లి లిప్టు ఇరిగేషన్ ప్రాజెక్టు వారి ప్రతిపాదనలు :

గడ్డిపల్లి లిప్టు ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రతిపాదనలలో చేరి వున్న ప్రధానమైన పనులు.

1. లిప్టును అమర్చుట.
2. భూమిని చదును చేసి అభివృద్ధి పరుచుట.
3. గోదాముల నిర్మాణము – పండించిన పంటలను నిలువ చేయుట కొరకు.
4. మానవ వనరులను (శక్తిని) సమకూర్చుట.

ఇది ఒక సమగ్రమైన ప్రణాళిక. దీనికి ఏ రకమైన ప్రభుత్వ గ్రాంటులను ఆశించకుండుట. ఈ పనులన్నింటిని లబ్ధిదారుల సహకారముతో బ్యాంకు ఋణముల ద్వారా చేపట్టుట జరుగును.

పైన పేర్కొనిన ప్రతిపాదనలకు బ్యాంకు వారు ధనము విడుదల చేయక ముందే S.B.H. హుజూరునగర్ బ్రాంచివారిని 5 లక్షల రూపాయలకు, ఆం.ప్ర. రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల కార్పోరేషన్ (A.P. State Agro Industries Corporation) కు గ్యారంటీ యివ్వ వలసినదిగా కోరబడినది. దానివలన భూమిని అభివృద్ధి పరచుటకు వారి నుండి బుల్డోజర్లను, ట్రాక్టర్లను తీసికొనుట వీలుకలుగ గలదు.

భూమిని అభివృద్ధి పరచుట :

ఈలోపు జూన్ నెలతో మాన్‌సూన్ వచ్చినది. ఇంతకాలంగా బీడుగా పడి వున్న భూములనభివృద్ధి పరచుటకు మొదలిడినారు. ఈ భూములన్ని చిన్న పాటి చెట్లతో విస్తరించి చిట్టడవిలాగానే వున్నవి. అదే ఊపులో పనులను కొనసాగించుచు అక్టోబర్ నెల (1969) వచ్చేవరకు ఒక వేయి ఎకరముల భూమి చదును పరచి, రాళ్లను తొలగించి, గట్లను కూడా నిర్మించుట జరిగినది. ఆపైన ఆభూమిలోకి వర్షము పడినపుడు నీరు ఇంకుటకు ట్రాక్టర్లతో ఒక సాలును కూడా పెట్టించుట జరిగినది.

లిఫ్టుకొరకు మోటార్లను, ట్రాన్స్‌పార్మర్లకు ఆర్డరిచ్చుట :

డా॥ గోపాలరెడ్డి గారు ఒకవైపు భూమి అభివృద్ధి పనులు జరుగుచుండగానే 'వోల్టాస్ కంపెనీ' వారిని సంప్రదించినారు. లిఫ్టు కొరకు కావలసిన మోటార్లకు ట్రాన్స్‌పార్మర్లకు, తదితర పరికరములకు వ్యాపార నియమములను మాట్లాడి ఆర్డరు యిచ్చినారు. అందుకు గాను నామమాత్రపు అడ్వాన్సును యిచ్చి మిగతా ధనమునకు సామాగ్రి అంతా చేరిన పిదప బ్యాంకువారే చెల్లించెదరని తెలియబరచి మోటార్లను మిగతా సామాగ్రినంతా నిర్మాణ స్థలమునకు చేర్చుట జరిగినది.

వోల్టాస్ కంపెని వారికి ఆర్డరు యిచ్చి, నామమాత్రపు అడ్వాన్సు చెల్లించిన పిదప 20% మేరకు ధరలు పెరిగినవి. అపుడాకంపెనీవారు పెరిగిన ధరలు చెల్లించాలని పేచీ పెట్టినారు. మన రెడ్డి గారు అది కుదరదు, మీరిచ్చిన మాటలకే కట్టుబడి యుండాలని కోరినారు. ప్రాజెక్టు ఎస్టిమేట్స్‌లో ధరలను కూడా చేర్చి ఆ మేరకు ఎంత ధనమవసరమో దానికి అనుమతిని బోర్డు నుండి పొందియున్నారు. ధరలు మారిన యెడల మాపని అంతయు మొదటికి వచ్చునని వాదించినారు రెడ్డి గారు. కాని కార్యాన్ని విజయవంతముగా సాధించాలని, ఈ విషయమును లేఖ ద్వారా శ్రీమాతకు నివేదించుట జరిగినది. శ్రీమాత తన ఆశీస్సులతో లేఖను పంపించినది. ఆ తల్లి అనుగ్రహము కంపెనీవారి కందినట్లున్నది గాబోలు ! మరునాడు ఉదయమే డాక్టరు గారికి కంపెని వారు లేఖను పంపించారు. దానిలో నెరిగినట్టి క్రొత్త ధరలు మీకు వర్తించవు, పాతరేట్లకే మీకు సామాగ్రి యిచ్చెదమని విషదపరచినారు. కావున ఈ సంకటము తొలగిపోయినది.

ఆ తర్వాత పనిగా - విద్యుచ్ఛక్తి మరియు సిమెంటు కొరకు నియమ నిబంధనల ననుసరించి అభ్యర్థించుట జరిగినది. దానికి అంగీకారమును కూడా పొందినారు.

డా॥ గోపాలరెడ్డి గారు అన్నిటి వలెనే ఇండియన్ హ్యూం కంపెనీ వారికి పైపుల కొరకు అడ్వాన్సుగా కొంత ధనమిచ్చి, ఆర్డరు యిచ్చినారు. వారు ఆర్డరు యిచ్చిన వారం రోజులకే ధరలు 20-25% పెరిగినా పాత ధరకే పైపులను యిచ్చెద మన్నారు.

రైతులకు భూమిపై టెనెన్సీ హక్కులు కల్గించుట :

రైతులు బ్యాంక్ అప్పు కొరకు పెట్టిన దరఖాస్తులు అంగీకరింపబడి, వక్యక్తుల పేరు పైననే ధనమును సొసైటి ఖాతాలో జమ చేయబడినవి. ఈ అప్పులను బ్యాంకు వారు వ్యక్తి భూమిని తనఖాపెట్టుకొని యిచ్చినారు. భూమిని తనఖా పెట్టవలయు నంటే ఆ భూమి అతని పేరున పట్టావుండాలి కాని అట్లు గాక తాతల పేరుపైననో, తండ్రుల పేరుపైననో వున్న దానిని తమ పేరులపై మార్పించుకొనలేదు. ఈ మార్పులు చేయించుటకు రైతులు స్టాంప్ డ్యూటి కట్టాలన్నారు. దానికి చాలా ధనమవసర మగును. బ్యాంకు వారిచ్చిన అప్పులో సగభాగము దీని కొరకే ఖర్చగును కావున రైతుల స్వంతపనికి కాకుండా కమ్యూనిటి ప్రయోజనమున కుద్దేశించబడినది. కావున రైతులకు స్టాంపు డ్యూటి నుండి మినహాయింపును కోరుచు జిల్లా కలెక్టరు గారికి విన్నవించుకొనగా, వారు కుదరదు పొమ్మన్నారు. అప్పుడు మన రెడ్డి గారు శ్రీమాతకు ఈ విషయమును లేఖద్వారా తెలియబరచి, రక్షించాల్సినదిగా కోరినారు. శ్రీమాత అదే వుత్తరంపైన ఆశీస్సులనందించెను. దైవ బలమందిన తోడనే, విషయాన్ని రాష్ట్ర చీఫ్ సెక్రటరీ గారికి విన్నవించుట జరిగినది. పూర్వము మన రెడ్డి గారు 1954-55 సం॥లో వ్యవసాయాధికారిగా ఉద్యోగము చేసినపుడు పరిచయ ముండుట చేత, చనువుగా చెప్పిన విషయమునంతా అవగాహన పరచుకొని, ఈ రైతులకు స్టాంప్ డ్యూటి నుండి మినహాయింపు నిచ్చినారు. దీనితో రైతులకందరకు టెనెన్సీ హక్కులు తమ భూములపై సంక్రమించినవి. దీనిని సాధించుట ఘనకార్యమే అయినది. ఇది శ్రీమాత అనుగ్రహము వలననే సిద్ధించినది.

గడ్డిపల్లి రైతాంగము సమతలమైన భూమిలో వేరుశనగను విత్తినారు. మన రెడ్డి గారు పై సమస్యను పరిష్కరించుటకై తలమునకలగుచు పట్నంలోనే వున్నారు. వారు తిరిగి రాగానే వందల ఎకరాలలో వేయబడిన వేరుశనగ పైరుకు నీరు కావాలన్నారు. అదెట్లు సాధ్యము - విద్యుచ్ఛక్తి లేదు, స్తంభాలు లేవు, వైరు లేదు, పైపులైనులు వేయబడలేదు. నీటిని తోడుటకు మోటార్లు, సరఫరాకు కాలువలు లేవు ఎట్లా ? అని తలపట్టుకున్నారందరు. రైతాంగమంతా శ్రీమాతను దీనముగా ప్రార్థించి నీరందించు తల్లీ యని వేడుకున్నారు. వారు ధైర్యముగానే యున్నారు. 'అమ్మ' అనుగ్రహంతో అన్నీ సాధింపబడినట్లే, ఇది కూడా సఫలము కాగలదని, దృఢ విశ్వాసముతో నున్నారు. రైతులంతా ముక్తకంఠంతో విద్యుచ్ఛక్తి, మోటార్లు, పైపు లైనులు, నీటి కాలువలు అన్ని సౌకర్యవంతంగా శ్రీమాత అనుగ్రహమువలన 20-30 రోజులలో సిద్ధించగలవని ధైర్యంగా అన్నారు. ఆ రైతుల ముఖములలో సందేహమన్న చిహ్నములే కానరాలేదు. ఇంతటి విశ్వాసముతో నున్న వారిని నిరుత్సాహపరచుట కూడదని, 'సావిత్రి'లోని దిగువ వాక్యము "Attempt is the charm of life not victory" గుర్తుకు వచ్చుటతో రెడ్డి గారిలో ధైర్యము స్థిరపడినది. కార్యారంభమునకు సంసిద్ధులైనారు.

★★★

గడ్డిపల్లి లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టునకు విద్యుచ్ఛక్తిని సాధించు ప్రయత్నములు

రైతుల మనోధైర్యము, డా॥ గోపాలరెడ్డి గారికి ఎనలేని శక్తిని ప్రసాదించగా, మారుమాటాడకుండా శ్రీమాతను ప్రార్థించి, భూమిని చదును చేయుట, శనగ పంట వేయుట మొదలగు విషయములను విషదపరచుచు సుదీర్ఘమైన లేఖను శ్రీమాత సన్నిధికి వ్రాసినారు. తక్షణ కర్తవ్యముగా వందలాది ఎకరములలో వేసిన శనగ పంట రక్షింపబడాలి ! కావున కర్తవ్యమును సూచించి రైతులను కాపాడవలసినదిగా శ్రీమాత నర్థించారు.

ఈ కార్యమున కవసరమగు పరికరాల కొరకు మోటార్లు ట్రాన్స్‌పార్మరులు, పైపులు, యింకను తదితరములకు ఆర్డరు యిచ్చాము కాని, వారికి ధనము మాత్రము చెల్లించలేదు. ఆయా కంపెనీల నుండి యంత్ర పరికరాలు పొందుటకు నూరుమంది రైతులు తమ భూములను తనఖా పెట్టవలసి యుండుగా ఆ సంఖ్య పూర్తి కాలేదు. చాలా మంది రైతులలో ఇంకా సందేహమే యున్నట్లున్నది. ఇప్పుడేం చెయ్యాలి ? మానవ మనస్సుకు యిది సాధ్యము కాదు. కావున మన రెడ్డిగారు దివ్యమాత సన్నిధికి లేఖను వ్రాసి ఆ సంఖ్యను 100 వరకు చేయమని వేడుకొనెను. వెంటనే శ్రీమాత నుండి ఆశీస్సులందినవి. ఆనాటి నుండే రైతులు తమ భూములను తనఖా పెట్టుటకు తరలినారు. సంబంధిత అధికార గణము సత్వరముగా సహకరించినది. కార్యము నిరాటంకముగా సాగినది. రైతుల సంఖ్య వందకు మించినది. బ్యాంక అధికారగణము కూడా తగురీతిగా స్పందించినది. సంబంధిత సంస్థలకు ధనము విడుదల చేసినది. మోటార్లు, ట్రాన్స్‌పార్మర్లు, పైపులు కావలసిన సంఖ్యలో కొనబోవుటకు అనుమతించినవి. వీనినన్నిటిని ఆ ప్రదేశమునకు చేర్చి మాత్రము ప్రయోజనమేమున్నది ? అసలైన కరంటు అక్కడ లేదు కదా ! సమీపము నుండి తెచ్చుకుందామన్నా సాధ్యమగునట్లు లేదు. ఇక్కడి నుండి 30 కి.మీ. దూరము నుండి ట్రాన్స్‌పార్మర్ లైను వేయాలి.

విద్యుచ్ఛక్తి అధికారగణము స్పందన :

డా॥ గోపాలరెడ్డి గారు విద్యుచ్ఛక్తి సాధనకై సంబంధిత అధికారి

సూపరింటెండెంట్ ఇంజనీరు గారిని కల్సి గడ్డిపల్లి ప్రాజెక్టుకు విద్యుచ్ఛక్తిని అర్థించగా, మూడు మాసములు పడుతుంది, అంతకన్న తొందరగా అగుట అసాధ్యమన్నారు.

విద్యుచ్ఛక్తి బోర్డు చైర్మన్ గారిని ఆహ్వానించుట :

డా॥ గోపాలరెడ్డి గారు పై అధికారి అభిప్రాయమునకు చింతించి, ఒక నెల లోపు పనిపూర్తి అయ్యి నీరురాని యెడల వేరుశనగ పంట వృధాకాగలదు. రైతులందు విశ్వాసము సన్నగిల్లును; అని ఊరుకొనకుండా, తన ప్రయత్నములో ముందుకు సాగుటకే నిశ్చయించుకొని, సంబంధిత 'అసిస్టెంటు ఇంజనీరు' గారిని ఒక వారము దినములలో కరంటు కావాలని కోరగా - విద్యుచ్ఛక్తి బోర్డు చైర్మన్ గారు మీ ప్రతిపాదనలను ఇంతవరకు మంజూరి చేయలేదని తెలిపినారు. దీనికగు వ్యయము 15 లక్షల రూపాయలు. కావున ప్రభుత్వమే ప్రత్యేకముగా మంజూరి యివ్వవలసి యుంటుందన్నారు. బోర్డువారు ఏ ప్రాజెక్టుకైనా, 10-12 లక్షల రూపాయల విలువ మేరకే మంజూరి యివ్వగలదు. అది మించినచో ప్రభుత్వమే అనుమతించాల్సి యుండును. ఈ వ్యవహారమును శ్రీమాత తప్ప మరెవ్వరి వలన పరిష్కరించబడదని నిర్ణయించుకొని వారు తల్లిగారికి పరిస్థితి నంతా వివరించి, అధికార గణముతో మాట్లాడి, మాకు విద్యుత్తు, నీరు అందునట్లు అనుగ్రహించుము మాతా ! అని లేఖ వ్రాసినారు. ఆ తర్వాత వారు హైద్రాబాద్ చేరి బోర్డు చైర్మన్ గారిని, శ్రీమాతను ప్రార్థించుచు కలిసి విషయమును వివరించి, "మహాత్మాగాంధి జన్మదినము" అక్టోబర్ 2వ తేదీన గడ్డిపల్లిలోని "మహాత్మాగాంధి లిప్టు ఇరిగేషన్ ప్రాజెక్టు"నకు ప్రారంభోత్సవము మీ చేతుల మీదుగా జరగాలని అర్థించారు. మేము పెట్టుకున్న పేరు, అక్టోబర్ 2వ తేది, పరస్పరముగా సంబంధము కల్గియున్నందున మీరే అరుదెంచి ప్రారంభించిన మా అదృష్టముగా భావించెదమని విన్నవించారు. శ్రీమాతకు మా మొర ఫలించినది. చైర్మన్ గారు ఆనందంగా అంగీకరించారు. ఆ వెనువెంటనే సూపరింటెండెంట్ ఇంజనీరు గార్కి మా ప్రతిపాదనలను మంజూరి యిచ్చి, అక్టోబర్ 2వ తేదీలోపు విద్యుత్ కనెక్షన్ పనులను పూర్తి చేయమని ఆదేశించారు. అంతే, వారేవిధమయిన ఎంక్వయిరీ చేయలేదు. దీని బడ్జెట్ ఎంత అనిగాని ? ఎవరి పరిధిలోకి వస్తుందని గాని విచారించకుండా ఆదేశము లిచ్చినారు. ఇదెట్లు సంభవము ? శ్రీమాత అనుగ్రహము కాదా ! ఆరంభము నుండి గడ్డిపల్లి ప్రాజెక్టు పనులన్ని ఆ తల్లిగారి సంపూర్ణ అనుగ్రహముతోనే నడచుచున్నవి కదా !

మన గోపాలరెడ్డిగారు తక్షణమే హెడ్ క్వార్టర్‌లో గల సూపరింటెండెంట్ ఇంజనీరు గారిని కల్సినారు. ఆ ఇంజనీరుగారు సరళస్వభావము గలవారు. విషయమును విని వెంటనే స్పందించినారు. వరంగల్‌లో వుండే సూపరింటెండెంట్ ఇంజనీరు గారికి ఫోనులో "గడ్డిపల్లి లిప్టు ఇరిగేషన్ ప్రాజెక్టు వారికి విద్యుత్ కనెక్షన్ కొరకు కావల్సిన యేర్పాట్లన్నీ చూచి మొదట వారి పని పూర్తి చేయాలి. ఏ విధమైన ప్రశ్నలు వేయకుండా, అడ్డంకులు పెట్టకుండా పని జరగాలని సూచించినారు. తక్షణమే వరంగల్ వెళ్లి వారిని కలువ వలసినదిగా ఆదేశించారు". వరంగల్ లోని ఇంజనీరు గారు మాబావ గారికి సన్నిహిత మిత్రులు. ఇది కూడా అదృష్టమే యని భావించి, బావ గారిని తోడ్కొని వరంగల్ చేరినాము. సూపరింటెండెంట్ ఇంజనీరు గారిని కల్సి విషయమును వివరించి, వీలైనంత తక్కువ సమయంలోనే మాకు కనెక్షన్ యిప్పించ వలసినదిగా కోరినాము. ఆ అధికారి ఆరంభంలో తాము ఎదుర్కొంటున్న కష్టములను, ఒత్తిడులను వల్లించి, చివరకు సంబంధిత 'ఎక్జిక్యూటివ్ ఇంజనీరు' గారికి "మన డివిజన్‌లో ఎక్కడెక్కడ ఎంత సామాగ్రియున్నదో చూచి వాని నన్నింటిని తెప్పించి గడ్డిపల్లి ప్రాజెక్టు పనికి అందించాల్సినది"గా ఆదేశించినారు.

విద్యుచ్ఛక్తి సాధనలో రైతాంగము సహకరించుట :

గోపాలరెడ్డి గారు తమ పని సత్వరమే పూర్తి చేయబడుటకు తమ సహకారాన్ని కూడా డిపార్టుమెంటు వారికిందించెదమని చెప్పినారు. వివిధ ప్రదేశాలందున్న మెటీరియల్‌ను గడ్డిపల్లి చేర్చుట కొరకు 3 లారీలను ఖరీదు చేసినారు. రవాణా సాధనములు మన స్వాధీనములో నున్నచో ఎంత పనినైనా చేయవచ్చును. డిపార్టు మెంట్ వారు ఇచ్చే పోల్స్‌ను, ట్రాన్స్‌పార్మర్లను, వైరును, మనుష్యులను కూడా గడ్డిపల్లి చేర్చుటకు, అవి ఎక్కడున్నా సరే నల్లగొండ నుండైనా, వరంగల్ నుండైనా, ఖమ్మం నుండైనా మూడు రోజులలో సూర్యాపేటకు చేర్చాలని నిర్ణయించుకున్నారు. సూర్యాపేట నుండి గడ్డిపల్లికి రోడ్డు లేనందున సామానులను లారీల ద్వారా తరలించుటకు వీలు పడదు.

శ్రీ గోపాలరెడ్డి గారు గడ్డిపల్లి చేరి, రైతులనందరిని సమావేశ పరచి, యింతవరకు జరిగిన పని వివరములను వారికి తెలియపరచినారు. సూర్యాపేట వరకు లారీలలో చేరిన సరుకును గడ్డిపల్లి వరకు తీసుకు వచ్చుటకు రైతన్నల బాధ్యతగా

తెలిపినపుడు అందరు ఆమోదించారు. ఒక్కొక్క బండికి 6గురు రైతులు, పారలు, గడ్డపారలతో రావాల్సినదిగా సూచన చేసినారు. సూర్యాపేట నుండి ఎలక్ట్రిక్ స్తంభాలను నిర్ణీత స్థలమునకు 30 కి.మీ. మేర చేర్చాలి. వానిని నిలబెట్టుటకు గుంతలు త్రవ్వాలి. స్తంభాలను నిలబెట్టాలి. ఈ పని కొరకు 50-60 మంది హెల్పర్లను డిపార్టుమెంటు వారి నుండి తీసుకున్నారు. స్తంభాలను నిలబెట్టుటలో వారికి నైపుణ్యముంటుంది. వారికి తోడుగా 2000 మంది రైతులను యేర్పాటు చేసినారు. ఈ విధముగా పని జరుగుటతో 30 కి.మీ దూరం స్తంభాలను నిలుపు పని 2 దినములలోనే పూర్తి చేయగలిగినారు. ఇదొక అద్భుత మహిమగా అందరు, ముఖ్యముగా డిపార్టుమెంటు వారు తలచినారు. వారి సంఘీభావము నందరు కొనియాడారు.

★ ★ ★

గడ్డిపల్లి ప్రాజెక్టు భూములకు నీటి సరఫరా ప్రయత్నములు

పైపులను తరలించుట :

లిఫ్టు మోటార్లు కాలువ నుండి తోడిన నీటిని సరఫరా చేయుటకు భారీ పైపులను, ఇండియన్ హ్యూమ్ కంపెనీ నుండి కొనుగోలు చేయుట జరిగినది. ఇక వానిని హైద్రాబాదు నుండి గడ్డిపల్లికి తీసుకరావాల్సియున్నది. సూర్యాపేట వరకు జాతీయ రహదారి పైన రాగలవు. అచటి నుండి గడ్డిపల్లి 25 కి.మీ. మేర రోడ్డు లేదు. కావున లారీలో సాధ్యం కాదు. మరొక ప్రత్యామ్నాయము మిర్యాలగూడ నుండి గరిడేపల్లి అచటి నుండి గడ్డిపల్లి 8 కి.మీ. దూరములో నున్నది. కాని ఈ 8 కి.మీ. పక్కా రోడ్డు లేదు. ఇది కూడా అసాధ్యమనిపించును. అయితే మరేది మార్గము ? ఈ 8 కి.మీ. దారిలో 3-4 చోట్లు దారి పూర్తిగా దెబ్బతిన్నది. దానిని బాగుచేసినచో సాధ్యము కాగలదు. నాగార్జున సాగర్ కాలువ పనుల కొరకు సమీపంలో నున్న క్యాంపు నుండి 'స్క్రిప్పర్' నొక దానిని ఆదివారం నాడు కిరాయికి తీసుకవచ్చి రోడ్డు మరమ్మతు చేయవచ్చును. డా॥ గోపాలరెడ్డి గారు సంబంధిత 'అసిస్టెంట్ ఇంజనీరు' గారిని, ఆదివారం నాడు 3-4 గంటల కొరకు కిరాయకు యివ్వాల్సిందిగా కోరినారు. కాని ఇంజనులు పని చేయుట లేదని బదులిచ్చినారు. శ్రీ రామకృష్ణారెడ్డి గారు ముందుకు వచ్చి మరొకమారు ప్రయత్నించుదామని కోరినా వారు వినలేదు. ఈ మధ్యలో ఒక హెల్పర్ కుర్రవాడు, అనాలోచితముగా ఒక స్క్రిప్పర్ పైకి ఎక్కి ఆబోల్టు, ఈ నట్లు ఏమీ ఆలోచన లేకుండా త్రిప్పినట్టున్నది. అకస్మాత్తుగా ఆ యంత్రము స్టార్ట్ అయ్యినది. ఈ అయాచిత కర్మ వల్ల అందరకు ఆనందము కల్గినది. డ్రైవర్లు అంగీకరించారు. ఆ భారీ యంత్రముతో 3-4 గంటలలో రోడ్డును మరమ్మతు చేసినారు. హైదరాబాదు నుండి గడ్డిపల్లికి 2 రోజులలో సునాయాసముగా పైపులు చేరినవి. రైతులంతా భూమిని త్రవ్వి పైపులను భూమి లోపల అమర్చినారు.

సాగునీటి కాలువల నిర్మాణము :

అతి తక్కువ కాలములో కావలసిన పైపులు చేరినవి. వెంటవెంటనే పైపు లైన్లను కూడా పూర్తి చేసినారు. కాని కాలువలు లేవు. వేసిన పంటను దక్కించు కోవాలంటే 12-13 కి.మీ. పొడవున కాలువ నిర్మాణం కావాలి. చేతి కష్టంతో తక్కువ కాలంలో పని జరగదు. కావున యంత్రము సహాయముతోనే అది పూర్తి

యగును. బుల్డోజర్‌తో కాలువ నిర్మాణమునకై తలపెట్టినాము. డ్రైవర్లు వ్యతిరేకించారు. మా బంధువు అయిన శ్రీ రామకృష్ణారెడ్డి కలుగచేసుకొని ప్రయత్నించెదము. తప్పక కార్యము పూర్తి కాగలదని ధైర్యము నిచ్చుటతో శ్రీమాతను ప్రార్థించి కార్యాన్ని చేపట్టినారు. ఆ సమయంలో భూమినభివృద్ధి పరచుటకు 20 బుల్డోజర్లు పని చేయుచున్నవి. ఒక్క పెట్టున వాని నన్నింటిని కాలువ పనిపై పెట్టినారు. 12-13 కి.మీ. పొడవు కాలువ నిర్మాణము జరిగినది. ఈ విధముగా శ్రీమాత అనుగ్రహముతో రైతాంగము యొక్క శ్రమ ఫలించి, వేరుశనగ పంట సంరక్షించబడినది.

సాగర్ నీటిని లిఫ్టు ద్వారా సాగునకు విడుదల - ప్రారంభోత్సవము :

శ్రీమాత అనుగ్రహము వలన గడ్డిపల్లి సొసైటి రైతాంగము, దివారాత్రములు ఏకం చేసి, నిర్విరామముగ ఒక పని వెంట మరొకటి నిర్వహించుచు మిక్కిలి శ్రమ కోర్చి నిర్మించుకున్న లిఫ్టులు, కాలువలు సంసిద్ధమై కృష్ణమ్మను ఎప్పుడు విడుదల చేయుదురన్నట్లు నిరీక్షించు రైతులకు ఆ సమయం చేరువైనది. నీటి విడుదలకు డా॥ ఓ. పుల్లారెడ్డి, ఆం.ప్ర. వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి గారిని ఆహ్వానించుట జరిగినది. ఈ విశ్వవిద్యాలయములోనే డా॥ గోపాలరెడ్డి గారు అగ్రానమి డిపార్టుమెంట్‌లో అసోసియేట్ ప్రొఫెసరుగా పనిచేయుచు, దీర్ఘకాలిక సెలవుపై వచ్చి గడ్డిపల్లి ప్రాజెక్టు పనిని చేపట్టినారు. ఈ మహాయజ్ఞములో ఈ సంస్థ కూడా ప్రముఖ పాత్రనే పోషించినది. ఆధునిక గ్రామీణ భారత నిర్మాణమునకు ఆదర్శంగా పని చేయుచున్న ఆం.ప్ర. వ్యవసాయ విశ్వవిద్యాలయ 'ఉపకులపతి' తోపాటు, రిజిస్ట్రార్ గారిని డీన్ లను కూడా ఆహ్వానించి, గడ్డిపల్లి సొసైటీని, ప్రజలను వారు ఆశీర్వదించుటకు వేడుకొనుట జరిగినది. ఆచార్యవర్గము వారికందరకు ప్రియమైన వాడు అయినందున డా॥ గోపాలరెడ్డి గారి ఆహ్వానమునకు ఆనందంగా అంగీకరించినారు.

నీటి విడుదల ప్రారంభోత్సవమునకు ప్రస్తుతమునకు 200 హెచ్.పి. గల ఒక మోటారును బిగించి, పైపు లైనుకు కనెక్షన్ యివ్వ బడినది. ప్రస్తుతమునకు దీని ద్వారానే నీటిని విడుదల చేయాలి. వైస్ ఛాన్సలర్ వెంట డా॥ కృష్ణమోహన్, పరిశోధనా డైరెక్టర్ డా॥ మోహతా, అగ్రికల్చర్ ఫ్యాకల్టీ డీన్, మరియు డా॥ వెంకటరెడ్డి రీజినల్ కాలేజ్ ఆఫ్ యూనివర్సిటీ గారలు వచ్చినారు.

వీరందరు విశ్రాంతి తీసుకొనుటకు తాటికమ్మలతో నిర్మించిన గుడిసెలను తాత్కాలికముగా ఏర్పాటు చేసినారు. ప్రారంభోత్సవము సా॥ 3-00 గంటలకు

ఏర్పాటైనది ఆ బహిరంగ సభ. దానికి అనేక మంది రైతులు హాజరైనారు. తర్వాత సశాస్త్రీయముగా అక్కడ జరుగుచున్న పనులకు తిలకించిన ఉపకులపతి గారు మహదానంద భరితులయ్యారు. ఆ పనులేవనగా శాస్త్రీయముగా భూమిని చదును చేయుట, సమ ఆకృతిలో గట్టు నిర్మించుట, రోడ్ల నిర్మాణము పంట కాలువల నిర్మాణము, చదును చేసిన భూమిలో గల పచ్చని వేరుశనగపైరు, మరొకవైపు పైపులు వేయుటకొరకు భూమిని త్రవ్వుట, ప్రతి పని వద్ద జనము ఏకాగ్రతతో తమ తమ కార్యములందు నిమగ్నులగుటను చూచి, ఈ ప్రాజెక్టు పనులను నిర్వహించుచున్న వ్యక్తి నూతనవ్యవస్థను ఆవిష్కరించు 'మార్గన్వేషి' (path finder) ధన్యుడని కొనియాడినారు. వారితో వచ్చిన వారంతా గోపాలరెడ్డి గారిని శ్లాఘించినారు. ఆం.ప్ర. వ్యవసాయ విద్యాలయమునకు చెందిన తమలో ఒక్కడు అయిన డాక్టరు రెడ్డి ఇంతటి మహాయజ్ఞమును నిర్వర్తించు చున్నందుకు, తమకు, తమ విశ్వవిద్యాలయమునకు గర్వకారణము. రైతుల సంక్షేమమునకు ప్రభుత్వము వారు యిట్టి ప్రాజెక్టుకు ప్రోత్సాహము నందించుట చాలా అవసరము. ఇది ఆదర్శప్రాయమైనదిగా వారు పేర్కొన్నారు.

ఉపకులపతి గారు అమర్చబడిన మోటారు స్విచ్ ఆన్ చేసిన వెంటనే ఆ కృష్ణమ్మ తల్లి గలగలా రవముతో ప్రవహించి తన గమ్యస్థానమైన చేలమధ్యకు చేరుకున్నది. ఏండ్ల తరబడి ఎదిరిచూచు రైతాంగము యొక్క హృదయములు ఆనందోత్సాహములతో ఉప్పొంగినవి. ప్రారంభోత్సవము పిమ్మట బహిరంగ సభ జయప్రదముగా ముగిసినది. అతిథులను ఆదరపూర్వకంగా సన్మానించి సాగనంపుటకు ముందు వారు జ్ఞానధనులు, కావున గడ్డిపల్లి ప్రాజెక్టు రైతాంగమునకు శుభములు చేకూరాలని ప్రార్థించి ఆశీర్వదించినారు.

కాలువల నిర్మాణము :

మొదటి లిఫ్టులో 5 మోటార్లు పనిచేయాల్సి యుండగా ఒక దానినే అమర్చి ప్రారంభం చేయుట జరిగినది. మిగతా నాలుగు మోటార్లనమర్చి, వానిని పైపు లైన్లకు సంధాన పరచుట కన్న కాలువలకు మట్టిపోసి గట్టును నిర్మించినచో సులభమగునని తలచి వారు సమీపములో గల NSP క్యాంపు సూపరింటెండెంట్ ఇంజనీరు గారిని ఆదివారములందు అద్దెకు 2 బుల్డోజర్లు, 2 స్క్రాపర్‌లను కాలువల నిర్మాణమునకు కోరినారు. రోజువారి అద్దె పద్ధతిపై వీరికి కోరినవి యివ్వవలసినదిగా

ఒక లేఖను క్యాంపు అధికారికివ్వమని తెల్పినారు. ఆ ప్రకారముగా రెండు బండ్లు, ఒక బుల్డోజరు, ఒక స్క్రేపర్ లభ్యమైనవి. ఇద్దరు డ్రైవర్లు, యిద్దరు క్లీనర్లకు పూర్వము వలెనే ఒక రోజు పనికి ఒక నెల వేతనము నిచ్చుటకై యేర్పాటు కుదిరినది. అదియును గాక ఒక్కొక్క ట్రిప్పునకు ఒక రూ॥ చొప్పున ప్రోత్సాహకరమును గూడా ప్రకటించి శనివారం రాత్రి, ఆదివారం పగలు రాత్రి పని జరిగినది. వారికి శక్తిని ప్రసాదించమని శ్రీమాత నర్థించాము. ఈ విధముగా వారి ద్వారా 10 అంతల పని జరిగినది. డ్రైవర్లకు అదనంగా రెండు నెలల వేతనములు దొరికినవి. ఈ పనికి అంచనా వేయబడిన ధనములో కేవలము 1/5 వంతు మాత్రమే ఖర్చు వచ్చినది.

శ్రీమాత మహిమాద్భుతము :

దైవ కార్యములాగా జరుగుచున్న ఇచటి పని యందు ఒక సంఘటన జరిగినది. అదేమనగా రెండు బండ్ల డ్రైవర్లు పోటి పడుచున్నట్లు, త్వరితగతిగా పని చేయుచున్నారు. ప్రతి ట్రిప్పునకు 1 రూ. ప్రోత్సాహకము పనిని తొందర పెడుచున్నది. కావున చాలా వేగముగా పోవుచున్న స్క్రేపర్ బండి, డ్రైవరు ఎదురు గడ్డనెక్కించుటలో బండి బోల్తా పడినది. మూడు పొర్లుపొర్లి తిరిగి యదా ప్రకారము మంచి స్థితిలోనే నిలబడి పోయినది. ఆ డ్రైవరుకు గాని, బండికి గాని ఏ ప్రమాదము, హాని జరుగలేదు. ఈ విధంగా పడినపుడు బండికి, మనిషికి యిర్వురికి ప్రమాదము జరుగును. కాని ఏ చిన్న దెబ్బగాని, గాయము గాని జరుగలేదు. ఆ దైవము శ్రీమాత, గడ్డిపల్లి ప్రాజెక్టు రైతాంగముపై ఎంతటి కరుణను కల్గియున్నదో ఈ సంఘటన ప్రత్యక్ష నిదర్శనముగా నిలిచినది. రైతులంతా శ్రీమాతను మనసారా వేడుకొని తమ కృతజ్ఞతలను ప్రకటించుకున్నారు. ఊహకందని సంరక్షణను శ్రీమాత వారికి వర్తింప చేయుట ప్రధానమైనది.

జగన్మాత సంపూర్ణ అనుగ్రహంతో ఒక నెలకు 5-6 దినములు, (ఆదివారము లందు మాత్రమే) పనిచేసి, నాల్గు మాసముల కాలములో 22-23 దినములు కాలువ నిర్మాణము కట్టలను పూర్తి చేయుట జరిగినది. ఈ పని పూర్తి చేయబడిన సమాచారమును అందుకొన్న అధికారులు సూపరింటెండెంట్ ఇంజనీరు, తదితర అధికార గణము ఇంతటి భారీపనిని అనతికాలములో ఎట్లు చేసినారో చూడాలను కుతూహలముతో ఆ స్థలమున కరుదెంచి, అందరకందరు ఆశ్చర్యపోయినారు. ఈ పనిని 22-23 దినములలో చేసిన పనిని డిపార్టుమెంటు వారు 4 స్క్రేపర్లతో చేసిన యెడల 6 మాసముల కాలము పట్టెడిది.

తర్వాత కాలములో 300 హెచ్.పి. మోటారును రెండవ లిఫ్టుకు 516 లెవల్ వద్ద అమర్చబడి 2500 ఎకరముల సాగు కొరకు నిర్దేశించబడినది. మొదటి లిఫ్టు వలన 1000 ఎకరములు మాత్రమే నీరు పారును. ఈ స్థితిని బ్యాంకు వారికి తెలియ బరచి మరి కొంత ధనమును విడుదల చేయవలసినదిగా కోరుట జరిగినది. అప్పుడు బ్యాంకు వారు సకాలములో స్పందించి నందున మరొక పైపులైను 800 మీ. నిడివి గలదానిని 300 హెచ్.పి. గల మోటారునకు కనెక్షన్ యిచ్చుటతో 500 ఎకరాల సాగుకు మరియు లింగాల, గడ్డిపల్లి చెరువులకు నీరందించుట సాధ్యమైనది. అయినా అనుకున్నంత ప్రదేశమునకు నీరందలేదు. దీనికి కారణం విద్యుచ్ఛక్తి కొరత రోజుకు 20 గంటలు కరెంటు అందినచో అది సాధ్యము కాగలదు. కాని వారికి కేవలము 8-10 గంటల కాలమే కరెంటు అందుచుండెను. అనుకున్న లక్ష్యము నెరవేరబడలేదు. భవిష్యత్తులో రాష్ట్రమునందు విద్యుచ్ఛక్తి ఉత్పత్తి పెరిగినపుడు ఈ సమస్యకు పరిష్కారము లభించగలదు.

★ ★ ★

మహాత్మాగాంధి లిఫ్టు ఇరిగేషన్ కాంప్రహెన్సివ్, ఇంటిగ్రేటెడ్ సహకార సొసైటి, గడ్డిపల్లి - ఆవిష్కరణ

గడ్డిపల్లి గ్రామ ప్రజలు మరియు పరిసర గ్రామముల ప్రజలు అంతా కల్సి డా॥ గోపాలరెడ్డి గారి నాయకత్వములో (2-10-1969) జాతిపిత మహాత్మాగాంధి జయంతి నాడు గడ్డిపల్లి భాగ్యోదయమునకు **"మహాత్మాగాంధి లిఫ్టు ఇరిగేషన్ కాంప్రహెన్సివ్, ఇంటిగ్రేటెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్ – గడ్డిపల్లి"** అను అపూర్వ సంస్థను స్థాపించు కొనుట జరిగినది. ప్రజల ఐకమత్యమే ఈ సంఘమునకు బలము. ఇక సంఘీభావమే వారి గమనం, గమ్యం కూడాను. ఈ సంఘీభావమే అక్కడ విప్లవాత్మక నూతన ప్రపంచమును ఆవిష్కరించినది. ఈ విప్లవమునకు అధినేత్రి శ్రీమాత. ఆ మహనీయురాలు, ముందుకాలంలో యిక్కడ చోటు చేసుకునే చైతన్యపూరిత పరిణామమునకు నేతృత్వము వహించనున్నది. ఆ దివ్యమూర్తికి శ్రద్ధాభక్తులతో ఉన్మీలురమైన చాలును; అను విశ్వాసముతో సంఘటితమైన ఆ ప్రజల యందు సౌభ్రాతృత్వమునకు, మానవ ఐక్యతకు, విశ్వప్రేమకు అంకురార్పణ జరిగినది.

ఈ సహకార సంఘము కార్యకలాపాలను కొనసాగించుటకు కావలసిన కార్యవర్గమును ఏర్పాటు చేసికొని దానికి అధ్యక్షులుగా డా॥ గోపాలరెడ్డి గారిని నియమించు కొన్నారు. ఆనాటి నుండి అనగా 1969 నుండి 1973 వరకు వారు ఆ పదవిలో వుండి సహకార సొసైటి ప్రాథమిక కార్యసరళిని చక్కబెట్టినారు.

ఈ సంస్థ నిర్వహించు పనులు :

1. గడ్డిపల్లికి సమీపములో ప్రవహించుచున్న నాగార్జున సాగర్ ఎడమ కాలువ నుండి నీటిని ఎత్తిపోతల ద్వారా, నల్గొండ జిల్లాలోని గడ్డిపల్లి, దాని పరిసర 7 గ్రామాలందు విస్తరించియున్న 6,600 ఎకరముల భూమికి, సాగునీటిని సరఫరా చేయుట.
2. సువిశాలమైన ఈ భూమి, ఎత్తు పల్లములుగా వుండుట వలన దానిని శాస్త్రీయంగా చదును పరచి అభివృద్ధి చేయుట.
3. చేల మధ్య రోడ్ల నిర్మాణము, డ్రైనేజి వసతి నిర్మాణములు చేయుట.
4. అనాదిగా సాంప్రదాయ పద్ధతిలో సాగు చేయుటకు అలవాటు పడిన రైతులకు, నూతనమైన సాంకేతిక పద్ధతులందు శిక్షణ నొసగి, అధిక దిగుబడికి అవకాశము కల్పించుట.

5. వరిధాన్యము, వేరు శనగ, ప్రత్తి, పప్పు ధాన్యములు, జొన్న పంటలకు మెరుగైన పద్ధతిలో పరిరక్షణతో బాటు, వ్యవసాయానికి సంబంధించిన పరిజ్ఞానాన్ని, పరికరాలను, ట్రాక్టర్లను తదితరాలను సమకూర్చుట.
6. పండించిన పంటలను నిలువ చేయుటకు గోదాముల నిర్మాణము చేయుట.
7. మార్కెటు సౌకర్యాలను మెరుగుపరచి, రైతుకు గిట్టుబాటు ధర లభించినపుడే పంటలను విక్రయించుటకు వీలు కల్పించుట.

ప్రముఖుల సందర్శన – ప్రశంసలు :

డా॥ గోపాలరెడ్డి గారి నేతృత్వములో సమర్ధవంతంగా నిర్వహింపబడుచున్న మహాత్మాగాంధి లిఫ్టు ఇరిగేషన్ సొసైటి కార్యకలాపములు విస్తృత ప్రచారము పొందినవి. వారి కృషి వలన పైన పేర్కొన్నపనులు చకచకా అమలు పరచబడినవి. వ్యవసాయ రంగమున అధునాతన పద్ధతులను అమలు పరుచుట మూలమున నూతన విప్లవమే సంభవించింది. అధిక దిగుబడిని సమకూర్చి పెట్టెను.

వ్యవసాయ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు, ఇరిగేషన్ కమీషన్ ఉన్నతాధికారులు, ఫోర్డు ఫౌండేషన్ ప్రతినిధులు, ఐక్యరాజ్యసమితికి చెందిన F.A.O. "ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్" వారి ప్రతినిధులు, 'ప్రపంచ బ్యాంకు' అధికారులు – భారత ప్రభుత్వానికి చెందిన ఉన్నతాధికారులు, ప్రముఖులైన సంఘ సేవకులు, కేంద్ర, రాష్ట్ర, శాసనసభ్యులు సందర్శించినారు. సమగ్ర గ్రామీణాభివృద్ధికి, వ్యవసాయ పరంగా జరుగుచున్న, ఈ అపూర్వ ప్రయోగములను ఈ సంస్థ నిర్వహించు చున్న కార్యకలాపముల ప్రశంసించారు.

డాక్యుమెంటరీ ఫిల్ము రూపకల్పన :

మహాత్మాగాంధి లిఫ్టు ఇరిగేషన్ కో-ఆపరేటివ్ సొసైటి, తమ సభ్యుల సర్వతోముఖాభివృద్ధికి కృషి సలుపుచున్నది. వారియొక్క ఆర్థిక, సాంఘిక, విద్య, సాంస్కృతిక, ఆధ్యాత్మిక అభివృద్ధితోపాటు, ఆరోగ్యపరిరక్షణకై ఆసుపత్రిని విద్యాభివృద్ధికి విద్యాలయమును నెలకొలిపి కృషి చేయుచున్నది.

సొసైటి నిర్వహించుచున్న సమగ్ర గ్రామీణాభివృద్ధి పనులను పరిశీలించి, స్టేటు బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు ఈ ప్రాజెక్టునకు విస్తృత ప్రచారము కలిగించుటకు ఒక 'సాంఘిక డాక్యుమెంటరీ ఫిల్ము'ను రూపొందించినారు. దానికి వారు యిచ్చిన శీర్షిక "Poverty to prosperity" ('పేదరికము నుండి పురోభివృద్ధికి').

ఈ ఫిల్ము ద్వారా ప్రజలు "దారిద్ర్యము నుండి ధన ధాన్య సంపదలను పొందుట"కు చేయాల్సిన పనులు ప్రత్యక్షముగా చూపబడి ప్రజలను చైతన్యవంతులను చేసినది. భారతదేశమంతటా ప్రదర్శింపబడినది. పలువురి ప్రశంసలను పొందినది. భారత రాష్ట్రపతి నుండి బంగారు పథకమును పొందుటయే గాక, ఈ ఫిల్ము అంతర్జాతీయ ప్రదర్శనలకు కూడా ఎన్నిక అయినందున గడ్డిపల్లి గ్రామము, శ్రీ గోపాలరెడ్డి గారి పని, ప్రపంచవ్యాప్తముగా ప్రచారము పొందినది. భావితరాల వారికి ఆదర్శప్రాయముగా నిలిచినది.

గడ్డిపల్లి సొసైటి ఆదర్శము :

గడ్డిపల్లి, దాని పరిసర ఆరు గ్రామాలందు 6,600 ఎకరాలలో కొనసాగు చున్న గ్రామీణ సమగ్రాభివృద్ధి, వికాసములను ప్రత్యక్షముగా తిలకించిన తదితర గ్రామాల ప్రజలు గడ్డిపల్లి పద్ధతిలోనే, 17 నూతన లిఫ్టు ఇరిగేషన్ పథకములను నాగార్జున సాగర్ ఎడమ కాలువపై యేర్పరచుకొని ప్రగతిపథములో పయనించారు. ఈ సొసైటీల క్రింద సాగులోకి వచ్చిన భూమి విస్తీర్ణము 30,000 ఎకరములు; 54 గ్రామాలలోని 9,800 వ్యవసాయ కుటుంబాలు లబ్దిపొందినవి, గ్రామీణ రైతాంగము నకు వరప్రసాదమైన ఈ సొసైటీల మూలమున కలిగిన నూతన వికాసము బహు ప్రయోజనకరమైనది.

పెట్టుబడి వివరములు :

ఈ సొసైటి కొరకు పెట్టుబడిగా సమకూర్చిన ధనము $1^1/_2$ కోట్ల రూపాయిలకు మించినది. ఇందులో ఒక కోటి రూపాయిలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము గ్రాంటుగా యిచ్చినది. State Bank of Hyderabad రైతులకు ఋణ సదుపాయము కల్గించినది. ఈ సందర్భంగా యీ సొసైటీలన్నీ ఆం.ప్ర. ప్రభుత్వమునకు ఋణ సదుపాయము సమకూర్చిన SBH సహృదయతతో అందించిన సహకారమునకు కృతజ్ఞతలను తెలియపరచినవి.

ఆం.ప్ర. ప్రభుత్వముతో సంప్రదింపులు :

వినూత్నమైన ఈ లిఫ్టు ఇరిగేషన్ సొసైటికి సంబంధించిన వివిధ వ్యవహారము లను, అవి ఎదుర్కొంటున్న సమస్యలను, దానికి పరిష్కార మార్గమును డా॥ గోపాలరెడ్డి గారు ఆం.ప్ర. ప్రభుత్వ ఉన్నత స్థాయి అధికారులకు విశదపరచి, సముచిత రీతిలో వారికి సదవగాహనను కలిగించిన ఫలితముగా, లిఫ్టు ఇరిగేషన్ బాధ్యతలను సంపూర్ణముగా ప్రభుత్వము స్వీకరించుటకు అంగీకరించి, G.O.Ms. No. 461, తేది : 7-4-1982 ద్వారా ఉత్తర్వులను విడుదల చేసినది. గడ్డిపల్లి మరియు తదితర 17 సహకార సొసైటీల స్వాధీనంలో గల భూములన్నిటికి, ఇట నుండి ప్రభుత్వము వారే సాగునీటిని సరఫరా చేయుటకును, ఈ సొసైటీలలో భూవసతి కల్గియున్న రైతాంగమును, నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు చెందిన రైతులుగా పరిగణించుటకును, ఆం.ప్ర. ప్రభుత్వమును ఒప్పించిన ఘనత శ్రీమాతకే చెందగలదు.

ప్రాజెక్టు పనుల పురోగమనము :

"మహాత్మాగాంధి లిఫ్టు ఇరిగేషన్ సొసైటి" వలన హుజూర్ నగరము, సూర్యాపేట తాలూకాల్లో, 724 మందికి చెందిన వ్యవసాయ భూమి 6,600 ఎకరాలకు నీటి పారుదల సౌకర్యము కల్పించబడినది. ఈ పథకమునకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైద్రాబాదు (SBH) వారు, 'అగ్రికల్చరల్ రీ ఫైనాన్స్ కార్పోరేషన్' సహకారంతో కావలసిన నిధులను సమకూర్చుటకు నిలబడినది. గడ్డిపల్లి ప్రజలు నూతనముగా ఆవిష్కారమైన ఆర్థిక సాంఘిక అభ్యుదయ భావములతో ముందుకు సాగుచున్నారు. ప్రస్తుత కాలములో చలామణిలో గల "పెట్టుబడి దారి విధానము" మరియు "సోషలిస్టు తరహా విధానము" ఈ రెండింటిని సమతూకంగా దృష్టి యందుంచుకొని "విలువ ఆధారిత పథకములను" (Value Based Plans) ప్రవేశ పెట్టుట జరిగినది. వీని వలన అటు వ్యక్తికి, యిటు సమాజానికి ప్రాధాన్యత నిచ్చుచు, శ్రీ అరవిందుల సమగ్ర తత్త్వమున కనుగుణముగా "సమగ్ర సహకార పద్ధతి"ని యిచట ప్రవేశ పెట్టుట జరిగినది.

ఈ పద్ధతి యొక్క విశిష్టత, ప్రయోజనము యేమనగా, గడ్డిపల్లి సొసైటిలో గల ప్రతి సభ్యుని యొక్క భూమి ఆ వ్యక్తి సొంతం. అది అతని పేరుననే యుంటుంది. అయితే ఆ వ్యక్తి తన సమస్త అవసరములకు సంఘంతో సంబంధం కల్గియుండును.

ఈ పథకము కేవలమొక సహకారసంస్థ మాత్రమే కాదు; వ్యక్తి అవసరములను, సహకారపద్ధతిలో సమకూర్చునట్టి సమగ్ర లక్షణములు గల సంస్థగా యుండును.

ఉద్యమ విస్తరణ :

గడ్డిపల్లి సొసైటీ ప్రగతి పథములో సాధించుచున్న పురోగమనమును ఆదర్శముగా గైకొని, 1972 అక్టోబరులో మరికొన్ని – 17 పరపతి సంఘములు ఈ ఉద్యమములో ప్రవేశించినవి. ఒక చిన్న సెలయేరుగా పుట్టిన ఉద్యమము మహా ప్రవాహముగా పరిణమించబోవుచున్నది. ఈ విధముగా, ఇప్పటికి, 50 గ్రామముల రైతాంగము ఈ సౌభ్రాతృత్వ దివ్యప్రేమ ఉద్యమములో భాగస్వాములుగా చేరినారు. అన్ని ప్రాంతములను ప్రభావితం చేయగల నూతన ప్రకాశము తన కిరణ సహస్రములను సర్వే సర్వత్ర వ్యాపింప చేయనున్నది. అందుకే "గడ్డిపల్లి ఒక నూతనమైన సమగ్ర సాంఘిక – ఆర్థిక వ్యవస్థకు గంగోత్రి".

అభివృద్ధి పథకముల స్వరూపము :

1. భూమిని అభివృద్ధి పరుచుట : లిఫ్టు ఇరిగేషన్ పథకము ననుసరించి, సొసైటీలో చేరిన వారి భూములను సర్వే చేసి, ఎత్తు పల్లములను చదును పరిచి, నీటి పారుదల సౌకర్యమును కలిగించుట, సాగు కొరకు సరియైన వాతావరణమును కలిగించి, సగటు సంవత్సర పంట రేటును పెంచుట.

2. వ్యవసాయ అభివృద్ధితోపాటు, వ్యవసాయమునకు, పశువులకు సంబంధించిన పరిశ్రమలను నెలకొల్పుట.

3. విద్యాభివృద్ధికొరకు యితర సాంఘిక సంస్థలను యేర్పాటు చేయుట కొరకు, రైతుల విరాళము ద్వారా భూసేకరణ – వానిలో విద్యాలయములను, వైద్యశాలలను, సాంస్కృతిక, కళా రంగమునకు అవసరమగు నిర్మాణములు చేపట్టుట.

4. వ్యవసాయ ఫలసాయమును నిల్వ చేయుటకు సరిపడు గోదాముల నిర్మాణము చేయుట, వ్యవసాయమునకు పయోగించు 'ట్రాక్టర్ల వర్కుషాపులు' నిర్మించుట.

5. ఆయకట్టు ప్రాంతములో రోడ్లను, మురుగు కాల్వలను నిర్మాణము చేయుట, రసాయన ఎరువులు, పురుగు మందులు, శుద్ధి చేసిన విత్తనములను నిల్వ చేయు వసతికి తగిన యేర్పాట్లు చేయుట.

6. సంఘము యొక్క అభివృద్ధికి, సంఘములోని ప్రతి ఒక్కరి అభ్యుదయం కొరకు, వ్యవసాయము, పశుపోషణ యిత్యాది విషయములకు సంబంధించిన పరిజ్ఞానమును, ప్రదర్శనా పూర్వకంగా అదించుటకు, ప్రదర్శనాశాలలను, ఫిల్ము ప్రదర్శనలను యేర్పాటు చేయుట, విద్యా సదస్సుల నిర్వహణ

7. సంఘ సభ్యులకు పొదుపు ఉద్యమాలు, ఆ ధనముతో సామూహిక వంట శాలలను హోటళ్లను నిర్వహించుట, రైతులకు అప్పుగా యిచ్చి వారి అవసరములకు దోహదపడుట.

8. వాణిజ్య సముదాయములను సమిష్టిగా నిర్మాణం చేయుట – రైతులకు నిత్యావసర వస్తుజాలమును సరఫరా చేయుటకు తగిన వసతిని సమకూర్చుట అనేక రకములైన అభివృద్ధి పథకములను అమలు పరచుట జరుగును.

వ్యవసాయాభివృద్ధికి వనరుల సేకరణ :

గడ్డిపల్లి లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టుకు కావలసిన ధనమును, యంత్ర సామాగ్రిని సమకూర్చుట కొరకు ప్రభుత్వమును ఆశ్రయించగా ఆయా లిఫ్టుల పారకం లోని ఆయకట్టు ననసురించి, వ్యవసాయ ప్రోత్సాహమునకు ప్రభుత్వము వారు దానికయ్యే ఖర్చులో కొంత మొత్తమును సుమారు 15 నుండి 20% వరకు గ్రాంటుగా యిచ్చుటకు, మిగతా ధనములో 10% రైతులు సమకూర్చెదరు ; యింకను 90% ధనమును 'సహకార బ్యాంకుల' ద్వారా గాని, 'వాణిజ్య బ్యాంకుల' ద్వారా గాని, ఋణముపై పొంది అందించెదరు. ఈ పద్ధతిలో ఎంతో కొంత మొత్తమునకు ప్రజలను కూడా భాగస్వాములను చేయుట జరిగినది. రైతులు వివిధ బ్యాంకుల నుండి తాము పొందిన అప్పులను చెల్లించుటకు 7 సాలుసరి వాయిదాలు నిర్ణయించ బడినవి. అనగా వారికి ధనము అందిన 3వ సంవత్సరము నుండి 9 వ సంవత్సరము వరకు అప్పు తీర్చవలసి యుండును.

వ్యవసాయం, పరిశ్రమలు తదితర పనులకు అవసరమగు ట్రాక్టర్లు మొదలగు యంత్రసామాగ్రిని 'ఆం.ప్ర. వ్యవసాయ పారిశ్రామిక సంస్థ' వారు సమకూర్చెదరు.

ఈ ప్రాజెక్టులు తాము విధించుకున్న కాల నిర్ణయం ప్రకారం గడువు పూర్తి అయిన పిమ్మట, సేద్యము ద్వారా సమకూరిన ఫల సాయమును సేకరించి,

గోదాములలో నిల్వయుంచి అదనులో సహకార సంఘముల ద్వారా విక్రయించుటకు యేర్పాటు చేయబడును.

ఈ లిఫ్టు ఇరిగేషన్ పథకములు ఆంధ్రప్రదేశ్ (ప్రాజెక్టు వింగ్) శాఖ వారి ఆజమాయిషీ క్రింద అమలు జరుపబడును. ఇవి "ఆం.ప్ర. వ్యవసాయ పారిశ్రామిక సహకార సంస్థ" మరియు "శ్రీ అరవింద శ్రామిక సహకార సంఘము" గడ్డిపల్లి వారి సహకారంతో నడుపబడును.

గత 40 సంవత్సరాల నాడు గడ్డిపల్లి లిఫ్టు ఇరిగేషన్ యేర్పరచుకొని ముందుకు సాగినది. ఈ ప్రయాణంలో అవి క్రొత్తగా పుట్టుకొని వచ్చిన సంఘములను కూడా తమతో కలుపుకొని సాగినది. ఈ సందర్భమునందు సంఘముల మధ్య తలయెత్తిన చిన్న పెద్ద సమస్యలను పరిష్కరించు కొనినది. డా॥ గోపాలరెడ్డి ధీరత్వమే రైతాంగము నకు పెద్ద అండయై నిలిచినది. ఈనాడు ఆ పొలములన్నీ డెల్టా భూములకు సాటిగా ఫల సాయాన్నందించుటలో పోటీ పడి, రైతాంగమునకు సిరిసంపదలను సమకూర్చి పెట్టుచున్నవి.

★★★

శ్రీ అరవింద కర్మధార అనుబంధము
నాగార్జున సాగర్ ఎడమకాల్వ క్రింద అమలు జరుపుచున్న లిఫ్ట్ ఇరిగేషన్ పథకముల వివరములు

1. పరిచయము :

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పబ్లిక్ వర్క్సు డిపార్టుమెంటు (ప్రాజెక్టు వింగు) జి.ఒ.యం.యస్. నెంబరు 194 ది. 31-5-1969 ప్రకారము నాగార్జునసాగర్ ఎడమకాల్వ క్రింద 72.4 మైళ్ళ వరకు యిరు ప్రక్కల సుమారు 50,000 ఎకరము లకు లిఫ్టు ఇరిగేషన్ ద్వారా నీటి పారుదల అవకాశము కల్పించబడినది. ఈ పథకము వల్ల లాభము పొందే రైతులు కాల్వలు త్రవ్వటానికి, పంపు సెట్లకు, వాటిని నడపటానికి అయ్యే ఖర్చులను భరించవలసి ఉంటుంది. ఈ పథకము క్రింద మొట్టమొదటగా నాగార్జునసాగర్ ఎడమకాల్వ 56వ మైలు వద్ద నల్గొండ జిల్లాలోని గడ్డిపల్లి గ్రామములో మహాత్మాగాంధి లిఫ్టు ఇరిగేషన్ సొసైటి స్థాపించబడినది. దీనివల్ల సూర్యాపేట, హుజూర్‌నగర్ తాలూకాలలో 724 మంది వ్యవసాయదారులకు సంబంధించిన 7,100 ఎకరాలకు నీటి పారుదల సౌకర్యాము కల్పించబడినది. ఈ పథకానికి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైద్రాబాదు వారు అగ్రికల్చరల్ రీఫైనాన్స్ కార్పోరేషన్ సహకారముతో కావలసిన ధన సహాయము చేయుచున్నారు.

దరిమిలా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము జి.ఒ.నంబర్ 309 ది. 10-10-72 మరియు 331 ది. 18-11-72 ద్వారా మరి 17 లిఫ్టు ఇరిగేషన్ పథకాలను నల్గొండ జిల్లాలోని మిర్యాలగూడ, సూర్యాపేట, హుజూర్‌నగర్ తాలూకాలలోని 29.200 ఎకరాల సాగుకు రూ. 450 లక్షలు మంజూరు చేసినారు. ఈ పథకాలు ప్రభుత్వము మరియు సహకార సంఘాల అజమాయిషి క్రింద నడుపబడును. ఈ పథకాలకు అయ్యే ఖర్చులో రూ. 97.21 లక్షలు ప్రభుత్వము వారిచే నీటిపారుదల తూములకు, పంపులకు, నీటి పంపకపు కాల్వలకు ఖర్చు చేయబడును. మిగతా సొమ్ము ఈ పథకము ద్వారా లాభము పొందు సహకార సంఘములు భరించవలెను.

పై అవకాశము మూలమున 33 గ్రామాలలోని రైతులు 10 సహకార సంఘములను ఏర్పరచుకొనిరి. ఇవికాక మహాత్మాగాంధి లిఫ్టు ఇరిగేషన్ సహకార సంఘము వారు మరియొక మూడు గ్రామములకు నీటిని సరఫరా చేయుదురు. ఈ పథకము క్రింద 11 సహకార సంఘాల ద్వారా 2375 మంది వ్యవసాయ దారులు లాభము పొందుదురు. (పట్టిక. 1)

2. లిఫ్టు ఇరిగేషన్ సహకార సంఘముల పథకము ఉద్దేశ్యములు :

ఎ) నాగార్జునసాగర్ ఎడమకాల్వ నుండి నీటిని తోడి తూములు, కాల్వల ద్వార సాగునకు ఉపయోగించుట.

బి) పంట చేలకు మురుగు నీటి కాల్వలను త్రవ్వుట.

సి) నీటిపారుదల ప్రాంతములో రోడ్లు మొదలగు కార్యక్రమములను చేపట్టుట.

డి) భూములను సర్వేచేసి చదును పరిచి సాగునకు ఉపయోగించుట సామాజిక అవసరములకు కావలసిన భూమిని (మొత్తము భూమిలో సుమారు 10 శాతము) విరాళాల ద్వారా సేకరించుట.

ఇ) వ్యవసాయాభివృద్ధికి, పరిశ్రమలకు, విద్యకు, సాంఘిక అవసరములకు కావలసిన భూమిని పొందుపరుచుట.

ఎఫ్) పంటల అధిక ఉత్పత్తి కొరకు కావలసిన వనరులను సమకూర్చుట, గోదాము, రవాణా మరియు సరుకు అమ్ముటకు తగు సదుపాయములు చేయుట.

జి) వ్యవసాయమునకు పశువులకు సంబంధించిన పరిశ్రమలు స్థాపించుట.

హెచ్) సభ్యులు, తదితరులకు సంబంధించిన సరకుల రవాణా కొరకు కావలసిన మోటారు శకటములను కొనుట లేక అద్దెకు తీసుకొనుట.

ఐ) అవసరమైనప్పుడు ప్రభుత్వము, సహకార సంఘములు మొదగు వారి ఏజంటుగా వ్యవహరించి వ్యవసాయ ఫలసాయము, పాలు మొదలగు వానిని సేకరించుట, సరఫరా చేయుట.

జె) సభ్యలకు గోదాము సౌకర్యములు కల్పించుట.

కె) సంఘము మరియు సంఘములోని ప్రతి ఒక్కరి అభ్యుదయము కొరకు వ్యవసాయము, పశుపోషణ యితర విషయాలకు సంబంధించిన అభివృద్ధిని ఫిల్ములు, తదితర సాధనముల ద్వారా తెలియపర్చుట.

యల్) అప్పుడప్పుడు విద్య, పరిజ్ఞానములకు సంబంధించిన జాతీయ మరియు అంతర్జాతీయ ప్రదర్శనలు, సదస్సులు, ఫిల్ము ప్రదర్శనలు ఏర్పాటు చేయుట.

యమ్) ఆరోగ్యము కొరకు ఔషధశాలలు, వైద్య శాలలు మరియు ఆట స్థలములను ఏర్పాటు చేయుట, వాటిని పోషించుట.

యన్) విద్యా సౌకర్యములు గలిగిన పారిశ్రామిక వాడలను నిర్మించుట.

ఓ) సంఘ సభ్యులకు పొదుపు ఉద్యమము అలవాటు చేసి ఆ డబ్బును సాంఘిక అవసరములకు అప్పుగా యిప్పించుట.

పి) సాంకేతిక సలహాల నిచ్చు నిపుణులను, పరిపాలనా దక్షత గలవారిని నియమించుట.

క్యూ) నవీన పద్ధతులలో వ్యవసాయాభివృద్ధి సాధించుట కొరకు సమిష్టి వ్యవసాయానికి అవసరమగు భూమి, తదితర వనరులను సమకూర్చుట.

ఆర్) సభ్యుల సౌకర్యార్థము సామూహిక వంటశాలలు, హోటళ్ళను నడిపించుట

యస్) ప్రభుత్వము జిల్లా పరిషత్, పంచాయతి సమితులకు సంబంధించిన ప్రజోపయోగకరములగు పనులను కాంట్రాక్టుకు తీసుకొనుట.

టి) సభ్యులు మరియు యితరుల మధ్య సహకారము పెంపొందించుట.

యు) ప్రభుత్వము నుండి, ప్రయివేటు సంస్థల నుండి గ్రాంటుగా గాని, అప్పుగా గాని డబ్బు సంపాదించి సభ్యుల భూమి అభివృద్ధికి పంటలు పండించుటకు అప్పుగా యిచ్చుట.

వి) సంస్థల తరపున ఏజంట్లుగా గాని, వర్తకులుగా గాని వ్యవహరించి సభ్యులకు కావలసిన సదుపాయములు సమకూర్చుట.

3. అభివృద్ధి పథకముల స్వరూపము :

నాగార్జునసాగర్ కాల్వల క్రింద నీటిపారుదల వసతి వేసవికాలములో సుమారు 5, 6 వారములు తప్ప సంవత్సరములోని మిగతా కాలమంతయు వుండును. లిఫ్టు ఇరిగేషనుకు సంబంధించిన నీటి పారుదల వసతుల వివరములు క్రింద పొందు పరచబడినవి.

1.	మెయిన్ కాల్వలో నీటి పారుదల	....	10398	క్యూసెక్కులు
2.	ప్రవాహ వేగము	....	3.95	అడుగులు
3.	మెయిన్ కాల్వ అడుగు వెడల్పు	....	88	అడుగులు
4.	కాల్వలో నీటి లోతు	....	22	అడుగులు
5.	కాల్వ ప్రక్కవాలు	....	1	అడుగు

(ఎ) భూమిని అభివృద్ధి పరచుట :

ఈ ప్రాంతములోని భూములు ఎఱ్ఱ గరువులు (చెల్కా) మరియు నల్లరేగడి భూములు. భూములలోతు 9" నుండి 24" వరకు వుండును. భూమిని సర్వేచేసి చదును పరచి అర ఎకరమునకు తక్కువగా లేనటువంటి ప్లాటుగా తయారు జేయుదురు. 1973వ సంవత్సర ఉత్తరార్థములో సుమారు 22,000 ఎకరాలు నీటిపారుదల క్రిందకు తేబడి సగటు సంవత్సర పంటల రేటు (cropping intensity) 1.3 నుండి 2.0 నకు

తీసుకొని రాబడును. దీని వల్ల ప్రజలకు ఎంతో పని కల్పించబడును. పని రద్దీని తట్టుకొని సహకార సంఘము వద్ద ఒక ట్రాక్టరు వర్క్‌షాపు స్థాపించబడును. దీని వల్ల చిన్న రైతులకు కూడ లాభము కలుగును. రైతులు పనులను సకాలములో చేయుటవల్ల పంటల దిగుబడి పెరుగును. ప్రతి 7 ఎకరములకు 1 హెచ్.పి. వంతున ట్రాక్టర్లు మొదలగు యంత్ర పరికరములు సమకూర్చబడును.

బి) సహకార సంఘములోని సభ్యులకు కావలసిన ఎరువులు, క్రిమి సంహార ద్రవ్యములు మరియు ఫలసాయమును నిల్వచేసికొనుటకు తగినన్ని గోదాములు సమకూర్చబడును. పై సహకార సంఘములలో 24 గోదాములును కట్టుదురు. ఆయకట్టు ప్రాంతములో రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించబడును.

4. ప్రాజెక్టుకు కావలసిన ధన సహాయము :

క్రొత్తగా స్థాపించిన 11 సహకార లిఫ్టు ఇరిగేషన్ సంఘాలకు సుమారు 451.22 లక్షల రూపాయలు కావలెను. ఇందులో రూ. 73.71 లక్షలు ప్రభుత్వము వారు యిచ్చెదరు. మిగతా రూ. 377.51 లక్షలలో 10 శాతము సభ్యులు పెట్టుబడి పెట్టెదరు. మిగతా 90 శాతము బ్యాంకుల నుండి రుణముగా తీసుకొందురు.

5. ప్రాజెక్టు లాభనష్టములు :

ఈ ప్రాజెక్టు ప్రాంతములో యింతకు ముందు వర్షాధారము మీద సంవత్సరానికి ఒకే పంట పండేది. బావుల క్రింద అక్కడక్కడ రబీ పంటలు పండించే వారు. సగటున సంవత్సరానికి ఎకరాకు 1.3 పంటలు పండించబడి రూ. 277.00 సాలుసరి ఆదాయము వచ్చేది. ఈ లిఫ్టు ఇరిగేషన్ పథకము వల్ల ఎకరాకు సుమారు 796.00 అధిక రాబడి రాగలదు. అందుకుగాను అభివృద్ధికి చేసిన అప్పు దాని మీద వడ్డీ కలిసి రూ. 243.00 వంతున 7 సంవత్సరాలు కట్టవలెను. పై వివరాలను బట్టి ఈ ప్రాంతపు రైతులకు ఈ ప్రాజెక్టువల్ల ఎంతో మేలు కలుగగలదని తెలుస్తుంది.

6. అప్పు తీసుకొనే పద్ధతి :

సభ్యులకు కావలసిన రుణాలను న్యాయసమ్మతమైన తనఖా ద్వారా బ్యాంకుల నుండి పొందుదురు. అప్పు మొత్తము కంటే 200 శాతము విలువ గల స్థిరాస్తిని తనఖా పెట్టవలెను. భూమి పట్టాలో కొద్ది లోపములున్న రైతులు కూడ అప్పుకొరకు ప్రయత్నించవచ్చును. ఈ డబ్బు మీద 9 శాతము వడ్డీ కట్టవలసియుండును.

7. అప్పు తీర్చుపద్ధతి మరియు కాలపరిమితి :

ఎ) భూమి అభివృద్ధికి, గోదాములకు యిచ్చిన అప్పును, అప్పు తీసుకొన్న 2 సంవత్సరముల తరువాత 7 సాలుసరి వాయిదాలలో తీర్చవలెను. అంటే డబ్బు

అందిన 3వ సంవత్సరము నుండి 9వ సంవత్సరము వరకు అప్పు తీర్చాలి. అప్పు మీద అయ్యే వడ్డీని సంవత్సరానికి రెండుసార్లు పంటలు చేతికివచ్చే సమయంలో అంటే మే 31న మరియు నవంబరు 30న కట్టాలి.

బి) ట్రాక్టరు వర్కుషాపు మొదలగు సామాజిక రుణాలను 7 సంవత్సరాలలోపల చెల్లించవలెను. రుణాలు తీసుకున్న మరుసటి సంవత్సరము నుండి 6 సాలుసరి వాయిదాలలో చెల్లించాలి. వడ్డీ ఆరు మాసములకొక పర్యాయము చెల్లించవలెను.

అప్పు తీరేవరకు బ్యాంకు తరపు సిబ్బంది డబ్బు వినియోగ పద్ధతులను అప్పుడప్పుడు తనిఖీ చేయుచుందురు. ఈ అప్పు హుజూర్‌నగర్, మిర్యాలగూడ మరియు సూర్యాపేటలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ బ్రాంచీల ద్వారా బట్వాడా చేయబడును.

8. శ్రామిక మరియు యంత్ర సదుపాయములు :

వ్యవసాయము, పరిశ్రమలు, తదితర పనులకు అవసరమగు ధనము శ్రామికులకు కావలసినంతగా దొరికే అవకాశముగలదు. ప్రాజెక్టుకు కావలసిన ట్రాక్టర్లు మొదలగు యంత్ర సామాగ్రిని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ పారిశ్రామిక సంస్థవారు సమకూర్చుదురు. ఇవి కాక ప్రతి సొసైటి కూడ కొంత యంత్ర సామాగ్రిని కలిగి యుండును.

9. క్రొత్త ప్రాజెక్టుల కాలపరిమితి :

ఈ ప్రాజెక్టులు సుమారు 15 మాసాలలో అంటె డిసెంబరు 1972 నుండి ఫిబ్రవరి 1974 లోపల పూర్తి చేయబడును.

10. పంటల కొరకు అప్పులు :

పంటలకు కావలసిన అప్పులను బ్యాంకుల నుండి పొందవచ్చును.

11. ఫలసాయ విక్రయము :

వ్యవసాయ తదితర ఉత్పత్తులను సేకరించి గోదాములలో నిల్వయుంచి అదనులో సహకార సంఘముల ద్వారా అమ్ముటకు ఏర్పాటు చేయబడును.

12. సాధారణ విషయములు :

ఈ లిఫ్టు ఇరిగేషన్ పథకాలు ఆంధ్రప్రదేశ్ పి.డబ్ల్యు.డి. (ప్రాజెక్టు వింగ్) శాఖవారి అజమాయిషి క్రింద అమలు జరుపబడును. ఇవి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ పారిశ్రామిక సంస్థ మరియు శ్రీ అరవింద శ్రామిక సహకార సంఘము, గడ్డిపల్లి వారి సహకారముతో నడుపబడును.

★ ★ ★

శ్రీ అరవింద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవెలప్‌మెంట్

Sri Aurobindo Institute of Rural Development

దేశమందు భారీ ప్రాజెక్టులు వెలసి వ్యవసాయ రంగము విస్తరించు చున్న కాలములో వ్యవసాయము దానికి అనుబంధ రంగములను కూడా వృద్ధి పరచాల్సిన అవసరము దృష్ట్యా, వందలాది సాంకేతిక నిపుణుల అవసరము గ్రామ సీమలలో యున్నందున యువకులకు శిక్షణ యిచ్చి సంసిద్ధ పరచవలసిన సమయమేర్పడినది.

భూమిని అభివృద్ధి పరచుట దానికవసరమగు సాంకేతిక యంత్రముల పరిజ్ఞానము కలిగించుట, నీటికి సంబంధించిన సాంకేతిక నిపుణులను తయారు చేయుట, పంట ఉత్పత్తిని పెంచుటకు వలయు ఫీల్డుమెన్‌లను ఉద్యానవన సేద్యమునకు సంబంధించిన సాంకేతిక జ్ఞానము కల్గించుట, పట్టు పరిశ్రమ, మొక్కల సంరక్షణ, డైరీలను నెలకొల్పి పాల ఉత్పత్తిని పెంచుట, కోళ్ళ పరిశ్రమ, సీమ పందుల పెంపకము, చేపల చెరువులను స్థాపించి దాని పెంపకము, యింకను స్థానిక వసతి, వనరుల దృష్ట్యా మరేయితర సంస్థలను వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను స్థాపించి, యువ శక్తిని పరిపుష్టము చేయాల్సిన పరిస్థితిని మన డాక్టరు గారు గుర్తించి, ఆ దిశగా పావులను కదుపుట ప్రారంభించినారు. తక్షణ అవసరముగా ఈ రకమైన వివిధ సాంకేతిక సిబ్బందిని సంసిద్ధ పరచుటకు "శ్రీ అరవింద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంటు" (Sri Aurobindo Institute of Rural Development) అను సంస్థను 1973 సం॥లో గడ్డిపల్లిలో స్థాపించినారు. దీనిని సొసైటి యాక్టు 1973 ప్రకారము, నెం. 429తో రిజిష్టర్ చేయించినారు.

ఈ సంస్థ యింతవరకు 300 మందిని 17 లిష్ట సంఘముల నుండి ఎన్నుకొని, 6 నుండి 12 మాసముల కాలములో వారికి వ్యవసాయ సంబంధ పనులలో శిక్షణ యిచ్చినది.

దేశములో వ్యవసాయ పాలిటెక్నిక్‌లను స్థాపించాలని ఈ సంస్థ కేంద్ర ప్రభుత్వమునకు ప్రతిపాదనలు సమర్పణ :

Dr. D.S. కొఠారి అధ్యక్షతలో ఏర్పాటు చేయబడిన "ద్వితీయ విద్యా కమీషన్" (కొఠారి కమీషన్ 1964-66) వ్యవసాయ "పాలి టెక్నిక్"లను ఏర్పాటు చేయాలని సూచించినది. వానిలో వ్యవసాయ వృత్తివిద్యలను పాఠశాల విద్య మానుకున్న వారికి,

గ్రామీణ యువకులకు బోధించాలని తెల్పినది. కొఠారి కమీషన్ సిఫార్సులు మధ్య తరగతి టెక్నీషియన్‌లను సిద్ధము చేయుటకుద్దేశించబడినవి. వీరిద్వారా సాంకేతిక పద్ధతులు దిగువ స్థాయికి అందును. ఈ విధముగా రూపొందిన టెక్నీషియన్లు శాస్త్రజ్ఞులందించు పరిజ్ఞానమును గ్రామస్థాయితో కలిపే వారధిగా వ్యవహరించ గలరని సిఫారసులలో పేర్కొనుట జరిగినది.

డా॥ కొఠారి కమీషన్ సిఫారసుల ప్రకారం "భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి", న్యూఢిల్లీ (Indian Council of Agricultureal Research) I.C.A.R. - వారు ఈ విషయమును అధ్యయనం చేయుటకు ఒక కమిటీని వేసినారు. ఒకప్పుడు ఇదే విషయమును ప్లానింగ్ కమీషన్ వారు మరియు మంత్రివర్గ మండలి వారు, ఐదవ పంచవర్ష ప్రణాళిక కాలములో చర్చించి, నిర్ణయించి యుండిరి. అప్పుడు ఆ కమిటీకి డా॥ మోహన్‌సింగ్ మెహతా "సేవా మందిర్ ఉదయపూర్" వారు అధ్యక్షులుగా వ్యవహరించినారు. వారిని వ్యవసాయ వృత్తివిద్యలను నేర్పుటకు ఏర్పాటు చేయాల్సిన విద్యాలయములను రూపకల్పన చేయుటకు నియమించినారు. ఆ కమిటీ యందు శ్రీ అరవింద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ గడ్డిపల్లి కార్యదర్శియైన మన డా॥ గోపాలరెడ్డి గారు కూడా ఒక సభ్యులుగా నున్నారు. ఆనాడు ఈ కమిటీ వ్యవసాయ సంబంధ వృత్తులను, వానికి సంబంధించిన సమస్యలను కూలంకషంగా చర్చించినారు. ఈ వృత్తులను నేర్పు సంస్థలకు Farm Science Centres అని పేరిడినారు. వానినే "కృషి విజ్ఞాన కేంద్రములు" (K.V.K.) గా దేశమంతటా వ్యవహరించు చున్నారు.

'భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి వారు "కృషి విజ్ఞాన కేంద్రము"లను వ్యవసాయ వృత్తివిద్యలను, దాని అనుబంధ వృత్తులలో శిక్షణ యిచ్చే నిమిత్తము దేశమందంతట నెలకొలిపినారు.

శ్రీ అరవింద పురం (గడ్డిపల్లి) లో శ్రీమాత శ్రీ అరవిందుల అనుగ్రహ ఆశీస్సులతో, డా॥ గంటా గోపాలరెడ్డి గారిచే స్థాపించబడిన "శ్రీ అరవింద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంటు" అను సంస్థ అతిముఖ్యమైనది. డా॥ గోపాలరెడ్డి గారు తమ జన్మభూమి గడ్డిపల్లి దురవస్థను దూరము చేయుటకు, అనేక విధములుగా ఆలోచించి, గ్రామీణ వికాసమునకు వివిధ రకములైన పనులను ప్రవేశ పెట్టి, గ్రామీణులైన రైతుల, తదితర వృత్తుల వారి అభ్యున్నతి కొరకు ఈ సంస్థను రూపొందించిన పత్రమును, ప్రణాళికను, శ్రీ అరవిందాశ్రమ జనయిత్రి, శ్రీమాత

దివ్య సముఖమున కర్పించి విన్నవించగా, ఆమె, ఆ దివ్యమాత అవలోకించి, ఆమోదమును తెలియ బరచినది. ఆ పత్రముపై తన మంత్రపూరిత సంతకమును ప్రసాదించినది. ఆ విధంగా ఈ సంస్థ ఉనికిలోకి వచ్చినది.

శ్రీమాత సంపూర్ణ అనుగ్రహముచే అవతరించిన ఈ సంస్థ, గడ్డిపల్లి గతినే మార్చివేసినదంటే అతిశయోక్తి కాదు. డా॥ గోపాలరెడ్డి గారు, అవసరానుగుణంగా అభివృద్ధిని సాధించు దిశలో పలయు సంస్థలను స్థాపించి, 'అమ్మ' అనుగ్రహం వలన అద్భుత ఫలితాలను సాధించినారు, సాధించుచున్నారు.

గ్రామీణ వ్యవసాయ విశ్వవిద్యాలయము దిశగా –

గడ్డిపల్లిలో ప్రప్రథమముగా స్థాపించబడి, రైతుల అభ్యున్నతికి ఆధారభూతమైనది "మహాత్మాగాంధి లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు" (M.G.L.I.) "బయోటెక్నాలజి ప్రాజెక్టు" బయోటెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్, దానికి సంబంధించిన ప్రయోగశాల; సేంద్రియ ఎరువుల యూనిట్; (Organic Manure Unit); వెర్మికల్చర్ యూనిట్; విత్తన శుద్ధి యూనిట్ (Seed Processing Unit) ఈ విధమైన వ్యయసాయ సంబంధిత సంస్థలు మరియు సాంకేతిక సంస్థలైన ట్రాక్టర్ మెకానిక్ వర్కుషాపు, భవన నిర్మాణ శిక్షణా సంస్థ మొదలగు టెక్నికల్ సంస్థల సముదాయాలు అన్నీ కలిసి గడ్డిపల్లిని ఉజ్వల భవిష్యత్తు దిశగా నడిపించుచున్నవి. ఈ సంస్థలన్నిటిని మన డా॥ గోపాలరెడ్డి గారు "శ్రీఅరవింద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంటు" సంస్థకు అనుబంధంగా చేసి, సత్ఫలితాలను సాధించుచున్నారు. అన్ని రకములైన వ్యవసాయ, పారిశ్రామిక, సాంకేతిక తదితర సంస్థల సంపుటిగా, "శ్రీ అరవింద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్" వెలసిన ఈ బృహత్తర సంస్థ, "గ్రామీణ విశ్వ విద్యాలయము" (Deemed Rural University) గా ఎదిగి, గడ్డిపల్లికి మాత్రమే గాక, రాష్ట్రస్థాయి అవసరాలను కూడా తీర్చగలదనుటలో సందేహము లేదు.

ప్రస్తుతమునకు, మన రాష్ట్రంలో గల "వ్యవసాయ విశ్వవిద్యాలయము", హైద్రాబాదు నగరములో నున్నది. అందులో పని చేయుచున్న ఆచార్యులు, వారి వారి రంగములందు అసమాన ప్రజ్ఞా దురంధరులు. వారు గ్రామీణ వ్యవసాయ అభివృద్ధి కొరకు రచన చేయు ప్రణాళికలు, పట్టణములోనే కూర్చొని, తమ సహాయకులచే అవసరమగు సమాచారమును తెప్పించుకొనెదరు. దీనిని పరోక్షపద్ధతిలో సమాచార సేకరణగా పరిగణింతురు. ఈ సమాచారమును ఆధారముగా చేసికొని,

చేయు ప్రతిపాదనలు, ఒక్కొక్క మారు భిన్నముగా పరిణమించవచ్చును. భవిష్యత్తులో ఇట్టి విశ్వవిద్యాలయములు గ్రామీణ ప్రాంతాలకు తరలించ బడవలసిన ఆవశ్యకత గలదు. అప్పుడు ఆచార్యులందరు గ్రామ సీమలలో నివాసముంటు రైతులతో ప్రత్యక్ష సంబంధమును కలిగి, వారే స్వయంగా చేలలోనికి వెళ్లి, సమస్యలను పరిశీలించి పరిష్కారము చూవగల్గుదురు. భవిష్యత్తులో ఈ విధమైన వ్యవసాయ విశ్వవిద్యాలయములు గ్రామీణ ప్రాంతాలకు తరలి రానున్నవి. మన Institute of Rural Development ముందు రానున్న కాలంలో ప్రప్రథమ గ్రామీణ విశ్వవిద్యాలయముగా మార్పు చెందగలదేమో ఎవరెరుగుదురు! ఇది ప్రథమ గ్రామీణ వ్యవసాయ విద్యాలయముగా మారి, గ్రామప్రాంతం నుండి కార్యనిర్వహణ చేయుచు, బృహత్తర సంస్థగా పరిణమించ గలదన్న ఆశాభావమును వ్యక్తము చేయుచున్నాను. ఇక ముగింపు దిశగా – శ్రీమాత సంఘటిత పరచిన ఈ శాస్త్రవేత్తల జంట మన రాష్ట్రంలో గ్రామీణ వికాసము, అభ్యున్నతి కొరకు అహర్నిశలు శ్రమించి, ఆశయ సిద్ధిని సాధించాలని ఆకాంక్ష.

★ ★ ★

కృషి విజ్ఞాన కేంద్రము (K.V.K.)

డా॥ గోపాలరెడ్డి గారు ప్రతి విషయమును వాస్తవిక దృష్టితో చూచెదరు. అది క్రియా పరముగా ఎంతవరకు ఉపయోగ పడగలదను దృష్టితో నిర్ణయించుట ఆయన సహజ లక్షణము. ఆయన శ్రీ అరవిందుల బోధనలకు మూర్తీభవించిన నిర్దిష్ట రూపము. దినమంతా – సూర్యోదయాది సూర్యాస్తమయం వరకు ప్రాజెక్టు రైతుల సమస్యల పరిష్కారం లోను, యిందు భాగస్వాములైన లంబాడి తండాల సంక్షేమం కొరకు నిరంతరం కృషి చేయుటయే వారి పని. 'Work is worship' అను సామెతయే వారి జీవిత ధ్యేయం.

డా॥ గోపాలరెడ్డి గారికి భారత ప్రభుత్వ వ్యవసాయశాఖతోను, ఆ శాఖకు చెందిన యితర అనుబంధ సంస్థలతోను సన్నిహిత సత్సంబంధాలున్నవి. వీరందరకు గడ్డిపల్లిలో నిర్వహింపబడుచున్న బృహత్తర కార్యములన్నీ పరిచితములే. వ్యవసాయ పరిశోధనకు చెందిన సంస్థ అయిన "భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి" (I.C.A.R.) న్యూఢిల్లి, గడ్డిపల్లిలో జరుగుచున్న బృహత్కార్యమును దృష్టియందుంచుకొని, తమ అధీనములో నిర్వహింపబడుచున్న "కృషి విజ్ఞాన కేంద్రము" (K.V.K.) నొకదానిని అచట 1985 సం॥లో స్థాపించినది. దాని నిర్వహణకవసరమగు ద్రవ్యమును కూడ అందించు చున్నది. డా॥ గోపాలరెడ్డి గారినే ఈ సంస్థకు కార్యదర్శిగా చేసినది. ఈ సంస్థ మూలంగా వారు సంకల్పించిన ఈ భారీ తరహా వ్యవసాయ రంగమునకు చెందిన యితర వృత్తులను నిర్వహించువారికి – అనగా ట్రాక్టర్ల మెకానిజం – సాగునీటి పంపులను అమర్చుట, రిపేర్ చేయుట, వ్యవసాయ పనిముట్లను బాగుచేయుట, విత్తనశుద్ధి కర్మాగారమునకు చెందిన అన్ని పనులు, విద్యుత్తు సరఫరాకు చెందిన పనులు, వర్కుషాపుల నిర్వహణ యిత్యాది పనులు – నిర్వహించుటకు మానవశక్తిని సంసిద్ధ పరచుటకై శిక్షణ యివ్వబడుచున్నది.

"మహాత్మాగాంధి లిఫ్టు ఇరిగేషన్" ప్రాజెక్టులో భాగస్వాములైన గ్రామాలలోని విద్యార్థి గణమంతా ఏదోఒక వృత్తిలో చేరి "పనిచేయుచు నేర్చుకొనుట" ("Learning by doing") అను పద్ధతిలో శిక్షణ పొందుచు ప్రావీణ్యమును సంపాదించి, తమ గ్రామ అవసరములను తీర్చుచున్నారు. ఆయా గ్రామాలలోని మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఇదొక వరప్రసాదమైనది. డాక్టరు గారు సంకల్పించిన పనికి మానవశక్తికి లోటు లేకుండా కార్యము సాగిపోవుచున్నది.

"భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి" (I.C.A.R.) వారు దేశవ్యాప్తంగా నెలకొల్పిన 260 'కృషి విజ్ఞాన కేంద్రము' లందు గడ్డిపల్లి కేంద్రము ఉత్తమమైనదిగా ఎంపికైనది. ఈ పురస్కారమునకు ప్రధాన కారకులు డాక్టరు గారే యనుట అతిశయోక్తి కాదు. కృషి విజ్ఞాన కేంద్రములన్నీ ప్రభుత్వ పరంగా నడచుచున్న సంస్థలే. ఈ విధమైన కేంద్రములను మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, జిల్లాకొకటి చొప్పున యేర్పాటు చేయబడినది. ఈ సంస్థలో పనిచేయు ఆఫీసర్లు మొదలు పరిచారకుని వరకు అందరు ప్రభుత్వ స్కేళ్లను పొందెదరు. గడ్డిపల్లిలో నున్న కృషి విజ్ఞాన కేంద్రమునకు ఆఫీసర్‌గా శ్రీ వీరయ్య గారు సమర్ధవంతంగా పని చేయుచు, విద్యార్థులచే చేయించుచు వారిని సుశిక్షితులుగా సంసిద్ధపరచు చున్నారు. వారి అధీనములో గల సిబ్బంది కూడా విద్యార్థి గణముతో ప్రేమానురాగాలతో మెదలుచున్నారు. వీరందరికి వలయు వసతి. తదితర సౌకర్యము లన్నీ సమకూర్చబడి, సంతృప్తిగా నున్నారు. ఇచటి గ్రామీణ యువతకు జీవనోపాధి కల్గించుటకు కల్పవృక్షమై నిలిచినది ఈ సంస్థ.

గడ్డిపల్లిలో యితర సంస్థలతో పాటు, మరికొన్ని ప్రభుత్వ సంస్థలు కూడా పని చేయుచున్నవి. ఉదాహరణకు : మత్స్యశాఖ, బాతుల పెంపకము, ఔషధ మొక్కల నర్సీరీలు మొదలగునవి. ఇవన్నియు ప్రదర్శనా పూర్వక జిల్లా స్థాయి క్షేత్రములు. ఇలాంటివే మరో 20 సంస్థలు యిచ్చట నున్నవి. ఈ క్షేత్రములన్నిటిలోను వివిధ ప్రాంతముల నుండి వచ్చిన గ్రామీణ యువత పని చేయుచు ఆయా వృత్తుల నభ్యసించు చున్నారు. డాక్టర్ గారి నేతృత్వములో ఈ శాఖలన్నీ ప్రశంసనీయముగా పనిచేయు చున్నవి. వారు అపారమైన మేధాశక్తి సంపన్నులు. సృజన శీలత కల్గిన సుజ్ఞానులు. బహుముఖ ప్రజ్ఞా దురంధరులు కావుననే, ఈ ప్రాజెక్టుకు సబంధించిన కార్యములను సంస్థల నన్నింటిని జయప్రదముగా నిర్వహించుచున్నారు.

★ ★ ★

బయో టెక్నాలజి ప్రాజెక్టు ప్రారంభము

(Prof. G. సత్యనారాయణ గారి నేతృత్వములో)

శాస్త్రీయ రంగములో నూతనమైన, అత్యాధునికమైన, విప్లవాత్మక మార్పులను తెచ్చి పెట్టినది బయోటెక్నాలజీ రంగము. గడ్డిపల్లి వ్యవసాయ క్షేత్రములో, దీని ఉనికి యొక్క ఆవశ్యకతను గుర్తించి ఆ దిశగా పావులు కదపబడినవి.

Prof. G. సత్యనారాయణ గారు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయము - రాజేంద్రనగర్, హైద్రాబాదులో హార్టీకల్చర్ విభాగమునకు శాఖాదిపతి గాను, ప్రొఫెసర్ గాను పని చేయునపుడు, మన కథానాయకుడు డా॥ గోపాలరెడ్డి గారికి అత్యంత సన్నిహిత మిత్రులు. ఇరువురు ఒకే గ్రామవాసులు; ఒకే విశ్వ విద్యాలయములో కలిసి పని చేసినవారు. గడ్డిపల్లి ప్రాజెక్టు ప్రారంభంలో డా॥ గోపాలరెడ్డి గారికి, వారు చేదోడుగా యుంటూ, చైతన్యవంతమైన పాత్రను పోషించినవారు. "మహాత్మాగాంధి లిఫ్టు ఇరిగేషన్ కో-ఆపరేటివ్ సొసైటి" స్థాపన లోను, నిర్వహణలోను, విశేషమైన సేవలను అందించినవారు. వీరు హైద్రాబాదులోనే కుటుంబ సమేతంగా నివాసముంటూ, తన బాధ్యతలను నిర్వహించుచు కూడా తడవ తడవకు గడ్డిపల్లిని సందర్శించుచు, M.G.L.I. సొసైటిలో క్రియాశీల వ్యవస్థాపక సభ్యులుగా అచటి పనుల నన్నింటిని పర్యవేక్షించే వారు.

శ్రీ సత్యనారాయణ గారిని గురించి ఇచట నాల్గు విషయములు తెల్సికొనుట అవసరం గాను, సందర్భోచితముగాను ఉండగలదని మనవి చేయుచున్నాను.

Prof. G. సత్యనారాయణ గారు ప్రప్రథమంగా డా॥ గోపాలరెడ్డి గారితో కలిసి, 1964 సం॥లో శ్రీ అరవిందాశ్రమంలో శ్రీమాతను దర్శించుకున్నారు. 1972 సం॥లో శ్రీ అరవిందుల జన్మ శతాబ్ధి సందర్భంగా వెడలినప్పుడు, శ్రీమాత వీరిని ఆశీర్వదించి, శ్రీ గోపాలరెడ్డితో కల్సి, గడ్డిపల్లిలో పని చేయాల్సిందిగా సెలవిచ్చారు. శ్రీమాత ఆజ్ఞను శిరసావహించి, డా॥ గోపాలరెడ్డి గారు చేయుచున్నట్టి పనిని దైవకార్యముగా భావించినారు. సదా వారికి సహకరించుటకు నిశ్చయించుకొన్నారు.

1992 సం॥లో Prof. G. సత్యనారాయణ గారు, తన ఆచార్య పదవి నుండి విరమణను పొందినారు. అంతకు పూర్వము వీరి పదవీ విరమణకు ఒక సంవత్సరం ముందు, ఆం.ప్ర.వ్య.వి.లో "ద్రాక్షపండ్ల"పై ఒక సెమినార్ జరిగినది. అందులో పాల్గొనిన మన Prof. G. సత్యనారాయణ గారు ద్రాక్ష పండ్లను రసాయనిక

ఎరువులు లేకుండా పండించుటకై మరియు ఇదే విధంగా ఔషధమొక్కలను (Medicinal Plants) కూడా సమృద్ధిగా పండించ వలసిన ఆవశ్యకతను వక్కాణించినారు.

ఉద్యోగ విరమణానంతరం Prof. G. సత్యనారాయణ గారు గడ్డిపల్లి ప్రాజెక్టు లోనే మన డా॥ గోపాలరెడ్డి గారితో కల్సి పని చేయుటకు నిర్ణయించుకున్నారు. వారు ఎన్నుకున్న పని ఆ వ్యవసాయ క్షేత్రంలో లేనిది, నూతనమైనది. అది "Tissue Culture Technology" మరియు "Bio-Technology" రంగములు. వీనిని అచ్చట అభివృద్ధి చేయాలని సంకల్పించినారు. దీనిని కూడా శ్రీమాత కార్యంగానే చేయుటకు సంసిద్ధులైనారు. వీరు, శ్రీమాత పలికినటువంటి ఒక మహావాక్యాన్ని - "Who ever is opened to the Mother, he is doing my yoga" ఆదర్శంగా ఎన్నుకున్నారు. అయితే పని ఎందుకు చేయాలి ? అను దానిపై కూడా వారి అభిప్రాయము స్పష్టముగా యున్నది.

"మనిషి యొక్క ప్రకృతి రూపాంతరం చెందుటకు పని చేయాలి".

"Transformation is possible with any one work" అన్నట్టి ఈ మహావాక్యంపై కూడా వారికి అచంచల విశ్వాసమున్నది. పని చేయుటకు పూనుకున్నచో అదీ శ్రీమాత కార్యంగా భావించి చేసినపుడు, దానికి కావలసిన శక్తి, ధనము అందిపుచ్చుకున్నట్లు, ధారా ప్రవాహంగా అవే తరలి వస్తాయన్నది వారి నమ్మకము.

ఈ సమాచారము, Prof G. సత్యనారాయణ గారిని గురించి నేను తెల్పిన భావజాలమంతా ఒకప్పటి వారి ప్రసంగ పాఠము నుండే గ్రహింప బడినది. అదెప్పు డందురేమో ! తేది : 30-9-2004 న, హైద్రాబాదులో నిర్వహింప బడిన "దేవ సంఘ దినోత్సవము" (దాదాజీ జన్మదిన సభ) సభలో వారి ప్రసంగపాఠమునుండే గ్రహింప బడినది. ఈ సందర్భములో తామెన్నుకున్న కార్యరంగమునకు చెందిన మరొక సత్యమును కూడా తెల్పినారు. "పూర్వం మహాభారతకాలంలో గాంధారి దేవి (దృతరాష్ట్రుని దేవేరి)కి నూరుమంది సంతానం కదా - వారెట్లు జన్మించారు ? Cloning వలన. అట్లే మొక్కలను కూడా యిదే పద్ధతిలో సృష్టించ గలమని అన్నారు. ఇదే పద్ధతిలో డా॥ కోలిన్ Vitamin Structure ను కనిపెట్టినారు" అని తెల్పి, "దానికి Divine grace కావాలని" తన ప్రసంగాన్ని ముగించారు.

గడ్డిపల్లి ప్రాజెక్టు పనులందు Prof. G. సత్యనారాయణ గారు శ్రద్ధాభక్తులతో

పని చేయుచున్న శ్రీమాత భక్తుడు. గడ్డిపల్లి ప్రాంత ప్రజలకు కూడా వారంటే ప్రేమాభిమానాలు మెండు. డా॥ గోపాలరెడ్డి గారికి ఎంత గౌరవమర్యాదలు యిచ్చెదరో, అంతటి ఆదరమును వీరిపై కూడాచూపించెదరు. 'మహాత్మాగాంధి లిఫ్ట ఇరిగేషన్' ప్రాజెక్టు పని ముగిసి అది విజయవంతంగా కొనసాగుటతో, వారు తమ దృష్టిని Bio-Technology Project పై మరల్చినారు. ప్రస్తుతము వారు హైద్రాబాదులో వుంటున్నా వారి ఆత్మ మరియు దృష్టి అంతా యిక్కడి ప్రాజెక్టు దాని పనులపైననే. దీనిని పూర్తి స్థాయిలో అభివృద్ధి పరచుటకు నెదర్‌లాండ్స్ ప్రభుత్వముతో సంప్రదింపులు జరిపి, వారి నుండి 75 లక్షల రూపాయలను గ్రాంటుగా సంపాదించి, ప్రాజెక్టుపై వెచ్చించి నారు. ఈ ప్రాజెక్టుకు చెందిన పనులను పర్యవేక్షించుటకు ఒక అధికారిని 30వేల రూపాయల మాసిక వేతనముపై నియామకం చేసినారు. దీనికి చెందిన పనులన్నీ సంక్లిష్టమైనవి. ఇక్కడి నిత్యవ్యవహారములను చూచుటకు, ఈ శాఖకు సంబంధించిన నైపుణ్యము గలవారి సలహాలు సదా అవసరమగును. వీరు హైద్రాబాదులో వుండి కూడా, ప్రతి అవసరమునకు వచ్చిపోవుచుందురు. వీరికి అక్కడకూడా చేయవలసిన పనులున్నవి. రాజేంద్రనగరంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయములో 'Organic Manure Section' ను నిర్వహించు చున్నారు. Verni Culture అనునది ఈ section లోని ఒక శాఖ. వారికేమో Horti culture విభాగము పట్ల మక్కువ. ఏ విధంగా చూచినను వారిలో ద్రవ్యకాంక్ష లేదు. తన మిత్రుని అభిమతము మేరకు తరచుగా గడ్డిపల్లి వస్తూ, పోతూ వుంటారు. Prof. G. సత్యనారాయణ గారుచాలా చైతన్యవంతమైన వ్యక్తిత్వం కలవారు. ఇక్కడి ప్రాజెక్టు పురోభివృద్ధి, సమాచారమును ఎప్పటికప్పుడు నెదర్‌ల్యాండ్ ప్రభుత్వమునకు తెలియబరచుచు, ఆర్థిక సహాయాన్ని అందుకొనుచు, గడ్డిపల్లి వ్యవహారములను సాఫీగా నడిపిస్తున్నారు. మధ్య మధ్య శ్రీ అరవిందాశ్రమమును సందర్శించుకొని దైవానుగ్రహమును పొందుతుంటారు. శ్రీమాతారవిందుల గ్రంథములను అధ్యయనం చేయుచుందురు.

ప్రయోగాత్మక పనులందాసక్తి

Prof. G. సత్యనారాయణ గారి దృష్టి, శ్రీ అరవిందుల బోధనలను ప్రయోగ పూర్వకంగా ఆచరణలో పెట్టుట యందే సదా లగ్నమై వుంటుంది. వారు సిద్ధాంత పరంగా శ్రీమాతారవిందుల గ్రంథాధ్యయనం ద్వారా చాలినంతగా జ్ఞాన సేకరణ

గావించు కొన్నారు. ఇపుడు వారి ఆలోచన ఆ జ్ఞానమును ప్రయోగ పూర్వకంగా అభివ్యక్త పరచుట ఎట్లు ? అనునదే. డా॥ గోపాలరెడ్డి గారితోపాటు మరొక ఆచరణాత్మక దృష్టి కలిగిన సాధకులు, కర్తవ్య నిర్వహణాపరులు మనకు లభ్యమైనందుకు మనం అదృష్టవంతులము వీరు ప్రదర్శనాపూర్వకముగా శ్రీ అరవిందుల బోధనలను అమలు పరచుచున్నారు. Prof. G సత్యనారాయణ గారు శ్రీ అరవింద తత్త్వ నిష్ఠాతులైన వారి ఉపన్యాసములను వినుటతో తృప్తి చెందరు; వీరు మిక్కిలి ఉపయోగితావాది (Pragmatist) యైన శ్రీ అరవింద భక్తుడు. తాను ఎంచుకున్న పని నొక్క దానినే గాక, గడ్డిపల్లి వ్యవసాయ క్షేత్రంలో Organic Manure (సేంద్రియ ఎరువుల) గ్రామీణ ఔషధ మొక్కల పెంపకం, విభాగములను కూడా పర్యవేక్షించెదరు. ఇక్కడొక విక్రయశాలను కూడా తెరచి, మొక్కలను కోరిన వారికి విక్రయించు వసతిని కూడా కలిగించినారు. ఈ విభాగములను కూడా వారే పర్యవేక్షించుచున్నారు.

'బయో టెక్నాలజి ఇన్‌స్టిట్యూట్, గడ్డిపల్లి'

Prof. G. సత్యనారాయణ గారు 75 సం॥ల వయస్సు కల్గి, వివిధ రంగము లందు కొరత లేకుండా పనులను చక్కబెట్టుచున్నారు. హార్టికల్చర్ రంగములో వారు సృజనాత్మక ప్రతిభాసంపన్నులు. ఉద్యోగ విరమణానంతరం అదే విశ్వవిద్యాలయంలో వీరికి తిరిగి ఉద్యోగమును యివ్వగా, వారు తిరస్కరించినారు. శ్రీమాత ఆదేశానుసారము గడ్డిపల్లికి తరలి వచ్చినారు. అచటి వ్యవసాయ క్షేత్రములో నూతన రంగమును ఆవిష్కరించ సమకట్టినారు. తన అభిమాన రంగము, బయో టెక్నాలజీని నెలకొలిపి, నూతన జ్యోతిని వెలిగించినారు. దీనినిట్లు కొనసాగించుచునే, మధ్య మధ్యన మేధోపరమైన సృజనాత్మక వ్యాసాలను, దేశంలోని 'హార్టికల్చర్' పత్రికలకు పంపుచుంటారు. వృక్షశాస్త్ర సంబంధ హార్టీకల్చర్ శిబిరాలలోను, సమావేశాలలోను పాల్గొను చుంటారు. ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త అయిన శ్రీ స్వామినాధన్ గారి వీరాభిమాని వీరు. ఆ శాస్త్రవేత్త, వివిధ సందర్భములలో ప్రచురించిన విలువైన వ్యాసములను పత్రికలలో చదివి ప్రేరణ పొందుతారు. వారి కుమారులు, కుమార్తె లందరు విదేశాలందు, వివిధ ఉద్యోగములను చేయుచున్నారు.

బయో టెక్నాలజి ప్రాముఖ్యత

ప్రస్తుత కాలమున శాస్త్రీయ రంగములో ఈ బయోటెక్నాలజికి గల ప్రాముఖ్యతను, గుర్తింపును వారు క్షుణ్ణంగా ఎరుగుదురు. ఇంతకు ఈ బయో టెక్నాలజి

అంటే ఏమిటి ? విత్తన గింజల అవసరం లేకుండ లేతమొక్కలను సృష్టించుదురు. ప్రయోగశాలలో మొక్కలను సృష్టించే శాస్త్రమును 'బయో టెక్నాలజీ' అని అందురు. మనకు అనేక విధములైన ప్రయోగశాలల విభాగముల ఆవశ్యకత గలదు. ఈ పద్ధతిలో ఏదేని ఒక ఆకు యొక్క చిన్న కణమును తీసికొని, దానిని ఏర్ కండిషన్ గదిలో వివిధ రకములైన పద్ధతుల ద్వారా భద్రపరచినచో, క్రమంగా దానికి చిన్న ఆకు పుట్టుకొచ్చును. ఆ ఆకును తీసి, దాన్ని మరొక తొట్టిలో పెట్టి ప్రయోగ పద్ధతిని కొనసాగించినపుడు, దానికి సన్నని కాండము యేర్పడగలదు. పిమ్మట దానిని మరొక తొట్టిలోనికి మార్చుగా, దానికి సన్నని వ్రేళ్లు యేర్పడగలవు. ఇట్లు చూడగా, ప్రతి ఆకు కణములో మొత్తము చెట్టు నిక్షిప్తమై యున్నది. ఇదే విధానమును జంతువుల పై కూడా ప్రయోగించవచ్చును. పాశ్చాత్యదేశములలో ఈ పద్ధతి ననుసరించి, మేక పిల్లలను కూడా సృష్టించినారు. మానవులపై ఈ ప్రయోగము నిషేధించ బడినది. ఇది ఒక ప్రమాద భరిత ప్రక్రియ.

బయోటెక్నాలజీ పురోగతి :

గద్దిపల్లిలో బయోటెక్నాలజీ ప్రయోగశాలను స్థాపించిన నాటి నుండి, వివిధ ప్రయోగాలను చేపట్టి, విజయవంతంగా నిర్వహించుచు, అద్భుతాలను ఆవిష్కరించినది. విత్తన గింజలు లేకుండానే మొక్కలను పెంచుచు, ఆ పనిలో ఆసక్తి గల యువతకు శిక్షణ నిచ్చుచున్నది. అపూర్వ అద్భుతములను ఆవిష్కరించుచున్న ఈ ప్రక్రియను విస్తరించ వలయునన్న సదాశయముతో Prof. సత్యనారాయణ గారు గద్దిపల్లిలో "బయో టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్"ను స్థాపించవలయునని సంకల్పించినారు. అందుకు స్పందించిన డా॥ గోపాలరెడ్డి గారు దానికి కావలసినంత స్థలమును సమకూర్చుటకు సంసిద్ధతను ప్రకటించినారు. గద్దిపల్లి, దాని పరిసర గ్రామములందున్న వివిధ సొసైటీలు ముక్త కంఠంతో ఈ ప్రతిపాదనకు స్వాగతము పలికి, తమవంతు సహకారమును చేకూర్చుటకు దీక్షా కంకణ ధారులైనారు. స్థాపనా ప్రక్రియ ప్రారంభమైనది. దీనితో గద్దిపల్లి శాస్త్రీయ రంగ ప్రపంచములో పటిష్టమైన స్థానమును పదిలపరచుకొన నున్నది. ఈ ప్రాజెక్టును నెలకొల్పుటలో ఆదిలోనే అవసరమైన చేయూతనిచ్చిన నెదర్లాండు ప్రభుత్వమునకు, మన కృతజ్ఞతలను తెల్పుకొని, భవిష్యత్తులో యిచటి విద్యార్థులకు ఉన్నత విద్య, పరిశోధనా రంగములందును ప్రాధాన్యత నొసగి, సహకరించ గలదని ఆకాంక్షించు చున్నాను. ఈ యిరువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు శ్రీమాత ఆశీర్వాదములు పొందినవారు. వారు చేయు ప్రతి పనిలోను, శ్రీమాత వారికి సాఫల్యతను సిద్ధింప చేయుచున్నది.

Prof. G. సత్యనారాయణ గారు సాధారణ ఆచార్యులు మాత్రమే కాదు; బహుముఖ ప్రజ్ఞావంతులైనట్టి మేధావి. వారు శ్రీమాత యొక్క ఆశీస్సులను అనుగ్రహమును అందుకున్న భక్తుడు. తనకు చెందిన కార్యక్షేత్రము నందు సమర్థ వంతమైన ప్రజ్ఞాధనులు. "వెర్మికల్చర్"ను అటు రాజేంద్రనగర్‌లోను, ఇట్లు గద్దిపల్లిలోను నిర్వహించు చున్నారు. అంతేకాక, గ్రామీణ ఔషధ మొక్కల పెంపకము నందు కూడా ప్రావీణ్యము గలవారు. "మహాత్మాగాంధి లిఫ్టు ఇరిగేషన్" ప్రాజెక్టు పనులందు విలువైన సలహాల నందించి, నిరాటంకముగా కొనసాగుటకు నిరంతరము తోడ్పడు చున్నారు. వారి యొక్క కృషి మూలంగా 'గద్దిపల్లి' సమీప భవిష్యత్తులో శాస్త్రీయ రంగము నందు మహోన్నత స్థితికి చేరనున్నది.

★ ★ ★

డా॥ మన్మోహన్ రెడ్డి గారి నుండి అందిన ప్రోత్సాహము

డా॥ గోపాలరెడ్డి గారు శ్రీ మాతారవిందుల మార్గము ననుసరించుటకు ముఖ్య ప్రేరణ, వారు అమెరికాలో ఉన్నత విద్యనార్జించు సమయమున, శ్రీ అరవిందా శ్రమం నుండి అరుదెంచిన శ్రీ అరవిందుల శిష్యులు శ్రీ ఎ.బి. పురాణి, హైద్రాబాదు నుండి వచ్చిన మరొక శిష్యుడు శ్రీ వి. మదుసూధన్ రెడ్డి, ప్రొఫెసర్ ఉస్మానియా విశ్వ విద్యాలయము వారల ప్రబోధాత్మక ఉపన్యాసములు వినుట – వీరిద్దరి ఉపన్యాసములు విని శ్రీ అరవిందుల తత్వమునకు ఆకర్షితులైన శ్రీ రెడ్డి గారు స్వదేశమునకు తిరిగి వచ్చిన తర్వాత శ్రీ మదుసూధన రెడ్డి గారిని కల్సినారు. శ్రీ మాతారవిందుల ఆశ్రమాన్ని సందర్శించినారు. అమ్మకు శరణాగతులైనారు. ఇక్కడ మనకు శ్రీ మదుసూధన రెడ్డిని గూర్చి కొంత తెలియవలసిన అవసరమున్నది.

నల్లగొండ జిల్లా నారాయణ పూర్ సంస్థానములోని జూలూరు గ్రామంలో శ్రీ వెదిరె నరసింహారెడ్డి శ్రీమతి నరసమ్మ దంపతులకు 6 గురు కుమారులు, 3 కుమార్తెలు. వీరిది సంపన్న కుటుంబము. చాలినంత భూవసతి కలిగినవారు. శ్రీ మధుసూదన రెడ్డి మగవారిలో 5వ సంతానము; ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆచార్యులు. 4వ సంతానమైన వీరి అన్నగారు శ్రీ మన్మోహన్ రెడ్డి. శ్రీమాతారవిందుల భక్తులు. వీరిద్దరు శరీరములు వేరైనా ఆత్మ ఒక్కటిగా గల అపూర్వ సహోదరులు. వీరి కుటుంబము శ్రీ వినోబా భావే గారిని తమ గ్రామానికి ఆహ్వానించి 500 ఎకరముల భూమిని దానముగా యిచ్చి "భూదాన ఉద్యమానికి" ఆద్యులైనారు. ఈ సోదరులు యిర్వురు మనకథానాయకునికి రెండు భుజములుగా మెలగి గడ్డిపల్లి ప్రాజెక్టునకు ఘనమైన సేవలందించిన ఆదర్శప్రాయులు.

డా॥ మన్మోహన రెడ్డి సహస్రచంద్ర దర్శనము గావించు కొనిన ధన్యులు. ఇప్పుడు 88 వసంతాలు నిండిన భాగ్యశాలి. వారు తమ కుటుంబ సమేతంగా, శ్రీమాత సన్నిధిలో, శ్రీ అరవిందాశ్రమమందు నివాసముంటున్నారు. వారు ఉస్మానియా విశ్వవిద్యాలయము నుండి "వేదార్థ వ్యాఖ్యానము – శ్రీ దయానందులు – శ్రీ అరవిందులు", అను అంశముపై పరిశోధన చేసి Ph.D.పట్టాను పొందిన పండితుడు.

గడ్డిపల్లిలోని ప్రాజెక్టుల ప్రారంభదినములలో డా॥ గోపాలరెడ్డికి తోడుగా నున్నారు. శ్రీమాత స్వయముగా గడ్డిపల్లిలో డా॥ గోపాలరెడ్డికి సహకరించవలసినదని, లిఖిత పూర్వకంగా ఆదేశించి యున్నారు. వారు స్వయముగా రైతుబిడ్డ. తమ కుటుంబ వ్యవసాయ క్షేత్రమున, భారీయెత్తున వ్యవసాయమును చేపట్టిన అనుభవజ్ఞులు. శ్రీమాత ఆదేశానుసారము గడ్డిపల్లి చేరి, అచటి సువిశాల వ్యవసాయ క్షేత్రములను చుట్టి వచ్చి, అచటి సమస్యలన్నింటిని ఆకళింపు చేసుకొన్న సునిశిత మేధావి.

గడ్డిపల్లిలో M.G.L.I. ప్రాజెక్టు క్రింద నున్న ఆరు గ్రామాలకు చెందిన భూములను చదును పరచి, సమిష్టి వ్యవసాయ క్షేత్రముగా రూపొందించుట జరిగినది. ఈ విధముగా చేయుటలోని ఆంతర్యము – ప్రతి రైతుకు ఉన్నటువంటి భూమి చిన్న కమతాలలో నుండుట వలన సాగుకు లాభదాయకము గాకుండెను. గిట్టుబాటు కాని కమతాలను ఏక ఖండముగా చేసి వ్యవసాయమును సాగించుట వలన ఆశించిన లాభములు అందుకొన గలమను ఉద్దేశ్యంతో, అందరు ఆలోచించి సమిష్టి వ్యవసాయమునకు అంగీకరించుట జరిగినది. నీటి వసతి లేని తమ భూమలకు 'ఎత్తిపోతల' ద్వారా నీరు అందుచున్న ఉత్సాహములో అందరి అభిప్రాయము ఒక్కటై ఈ నిర్ణయమునకు వచ్చుట జరిగినది. ఏ రైతు కూడా తమ అసమ్మతిని ప్రకటించ లేదు.

సమిష్టి వ్యవసాయ నిర్వహణ :

గడ్డిపల్లి ప్రాజెక్టులో భాగస్వామ్యము కలిగిన 6 గ్రామములకు చెందిన మొత్తము ఆయకట్టు విస్తీర్ణము 6,600 ఎకరములు. దీనిని 4 ఖండములు (సెక్టార్లు)గా విభజించి, శ్రీమాత యొక్క 4 శక్తుల పేర్లు పెట్టినారు. 1. మహేశ్వరి సెక్టారు, 2. మహాకాళి సెక్టారు, 3. మహాలక్ష్మి సెక్టారు, 4. మహాసరస్వతి సెక్టారు. ఈ విధంగా యేర్పడిన సువిశాలమైన 4 సెక్టార్లకు, 4గురు మేనేజర్లను యేర్పాటు చేసినారు. తమ తమ సెక్టార్లలోని భూమిలో సాగుకు సంబంధించిన సమస్యలను పరిష్కరించి, పనులను జరిగేటట్లు చూచు బాధ్యత వారిది. వీరు నలుగురు ఎప్పటికప్పుడు జరుగు చున్న పనులను డా॥ గోపాలరెడ్డి గారికి వివరించి, తగు సలహాలను పొందుదురు. ఇక వ్యక్తిగత వ్యవసాయమే లేదు. ఆ భూమి అంతా సమిష్టి వ్యవసాయ క్షేత్రముగా భాసిల్లునది. రైతులందరకు ఇదొక నూతన అనుభవము. ఆనందోత్సాహాలు వెల్లి

విరియగా, రైతాంగం పరిశ్రమించి సమిష్టి సాగును సలక్షణంగా కొనసాగించారు. పంట దిగుబడి కూడా రైతులకు సంతృప్తిని కలిగించింది. కాని ఈ సంతోషము ఎంతో కాలము నిలువలేదు. మానవ మస్తిష్కములో మరో రకమైన ఆలోచన చోటు చేసికొన్నది. ఆ మహమ్మారి పేరు 'స్వార్థచింతన'. ఈ భావనకు తెరలేచి, అది ఏ ఒక్కరిలో నైనా అంకురించినచో, నిశ్శబ్దముగా అందరికి అంటుకుంటుంది. అందులో ఆశ్చర్యమేమి లేదు కదా ! ఇక్కడ ఈ వ్యవస్థలో నిస్వార్థపరుడు, రైతాంగ హితవరి అయిన డా॥ గోపాలరెడ్డి గారి నాయకత్వంలో దీనికి ఆస్కారముండకూడదని ఆశించుట సహజము.

సమిష్టి వ్యవసాయం లోని లోపములు :

మానవుడు ఎంతైనా ఒక అపరిపక్వ జీవి మాత్రమే. అతడు పుట్టుక మొదలు, ప్రకృతి రీత్యా స్వార్థజీవి. గడ్డిపల్లి ప్రాజెక్టు వ్యవహారములు ప్రారంభంలో మహోత్సాహముగా నడచినవి. రానురాను మానవనైజంలో మార్పులు చోటు చేసికొనుట, కొన్ని సెక్టార్లలోని మేనేజర్లు, వారి సహాయకులు స్వార్థ బుద్ధి ప్రేరేపితులై, తప్పుడు లెక్కలు వ్రాయుట కుపక్రమించినారు. ఈ భావన యింతటితో ఆగలేదు. అలవాటు పడిన ప్రాణం. మరెక్కడెక్కడ యిలాంటి వానిని దొర్లించ వచ్చునను ఆలోచనలే వారి మదినిండా నిండి, ఆ విధమైన అనువైన అంశముల అన్వేషణతోనే కాలము గడుచుటతో తమ తమ సెక్టార్ల శ్రేయస్సును గాలికి వదలి వేసినారు. వ్యవసాయ కూలీల నియామకం – 100 మందిని నియమించి, లెక్కలో 150 మందిని చూపించి, అదనపు ధనమును కాజేసేవారు. క్రమముగా ఈ దుష్ట సాంప్రదాయం అన్ని సెక్టార్లకు విస్తరించినది. సమిష్టి సంపద స్వార్థపరుల పాకెట్లలోకి ప్రవేశించెను. ప్రతివారిలోను యిదే భావన ప్రబలినది. పవిత్ర ఆశయ సాధనకు గండి పడినది. ఇక్కడ ఈ రకమైన కలుషిత స్థితి మూలముగా, సమిష్టి సాగు పద్ధతి ఆశించిన ఫలితాలను అందివ్వలేదు సరికదా, వ్యవస్థ మొత్తము నష్టముల ఊబిలో కూరుకపోయినది. పరిస్థితులు అదుపు తప్పి, ఏ మాత్రం ఆశాజనకంగా లేని స్థితి దాపురించినది.

డా॥ మన్మోహన రెడ్డి గారి రంగ ప్రవేశం :

ఈ రకమైన మానసిక పరివేదనను మిగిల్చిన ఈ సున్నిత తరుణంలో,

శ్రీమాత ఆదేశానుసారం ఆశ్రమం నుండి అరుదెంచారు డా॥ మన్మోహన్ రెడ్డి గారు. వీరు పూర్వరంగంలో కొంతకాలము సమర్థవంతముగా సాగుచేసిన కృషీవలుడు. గడ్డిపల్లి వ్యవసాయ క్షేత్రంలో అడుగిడిన తొలిరోజే రోగము యొక్క మూలమును పసికట్టి అవగాహన పరచుకున్నారు. దోషము ఎక్కడ దొర్లుచున్నదో తెలిసినది. గడ్డిపల్లి వ్యవసాయ క్షేత్ర స్థితిగతులను కరతలామలకము గావించుకొని, తన అవగాహన కందిన వానిని విపులముగా, నివేదిక నొక దానిని సిద్ధపరచి, శ్రీ అరవిందాశ్రమ కార్యదర్శియైన శ్రీ నళినీకాంత గుప్త గారికి పంపించినారు. అందులో సమిష్టి సాగులో దొర్లిన దోషములను చర్చించి, విపులీకరించినారు. ఈ విషయములన్నిటిని డా॥ గోపాలరెడ్డితో సమాలోచన సాగించి, మానవ నైజాన్ని మార్చలేమని, స్వచ్ఛతను సాధించుట, ఈ దశలో సాధ్యం కాదని వారికి నచ్చచెప్పినారు. తక్షణం చేపట్టవలసిన చర్య ఏకైక మార్గము, సమిష్టి వ్యవసాయమునకు స్వస్తి పలికి, పూర్వపు వ్యక్తిగత కమతాలనే ప్రమాణంగా గైకొని, సాగును పునరుద్ధరించుట జరగాలని, దాదాజీ నిర్మోహమాటంగా డా॥ గోపాలరెడ్డికి వివరించుట జరిగినది. వారు కూడా భేషజాలకు పోకుండా, తనకన్న పెద్దవాడు, వ్యవసాయరంగంలో విశిష్టమైన అనుభవజ్ఞుడు, క్షేత్ర స్థాయిలో ప్రయోగాత్మక పరిజ్ఞానం పుష్కలంగా గల్గినవాడు, విద్యావ్యాసంగంలోను తనకు సాటియగు పరిశోధనా (Ph.D.) పట్టభద్రుడు అయిన డా॥ మన్మోహనరెడ్డి మాటలను మన్నించి, సమిష్టి సాగు స్థానములో క్రమక్రమముగా పూర్వపు వ్యక్తిగత రైతు కమతాల సాగును పునరుద్ధరించుట జరిగినది.

శ్రీ మాతారవిందుల తత్త్వ పరిజ్ఞానము రైతులకు కల్పించుట :

శ్రీమాత అనుగ్రహం వలన గడ్డిపల్లి వ్యవసాయ క్షేత్రంలో ప్రవేశపెట్టిన నూతన మార్పులు, అందరికి ఒక కుదుపునిచ్చినవి. రైతాంగములో కొందరకు ఖేదము మరికొందరకు మోదము కల్గించినవి. అంతా తిరిగి ఈ నూతన వ్యవస్థకు అలవాటు పడవలసియున్నది. వానికి కావలసినది ముందుగా మానసిక వైజ్ఞానిక మార్పు. రైతులందరకు ఈ దిశగా చికిత్స కావలయునని దాదాజీ తలచినట్లున్నది. అందుకొరకు రైతులందరకు, శ్రీమాతారవిందుల జీవిత విశేషములు, వారి తత్త్వ జ్ఞానము నందించుటకు వారు ఎంతగానో కృషి చేసినారు.

ప్రప్రథమముగా వారు 'శ్రీ అరవిందుల జీవితము'ను రచించి, ప్రచురించి నారు. ఏకముగా 3 వేల కాపీలను ముద్రించి రైతాంగమునకు అందించినారు.

అంతవరకు ఆనోట, ఈనోట ఆశ్రమ విషయాలు విని వున్నారే కాని ప్రత్యక్షంగా వారు తెల్సికొన్నదేమి లేదు. ఈ గ్రంథము వారి ఆలోచనా సరళిలో అద్భుతమైన మార్పు కల్గించినది. ఆ తర్వాత ఒక్కొక్కటిగా మరికొన్ని పుస్తకములు వెలుగు చూచినవి. ఈ విధంగా శ్రీ మాతారవిందులకు సంబంధించిన సాహిత్య పరిచయము రైతాంగమునకు కల్గినది. అది వారిలో పఠనాసక్తిని పెంపొందించినది.

ద్వితీయ చర్యగా దాదాజీ చేపట్టిన మరొక కార్యము ఈ సాహిత్య పరిచయ పఠనములలో ఎదురైన క్లిష్టతలను తొలగించి, సందేహములను నివృత్తి చేయుట సముచితమని భావించారు. అందుకొరకు దాదాజీ శ్రీ కె.యస్. భాస్కరరావును అక్కడకు పిలిపించినారు. వారి పని అక్కడి శ్రీ అరవింద హైస్కూలులో విద్యార్థులకు, శ్రీ అరవింద మందిరములో పెద్దలకు, రైతులకు, శ్రీ అరవిందుల జీవిత విశేషములను తెలుపుట, రైతులు తాము చదివిన గ్రంథములలో తలెత్తిన సందేహములను తొలగించుట. శ్రీ కె.యస్. భాస్కరరావు గారు రైతులకు చేరువై వారికి అనేక విషయములను తెలిపెడి వారు. ప్రతి నిత్యము ఉదయ సాయంకాల సమయములందు శ్రీ మాతారవిందుల స్తోత్ర పాఠములను చదువుచూ అందరి హృదయములందు, శ్రీమాత పట్ల భక్తిభావమును జాగృతము గావించినారు.

కాలక్రమములో రైతులకు శ్రీ భగవద్గీతా జ్ఞానము నందించుటకు, దాదాజీ వేల్పూరు (నిజామాబాద్ జిల్లా) నుండి శ్రీ నరసింహం గారిని పిలిపించి, ప్రతిదిన మొక్క అధ్యాయమును చెప్పించినారు.

రైతులు ఒక్కొక్క విషయమును గ్రహించి సాహిత్య పిపాసను తీర్చుకొనుచు, శ్రీమాతారవిందుల మహిమలు తెల్సికొన్నారు. శ్రీమాతారవిందులకు సంబంధించిన మరిన్ని విషయములను తెలియపరచుటకు వీలుగా హైద్రాబాదు నుండి శ్రీ కె.వి.ఆర్. సంజీవరావు గారిని దాదాజీ పిలిపించినారు. శ్రీమాతారవిందుల విషయమును నెలకొక్కచోట చెప్పుటకు వారు అంగీకరించినారు. అక్కడ మొత్తము 21 లిఫ్టు ఇరిగేషన్ ప్రాంతములున్నవి. వానిలో ఒక్కొక్క నెలకు ఒక్కచోట ఒకటి రెండు రోజులుండి చెప్పుటకు యేర్పాటు జరిగినది. దాదాజీ శ్రీకారం చుట్టిన ఈ కార్యక్రమాలన్నిటి వలన, ఇచటి బీడు భూములకు సాగర్ నీరు అందిన విధముగా, ఇచటి రైతుల మనస్సులకు శ్రీ మాతారవిందుల జ్ఞాన గంగ అంది వారిని పునీత మొనరించినది. ఆ తర్వాత గడ్డిపల్లిలో యేర్పడిన చైతన్య పూరిత వాతావరణమును మరింత ముందుకు తీసుకొని పోవుటకు దాదాజీ మరో ప్రయత్నము చేసినారు.

వివిధ ప్రాంతముల నుండి శ్రీ అరవింద తత్త్వ నిష్ణాతులను ఆహ్వానించి, ఒక శిబిరమును నిర్వహింప చేసినారు. రైతులందు మనోవైజ్ఞానిక మార్పును కలిగించినారు. డా॥ మన్మోహనరెడ్డి గారు గడ్డిపల్లి రావడం ఒక నూతన అధ్యాయమునకు తెరతీసినట్లయినది. ఇది దైవ సంకల్పం. శ్రీమాత అనుగ్రహము వలన రావలసినవన్నీ సమకూరగలవనుటకు చక్కని నిదర్శనము.

డా॥ మన్మోహనరెడ్డి "శ్రీమాత చరణ సన్నిధిలో నా జీవితం" పేరున 2000 సం॥లో ప్రచురించిన గ్రంథములో "గడ్డిపల్లితో నా అనుబంధం" అని ఒక అధ్యాయంలో పేర్కొన్న విషయాన్ని యిక్కడ ఎత్తిచూపుట వలన పాఠకులకు మరిన్ని విషయములు ప్రత్యక్షంగా అందగలవని భావించి ఈ దిగువన చేర్చుచున్నాను.

మరొక అంశము – 'దివ్య జనని' నుండి వారికి గడ్డిపల్లిలో పని చేయుమని అందిన వ్రాతపూర్వక ఆదేశము (ఆంగ్లంలో) మరియు దానికి తెలుగు అనువాదమును కూడా చేర్చినాను.

గడ్డిపల్లితో నా అనుబంధం :

"శ్రీ ఘంటా గోపాలరెడ్డి గారు అమెరికాలో వ్యవసాయంలో పి.హెచ్.డి. పూర్తిచేసి (1969లో) తిరిగి రాగానే గడ్డిపల్లిలో (నల్గొండ జిల్లా) మహాత్మాగాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమును ప్రారంభించారు. ఆయన అమెరికాలో వుండగా శ్రీ అరవిందుల సీనియర్ శిష్యులలో ఒకరైనా శ్రీ ఎ.బి. పురానీ, మా తమ్ముడు డా॥ మధుసూధన్ రెడ్డి శ్రీ అరవిందులపై ఇచ్చిన ఉపన్యాసాలకు ప్రభావితుడు అయ్యాడు. ఇపుడతడు శ్రీమాతరవిందుల భక్తుడు. రెండు సంవత్సరాల కాలం నేను గడ్డిపల్లిలలో ఆయనతో కలిసి పనిచేసాను. నేను గడ్డిపల్లిలోని శ్రీ అరవింద స్కూలు హెడ్మాస్టరుగా, డిపార్ట్ మెంటల్ స్టోర్స్ కన్వీనర్‌గా పనిచేసాను. అక్కడి నుండి నేను చాలా మందిని శ్రీ అరవిందాశ్రమానికి తీసుకొని వెళ్తుండేవాడిని. 1970లో "శ్రీ అరవిందోస్ యాక్షన్" పేరుతో 'మదర్' ఆశ్రమంలో ఒక సంస్థను ప్రారంభించారు. ఆ సంస్థ తరపున గడ్డిపల్లిలో పనిచేసేందుకు 'మదర్' నాకు అనుమతిని ప్రసాదించారు. ఆ సమయంలో తెలుగులో 'శ్రీ అరవిందుల జీవితం' అన్న గ్రంథాన్ని 3000 ప్రతులు ప్రింటు చేయించాము. ఎన్నో సెమినార్లు నిర్వహించాము. 'దివ్యజ్యోతి' పేరుతో ఒక సావనీరును వేయించాము. శ్రీ టి. నర్సింహం అనే ఒక పండితుడిని శ్రీ అరవిందుల సందేశాలను ఆ ప్రాంతంలోని ప్రజలకు అందించేందుకు నియమించి అతనితో ఉపన్యాసాలను ఇప్పించాము. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీము క్రిందికి వచ్చే ఎనిమిది

గ్రామాలలోనూ, సహకార పద్ధతిపై నిత్య జీవితావసరాలకు పనికివచ్చే సరుకులు సరఫరా చేసేందుకు స్టోర్సును ఏర్పాటు చేయదలచాము. నేను ప్రతిగ్రామాన్ని సైకిల్‌మీద వెళ్ళి సందర్శించి అక్కడి ప్రజలలో సన్నిహిత సంబంధం కల్పించుకున్నాను. **1972లో శ్రీ అరవిందుల శతజయంతి సందర్భంగా శ్రీ అరవిందుల పవిత్ర అవశేషాలను గడ్డిపల్లిలో ప్రతిష్ఠించాము. ఈ మహాక్రతువుకు ఉదార్‌పింటో అనే ఆశ్రమ సీనియర్ సాధకులు గడ్డిపల్లి వచ్చారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో అక్కడి సంప్రదాయానికి అనుగుణంగా ఒక జాతర లాంటిది జరిగింది. శ్రీ గోపాల్‌రెడ్డి గారు అత్యంత ఉత్సాహవంతులు. శ్రీమాతారవిందుల పట్ల ఎనలేని భక్తి విశ్వాసాలు** కలవారు. అతని జోక్యంతో వ్యవసాయ పనుల కోసం ఆ ఎనిమిది గ్రామాల భూమినంతటిని నాలుగు భాగాలుగా అంటే మహేశ్వరి, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి సెక్టార్‌లుగా విభజించారు. ప్రైవేటు వ్యవసాయ భూము లన్నింటి అభివృద్ధి చేసి, సాగు చేసేందుకు చిన్నచిన్న సెక్టార్లుగా విభజించి సమిష్టిగా పనులు ప్రారంభించారు. అన్నింటినీ కలిపి ఒక సమిష్టి ఖోరంగా తీర్చిదిద్దాలని గోపాల్‌రెడ్డి తపన. ప్రతి సెక్టారులోనూ వ్యవసాయ పనులను పర్యవేక్షించేందుకు నలుగురు సూపర్‌వైజర్లను నియమించారు. ఒక మినియేచర్ సమిష్టి వ్యవసాయ క్షేత్రాన్ని రష్యా పద్ధతిలో ప్రారంభించారు. అయితే ఈ బలవంతపు సమిష్టి వ్యవసాయ క్షేత్రానికి నేను సుముఖంగా లేను. మానవుడు ఇంకా అంత ఎత్తుకు ఎదగలేదు. అతడు స్వాభావికంగానే స్వార్థపరుడు. 'నాది' అనుకున్నపుడే కష్టపడి పనిచేస్తాడు. 'మనది' అనుకొని కష్టపడి పనిచేయగల స్థాయికి అతడింకా చేరుకోలేదు. అలాంటి సమిష్టి భావన మంచిదే. ప్రోత్సాహం కూడా వుండాల్సిందే. కానీ మానసిక స్థాయి ఇంకా అంత పరిపక్వస్థితికి చేరని కారణంగా ఇలాంటి ప్రయోగాలు విజయవంతం కావడానికన్నా, అపజయం, అపఖ్యాతి పాలుకావాడానికే అవకాశాలు మెండుగా వుంటాయి. అందుకోసం ఆసక్తి ఉండడం వేరు. ఆచరణ వేరు. అందుకే నేనీ విషయంలో అంతగా సుముఖత వ్యక్తం చేయలేదు.

ఇంక ఈ సమిష్టి వ్యవసాయక్షేత్రాలలో పనిదొంగలు బయలుదేరారు. అవినీతి పరులు తయారయ్యారు. ఎరువుల బస్తాలు కొద్దిమొత్తంలో ఉపయోగపడి, పెద్దమొత్తం బ్లాక్ మార్కెట్‌కు చేరుకొనేవి. కొద్దిమందిని పనిలోకి తీసుకొని ఎక్కువమంది కూలీలను నియమించినట్లు కాకి లెక్కలు చూపి మిగిలిన డబ్బును స్వాహా చేసేవారు సూపర్‌వైజర్లు. ఈ సమిష్టి వ్యవసాయానికి పురిట్లోనే సంధికొట్టింది. ఒక్క సంవత్సరంలోనే అది

ఫెయిల్ అయి నష్టాలు చవిచూసింది. అవినీతి నెమ్మదిగా వేళ్ళూనింది. లిఫ్ట్ ఇరిగేషన్ వారు బ్యాంకుల నుండి ఋణాలు తేవడమే గానీ, తిరిగి చెల్లించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఏ ఒక్కరూకూడా చిత్తశుద్ధి, నిజాయితీ ఉన్నవారు కన్పించ లేదు. వెంటనే ఎవరి భూముల్ని వారికిచ్చేసారు. మొదటి నుండి ఈ బలవంతపు సమిష్టి వ్యవసాయాన్ని నేను వ్యతిరేకిస్తూనే ఉన్నాను. ఈ విషయంలో నళినీ దాకు కూడా నా అభిప్రాయం వ్రాసాను. ఏది ఏమైతేనేం, సమిష్టి వ్యవసాయాన్ని కొనసాగించేందుకు స్వస్తిచెప్పి, ఎవరి భూముల్ని వారినే చేసుకోమని తిరిగి ఇచ్చేసారు.

ఏది ఏమైనా, సమిష్టి వ్యవసాయాన్ని ఇంత పెద్దఎత్తున నిర్వహించి అందులోని బాగోగులను ఎత్తి చూపిన ఘనత డా॥ గోపాల్ రెడ్డి గారికే దుక్కుతుంది. అంతేకాదు, బీడు భూములుగా, ఊసరవెల్లి క్షేత్రాలుగా పడివున్న ఆ భూముల్ని లిఫ్ట్ ఇరిగేషన్ పేరుతో ఎంత సారవంతం చేయవచ్చునో చూపిన ఘనత కూడా వారికే దక్కింది. ఆయనొక గొప్ప ఆదర్శవాది. ఒక స్వాప్నికుడు. ఒక దార్శనికుడు. స్వార్థమెరుగని నిరాడంబర జీవి. రైతుబాంధవుడు. ఇప్పటికీ ఆయన శ్రీఅరవింద కృషి విజ్ఞాన కేంద్రాన్ని నెలకొల్పి, ఆ ప్రాంతంలోని రైతులకు నిస్వార్థంగా సేవ చేస్తున్న ధన్యజీవి – ఈ కేంద్రానికి విదేశీసాయం అందే ఏర్పాట్లు కూడా జరిగాయి. వ్యవసాయంలో అధునాతన పద్ధతులను పరిచయం చేస్తున్నారు. ఈ మహాయజ్ఞంలో శ్రీ గోపాల్‌రెడ్డి గారికి మరో రిటైర్డ్ హార్టీకల్చర్ ప్రొఫెసర్ శ్రీ జి. సత్యనారాయణ సహాయకులుగా ఉండి తన చేయూతనిస్తున్నారు. వీరిద్దరి కృషి ఫలించాలని, ఆ ప్రాంతం అభివృద్ధి చెంది, అక్కడి గ్రామస్థులు, ఇతర ప్రజలూ సుఖశాంతులతో వర్ధిల్లుగాక యని ఆకాంక్షిస్తున్నాను."

★ ★ ★

శ్రీ అరవిందాశ్రమ ట్రస్టు నుండి
డా॥ గోపాలరెడ్డి పేరున అందిన ఆదేశము :

SRI AUROBINDO ASHRAM TRUST

Telegrams :
AUROBINDO - PONDICHERRY

PONDICHERRY - 2
S. India

21st October, 1970

Dear Doctor Gopal Reddy,

In continuation to my letter dated 20-10-70 I am glad to inform you that the Mother has authorised Sri Manmohan Reddy to take up the work of Sri Aurobindo Action in your area (Gaddipalli). My friend Udar, General Secretary of Sri Aurobindo's Action has been informed. In all matters connected with the above activity you may correspond with Udar : (Sri L.M.Pinto, general secretary Sri Aurobindo's Action, Pondicherry - 2)

A receipt in respects of your offering is enclosed.

Yours sincerely
Sd/-
P. Counouma.

Copy to
(1) Udar
(2) Manmohan Reddy

శ్రీ అరవిందాశ్రమ ట్రస్టు నుండి
డా॥ గోపాలరెడ్డి పేరున అందిన ఆదేశము యొక్క తెలుగు అనువాదము

శ్రీ అరవిందాశ్రమము
21 అక్టోబరు 1970

డియర్ డాక్టర్ గోపాలరెడ్డి

ది. 20-10-70న నా లేఖకు అనుబంధంగా శ్రీ మన్‌మోహన్ రెడ్డి శ్రీ అరవిందోస్ యాక్షన్ పనిని మీ గడ్డిపల్లి ప్రాంతంలో చేపట్టుటకు శ్రీమాత అనుమతించారని తెలియచెప్పేందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. అలాగని మిత్రుడు ఉదార్ (జనరల్ సెక్రటరీ, శ్రీ అరవిందోస్ యాక్షన్) సమాచారం అందించారు. ఇందుకు సంబంధించిన అన్ని విషయాలను మీరు ఇకముందు ఉదార్‌ను (శ్రీ సి. యమ్. పింటో)ను సంప్రదించండి.

మీ ఆఫరింగ్స్‌కు రశీదులు ఇందువెంట జతపరచుచున్నాను.

యువర్స్ సిన్సియర్లీ
సం/-
పి. కున్నమా

ప్రతులు :
1. ఉదార్
2. మన్మోహన్ రెడ్డి

★ ★ ★

గ్రామీణ భారత నిర్మాణము

బ్యాంకింగ్ రంగము – డా॥ గోపాలరెడ్డి పాత్ర

భారతదేశము వ్యావసాయిక దేశము. ఈ దేశములోని పల్లె ప్రాంతము లందే వ్యవసాయ వృత్తి విస్తరించి యున్నది. ఇచటి నగరములు, పట్టణములు, పరిశ్రమలకు, వాణిజ్య సముదాయములకు, వర్తక వ్యాపార కేంద్రములకు, విద్యాలయము లకు, వైద్యశాలలకు, ప్రభుత్వ కార్యాలయములకు కళారంగమునకు సంబంధించిన కేంద్రములకు నిలయములు. భారత ప్రభుత్వము గ్రామీణ భారతమును పరిపుష్టము చేయదలచి, ప్రపథమమున బ్యాంకింగ్ రంగమును గ్రామములకు విస్తరించ దలచినది. మొదట పెద్ద గ్రామములు, మండల కేంద్రములందు బ్యాంకు శాఖలను యేర్పాటు చేసిన యెడల రైతులకు ధనమందుబాటులో నుండ గలదని, వారి వ్యవసాయ అవసరములకు వలయు ధనమును ఋణముగా పొందుటకు సౌకర్యముగా నుండునని విస్తరణకు పూనుకొన్నది. ఈ పనిని నూతనముగా ప్రవేశపెట్టు చున్నందున, అందులో తలయెత్తు సాధక బాధకములను అధిగమించుటకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకొన వలసియుండగా అందుకు నిపుణుల సలహాలను తీసుకొనుటకు "స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా" వారు, డా॥ గోపాలరెడ్డిని తగిన వ్యక్తిగా గుర్తించినది. నల్లగొండ జిల్లా అంతట యేర్పాటు చేయ సంకల్పించిన బ్యాంకులకు "నాగార్జునా గ్రామీణ బ్యాంకు" లుగా నామకరణం చేసినది. మన డాక్టరు గారిని ఈ బ్యాంకునకు డైరెక్టరుగా నియమించినది.

నాగార్జున గ్రామీణ బ్యాంకు డైరెక్టరుగా :

గ్రామ ప్రాంతాలందు బ్యాంకింగ్ రంగ విస్తరణ చేయుటకు నల్లగొండ జిల్లాయందు "నాగార్జున గ్రామీణ బ్యాంకు" 1976 సం॥లో ప్రారంభింప బడినది. దీనికి భారతీయ స్టేటు బ్యాంకు వారు, డా॥ గోపాలరెడ్డి గారిని డైరెక్టరుగా నియమించారు. దీని పదవీకాలము 2 సం॥ములు. వీరు ఈ పదవికి ప్రతి రెండు సం॥ల పదవీ కాలానికి 5 మార్లు నామినేట్ చేయబడి, (1976-1986) పది సం॥లు ఆ పదవీ బాధ్యతలను నిర్వహించారు. ఈ గ్రామీణ బ్యాంకుల వ్యవస్థ నూతనముగా ప్రారంభింప బడినందున, ప్రారంభకాలములో యేర్పడు పరిపాలనా సమస్యలకు పరిష్కారమును సూచిస్తూ వారు నిర్మాణాత్మక పాత్రను పోషించారు.

ఈ రంగమున పని చేయు ఉద్యోగ బృందాన్ని నియామకం చేయుటలోను, వారికి వలయు శిక్షణను అందించుటలోను, వీరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ప్రతినిధిగా మెరుగైన సేవలనందించారు. ఈ బ్యాంక్ వ్యవస్థలో 130 బ్రాంచీలున్నవి. 3 రైతు సేవా సహకార సొసైటీలు కలవు. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులలో ఖమ్మం లోని నాగార్జున బ్యాంకు శాఖ సేవలందించుటలో ప్రథమ స్థానములో నిలిచినది.

గ్రామీణ బ్యాంకింగ్ వ్యవస్థ యొక్క సామర్థ్యాన్ని పెంపొందించుటకు, ఈ రంగములో తమకున్న విశేషమైన 10 సం॥ల అనుభవము దృష్ట్యా, అవగాహనా పూర్వక నివేదికను సంసిద్ధ పరచి భారతీయ స్టేటు బ్యాంకు వారికి సమర్పించారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డైరెక్టరుగా :

భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ వారు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క పనితీరును మెరుగు పరుచుటకు తీసికొనవలసిన చర్యలను సూచించ వలసినదిగా డా॥ గోపాలరెడ్డి గారిని విశిష్ట డైరెక్టరుగా 4 సం॥ల కాలానికి (1978 నుండి 1981 వరకు) నియమించినది.

డా॥ గోపాలరెడ్డి గారు యూనియన్ బ్యాంకు కార్యనిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించినారు. ఇతర జాతీయ బ్యాంకుల పని తీరుకు, దీనికి గల తేడాలను గమనించి, బ్యాంకు పనితీరులోని లొసుగులు, ఆర్గనైజేషన్ సెటప్‌లో యేర్పడిన కొరతలు, మేనేజిమెంటు పనితీరు, వ్యూహాత్మకంగా మానవశక్తి వినియోగము, మరియు బ్యాంకు నిర్వహణా వ్యయంపై మేనేజిమెంటుకు వుండవలసిన అదుపు మొదలగు అంశములపై మౌఖికంగాను, వ్రాతపూర్వకంగాను నిర్మాణాత్మక సలహాలు, సూచనలతో కూడుకొనిన 15 పేజీల సుదీర్ఘ నివేదికను యిచ్చినారు.

బ్యాంకు పనితీరును పునరుద్ధరించుటకు, చాలా వివరంగా యిచ్చిన నివేదికలో మూడు రకములైన ప్రత్యామ్నాయ మార్గాలను సూచించుట జరిగినది.

యూనియన్ బ్యాంకువారు గ్రామీణ బ్యాంకింగ్‌ను విస్తరించుటకు ముందు చర్యగా, బ్యాంకు సిబ్బందికి శిక్షణ యిచ్చుట కొరకు 'స్టాఫ్ ట్రేనింగ్ కాలేజి"ని యేర్పాటు చేయాలని, అందుకు తగిన విధంగా 'ఎకడమిక్ ప్లాను' కూడా డా॥ గోపాలరెడ్డి గారు తమ నివేదికలో యిచ్చారు. ఈ ప్లానును 'రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా, బొంబాయి స్టాఫ్ ట్రేనింగ్ కాలేజి సభ్యులు' ఎంతగానో శ్లాఘించినారు. అదే విధంగా NIBM మరియు 'అగ్రికల్చరల్ బ్యాంకింగ్ కాలేజి' పూనా వారు కూడా ప్రశంసించారు. డా॥ గోపాలరెడ్డి గారు అందించిన ఈ ఎకడమిక్ ప్లానును పరిశీలించిన శ్రీ జి.పి. భావే, ప్రిన్సిపాల్, కాలేజి ఆఫ్ అగ్రికల్చరల్ బ్యాంకింగ్ - రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా, పూనా గారు స్పందించిన తీరు ఈ విధంగా వుంది :

"గ్రామీణ బ్యాంకింగ్ స్టాఫ్ ట్రేనింగ్ కాలేజి స్థాపనకు సంబంధించిన, శ్రీ గోపాలరెడ్డి గారి ప్రతిపాదనను పరిశీలించాను, నిస్సందేహంగా యిది చాలా అవగాహనా పూర్వకంగా వుంది. గ్రామీణ బ్యాంకింగ్ విస్తరణలో యేర్పడబోవు వివిధ సమస్యలను పరిగణనలోకి తీసికొని, వాని పరిష్కారమునకు అవసరమగు చర్యలు సూచింప బడినవి. ఈ ప్రతిపాదనలు ప్రయోగాత్మకంగా, విస్తరణాభిలాషకు చెందిన విషయాలపై దృష్టి నిలిపిన వారి ఆలోచన ముందు ముందు యిది జాతీయ స్థాయి సంస్థగా రూపొంది, వాణిజ్య బ్యాంకుల ప్రభుత్వ శాఖల, పారిశ్రామిక సంస్థల, సిబ్బంది యొక్క శిక్షణా వసరములను తీర్చగలిగినట్లున్నది" అని అభిప్రాయపడినారు.

యూనియన్ బ్యాంకు మేనేజిమెంటు బోర్డు వారు డా॥ గోపాలరెడ్డి గారు సమర్పించిన నివేదికను యధాతదంగా ఆమోదించారు. "గ్రామీణ బ్యాంకింగ్ నిర్వహణార్థము స్టాఫ్ ట్రేనింగ్ కళాశాల"ను, మహాత్మాగాంధి జన్మదినము 2-10-1981 నాడు బెంగుళూరు సమీపములో ప్రారంభించారు.

యూనియన్ బ్యాంకు మేనేజిమెంట్ బోర్డు సమావేశాలందు వ్యవసాయానికి సంబంధించిన చర్చలందే గాక తదితర ప్రాధాన్యతా రంగాలకు చెందిన వానియందు కూడా, వీరు చురుకుగా పాల్గొని బ్యాంకు నిర్వహించాల్సిన పాత్రను గురించి నిర్మాణాత్మక సలహాలిచ్చారు. సశాస్త్రీయమైన వీరి సూచనలు, ఆదర్శవంతంగా వున్నవని ఇతర జాతీయ బ్యాంకులు కూడా అనుసరించాయి.

★★★

డా॥ గోపాలరెడ్డి గారి బహుముఖ ప్రజ్ఞ

వివిధ సంస్థల ఆహ్వానము

గడ్డిపల్లిలో డా॥ గోపాలరెడ్డి గారు నిర్వహించుచున్న కార్యకలాపములన్నీ విస్తృత ప్రచారము పొందినవి. "మహాత్మాగాంధి లిఫ్టు ఇరిగేషన్ సొసైటి" ఆధ్వర్యములో కొనసాగుచున్న భారీ వ్యవసాయము వారి అపూర్వ సృష్టియనియే తెల్పవచ్చును. వారికి ఈ ఆలోచన కల్గుట ఆ జగన్మాత కృపాకటాక్షమనియే చెప్పవచ్చును. అదెట్లనగా భగవద్గీతలో పరమాత్ముడు తెలిపినట్లు –

"అహం పైకి చూడటానికి కర్తగా కనిపించినా, దానిని, దాని ఇచ్చను కూడా ప్రకృతి సృష్టించింది. తన ఉపకరణాలుగా వాటిని ఉపయోగించు కుంటున్నది అని*" దీని భావమును మనము అన్వయించుకొన్నపుడు మన డాక్టరు గారు కర్తగా కనిపించినా ఆయనను ఆయనకు కల్గిన ఇచ్చను సృష్టించినది 'ప్రకృతి' యని తేటతెల్లమగు చున్నది. కావున ఆయన దైవము యొక్క ఉపకరణముగా తెరముందుకు వచ్చి, దైవముచే నిర్దేశింప బడిన కార్యమును నిర్వహించు చున్నాడని గ్రహించవలసి యున్నది. కావున వారు దైవముచే ఎంపిక చేయబడిన కారణజన్ములు. దైవ కార్యమును నిర్వహించుటకు అరుదెంచిన అమృత పుత్రులు.

వారు చేపట్టిన అపురూపమైన పనులను, వ్యవసాయ రంగానికి చెందిన జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర శాసనసభ్యులు, ఉన్నతాధికార బృందములు, ప్రముఖ సంఘసేవకులు సందర్శించి ప్రశంసించినట్లు మనవి చేసి యున్నాను.

"భారతీయ స్టేటు బ్యాంక్" వారు ఏకంగా గడ్డిపల్లి ప్రాజెక్టుపై సమగ్రమైన సాంఘిక డాక్యుమెంటరీ ఫిల్మును రూపొందించి (Pverty to Prosperity) "పేదరికము నుండి పురోభివృద్ధికి" అను శీర్షికను ఏర్పాటు చేసి, భారత దేశమంతటా ప్రదర్శించినారు. ఈ ఫిల్ము పలువురి ప్రశంసలను పొందుటయే కాదు భారత రాష్ట్రపతి నుడి "బంగారు పథకము"ను కూడ సాధించినది. జాతీయ స్థాయిలో 'గడ్డిపల్లి' ఒక మారుమూల నున్న కుగ్రామము. అభివృద్ధిపథములో అద్భుత ఆకర్షణీయమైన వెలుగు చుక్కగా వెలుగు లీనినది. మరొక్క విశేషమేమనగా, ఈ డాక్యుమెంటరీ ఫిల్ము "అంతర్జాతీయ ఫిల్ము ప్రదర్శనలకు" ఎన్నికైనది. ఆ కారణంగా

* గీతాదర్శనము – 'ఉత్తమంరహస్యం' P 86 తె.పూ.రా.

మన రెడ్డి గారి కృషి, గడ్డిపల్లి పురోభివృద్ధి, ఆకాశమంత ఎత్తు ఎగసి, ధృవతారగా నిలిచి ప్రపంచ భావితరముల వారికి ఆదర్శప్రాయమై అంతర్జాతీయ ఖ్యాతి నార్జించినది.

ఈ విధంగా వెలుగులోకి వచ్చిన మన రెడ్డి గారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వముల వ్యవసాయశాఖకు చెందిన వివిధ సంస్థలకు చేరువైన కారణంగా, ఆ సంస్థల అధిపతులు రెడ్డి గారి సేవలను ఉపయోగించుకొనుటకు సంకల్పించి, వారి అధీనములోని వివిధ వ్యవస్థలను సంస్కరించుటకు లేదా చక్కని మార్గనిర్దేశన మొనరించుటకు, వారికి తమ సంస్థలలో భాగస్వామ్యమును కల్పించి ఆహ్వానించారు. భావిభారత భాగ్యోదయమునకు బాట వేయుట సామాన్యుని వలన కానిపని. దైవోపకరణముగా జన్మించి, దైవకార్యమును నిర్వహించ వచ్చిన వారి వల్లనే యిది సాధ్యము కాగలదు అనుటకు సందేహము లేదు. కావుననే వారు కారణజన్ములని ముందే మనవి చేశాను. వారికి సరిజోడుగా వుండి వారు సాధించిన కార్యములను తిలకించుట మన మహద్భాగ్యము. దైవకార్యనిర్వహణకై అరుదెంచిన వారి జన్మ ధన్యము.

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసర్చి, న్యూఢిల్లీ సభ్యులుగా :

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసర్చి - న్యూఢిల్లీ సంస్థ వారు బహుముఖ ప్రజ్ఞాశాలియైన డా॥ గోపాలరెడ్డి గారి సేవలను వినియోగించుకొన దలచి, తమ సంస్థకు చెందిన వివిధ కమిటీలందు సభ్యులుగా భాగస్వామ్యమును కలిపించి గౌరవించారు.

1. వ్యవసాయ విద్య యొక్క శాస్త్రీయ పానెల్‌లో సభ్యులుగా -
2. కృషి విజ్ఞాన కేంద్రముల నిర్వహణార్థము యేర్పడిన జాతీయ కమిటి యందు సభ్యులుగా -
3. ఇతర సంస్థలందు కూడా సభ్యులుగా - చేర్చుకున్నారు.

శ్రీ అరవింద కృషి విజ్ఞానకేంద్రం, గడ్డిపల్లి - కార్యదర్శిగా :

డా॥ గోపాలరెడ్డి గారికి "భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, న్యూఢిల్లీ" వారితో గల సాన్నిహిత్యము దృష్ట్యా, గడ్డిపల్లి ప్రాజెక్టులో జరుగుచున్న బృహత్ కార్యానికి సహకరించగలదను, సదుద్దేశ్యముతో వారు తమ అధీనములోని "కృషి విజ్ఞాన కేంద్రము" నొక దానిని 1985 సం॥లో గడ్డిపల్లిలో స్థాపించి, డా॥ గోపాలరెడ్డి గారిని కార్యదర్శిగా యేర్పరచినారు.

కృషి విజ్ఞాన కేంద్రములు ప్రధానంగా వృత్తి విద్యా కోర్సుల శిక్షణా సంస్థలు,

వ్యవసాయ ఉత్పత్తులను అభివృద్ధి పరుచుటకు, సాంకేతిక పరిజ్ఞానాన్ని యువతకు అందించుట వీని ఉద్ధేశ్యమై యున్నది. Teaching by doing 'పనిచేయుచు బోధించుట' మరియు Learning by doing 'పనిచేయుచు అభ్యసించుట' అను సూత్రముల ఆధారంగా, ఆర్థికంగా, సాంఘికంగా వెనుకబడిన గ్రామీణ యువతకు వ్యవసాయ ఆధారిత వృత్తులందు శిక్షణ నొసగుట వీని కర్తవ్యము. ఈ సంస్థ స్థాపింపబడిన నాటి నుండి నేటి వరకు మన డాక్టరు గారే కార్యదర్శిగా వ్యవహరించుచున్నారు. వీరి కృషి వలన గ్రామీణ యువతకు జీవన భృతి కల్గినది. వ్యవసాయ ఉత్పత్తి రంగమున విప్లవాత్మక మార్పు సంభవించినది.

"చేతన" మేనేజింగ్ కమిటి మెంబర్‌గా :

'చేతన' ఇది ఒక పబ్లిక్ చారిటబుల్ ఆర్గనైజేషన్ సంస్థ. ఈ సంస్థ ఆం.ప్ర. రాష్ట్ర గవర్నర్‌చే స్థాపించబడినది. వెనుక బడినట్టి గ్రామాలను ఆర్థిక, సాంఘిక, వైజ్ఞానిక, సాంస్కృతికంగా అన్ని రంగాలందు మార్పు తెచ్చుట దీని లక్ష్యము. తద్వారా సమగ్రాభివృద్ధి సాధించాలి.

గ్రామీణాభివృద్ధి రంగములో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చూపించే చొరవను అంది పుచ్చుకొని, అవి అందించే నిధులను రాబట్టుకొనుటలో సహకరించి, ఆయా గ్రామాలను, అగ్ర గాములుగా చేయుటకు ఉద్దేశించబడిన ఈ సంస్థలో 1983 నుండి 1987 వరకు డా॥ గోపాలరెడ్డి గారిని ఆం.ప్ర. రాష్ట్ర గవర్నర్, మేనేజింగ్ కమిటి మెంబర్‌గా నియమించారు. ఈ సంస్థ లక్ష్యములను సాధించుటలో వీరు చిత్తశుద్ధితో కృషి చేసినారు.

"ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజిమెంట్ ఎడ్యుకేషన్ & రీసర్చి" మద్రాసు - డైరెక్టర్ గా :

ఈ సంస్థ 'మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్' కొరకు మద్రాసులో యేర్పడినది. మేనేజ్‌మెంట్ రంగములో వివిధ కోర్సులను, సెమినార్లను నిర్వహించి, ఆ విద్యను పరిపుష్టము చేయుట కొరకు ఏర్పడినది. డా॥ గోపాలరెడ్డి గారు 1986 నుండి 1990 వరకు దీనికి డైరెక్టరుగా వ్యవహరించి, మార్గదర్శనం చేసినారు.

మల్టిపర్పస్ కో-ఆపరేటివ్ సొసైటీస్ అసోసియేషన్ - హైద్రాబాద్ డైరెక్టర్‌గా :

వ్యవసాయ రంగానికి చెందిన వివిధ సహకార పరపతి సంఘములు నిర్వహించు కార్యకలాపములను సమన్వయ పరుచుట ఈ సంస్థ లక్ష్యము. అదే విధంగా వివిధ రాష్ట్రాలందున్న సహకార పరపతి సంఘాల పనులకు దిశానిర్దేశం చేయుట కూడా ఈ సంస్థ బాధ్యత. అదే పద్ధతిలో సహకార రంగములో పని చేయుచున్న సిబ్బందికి మరియు తద్వారా సహకార విద్యారంగానికి చెందిన మేనేజిమెంటుకు శిక్షణ యిచ్చుటకు యేర్పడినది ఈ సంస్థ.

ఈ బహుళార్థ సహకార పరపతి సంఘముల అసోసియేషన్ సంస్థ డైరెక్టర్‌గా డా॥ గోపాల రెడ్డి గారు 1983 నుండి 1985 వరకు వ్యవహరించి, మెరుగైన సేవల నందించారు.

"సొసైటీ ఆఫ్ సైంటిస్ట్స్ పర్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంటు" హైద్రాబాదు - సభ్యునిగా :

వ్యవసాయ రంగ అభివృద్ధి కొరకు యేర్పడిన శాస్త్రవేత్తల సంఘములో డా॥ గోపాలరెడ్డి గారు సభ్యులుగా వున్నారు. ఈ సంస్థ వ్యవసాయ రంగములో అభివృద్ధి సాధించు దిశలో, అది రూపొందించిన వివిధ కమిటీలలో సభ్యులుగా పాల్గొని వారు ఈ దిగువ అంశములపై అవగాహన పూర్వకంగాను, ఆచరణాత్మకం గాను అవలంభించాల్సిన విధానాలను రూపొందించారు.

1. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ విస్తరణ.
2. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ విద్య.
3. అభివృద్ధి సాధనా దిశలో - గ్రామాల దత్తత స్వీకరణ.
4. సమగ్ర గ్రామీణాభివృద్ధి.
5. గ్రామీణాభివృద్ధి సాధనా దిశలో అవలంభించాల్సిన సాంకేతిక విద్య.
6. విత్తన ఉత్పత్తి మరియు విత్తన ధృవీకరణ.

"తెలంగాణ ప్రాంతీయ అభివృద్ధి బోర్డు" మెంబర్‌గా :

తెలంగాణ ప్రాంత వెనుకబాటు తనాన్ని తొలగించి, ఆర్థిక - సాంఘిక రంగాలందు అభివృద్ధి చేయుటకు, తెలంగాణ ప్రాంతీయ అభివృద్ధి బోర్డును, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము యేర్పాటు చేసినది. దానియందు 1975-76 సం॥నకు శ్రీ గోపాలరెడ్డి గారిని, నైపుణ్యత గల సభ్యునిగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము నియమించి,

వారి నైపుణ్యతకు సముచిత గౌరవము కల్పించినది. ఒక ఉన్నతమైన వ్యవసాయ శాస్త్రవేత్తగా, వారు తెలంగాణ ప్రాంత వ్యవసాయ రంగము యొక్క అభివృద్ధికి నిర్మాణాత్మక సలహాలను, సూచనలను అందించారు.

ఆం.ప్ర. రాష్ట్ర ఇరిగేషన్ బోర్డు, నాగార్జునసాగర్ - మెంబర్ గా :

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరీవాహక ప్రాంతంలో సాగునీటి సౌకర్యాలను మెరుగు పరచుటకు యేర్పడిన ఇరిగేషన్ బోర్డునందు 1975-76 సం॥నకు డా॥ గోపాలరెడ్డి గారిని సభ్యునిగా నియమించి, వారి సేవలను వినియోగించుకున్నది.

శ్రీ వెంకటేశ్వర సైన్స్, ఆర్ట్స్ & కామర్స్ కళాశాల, సూర్యాపేట, జిల్లా నల్లగొండ - వైస్ చైర్మన్ గా :

నల్లగొండ జిల్లాలోని ప్రముఖ వ్యాపారకేంద్రమైన సూర్యాపేటలో కళాశాల విద్యకు అవకాశము కలిపించుటకు శ్రీ వేంకటేశ్వర సైన్స్, ఆర్ట్స్ & కామర్స్ కళాశాల స్థాపించ బడినది. దానికి శ్రీ గోపాలరెడ్డి గారు, కళాశాల మేనేజిమెంటు వైస్‌చైర్మన్‌గా 1985 నుండి 1990 వరకు వ్యవహరించారు. కళాశాల పురోగతికై వారు విశిష్ట సేవల నందించారు.

"ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పార్మ్ అడ్వైజరీ & కన్సల్టెన్సీ సర్వీసెస్" (INFACONS), హైద్రాబాద్ :

ఈ సంస్థకు డా॥ గోపాలరెడ్డి గారు వ్యవస్థాపక సభ్యులు మరియు ప్రాజెక్టు డైరెక్టర్‌గా 1990 నుండి 1995 సం॥ము వరకు ఉన్నారు. ఈ కాలంలో ఈ ఇన్‌స్టిట్యూట్‌కు వారు ఎకడమిక్‌ప్లానును సంసిద్ధపరచి, అమూల్యమైన తమ వ్యవసాయ శాస్త్ర అనుభవములనందించారు.

ఆం.ప్ర. అగ్రికల్చరల్ యూనివర్సిటీ, హైద్రాబాద్ రీసర్చి అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులుగా :

వ్యవసాయ శాస్త్రము నందు అత్యున్నత పురస్కారములను పొంది, ఆ రంగమున విశేష అనుభవముతో, ప్రయోగాత్మకముగా ఎన్నో ప్రాజెక్టులకు సారధ్యము వహించిన డా॥ గోపాలరెడ్డి గారిని, ఆం.ప్ర. వ్యవసాయ విశ్వవిద్యాలయము వారు రీసర్చి అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులుగా 1994 - 98 వరకు నియామకం చేసి, వారి సేవలను పొందినది.

డా॥ గోపాలరెడ్డి గారు సమగ్ర గ్రామీణాభివృద్ధి మరియు గ్రామీణ పేదరిక నిర్మూలనకు సంబంధించిన అనేక జాతీయ సెమినార్లు, వర్క్‌షాపులు, కాన్ఫరెన్స్ లందు పాల్గొని, సిద్ధాంత పత్రములను, నివేదికలను సమర్పించారు. ఈ వరుసలోనే భారత ప్రభుత్వ ప్రణాళికా సంఘమునకు మూడు రకాలైన సిద్ధాంత పత్రములను సమర్పించారు.

1. ప్రణాళికల యొక్క విధి విధానాలు మరియు వాని ప్రోగ్రాములు వుండాల్సిన తీరును గురించి 1979లో సిద్ధాంత పత్రమును సమర్పించారు.

2. ఇంటిగ్రేటెడ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ ఆఫ్ రూరల్ పూర్ గ్రామీణ పేదల కొరకు సమగ్రవిద్య, ఆర్థిక - సాంఘిక, సాంస్కృతిక అభివృద్ధి, వికాసములను ఆచరణా త్మకంగా అందించుటకు, పరిశోధనా కార్యక్రమంపై సిద్ధాంత పత్రమును డా॥ గోపాలరెడ్డి గారు సమర్పించగా - దానిని ప్రణాళికా సంఘ సభ్యుడైన డా॥ M.S. స్వామినాధన్ గారు ఆమోదించి, వీరి ప్రతిపాదనలను భారత ప్రభుత్వానికి సిపారసు చేశారు. ఈ సిఫారసుల ప్రాతిపదికగా మహారాష్ట్ర రాష్ట్రములోని వార్ధా జిల్లాలో ఈ ఆచరణాత్మక పరిశోధనా ప్రోగ్రామును, గ్రామీణ నిరుపేద మానవ వికాసానికి, వారి అభివృద్ధికై ప్రవేశ పెట్టారు.

3. "పేదరికము నుండి పురోభివృద్ధికి నూతన మార్గము" (New path ways from poverty to prosperity) అను అంశము ఆధారంగా, భారత ప్రభుత్వ VII పంచవర్ష ప్రణాళికా కాలమందు, దిగువ తెల్పిన మూడు ప్రాధాన్యతా రంగాలకు సంబంధించిన అంశములపై సిద్ధాంత పత్రములను సమర్పించారు.

a) ప్రజలందరికి పని (Work for All)
b) వ్యవసాయము - నీటి పారుదల (Agriculture & Irrigation)
c) ఉత్పత్తి యొక్క ప్రతి యూనిట్‌పై వెచ్చించే ధనము. (Productivity per Unit amount invested)

ఈ అంశములను ఆధారం చేసికొని, డా॥ గోపాలరెడ్డి గారు సమర్పించిన వారి సిద్ధాంత పత్రమును, ప్రణాళికా సంఘమునకు అధ్యక్షులైన భారత ప్రధానమంత్రి తన ఆమోదము తెల్పి సంతకము చేసి పంపించారు. వీరి సూచనలను ప్రణాళికా సంఘము ఆమోదించి, ఆ విషయమును గూర్చి వివరణాత్మక చర్చల కొరకు శ్రీ గోపాల రెడ్డి గారిని ఆహ్వానించింది.

భారతీయ సంస్కృతి :

డా॥ గోపాలరెడ్డి గారు భారతీయ సంస్కృతీ వారసత్వములపై వివిధ సందర్భాలందు అనేక పత్రాలను రూపొందించారు.

అంతర్జాతీయ విశ్వవిద్యాలయ స్థాపన దిశగా :

భారతదేశములో అంతర్జాతీయ విశ్వ విద్యాలయాన్ని స్థాపించి, విశ్వశాంతిని నెలకొలుపుటకు, ఆధ్యాత్మికతను, మానవ ఐక్యతను సాధించు దిశగా - ప్రాజెక్టు ప్రతి పాదనలను మరియు ఎకడమిక్ ప్లానును, భారత ప్రభుత్వానికి డా॥ గోపాలరెడ్డి గారు సమర్పించారు.

ఈ ప్రతిపాదన వాస్తవానికి భారతదేశ జీవిత ధర్మానికి ప్రతీకగా పేర్కొన వచ్చును. అనాది నుండి భారతదేశము విశ్వమానవ సౌభ్రాతృత్వమునే వాంఛించు చున్నది. 'శ్రీ అరవిందులు ప్రతిపాదించిన విశ్వమానవ ఐక్యతాదర్శము'ను సాధించు దిశగా వీరి ప్రతిపాదన యున్నది. మాన్యులైన మహనీయులకే గాని, సామాన్యుల కిట్టి ఆలోచన రాదు కదా !

నూతన పౌరపాలనా వ్యవస్థ :

"We want new polity" "మా కోరిక నూతన పాలనా పద్ధతి" - అను నినాదమును, భవిష్యత్తులో భారతీయులు వినిపించ నున్నారనుటకు సూచనగా, భారతీయ ఆత్మకు ఆయువు పట్టు అయిన ఆధ్యాత్మికతకు ఆధారంగా, భవిష్యత్ పౌరపాలనా పద్ధతి రూపొందాలని, సిద్ధాంత పత్రాన్ని వారు సిద్ధపరచినారు.

ఈ సందర్భంగా మనము గుర్తు చేసుకోవాల్సిన అంశము - శ్రీమతి ఇందిరా గాంధి భారత ప్రధానిగా నున్నపుడు శ్రీమాత వారికి పార్టీ రహిత ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని యేర్పాటు చేయాల్సిందిగా సూచించారు.

మేధావంతులు, ఏ పార్టీలో నున్నా అందరిని కలుపుకొని పరిపాలనా దక్షత గలవారితో ప్రభుత్వము నిర్వహింప బడాలన్నది శ్రీమాత మనకందించిన 'దైవ వాణి'. అయితే మనం దాన్ని వినలేదు కదా ! దానికి సమయమెపుడు రాగలదో, కాని డా॥ గోపాలరెడ్డి గారి ఆలోచనా విధానము మన పౌరపాలనా పద్ధతి ఆధ్యాత్మికత దిశవైపు మరలాలని కనబడుచున్నది.

అందుకే వారు, "Spiritual Party of India" "భారతీయ ఆధ్యాత్మిక పార్టీ" - అను పేరున ఒక సుదీర్ఘ మైన మ్యానిపెస్టోను రూపొందించారు.

గ్రామీణ జీవన వికాసము - పేదరికంపై పోరు :

భారతీయ అభివృద్ధి - వికాసములను అడ్డుకుంటున్న మహమ్మారి పేదరికము 60 సంవత్సరాల ప్రజాస్వామ్య పరిపాలన, మరియు 10 పంచవర్ష ప్రణాళికల అమలు - ఈ దేశాన్ని పేదరికమను పెనుభూతపు పట్టు నుండి విముక్తి చెందించ లేకపోయినవి. అయినను మనం నిరాశకు, నిస్పృహకు గురి కాలేదు. ధైర్యముగా దానికి ఎదురొడ్డి పోరాడుతునే వున్నాము. విద్యావంతులు, ఆర్థిక రాజకీయ శాస్త్రవేత్తలు, సందర్భాను సారంగా వీనిని తడుముచునే యున్నారు. ఆ బాటలోనే శ్రీ గోపాల రెడ్డి గారు హైద్రాబాదులోని 'కేంద్రీయ విశ్వ విద్యాలయం' లోను "నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంటు" హైద్రాబాదులోను, మరియు తదితర సంస్థలందు గ్రామీణ జీవన వికాసమును సాధించు మార్గాల గురించి ఉపన్యసించారు. నిర్మాణాత్మకమైన వీరి ఆలోచనా ధోరణి అనుసరణీయమనుటలో సందేహ పడాల్సిన అవసరం లేదు. కాని కాలం కూడా అనుకూలించాలి కదా !

ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ ఏజన్సీ లీడర్ :

నల్లగొండ జిల్లాలోని 3 మండలాలలో 1. పెన్‌పహాడ్, 2. మోతె, 3. తుంగతుర్తి మండలాల యందు డా॥ గోపాలరెడ్డి గారు ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ లీడర్‌గా 1997 సం॥ నుండి 2002 వరకు, 27 వాటర్‌షెడ్‌ల నిర్మాణము చేయించినారు. వానివలన ఆ ప్రాంతంలో భూగర్భ జలసంపద పెరిగినది. సాగునకు చక్కగా లాభము సమకూరినది.

ఆం.ప్ర. - నెదర్‌ల్యాండ్ బయోటెక్నాలజీ ప్రోగ్రాం :

డా॥ రెడ్డిగారు ఈ ప్రోగ్రాంలో 1994 నుండి అనగా ఏర్పడిన నాటి నుండి డైరెక్టర్‌గా నున్నారు.

స్టేట్ లెవెల్ కో-ఆర్డినేషన్ కమిటి (SLCC) సభ్యులుగా :

ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు డా॥ గోపాలరెడ్డి గారిని SLCC సభ్యులుగా, 1998 లో నియామకము చేసి వారి సేవలను సమాజానికి

అందించు చున్నారు. ఈ కమిటి జిల్లాలోని వ్యవసాయ సలహాకేంద్రముల (DATTCs) ప్రణాళికలను, పనులను సమీక్షించుట, సమన్వయ పరచుట, పర్యవేక్షణలాంటి పనులను నిర్వహించి, వ్యవసాయదారులకు మార్గదర్శనం చేయును.

"నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజిమెంటు", హైద్రాబాద్ :

ఈ సంస్థలో డా॥ గోపాలరెడ్డి గారు సభ్యులు. వీరిని భారత ప్రభుత్వ వ్యవసాయ శాఖవారు, 2004 సం॥లో నియామకం చేసారు. ఇప్పటికిని వీరు ఆ పదవిలో కొనసాగుచున్నారు. అమూల్యమైన వారి వ్యవసాయ శాస్త్ర అనుభవాలను ఆ సంస్థకు అందించు చున్నారు.

"రైతు సేవా సహకార సొసైటి" గడ్డిపల్లి :

గడ్డిపల్లిలోని రైతులనే కాక, పరిసర గ్రామాల రైతాంగాన్ని కూడా ఒకే త్రాటిపై నడిపించారు. ఆరంభం నుండి అద్భుత కార్యాలను సాధించిన శ్రీ గోపాలరెడ్డి గారి వ్యవహార దక్షతకు రైతులందరు వారిని తమ "రైతు సేవా సహకార సొసైటి" చైర్మన్‌గా ఎన్నుకున్నారు. 2005 సం॥ నుండి వారు ఈ బాధ్యతను నిర్వహించు చున్నారు.

"నీటి వినియోగదారుల సంఘము" గడ్డిపల్లి :

ఈ సంఘాన్ని కూడా డా॥ గోపాలరెడ్డి గారు 2005 సం॥లో L-27 స్కీము క్రింద స్థాపించారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకొను విధానము నేర్పించి, వ్యవసాయాభివృద్ధికి సహకరించు చున్నారు.

★ ★ ★

శ్రీ అరవింద ధ్యాన మందిరము

నిర్మాణము - శంకుస్థాపన - 25-7-1971 :

నల్గొండ జిల్లా గడ్డిపల్లిలో శ్రీ మాతారవిందుల ప్రేరణ వలన, 1969 నుంచి ఒక క్రొత్త సాంఘిక - ఆర్థిక వ్యవస్థకు పునాదులు వేయబడినాయి. ఒక క్రొత్త ప్రపంచము సృష్టింప బడ్డది. ఈ విప్లవానికి అధినేత్రి శ్రీ దివ్యమాత. రాబోయే అట్టి సంఘము యొక్క మార్పుకు శ్రీ దివ్యమాతయే నేతృత్వము వహించగలదు. అట్టి అవతార మూర్తులైన, శ్రీ మాతారవిందులకు మందిరమొకటి నిర్మించి, వారిని సేవించు కొనుటకు ప్రజలకు అవకాశము కల్పించాలని, డా॥ గోపాలరెడ్డి గారు సంకల్పించారు. ఆ మందిరములో శ్రీ అరవిందుల దేహాంశాలను (Relics) ప్రతిష్ఠించుట వలన ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక ప్రశాంతత నెలకొని, పవిత్రత పరిఢవిల్ల గలదని "దేహాంశాల ప్రతిష్ఠాపన మందిర" నిర్మాణమునకు పూనుకున్నారు.

గడ్డిపల్లిలో ప్రారంభింప బడిన నూతన అభ్యుదయ ఉద్యమానికి ప్రేరణ నిచ్చి, ఆర్థిక సహకారము నందించుచున్న హైద్రాబాదు స్టేట్ బ్యాంక్ అధ్యక్షులు, శ్రీ తల్వార్ గారిచే మందిరమునకు, ది. 25-7-1971 నాడు శంకుస్థాపన గావించ బడినది. అదేరోజు శ్రీ అరవింద పాఠశాల కూడా వారి చేతనే ప్రారంభింప బడినది. అనంతరం జరిగిన బహిరంగ సభకు నల్లగొండ జిల్లా కలెక్టర్ శ్రీ ఓబయ్యగారు అధ్యక్షత వహించి, డా॥ గోపాలరెడ్డి గారి సామర్థ్యమునకు సంతసించి ప్రశంసించారు. ఈ సభకు ఆ ప్రాంత ప్రజానీకము 2000 మంది వచ్చారు. వీరి మనోభూమిక లందు సౌభ్రాతృత్వ భావానికి అంకురార్పణ జరిగినది.

శ్రీ అరవిందుల దేహాంశముల (Relics) ప్రాముఖ్యత :

భాగవతోత్తములు, అవతార పురుషులైన మహనీయుల అవశేషాలకు, ఆధ్యాత్మిక రంగమందు అత్యంత ప్రాధాన్యత కలదు. వీనిని Relics అనియు దేహాంశములనియు వ్యవహరించెదరు. ఆ మహనీయుల సంస్మరణ, దేదీప్యమానమైన దివ్య తేజస్సు మరియు అలౌకిక అనుభూతులతో ప్రేరితులు కావడానికి వీలుగా, దేహాంశాల ప్రతిష్ఠాపనా మందిరాలనో, సమాధులనో నిర్మించడ మనేది అనూచానంగా వస్తున్న సాంప్రదాయం.

సత్యాన్వేషణా సాధకులు, ఇట్టి మందిరాల నుండి అనాదిగా ప్రేరణను, ఆత్మ వికాసాన్ని, సదసద్వివేకాన్ని పొందగలుగుచున్నారు. పవిత్ర పరిసరాలలో నిర్మితమైన ఇట్టి మందిరాలు, యోగ సాధకులకనేకంగా ఉపయోగపడతాయి. విజ్ఞాన శాస్త్రం సైతం వివరించ లేని అపూర్వ సంఘటనలు, మహిమలు అనేకంగా ఇట్టి సమాధులు లేదా మందిర ప్రాంతాలందు జరగడం జగద్విదితం. అస్వస్థులు ఆరోగ్యాన్ని పొందుట, తీరని కోరికలు ఈడేరడం వంటి అద్భుత సంఘటన లనేకం సంభవించిన దృష్టాంతరా లున్నవి. కావుననే శ్రీఅరవిందుల దేహాంశాలను యిచ్చట ప్రతిష్ఠించి, యీ ప్రాంతాన్ని పవిత్ర స్థలంగా తీర్చిదిద్దాలని సంకల్పం.

శ్రీ అరవిందుల దేహాంశముల ప్రతిష్ఠ :

శ్రీ అరవిందుల పవిత్ర దేహాంశాలను పుదుచ్చేరి శ్రీ అరవిందాశ్రమం నుండి శ్రీ దివ్యమాత కరకమలముల నుండి డా॥ మధుసూదన రెడ్డి గారు మరియు డా॥ గోపాలరెడ్డి గారు ది. 5-12-1971 న అందుకొనిరి. శ్రీ అరవిందులు స్వయంగా గడ్డిపల్లికి తరలి వెళ్ళుచున్నట్లు భావించి ఆశ్రమ ప్రముఖులు, సాధకులు, దర్శన స్పర్శనలతో పునీతులై సాగనంపుటకు అరుదెంచి ధన్యత చెందినట్లు సంతృప్తి పొందారు.

ఆ పవిత్ర అవశేషాలు అదే రోజున మద్రాసులో శ్రీ అరవింద కేంద్రానికి చేర్చి కొలది గంటలు భక్త జనుల సందర్శనార్థం వుంచబడినవి. ఆ తర్వాత విమాన మార్గమున హైద్రాబాదునకు చేరగా విమానాశ్రయంలో ఆం.ప్ర. ప్రభుత్వ ముఖ్యమంత్రి శ్రీ పి.వి. నర్సింహారావు, సాధకులు, భక్త జనుల మేళ తాళాలతో ఘనంగా స్వాగతం పలికినారు, వానిని ఊరేగింపుగా తీసుకవచ్చి, రాజభవన్‌లో భక్తుల సందర్శనార్థం డిసంబర్ 5వ తేది నుండి 8వ తేది వరకు వుంచారు.

డిసంబర్ 9వ తేదీన వానిని రాజభవనము నుండి భక్తజనుల జయజయ ధ్వానముల మధ్య శ్రీ అరవిందపురం (గడ్డిపల్లి)కి చేర్చగా, అచటి ప్రజలు ఎన్నాళ్ల నుండో ఎదురు చూస్తున్న తమ దైవము రానే వచ్చారని, ఆనందోత్సాహాల మధ్య భక్తజన సందోహముతో, భజన మండలుల మేళతాళములతో, మహిళామణులు పూర్ణ కుంభములతో ఎదురేగి స్వాగతము పలికినారు. తర్వాత భక్తజనులంతా తమ దర్శన ప్రణామములను గావించగా వేదమంత్రోచ్చారణలతో శాస్త్రయుక్తముగా, నూతన భవనమునందు శ్రీ అరవిందుల అవశేషాలను ప్రతిష్ఠించుట జరిగినది. ఈ ప్రతిష్ఠా కార్యక్రమము డా॥ గోపాలరెడ్డి గారి యిర్వురు పాపలు చి॥ మీరా, చి॥ లక్ష్మి

కరకమలములచే జరిపించికొని, ప్రజలు వారికి తమ కృతజ్ఞతలను తెల్పినారు. ప్రజలందరూ తమ యిష్టదైవమును, తాము నిర్మించిన ధ్యాన మందిరములో నిలుపుకొన్నారు. తమ తమ గుండెల్లోనే ఆ దైవము కొలువు దీరినట్లు తృప్తి చెందినారు.

శ్రీ అరవిందుల దేహాంశముల ప్రతిష్ఠాపన ప్రథమ వార్షికోత్సవము - శ్రీ అరవింద పురం - గడ్డిపల్లి.

శ్రీ అరవిందపురం (గడ్డిపల్లి) లోని శ్రీ అరవింద మందిరంలో, శ్రీ అరవింద అవశేషాల (Relics) ప్రతిష్ఠాపన ప్రథమ వార్షికోత్సవము తేది. 4-4-1973న జరిగినది. ఈ ఉత్సవానికి శ్రీ అరవింద ఆశ్రమం నుండి శ్రీ ఉదార్ పింటో (Secretary, Sri Aurobindo's Action) ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఆయన అచట నిర్మించ తలపెట్టిన 'శ్రీ అరవింద పాఠశాల భవనాని'కి శంకుస్థాపన చేసారు. తరువాత జరిగిన బహిరంగ సభలో శ్రీ అరవిందుల విద్యావిధానం యొక్క ప్రత్యేకతను, ప్రాముఖ్యతను గూర్చి తమ ప్రసంగంలో వివరించారు.

ఈ ఉత్సవానికి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రచార విభాగ శాఖాధిపతి శ్రీ ధనంజయరావు గారు, హైద్రాబాద్ నుండి అరుదెంచిరి. ఆయన శ్రీ ఉదార్ పింటో గారి ఆంగ్ల ఉపన్యాసాన్ని, తేటతెల్లముగా తెలుగులో వివరించారు. అనంతరం గడ్డిపల్లి ప్రాజెక్టు సారథియైన డా॥ గంటా గోపాలరెడ్డి గారు శ్రీ అరవిందాశ్రమం, పుదుచ్చేరి నుండి అరుదెంచిన అతిథి, శ్రీ ఉదార్ పింటో గారికి, ప్రాజెక్టుకు సంబంధించిన విశేష వివరాలను తెలిపిరి. తరువాత, వారు శ్రీ దివ్యమాత అనుగ్రహం మేరకు, రైతులందరు సమిష్టిగా సాధించిన వివిధ ప్రాజెక్టుల వివరముల భవిష్యత్ స్వరూప స్వభావాలను గూర్చి తెలిపి, భవిష్యత్ తరాన్ని, ఆ దిశగా సంసిద్ధ మొనర్చుటకు, విద్యాలయం యొక్క ఆవశ్యకతను వివరించిరి. ఆ విద్యాలయం నూతన భవనానికి, శ్రీ దివ్యమాతయొక్క ప్రియశిష్యుడు, శ్రీ ఉదార్ పింటో గారు శంకుస్థాపన చేయుట, గడ్డిపల్లి వాసుల అదృష్టంగా కొనియాడారు. రైతాంగము తరపున శ్రీ ఉదార్ గారికి కృతజ్ఞతా పూర్వక వందనములర్పించారు.

చివరగా, డా॥ వి. మన్మోహన్ రెడ్డి గారు, (శ్రీ అరవింద కర్మధార సంపాదకులు) గడ్డిపల్లి లిఫ్టు ఇరిగేషన్ సహకార సంఘాల యొక్క అధ్యక్ష, కార్యదర్శుల నుద్దేశించి, తాము తలపెట్టిన ఉద్యమాన్ని గూర్చి, సమిష్టిగా వారంతా నిర్వహించాల్సిన బాధ్యతలను వివరించారు.

గడ్డిపల్లి యువజన బృందం వారు, శ్రీమాతపై వారికున్న భక్తి శ్రద్ధలను ప్రకటించు బుర్రకథను, నాటికలను ముందురోజు రాత్రి అనగా 3-4-1973 నాడు సభాసదుల హర్షధ్వానాల మధ్య ప్రదర్శించారు.

శాస్త్రీయ పద్ధతిలో వ్యవసాయ ప్రదర్శన :

ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, హైద్రాబాదు నుండి ప్రత్యేక వాహనంలో 'వ్యవసాయ ప్రదర్శన' (Agricultural Exhibition) సామాగ్రి మరియు సిబ్బందితో అరుదెంచిన వారు, శాస్త్రీయ పద్ధతిలో ప్రదర్శనను యేర్పాటు చేసినారు. శ్రీ ధనంజయ రావు గారి (వవ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రచార శాఖాధిపతి) నేతృత్వములో యేర్పాటు గావించ బడిన ఈ ప్రదర్శన, వ్యవసాయ శాస్త్ర మెళకువలను, ప్రయోగ పద్ధతులను రైతులకు చక్కగా వివరించినది. సాంప్రదాయ పద్ధతి సాగు విధానాలను, సాంకేతిక శాస్త్ర పద్ధతుల మధ్య నున్న తారతమ్యములను రైతులు అవగాహన చేసికొనిరి.. ముందుముందు ఈ నూతన పద్ధతులనే అవలంభించి, తమ వ్యవసాయ ములను నిర్వహించుటకు నిర్ణయించుకొనిరి. ఆ ప్రయోగ పద్ధతులు ఎంతటి నూతనమైన వైనను, వారికి మార్గదర్శకత్వము చేయుటకు కొండంత అండగా, వ్యవసాయ శాస్త్రవేత్త డా॥ గోపాలరెడ్డి గారు ఉండుట, వారి భాగ్యముగా భావించిరి.

చలన చిత్ర ప్రదర్శన :

అదేరోజు అనగా 4-4-1973 సాయంత్రం 7-00 గంటలకు "శ్రీ అరవిందుల జీవితము - కార్యము" పై రెండు గంటల నిడివిగల చలన చిత్రాన్ని ప్రదర్శించుట జరిగినది. చిత్రప్రదర్శన సమయములో మధ్య మధ్య అందులోని విశేషాంశములను గూర్చి, ప్రేక్షకులకు డా॥ గోపాలరెడ్డి గారు వివరించుట జరిగినది. పరిసర గ్రామాల నుండి చిత్ర ప్రదర్శనను తిలకించుటకు 5 వేల మంది వరకు ప్రజలు అరుదెంచారు.

ప్రభ బండ్ల ప్రదక్షిణ :

అంతకుముందు అదేరోజు మధ్యాహ్నం 3 గంటలపుడు పరిసర గ్రామాల నుండి అత్యుత్సాహముతో, రంగు రంగుల వస్త్రాలతో అలంకరించిన రెండెడ్ల బండ్లపై శ్రీ మాతారవిందుల చిత్ర పటాలనుంచి, సమున్నతమైన 'ప్రభ'లను తీర్చి దిద్దిన 50 వరకు బండ్లు వచ్చి, "శ్రీమాతారవిందుల మందిరం" చుట్టు ప్రదక్షిణ గావించినవి. రైతు జనము, స్త్రీలు, బాలురు, వృద్ధులందరకు నేత్రోత్సవమును గావించిన ఈ

వైభవమును దర్శించుటకు తండోపతండాలుగా అరుదెంచి, మంగళహారతులతో, పుష్పమాలలతో, టెంకాయ ప్రసాదములతో మందిరములోని శ్రీమాతారవిందులను, భక్తి పూర్వకముగా, తమకు నూతన జన్మను ప్రసాదించినట్లు భావించి, సేవించుకొని ధన్యులైనారు. ఈ విధంగా ఈ ఉత్సవం "శ్రీమాత తిరునాళ్లు"గా వారి హృదయాలందు చెరగని ముద్ర వేసినది. ఆనాటి నుండి నేటికి యిదే విధంగా ప్రతి సంవత్సరం తమ భక్తి ప్రపత్తులతో శ్రీమాతారవిందులను సేవించుకొనుచున్నారు.

శ్రీ మాత తిరునాళ్లు (29-3-76 ... 4-4-76)
శ్రీ అరవింద పురం - గడ్డిపల్లి.

29 మార్చి, 4 ఏప్రిల్ తేదీల ప్రాముఖ్యత :

అరవిందపురం (గడ్డిపల్లి)లో 29-3-1976 నుండి 4-4-1976 వరకు శ్రీమాత తిరునాళ్లు ప్రతి సంవత్సరం వలెనే ఘనంగా జరిగాయి. శ్రీ అరవిందాశ్రమ చరిత్రలో ఈ రెండు తేదీలకు ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఉన్నది. క్రీ.శ. 1914 వ సం॥ మార్చి 29వ తేదీన ఫ్రాన్స్ దేశాన్నుండి శ్రీమాత పుదుచ్చేరికి శ్రీ అరవిందుల దర్శనార్థం ఆశ్రమానికి అరుదెంచారు. శ్రీ అరవిందులను దర్శించాలన్న కుతూహలము కొంత కాలం నుండి శ్రీమాతకు వున్నా, అది ఈ రోజున మొదటిసారి తన రాకతో సిద్ధించినది.

ఇక రెండవది, నాల్గవ తేది, నాల్గవ నెల, పందొమ్మిదివందల పది సం॥ (4-4-1910) నాడు సాయంకాలము నాల్గు గంటలకు శ్రీ అరవిందులు చంద్ర నాగూర్ నుండి పుదుచ్చేరికి వచ్చారు. ఇది కూడా వారు యిక్కడికి వచ్చింది. మొదటి మారే కాబట్టి ఈ రెండు దినాలకున్న ప్రాముఖ్యత యిట్టిది. ఈ రెండు తేదీల మధ్యకాలం వారం రోజులను గడ్డిపల్లి వాసులు శ్రీమాత తిరునాళ్లుగా జరుపుకొనుచు ధన్యులైనారు.

ఈ సందర్భంగా 29 మార్చి నుండి 4 ఏప్రిల్ (1973) వరకు ప్రతిరోజు ఉదయ సాయంకాలాలందు, శ్రీ టి. నర్సింహం గారు (వేల్పూరు) శ్రీ మద్భగవద్గీత ప్రవచనాలు చేసారు. శ్రీ అరవింద ధ్యాన మందిరం ప్రాంగణంలో శ్రీ టి. నర్సింహం గారు గ్రామీణులకు అర్థమగు రీతిగా గీతా ప్రవచనాలు గావించి, అందరిని ధన్యులను చేసిరి. వారు ఉపయోగించిన భాష మిక్కిలి సరళంగా యుండుట మూలాన, ఈ

కార్యక్రమానికి అందరు అరుదెంచెడి వారు. శ్రద్ధగా ఆలకించెడివారు కూడా.

"శ్రీమాత లిఫ్టు ఇరిగేషన్" ప్రాజెక్టు శంకుస్థాపన :

అగ్రహారం గ్రామం వద్ద ది. 4-4-1976 నాడు డా॥ వి. మధుసూదన్ రెడ్డి గారు, ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆచార్యులు, "శ్రీమాత లిఫ్టు ఇరిగేషన్" స్థాపించు కార్యక్రమానికి శంకుస్థాపన చేసినారు. అంతకు ముందు అగ్రహారం గ్రామప్రజలంతా నూతన ఉత్సాహంతో తమ గ్రామ పంటపొలాలను సస్యశ్యామలం చేయడానికి సంకల్పించిన శ్రీమాత లిఫ్టు ఇరిగేషన్ పనిని ప్రారంభించుటకు వచ్చిన ఆచార్య మధుసూదన్ రెడ్డి గారికి మేళతాళాలతో ఘనంగా స్వాగతము పలికినారు.

శ్రీమాతపురం - 'ఎడ్యుకేషన్ టౌన్‌షిప్' :

ఆ ప్రదేశమందు శ్రీమాతారవిందుల చిత్రపటాలను ఉన్నత ఆసనములపై వుంచి, పరిమళ భరిత పుష్పమాలలతో అందంగా అలంకరించి, భక్తి ప్రపత్తులతో పూజలొనరించి, నారికేళాలను సమర్పించి, మౌనప్రార్థనతో యీ శంకుస్థాపన ఉత్సవం జరిగింది. శ్రీమాతారవిందులకు ప్రజలందరు ముక్తకంఠంగా జయజయ ధ్వానములు చేసిరి. ఈ 'లిఫ్టు' వలన ఆ ప్రాంతములో ఒక వెయ్యి ఎకరాల బీడు భూములు సస్యశ్యామలం కాగలవు. ఈ ప్రాంతంలో 'శ్రీమాతపురం' అను పేరిట ఒక 'ఎడ్యుకుషన్ టౌన్‌షిప్' ను నెలకొల్పాలన్న సంకల్పం వున్నట్లుఆ, యీ మహా ఉద్యమ దీక్షా కంకణ ధారి అయిన డా॥ గోపాలరెడ్డి తెలియజేసి అందరిని ఆనందభరితులను చేసినారు.

శ్రీమాత ఆశీర్వదించిన గ్రామీణ భారతి వికాసానికి అంకురార్పణ జరిగిన ఈ శుభసందర్భానికి, ఆశీర్వదించుటకు అరుదెంచిన శ్రీ మాతారవింద భక్తులు, శ్రీయుతులు, శ్రీ గురుప్రసాద్ గారు, డా॥ వి. మన్మోహనరెడ్డి గారు, ప్రొఫెసరు ఎం. నాదకర్ణి గారు రైతాంగమునకు తమ శుభాకాంక్షలను అందించిరి. అట్లే కోటగిరి శ్రీ అరవింద కేంద్రం నుండి వచ్చిన శ్రీ కొంగర భాస్కరరావు, శ్రీ బి. గంగాధర్, శ్రీ జి. రంగారావు, శ్రీ వి.పి. చౌదరి, శ్రీ కొసరాజు కృష్ణమూర్తి గారలు, వేల్పూరు కేంద్రం నుండి శ్రీ టి. నర్సింహం గారు, నర్సంపేట నుండి శ్రీ చదలవాడ కృష్ణారావు మిత్ర బృందము వారు అందరూ తమ శుభాకాంక్షలనందించారు. ఈ ఉత్సవానంతరం అంతా పవిత్ర అవశేషాలను భద్రపరచిన శ్రీమాతారవిందుల మందిరాన్ని దర్శించికొని, డా॥ గోపాలరెడ్డి గారి నాయకత్వమున కొనసాగుచున్న ప్రాజెక్టులన్నీ సత్వరంగా సత్ఫలితాల నందించాలని ప్రార్థించారు.

పరిసర పల్లెల నుండి ప్రజలు భక్తి శ్రద్ధలతో శ్రీమాతారవిందుల చిత్ర పటాలను అందంగా అలంకరించిన బండ్లపై నుంచి, ఎత్తైన ప్రభలతో తీర్చిదిద్ది, రంగులతోను, పూల మాలలతోను, చూడ ముచ్చటలు గొలుపు బసవన్నలను పూన్చిన రెండెడ్ల బండ్లు దాదాపు 90 వరకు వచ్చి, శ్రీమాతారవిందుల మందిరం చుట్టూ ప్రదక్షిణలతో తమ భక్తిని చాటినవి.

లిఫ్టు ఇరిగేషన్ సొసైటీల ప్రతినిధుల సమావేశము

అదే రోజు 4-4-1976 న సాయంత్రం అందరి హృదయాలు ఆనందోత్సాహాలతో నిండిన వేళ, అన్ని గ్రామాలకు చెందిన 'లిఫ్టు ఇరిగేషన్ సొసైటీలకు' సంబంధించిన ప్రతినిధుల సమావేశము నిర్వహించుట జరిగినది. ఆ సభలో డా॥ గోపాలరెడ్డి గారు వారిని ఉద్దేశించి, గత ఆరు సంవత్సరాలుగా ఆ గ్రామాలందు జరిగిన ప్రగతి కార్యక్రమాలను, శ్రీమాతారవిందుల అనుగ్రహం మేరకు ఏ విధంగా సాధించబడినవో యీ రీతిగా వివరించారు.

డా॥ గోపాలరెడ్డి గారి గంభీర ఉపన్యాసము :

"గతంలో ఆరు సంవత్సరాల క్రితం యీ ప్రాంతంలోని జనాభాలో 90% మందికి ధరించుటకు సరియైన బట్టలు కాని, సరిపోవునంతటి తిండిగింజలు కాని లభ్యమయ్యేవి కావు. ఇచటి బాలబాలికలకు చదువుకొనుటకు పాఠశాలలు లేవు. వారికి చదువుట, వ్రాయుట అందని ఫలాలే అయ్యాయి. వర్షాధారపు పునాస పంటలే వారి సాగు ఫలితము. ఆ మేరకే వారి బ్రతుకులుండేవి కూడా - ఇది మనందరకు అనుభవమే కదా. కాని యీనాడు శ్రీమాతారవిందుల అనుగ్రహం మనపై సంపూర్ణంగా వర్షించిన ఈ ఆరు (6) సంవత్సరాల తర్వాత యిచటి ప్రజలందరకు తినుటకు తిండి, వంటి నిండా కట్టు కొనుటకు బట్టలు యేర్పడినాయి. ఎక్కువ మంది పిల్లలు చదువుకొనుటకు బడికి వెల్లుచున్నారు. మన శ్రీ అరవిందపురం లోనే "శ్రీ అరవింద హైస్కూలు"ను యేర్పాటు చేసుకొన్నాము. దీనికి అనుబంధంగా హాస్టలు వసతి కూడా కలదు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఆసుపత్రి కూడా కలదు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఆసుపత్రి కూడా వెలసినది. ఇచ్చటి 6 గ్రామాలకు చెందిన బీడు భూములు నేడు పాడిపంటలతో, సస్యశ్యామలంగా, కన్నుల పండువుగా దర్శనము యిచ్చు చున్నాయి. సంవత్సరం పొడవునా రెండు మార్లు పంటలు

పండుచున్నవి. పండిన పంటలను గిట్టుబాటు ధర లభించేవరకు అట్టిపెట్టుకొనుటకు సరిపడు గోదాములను కూడా సమకూర్చుకున్నాము. మనము శ్రీమాతారవిందుల అనుగ్రహం తోను, ప్రభుత్వ అనుమతితోను నాగార్జున సాగర్ ఎడమ కాల్వ - "లాల్ బహద్దూర్ కెనాల్" కు చిన్న ఆనకట్టను కట్టి, దాదాపు రూ. $1^1/_2$ కోట్ల వ్యయంతో 'లిఫ్టు' పద్ధతిన సరపరా అగుచున్న సాగునీరు, ఈ ప్రాంత చరిత్రనే మార్చివేసినది. ఇదంతా మనం సమిష్టిగా సాధించిన విజయం". అని వారు తమ ప్రసంగాన్ని సభాసదుల హర్షానంద ములు, జయజయ ధ్వానముల మధ్య ముగించారు.

సహకార సంఘం యొక్క విశిష్టత :

శ్రీమాతారవిందుల అనుగ్రహంచే యింతటి అభివృద్ధికి నోచుకున్న ఈ ప్రాంత ఉద్యమ తీరులో కొన్ని గమనించాల్సిన ముఖ్య అంశము లేమనగా -

గడ్డిపల్లిలో సమిష్టి అభ్యుదయానికి రైతులు యేర్పరచుకొన్న "మహాత్మాగాంధి లిఫ్టు ఇరిగేషన్ సొసైటి" సహకార పద్ధతి ననుసరించి ప్రగతి సాధించుచున్నది. అయితే సొసైటీలోని ప్రతి సభ్యుని భూమి ఆ వ్యక్తి సొంతము. అది రికార్డుల్లో అతని పేరు మీదనే యుంటుంది. కాని ఆ వ్యక్తి తన అవసరముల కొరకు అరవిందపురం లోని కేంద్ర సంఘంతో అన్ని విధాలైన సంబంధాలను కల్గియుండును. కేవలము ఇది ఒక సహకార సంస్థ మాత్రమే కాదు. వ్యక్తి యొక్క అవసరాలను, సహకార పద్ధతిలో సమకూర్చిపెట్టే సమగ్ర లక్షణములు గల సంస్థ. సంఘీభావముతోను, సోదర భావము తోను సభ్యులు తమ పనులను చక్కబెట్టుకుంటారు.

ఈ సంఘము నందలి మరొక ముఖ్య అంశము - బయటి ప్రపంచంలో పరిస్థితులెంత బాధాకరంగా వున్నా, ఏ విధమైన చిక్కు సమస్యలున్నా - ఆ బాధల నుండి, ఆ చిక్కుల నుండి శ్రీ మాతారవిందులు తమను కాపాడుతారన్న పరిపూర్ణ విశ్వాసము, ధైర్యము ఈ ప్రాంతంలోని (6) గ్రామాల ప్రజల్లో వయసుతోను, మతం తోను, విద్యతోను నిమిత్తం లేకుండా నిండియుంది. ఇచటి ప్రజల హృదయాల్లోను, వాతావరణములోను శ్రీమాతారవిందుల దివ్యచైతన్యము నిండి యుంది. ఒక సమగ్రమైన దివ్యతేజస్సు ఇచటి ప్రజలనందరినీ వారికి తెల్సినా తెలియకున్నా సమిష్టి జీవనం వైపు దివ్యజీవన ఆవిర్భావానికి కావలసిన ప్రేరణను యిస్తున్నది. అడుగులు

మందగతిగా పడినా, దివ్యజీవనం వైపు స్థిరంగానే పడుతున్నాయి. ప్రతి వ్యక్తి గుండెల్లో ఆ దివ్యమాత గూడు కట్టుకొని యున్నది.

శ్రీ అరవిందాశ్రమానికి దూరాన బయటి ప్రపంచంలో యింత భారీ యెత్తున శ్రీమాతారవిందుల దివ్య సందేశాలకు రూప కల్పన చేస్తున్న మహనీయులు శ్రీయుతులు డా॥ గోపాలరెడ్డి, డా॥ వి. మధుసూదన రెడ్డి, డా॥ వి. మన్మోహన రెడ్డి, మరియు ప్రొఫెసరు జి. సత్యనారాయణ, వీరితోపాటు మనస్పూర్తిగా సహకరించే పెద్దలు ధన్యులు. ప్రయోగాత్మకంగా కొనసాగుచున్న యీ ప్రాజెక్టు యొక్క నమూనా శ్రీమాత దివ్య చేతనలో ముందే రూపు సంతరించుకొని వుంది కనుకనే దివ్య సమిష్టి జీవనానికి యిచట దారి పడినది. ఆంధ్రప్రదేశ్‌లో అంకురించిన యీ దివ్య సమిష్టి జీవన ప్రయోగము భావికాలాన భారతావనికి మార్గదర్శక మగుననుటలో సందేహము లేదు.

★ ★ ★

"'గడ్డిపల్లి' గ్రామీణ భారతము యొక్క ఆరోవిల్"

ఆరోవిల్ అంతర్జాతీయ నగరము. ఇది పాండిచ్చేరికి సమీపములో నున్నది. శ్రీ అరవిందాశ్రమానికి అనుబంధ ప్రాజెక్టు. అంతర్జాతీయ సంస్కృతికి నిలయము. శ్రీమాతారవిందుల దివ్య సంకల్పానికి సాకారం. విశ్వమానవ ఐక్యత, స్వేచ్ఛా సమానత్వ, సౌభాతృత్వ సౌధం. ప్రపంచ దేశాలు కల్సియుండుట కేర్పడిన నమూన కేంద్రం. కాగా గడ్డిపల్లి గ్రామీణ భారత నిర్మాణానికి, గ్రామ అభ్యుదయానికి ఉద్దేశించిన నమూనా గ్రామము.

'గడ్డిపల్లి' ప్రయోగము – గ్రామీణ భారత పునర్నిర్మాణము :

గ్రామీణ భారత నిర్మాణానికి 'గడ్డిపల్లి' గ్రామంలో నూతన ప్రయోగ మొకటి ప్రారంభింప బడినది. మహాత్మాగాంధి జన్మదినము (2-10-1969) నాడు అచటి ప్రజలు డా॥ గంట గోపాలరెడ్డి గారి నాయకత్వంలో, శ్రీ మాతారవిందుల అనుగ్రహ ఆశీస్సులతో, "మహాత్మా గాంధి లిఫ్టు ఇరిగేషన్ కో-ఆపరేటివ్ సొసైటి"ని స్థాపించారు. ఆం.ప్ర. ప్రభుత్వ అనుమతి పొంది, ఈ స్కీంపై ఒక కోటి రూపాయలు వెచ్చించి, 1969 నుండి 1972 వరకు, ఈ మూడు సంవత్సరాల కాలంలో మొదటిదశ పూర్తి చేసినారు. నాగార్జున సాగర్ ఎడమ కాల్వనుండి నీరు తోడుటకు 4 పంపు సెట్లను బిగించి, నీరు తోడి, సాగు చేయుట ద్వారా నూతన అధ్యాయానికి తెరతీసినారు. ప్రభుత్వ పథకాలతో పోల్చినపుడు యిది మిక్కిలి చిన్నదే; అయినా సాంఘిక – ఆర్థిక విద్య, సాంస్కృతిక ఆధ్యాత్మిక అభివృద్ధి సాధన దిశగా ఇది వినూత్నమైనది. మరెక్కడా లేనిది. భారత భూభాగంపై, స్వరాజ్యమొచ్చిన రెండున్నర దశాబ్దముల తర్వాత, భారతీయ మేధో సంపత్తితో ఇట్టి నూతన ఉద్యమం ప్రారంభమైనది. మన నాయకగణం, ఆర్థిక, సాంఘిక, రాజకీయ రంగాల్లో ఆంగ్లేయుల నమూనా పద్ధతులనే కొనసాగించు చున్నారు. ప్రస్తుత ప్రపంచం రెండు ముఖ్యదృక్పధములతో ముందుకు సాగుచున్నది. ఒకటి సోవియట్ తరహా దైతే, మరొకటి ప్రజాస్వామిక పెట్టుబడి దారీ పద్ధతి. ఈ రెండు పద్ధతులు కూడా తమ తమ ప్రత్యేకతలతో, మంచిచెడు గుణాలను మిశ్రమంగా కలిగియున్నవి. ఈ రెండునూ పాక్షిక సత్యాలే. ఇవేవీ మానవ విలువలను పరిగణనలోకి తీసికోలేదు. ఇవి కేవలం ఆర్థిక దృక్పథంతో ఒకటి, సాంఘిక దృక్పథంతో మరొకటి ముందుకొచ్చి నవే కాని వానిలో సమగ్రత దృష్టి దేనికిని లేవు. ఆధునిక కాలంలో అందుబాటు లోకి వచ్చిన శాస్త్ర సాంకేతిక

సౌకర్యాలు మానవులను చెడు నడతకు దూరంగా ఉంచలేక పోయినవి, సరికదా ఇంకా ఎక్కువైన వన్నా దోషమేమి వుండదనుకుంటా. బాగా అభివృద్ధి చెందిన దేశాల తీరు కూడా యిట్లే వుంది. మానవులు భయం గుప్పిటిలోనే మనుగడ సాగించుచున్నారు. మన నాయకులు గ్రుడ్డిగా, అవసానదశకు చేరిన పాశ్చాత్య అద్దె పద్ధతులనే అనుసరించుచున్నారు. అందుకని జాతీయ తరహాలో మన అభివృద్ధి కొనసాగుట లేదు. గాంధీజి ఆర్థిక విధానము ఖండింప బడినది. వారి తత్వానికి విజ్ఞాన శాస్త్రాన్ని జోడించినచో, ఆ ఫలితాలు వేరొక విధంగా యుండెడివి.

శ్రీ అరవిందుల సమగ్ర పద్ధతి :

శ్రీ అరవిందులు, ప్రథమ ప్రపంచ సంగ్రామం నడుస్తున్న రోజుల్లో సమగ్ర నాగరికతకు చెందిన అన్ని అంశాలను, తమ తత్వశాస్త్ర మాసపత్రికయైన 'ఆర్య'లో వివరించారు. ప్రస్తుత నాగరికత తర్వాత రానున్న ఆ సమగ్ర నాగరికత ఆవిష్కరింప బడుతుందని వారు వివరించారు. అయితే శాస్త్ర విజ్ఞాన లేమిచే కాని, భౌతిక వనరుల కొరతచే కాని, ప్రస్తుత ప్రపంచం బాధపడుట లేదు. కేవలం, హ్రస్వదృష్టి తోను, ఖండిత దృష్టితో మాత్రమే ఇపుడున్న ప్రపంచం బాధ పడుచున్నట్లు వారు తెల్పినారు. మానవులకు యింకా విశ్వదృక్పధము నెలకొనలేదు, అని వారు వివరించారు. భవిష్య ప్రపంచం యొక్క సంపూర్ణ చిత్రాన్ని, శ్రీ అరవిందులు తమ రచనల్లో వివరించి యున్నారు.

భారతదేశ పాత్ర :

ప్రపంచంలో భారతదేశ మొక్కటే, విశ్వమానవాళికి మార్గదర్శనం చేయ గలదు. ఇది ఒక సూక్ష్మ ప్రపంచం. అందుకే యిది యిపుడు ప్రస్తుతం చేవ చచ్చిన పాతపద్ధతులను విడనాడి, భారతీయమైన స్వంత పద్ధతులను నూతనమైన వానిని అవలంభించాల్సిన తరుణం ఆసన్నమైనది. అట్టి నూతనమైన, సమగ్ర పద్ధతుల్లో ముఖ్యమైనది, 'గ్రామీణ భారత నిర్మాణం'. ప్రస్తుత ప్రపంచంలో ధనము ప్రధానపాత్ర పోషించుచున్నది. సంఘంలోని సమస్యలన్నీ దాని చుట్టే తిరుగుచున్నవి. 70% ప్రజలు గ్రామాలందే నివసించుచున్నారు. అందుకని గ్రామ పునర్నిర్మాణమును సత్వరమే చేపట్టాల్సియుంది. ఇప్పుడు అమలులో గల రెండు ఆర్థిక పరమైన పద్ధతులు ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులో నున్నవి. అవి ఒకటి 'సోవియట్ తరహా పద్ధతి' కాగా రెండవది 'అమెరికన్ తరహా పద్ధతి' - అయితే ఈ రెంటికి సమతూకంగా

యుండే ప్రయోగాన్ని, గడ్డిపల్లి పొరం నందు, విలువల ఆధారిత స్కీముల ద్వారా అమలు చేయుచున్నారు. ఇచటి రైతు తన భూమికి తానే యజమానిగా వుంటూ, యితరములైన - సాంఘిక, నైతిక అవసరాలకు సొసైటీతో సంబంధ పడియున్నాడు. ఈ గడ్డిపల్లి సొసైటి, కేవలం సహకార పరపతి సొసైటి మాత్రమే కాదు. ఇదొక సమగ్ర సహకార సొసైటి. ఇది వ్యక్తి యొక్క అవసరాల నన్నింటిని దృష్టియందుంచు కొనును. రైతుల మధ్య పరస్పర హితభావాన్ని కలిగించి, క్రమంగా వ్యక్తులు, సంఘంతో మమేకమై పోవునట్లు, వారి సాంఘిక, మానసిక ఆలోచనలందు నూతన దృష్టిని మేల్కొలుపు నట్లున్నది. ప్రతి ఒక్కరి హృదయాలందు సమిష్టి సంక్షేమ హిత భావాన్ని పెంపొందించు చున్నది.

అరవిందపురం (గడ్డిపల్లి) - నాడు :

నలుబది సంవత్సరాల నాడు, నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్ తాలూకాలోని గడ్డిపల్లి మరియు పరిసర గ్రామాల్లోని ప్రజలను, వ్యవసాయ శాస్త్రవేత్త అయిన డా॥ గంటా గోపాలరెడ్డి గారు సమావేశ పరచి, తమ పొలాల నుండే పారుచున్న నాగార్జున సాగర్ ఎడమకాల్వ ద్వారా మనం లబ్ధి పొందవచ్చును అను విషయాన్ని వివరించినారు. ఆ ఉపాయమే "లిఫ్టు ఇరిగేషన్" లేదా "ఎత్తిపోతల" పద్ధతి. వారి ప్రతిపాదనను ప్రజలందరు ఏకగ్రీవంగా ఆమోదించి, కార్యరంగంలోకి దిగినారు.

డా॥ గోపాలరెడ్డి గారు దీనికి సంబంధించిన సంపూర్ణ ప్రణాళికను రూపొందించి, గడ్డిపల్లితో ఆరు గ్రామాల ప్రజలు దీనిని బలపరుస్తున్నట్టు వారి ఆమోద అంగీకార పత్రములతో సహా, ఆనాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విన్నవించినారు. ప్రభుత్వ వ్యవసాయ శాఖామంత్రి, ఉన్నతాధికారగణంతో చర్చించి, దాని సాధ్యాసాధ్య తలను, రైతులందించు సహకారాన్ని వగైరా విషయాలను వివరించి, "లిఫ్టు ఇరిగేషన్" ప్రయోగానికి అంగీకరింపజేయుట జరిగినది.

ఫలితముగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంటు వారు (ప్రాజెక్టు వింగ్) G.O.Ms. No. 194, తేది : 31-5-1969, ప్రకారం నాగార్జున సాగర్ ఎడమ కాలువ క్రింద 72.4 మైళ్ల వరకు ఇరుప్రక్కల రమారమి 50,000 ఎకరాలకు "లిఫ్టు ఇరిగేషన్ పద్ధతి" ద్వారా నీటిపారుదల అవకాశమునకు మంజూరు ఇచ్చింది. తమకు ప్రభుత్వము వారు కల్పించిన ఈ సౌకర్యానికి తమ కృతజ్ఞతలను తెలిపి, భవిష్యత్ కార్యక్రమానికి పూనుకున్నారు. శ్రీమాత అనుగ్రహం వలన తమ

కార్యసాఫల్యతకు మార్గం సుగమ మైనదని ప్రజలందరు వినమ్ర భావనతో శ్రీమాతకు వందనమొనరించారు. డా॥ గోపాల రెడ్డి గారి నాయకత్వాన ప్రజలందరు ఒక సంఘంగా ఏర్పడి "మహాత్మాగాంధి లిఫ్టు ఇరిగేషన్ సహకార సంఘము" - గడ్డిపల్లి, ని స్థాపించుకొన్నారు.

ఈ సంఘీభావమే అక్కడొక నూతన ప్రపంచాన్ని సృష్టించినది. దీనికి అధినేత్రి దివ్యమాత. భవిష్యత్‌లో సంఘము యొక్క మార్పునకు, ఆ దివ్యమాత నేతృత్వము వహించనున్నది. కావున ఆ జగన్మాత కృప వల్లనే ముందు ముందు యిక్కడ జరుగనున్న పనులు పూర్ణత్వము నొందగలవు.

గత మూడు సంవత్సరాలుగా గడ్డిపల్లి సొసైటి సాధించుచున్న ప్రగతిని ఆదర్శంగా గొని, 1972 సం॥లో మరో 17 ఎత్తిపోతల సంఘాలు, ఈ ఉద్యమంలో చేరినవి. ఒక చిన్న సెలయేరుగా పుట్టిన ఉద్యమం గంగా ప్రవాహంగా ఈ సౌభ్రాతృత్వ సంఘములో భాగస్వాములయ్యారు. ఇన్ని ప్రాంతాలను ప్రభావితం చేసిన నూతన ప్రకాశం తన కిరణ సహస్రాన్ని సర్వే సర్వత్రా వ్యాపింప చేయగలదనుటలో సందేహం లేదు. అందుకే గడ్డిపల్లి (అరవింద పురము) ఒక నవ్యమైన, భవ్య సమగ్ర ఆర్థిక - సాంఘిక వ్యవస్థకు గంగోత్రి అయినది.

అరవిందపురం (గడ్డిపల్లి) - నేడు :

శ్రీమాతారవిందుల అనుగ్రహం - ఆశీస్సులతో గత 40 సం॥ల నాడు, 1969 అక్టోబర్ 2 వ తేదీన ప్రారంభించిన "మహాత్మాగాంధి లిఫ్టు ఇరిగేషన్ సహకార సంఘము - గడ్డిపల్లి", ప్రజల సహకారంతో నిరంతరం పనిచేసి, సత్ఫలితాలను సాధించి రైతాంగానికి సిరులు కురిపించుచున్నది. ఇంతటి ఘన కార్యనిర్వహణకు, డా॥ గోపాలరెడ్డి గారికి, ఈ కార్యాన్ని చేయాలను ప్రేరణను కల్గించినది మరెవరో కాదు, సాక్షాత్తుగా ఆ 'జగన్మాత'యే. ఆమెయే స్వయంగా మన డాక్టరు గారిని తన కార్యనిర్వహణకు ఉపకరణంగా ఎన్నుకున్నది. నాగరికతా గమ్యమును మార్చి, నూతన నాగరికత దిశగా మానవాళిని నడిపించుటకై కాబోలు ! మన రెడ్డి గారిని ప్రప్రథమము నుండి సంసిద్ధ పరచుచు వచ్చినది. వ్యవసాయ శాస్త్రమునే చదువునట్లు, ఆపైన అత్యంత సంపన్నదేశమైన అమెరికాకు పంపి అచట పరిశోధనా రంగమున పట్టభద్రున్ని చేసి, దేశమాత దుస్థితిని తొలగించుటకు, భారీ తరహా వ్యవసాయ కార్యములను నిర్వహించునట్లు చేసి, దేశమాత ఆర్థిక సౌభాగ్యాన్ని ఆకాశమంత ఎత్తునకు చేర్చుటకు సమకట్టినది శ్రీమాత కాక మరెవరు !

గ్రామీణ భారత పునర్నిర్మాణమునకు దీక్షాకంకణ ధారియైన డా॥ గోపాల రెడ్డి గారు, తమ కార్యక్షేత్రానికి కదలుటకు ముందు, తొలుతగా శ్రీ అరవిందాశ్రమాన్ని 1969లో సందర్శించినారు. శ్రీమాతకు తన కార్యప్రణాళికను సమర్పించినారు. 'అమ్మ' ఆమోదముతో తిరిగి వచ్చి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి, నిధులను సమకూర్చుటకు సమాయత్తమైనారు. ఇంతవరకు, కారణాలేమైనా - గ్రామ నిర్మాణము నిర్లక్ష్యమునకు గురియైనదని, అది అట్లే కొనసాగుట భావ్యము కాదని, వాని స్థితి గతులను మెరుగుపరచ వలసిన సమయ మాసన్నమైనదని, నిధులను మసకూర్చుటకు, ప్రభుత్వాలను అంగీకరింప చేసినారు. కార్యసాధనకు, సాఫల్యతకు పలు సంస్థలను రూపొందించి, వాని నిర్వహణయందు ప్రభుత్వముతోబాటు ప్రజలను కూడా భాగస్వాములను చేసినారు. విజయ వంతంగా కొనసాగుచున్న పురోగతికి, ప్రభుత్వము నుండి ప్రశంసలనందుకొనుటయే గాక వారినుండి అదనపు నిధులను కూడా సేకరించినారు. రైతు అభ్యుదయానికి బాటలు వేసినారు. ఇదంతా గతం.

ఇక యిపుడు ప్రభుత్వము పూర్వపు ఇరిగేషన్ ప్రాజెక్టును విస్తృత పరచుటకు, ఈ సొసైటికి $17\frac{1}{2}$ కోట్ల రూ॥లను గ్రాంటుగా మంజూరి చేసినది. వీనితో పాత పంపు సెట్లను తొలగించి, వాని స్థానంలో ఉన్నదానికి, మూడు రెట్లు ఎక్కువ సామర్థ్యం గల పంపుసెట్లను, పెద్ద పెద్ద పైపు లైన్లను నిర్మించుచున్నారు. అదనపు నీరు పుష్కలంగా లభించుట మూలాన, ఈ ప్రాంతం లోని భూములన్నీ పచ్చపచ్చని చేలతో కన్నుల పండుగ గావించుచున్నవి. ఆధునిక అవసరాలకు తగిన రోడ్లు, రవాణా సౌకర్యాలు అభివృద్ధి చెందినవి. రోడ్లకు యిరుప్రక్కల వాణిజ్య సముదాయాలు వెలసినవి. రైతుల జీవన ప్రమాణము పెరిగినది. పిల్లల చదువులకు సరిపడు విద్యాలయాలు వెలసినవి. రైతులతోపాటు స్త్రీ జనానికి కూడా చేతినిండా పనులు సమకూరినవి. నూతన నిర్మాణాలకు కావలసిన సిమెంటు యిటుకల పరిశ్రమలు వెలసినవి. వ్యవసాయ పనులకు 30 ట్రాక్టర్లు సమకూరినవి. వానిని మంచి స్థితిలో పనిచేయించుటకు వర్క్‌షాపులు, వర్కర్లకు కొదువలేదు. యువజనులు ఎవ్వరూ పని లేకుండా వుండరు. అందరకూ చేతినిండా పనులు, ఆ ప్రాంతమంతా పాడిపంటలు, పండ్లతోటలు, పని పాటలతో సుసంపన్నమైనది. ఒకనాటి బీళ్లు నేడు సస్యశ్యామలంగా శోభిల్లుచున్నవి. ఇంతకూడా విరామం లేకుండా జనులను పనిలో పెట్టుటకు గడ్డిపల్లిలో వెలసిన సంస్థలు ఆదర్శప్రాయమైనవి.

శ్రీ అరవింద పురము :

"మహాత్మా గాంధి లిఫ్టు ఇరిగేషన్" ప్రాజెక్టు, "కృషి విజ్ఞాన కేంద్రము" మరియు ఇతర ప్రాజెక్టుల కార్యకలాపముల మూలంగా యిచట చాలా బిల్డింగులు వెలసినవి. గడ్డిపల్లి చుట్టూ వెలసిన, ఈ భవన సముదాయములో ప్రధానమైనవి వివిధ 'కార్యాలయ భవనములు', 'విత్తన శుద్ధి సంస్థ', పండిన ఫలసాయమును నిలువ చేయుటకు పెద్ద పెద్ద గోదాములు, ఈ ప్రాజెక్టులకు చెందిన అధికారులరుదెంచి నపుడు మరియు సందర్శకులెవరైనా వచ్చినపుడు, వారు నివాసముండుటకు 'విశ్రాంతి భవనములు', 'వసతి గృహములు', ఏ ఒక్క దానికి కొరత లేకుండా, సకల సదుపాయముల తోను, ఆధునిక రీతిలో అమరిన ఈ భవన సమూహము, ఒక గుచ్ఛములోని పుష్పములవలె నున్న ఆ ప్రాంతమునకు, "శ్రీ అరవిందపురము"ని నామకరణము చేయబడినది.

ఈ భవనము లన్నింటికి మధ్య భాగములో సువిశాల ప్రాంగణములో, శ్రీ అరవిందుల దేహాంశములను (Relics) ప్రతిష్ఠించిన "శ్రీ అరవింద ధ్యాన మందిరము"న్నది. ఆధునిక పద్ధతిలో నిర్మితమైన యిది ఆరోవిల్ లోని "శ్రీమాతృ మందిరము"ను తలపింప చేయుచున్నది. ఈ మధ్యనే దీనిలో శ్రీ అరవిందుల పాలరాతి (Bust) విగ్రహము కూడా ప్రతిష్ఠ చేయబడినది. ఆ ప్రాంతీయులందరకు యిదే ప్రధాన దేవాలయము. అందుకేనేమో, మన దాదాజీ పూర్వం తన పత్రికయైన 'శ్రీఅరవింద కర్మధార' లో "Gaddipally is the Auroville for the Rural India" అని వర్ణించి యున్నారు.

★ ★ ★

గడ్డిపల్లి ప్రాజెక్టు రైతులందు అపశృతి

డా॥ గోపాలరెడ్డి గారిపై వ్యతిరేకత

గడ్డిపల్లి లిఫ్టు ఇరిగేషన్ సహకార సంఘము దిన దిన ప్రవర్ధమానముగా అభివృద్ధి చెందుచు, సభ్యులందరకు సర్వ సంపదలను సమకూర్చి పెట్టుచున్నది. కృషీవలులందరకు, తమ కృషి ఫలించినదన్న తృప్తితో సుఖజీవనము గడుపుచున్నారు. 1971 నుండి నిరంతరముగా సాలుకు రెండు పంటలు దిగుబడి అగుచున్నవి. ఈ ప్రాజెక్టులోని ఆరు గ్రామాల ప్రజలు ఆనందముగా నున్నారు. తమ సంతానమునకు చక్కని విద్యలభ్యమగుచున్నది. కళాశాల విద్యకొరకు సమీప పట్టణముల నాశ్రయించి నారు. ఈ ఆరు గ్రామాల సంపుటికి నాలుగు ప్రక్కల నున్న సూర్యాపేట, హుజూర్ నగర్, మిర్యాల గూడ మరియు కోదాడ పట్టణములలో ఉన్నత కళాశాల విద్య లభ్య మగుచున్నది. కళాశాల విద్య అందుబాటులో ఉండుటవలన యువజనము అధిక సంఖ్యలో విద్యావంతులై పరిపక్వత చెందినారు. కళాశాల విద్యతో విజ్ఞాన నేత్రము విప్పుకొనునని విజ్ఞులు నుడివెదరు కదా ! ఆ విధముగా నూతన తరము తొంగిచూచు చున్నది. తమ తండ్రులు, తమ కొరకు నిర్వహించిన త్యాగములు, గ్రామాభ్యుదయము నకు వారొనరించిన కృషి, మొదలగు సమస్యలు యువజనమునకు అవగాహన కల్గినది. తమ గ్రామము నుండి ఉన్నత శిఖరముల కెదిగిన డా॥ గోపాలరెడ్డి గారు యింత కాలముగా నిర్వహించుచున్న నిస్వార్థ త్యాగము తమకు బాసటయైనదని తెల్సికొన్నారు. వారిని తమ ఆదర్శమూర్తిగా తలచినారు. అనితరసాధ్యము, అసాధారణమగు వారి కృషిని కొనియాడిరి. 12 సంవత్సరములుగా ప్రాజెక్టు రైతులు, పిల్లాపాపలతో సుఖ జీవనమును గడుపుచున్నారు.

శ్రీమాత అనుగ్రహము వలన రైతాంగము సకల సంపదలను స్వయంకృషితో సమకూర్చుకొని, సుఖజీవనము సాగించుచున్నారు. ఆ సమయములో కొందరు రైతులలో డా॥ గోపాలరెడ్డి గారి నాయకత్వముపై అసహనము ఏర్పడినది. ఇది మానవ స్వభావ లక్షణము. కాలము ఎప్పుడు ఒక్కతీరుగా నుండదు కదా ! అట్టి వారికి అధికార వాంఛ కూడా కలిగినది. క్రమముగా ఈ భావము ఒక్కరి నుండి పలువురికి విస్తరించినపుడు కొందరనుకూలము గాను మరి కొందరు వానికి భిన్నముగా నుందురు కదా ! అననుకూల వర్గము వారంతా మంతనాలాడుచు డా॥ గోపాలరెడ్డి గారి నాయకత్వమునకు భిన్నమనస్కులై తమ వర్గము వారిని కూడగట్టినారు. కొందరు

సత్వర నిర్ణయము చేయలేని ఊగిసలాట మనస్కులకు దుర్బోధలు చేసి తమ ప్రక్కన చేర్చుకున్నారు. ఇదంతా లోలోపటి భాగోతము బయటపడి రెడ్డిగారిని ఎదిరించే సాహసమునకు యింకా దిగలేదు.

నల్లగొండ జిల్లా అది నుండియు కమ్యూనిస్టు భావజాలమునకు నిలయము. హైద్రాబాదు సంస్థాన విమోచనోద్యమ కాలము నాడు, నిజాం నవాబును గద్దె దింపుటలో అధికపాత్రను పోషించినది ఈ జిల్లా. ముఖ్యముగా సూర్యాపేట విద్యార్థి గణమే. 1947-48 నాటి సాయుధ పోరాట దళములన్నీ యిక్కడ నుండి యేర్పడినవే. ఆనాటి దళముల పేర్లు కొన్ని బి.ఎన్. దళము, వి.ఎన్. దళము, సి.టి. దళము మొ॥ ఆవాడు ఈ దళములు అనేక ఘనకార్యములు చేసి నిజాంనవాబు ప్రక్కలో బల్లెముగా నుండినవి. ఈ భావజాలము ఇక్కడ ఈనాటికిని మనుగడ సాగించుచున్నది.

కమ్యూనిస్టు క్యాడరులోని యువక సభ్యులు కొందరు ఈ గ్రామాలందు డా॥ గోపాలరెడ్డి గారి అభ్యుదయ పథమునకు ఆకర్షితులైనారు. వారి నాయక గణమునకిది రుచించలేదు. గ్రామములపై తమపట్టు సడలగలదను బెంగ వారిని పట్టుకొన్నది. ఇతర రాజకీయ పక్షముల వారిది కూడా యిదేతీరు. గత కొద్దికాలముగా ఏ రాజకీయ పక్షము వారు కూడా గడ్డిపల్లిలో బహిరంగసభ పెట్టుటకు సాహసించ లేదు. ఆయా పార్టీలవారు ఏ రకమైన ప్రభావమును యిక్కడ చూపలేక పోయినారు. దీనికంతటికి కారణం గ్రామాభ్యుదయమునకు ఆచరణాత్మకముగా పాటు పడుచున్న డా॥ గోపాలరెడ్డి గారేనని, వారిపై ద్వేషభావమును పెంచుకొనుచున్నారు. చిన్న పెద్ద రాజకీయ పార్టీల వారిది కూడా ఇదేబాట కాగా, ఇక ఈ ఆరు గ్రామాలందు తరతరాలుగా అధికారము చలాయించిన భూస్వాములు కూడా వారిపై అసంతృప్తి గానే యున్నారు. వారి అధికారము డొల్లయగుచున్నదని, సామాన్య జనముపై తమ పట్టు పోవుచున్నదను బెంగ వారిని పట్టుకున్నది. ఆ క్రమంలోనే గ్రామాధికార గణం ఇక వడ్డీ వ్యాపారులు, వర్తక వాణిజ్య గణం వారు కూడా, కో-ఆపరేటివ్ సొసైటీ నుండి డబ్బు, సూపర్ బజారు నుండి నిత్యావసర సరుకులు రైతాంగమునకు లభ్యమగుచున్నందున, తమ దుకాణములు మూతపడినవని అసంతృప్తిగా యున్నారు. ఇంతమంది ఒకవైపు తమ పంట భూములకు అందిన నీటితో లబ్ధిపొందుచు కూడా మరొక వైపు డా॥ గోపాలరెడ్డి గారిపై వైషమ్యమును పెంచుకొనుచున్నారు.

ఈ విధముగా అసహనమునకు గురియైన వారందరు డా॥ రెడ్డి గారి అధికారమునకు అడ్డుకట్ట వేయాలన్న ఆలోచనను పెంచుకొని 'గడ్డిపల్లి లిఫ్టు ఇరిగేషన్

ప్రాజెక్టు' అధ్యక్ష పదవికి వారిని ఎన్నుకొన కూడదను నిర్ణయమునకు వచ్చినారు అందరూ కల్సి వారిని ప్రశ్నించినారు. "మీరే ఎప్పటికి లిఫ్టు ప్రాజెక్టునకు అధ్యక్షులుగా యుండాలా ?" అని. అందరి ధోరణిని చూచి, "అవసరము లేదు. మీరు కూడా వుండవచ్చు నన్నారు" మన రెడ్డి గారు. "నేనెప్పుడైనా కాదన్నానా ?" ఇక్కడ మనము మూలము లోనికి వెళ్లనిది విషయము సవిస్తరముగా బోధపడదు. కావున ఈ వైపుగా దృష్టిని సారించుట అవసరము.

వ్యతిరేకతకు కారణములు :

గడ్డిపల్లి ప్రాజెక్టు రైతులు లిఫ్టు పనిచేయుట కొరకు కరంటు కాలినంత చార్జీలను తమ తమ భూవసతి ప్రకారము చెల్లించుట ఆనవాయితి. దానికి తోడుగా ఎకరాకు రూ. 20/- చొప్పున అదనముగా రైతులు చెల్లించేవారు. ఈ విధముగా పోగైన ధనమును కమ్యూనిటి కార్యక్రమాలకు వినియోగించు ఆచారమునేర్పాటు చేసుకున్నారు. అనగా ఉన్నతపాఠశాల, ప్రాథమిక ఆరోగ్యకేంద్రము, పశు వైద్యశాల, ప్రజలకు సరసమైన ధరలకు నిత్యావసర పరకులు అందించుటకు సూపర్ మార్కెటు, ప్రజలను బ్యాచ్‌లుగా ప్రతి సంవత్సరము పాండిచేరి శ్రీ అరవిందాశ్రమ సందర్శనకు తీసుకువెళ్లుటకు ఉచిత బస్సు సౌకర్యము కలిగించుట, వారమున కొకమారు పిల్మ్ ప్రదర్శనల యేర్పాటు - అవి ఆశ్రమ సంబంధమైనవి, వ్యవసాయ సంబంధ డాక్యుమెంటరీ పిల్ములు, మరి యితరములను కూడా ప్రదర్శించు యేర్పాటు చేయబడినవి. వీనితోపాటుగా యువకులందు అణగి మణియున్న కళలను వెలికి తీయుటకు సాంస్కృతిక కార్యకలాపముల ప్రదర్శనలు కూడా నిర్వహింపబడుట - ఒక దశాబ్దము పాటు వీనిద్వారా విజ్ఞానమును పొందినా, సౌకర్యములను అనుభవించినా కూడా అసమ్మతి వర్గీయుల దుర్బోధలకు చెవి యొగ్గినారు మన ప్రజలు.

నూతన అధ్యాయము ప్రారంభము :

కమ్యూనిటి కార్యకలాపములలో పాఠశాల, వైద్యశాల, పశువైద్యశాల యివన్నీ ప్రభుత్వ బాధ్యతలు కదా. ప్రభుత్వము నుండి వానిని రాబట్టుకొనవచ్చును కావున వానికొరకు ప్రజలధనమును వెచ్చించుట భావ్యము కాదని రూ. 20/- చెల్లించుట నిలిపి వేసినారు. డా॥ గోపాలరెడ్డి గారి మాటలు వారికి చెవికెక్కలేదు. పోనీయని వారు మిన్నకుండిరి.

గడ్డిపల్లి లిఫ్టు ఇరిగేషన్ సహకార సంఘము నియమావళి ప్రకారము 5 సం॥ల కొకమారు నిర్వహించుకొను ఎన్నికలు వచ్చినవి. అసమ్మతి వర్గీయులు డా॥ గోపాలరెడ్డి గారిని ఓడించి, అట్టి అధికారమును తామే స్వాధీన పరచుకొన వలయునని నిర్ణయించుకుఅన్నరు. కాని రెడ్డి గారే వానికి దూరమున్నారు. ఎన్నికలు జరిగినవి. గ్రామస్తులలో ఒకరు ఆ పదవికి ఎన్నికైనారు. ద్వాదశ వర్షముల తర్వాత లిఫ్టు ఇరిగేషన్ చరిత్రలో నూతన అధ్యాయము ప్రారంభమైనది.

గడ్డిపల్లి లిఫ్టు ఇరిగేషన్ సహకార సంఘము తమ వశమైనందుకు నూతన కార్యవర్గ సభ్యులు సంతోషమును పొందినారు. ఈ ఎన్నికలకు ముందు నిర్ణయము నకు కట్టుబడి రైతాంగము అదనపు రుసుము రూ. 20/- ను, నిలిపివేయాలన్న విషయమునే తిరిగి బలపరచి రైతులకు విముక్తి కల్గించినట్లు భావించినారు. వారు అధికారమును వశపరచుకొన్నపుడు నిల్వ వున్న ధనముతో కార్యక్రమములు కొన్నాళ్లు సాగినవి. ఆ తర్వాత వారు చేతులెత్తేసినారు. పరిష్కార మార్గమునకై జనరల్ బాడీ సమావేశము జరిగినది. రైతాంగమును పెడత్రోవ పట్టించిన చోటా మోటా నాయకులంతా మన గ్రామమునకు పాఠశాల, ఆరోగ్యకేంద్రము ప్రభుత్వము వారు యివ్వాలి కనుక ఆ రెండు సంస్థలను ఎత్తివేయుదామను నిర్ణయానికి వచ్చి, పాఠశాలను ప్రభుత్వ పరము చేసి, డాక్టరును తొలగించి, వైద్యశాలను మూసి వేసినారు. ఎవరి కుటుంబమునకు వారు కావలసిన సరుకులు కొని తెచ్చుకొనవచ్చును కదా ! యని సూపర్ మార్కెటును కూడా ఎత్తివేసినారు. సంఘము వద్ద ధనము అడుగంటినది. వేతనములు చెల్లించలేని దుస్థితి. లిఫ్టు పనివారి వేతనములు ఆగిపోయినవి. వారు పనికి దూరమైనారు. లిఫ్టులు ఆగిపోవుట ఫలితముగా ఒక కారు పంటకు రైతులు దూరమైనారు. చిన్న సన్నకారు రైతులు గగ్గోలు పెట్టినారు. ఇదంతా ఇట్లెందుకు జరిగినది. నీ వల్లనే అంటే మీ వల్లనే అని పరస్పర దూషణలకు దిగినారు. కూలి జనులు నిరసలను, అంతటా హాహాకారములు చెలరేగినవి. విమర్శలు, ప్రతి విమర్శలు, తర్జన భర్జనలు ఎన్నైనా, సమస్యకు పరిష్కారము మాత్రము శూన్యము.

ఈ విధముగా కొనసాగిన రసవత్తరమైన చర్చలలో తేలిన సారాంశమేమన కమ్యూనిటీ కార్యకలాపములను బేరీజువేసి, కొన్నింటిని ప్రభుత్వ పరం చేసి, మరి కొన్నింటిని పడావ పెట్టి, కేవలం లిఫ్టులు నీటి పారుదల ఒక్కదానినే చేపట్టి, వచ్చే జులైనాటికి కాలువలను బాగుచేసి సాగునకు నీరందించే బాధ్యతను మాత్రమే తలకెత్తు కున్నారు. అయితే పంపుల మరమ్మతునకు మార్గమేది? ఇది వారి ముందున్న ప్రశ్న.

డా॥ గోపాలరెడ్డి గారి వద్దకు వచ్చుటకు వారికి ముఖం చెల్లనందున మిన్నకుండుట తప్ప మరేమి చేయలేని స్థితి. రైతులు అశాంతికి గురి అయినారు. యాజమాన్యము వారి అసమర్థతను దుయ్యబట్టినారు. వారి ఆగడాలను సహించలేని స్థితి ఏర్పడినది. లిఫ్టు యంత్రాలు, పంపులు పాతబడి పోయినవి. రిపేరు చేసే స్థితిని దాటిపోయినవి. వాని కెపాసిటికి తగిన నీరు తోడుటలేవు. ఆయకట్టు మొత్తము 3000 ఎకరములకు నీరందించు శక్తిని కోల్పోయినవి. 500 ఎకరాలకు అతికష్టము మీద నీరందు చున్నది. అందరిలో అలజడి చెలరేగినది. ఆ తర్వాత సాలు ఒక మోస్తరుగా వున్న పైపులు కూడా లీకేజీకి గురి అయినవి. తోడిన నీరు నకు గమ్యం తెలియుట లేదు. అవి ఎటు పోవుచున్నవో గాని వేసిన పైరులు మాత్రము వెలవెల బారి ఎండి పోవుచున్నవి. సుఖముగా సాగిపోయే జీవితాలకు చేటును చేతులారా తెచ్చుకున్నాము కదా ! అని పెద్దల వగపు, బింకాలకు పోయిన వారి ముఖములు బిక్కుబిక్కు మనుచు, అయ్యో, అయ్యో అని ఆర్తనాదాలు చేయుచుండిరి. అధికారమునకు అర్రులు చాచినవారు, పదవిని చేజిక్కించుకొన్నవారు ఆనాడు ఏమని తలచియుందురు ? డా॥ గోపాలరెడ్డి గారు చేయు పనిని మేము చేయలేమా ? అని కదా ! ఆనాడు వారికి కష్టమని పించినది డా॥ గోపాలరెడ్డి గారి క్రమశిక్షణ. అందరు కల్సి నిర్ణయించిన విధి విధానములకు అందరు కట్టుబడి యుండాలి; అంతే కాదు అమలు చేయాలి అని అనేవారు. ఈ కార్యము మన అందరిది అను విశాల భావముండాలి. నాయకత్వమునకు బద్ధులై యుండాలి. అపుడే అనుకున్న లక్ష్యసాధన జరుగ గలదని తెలియ జెప్పెడివారు. ఈ మాటలు కొందరికి బాధాకరములైనవి. వారు చేయుచున్న పని సమిష్టి సంక్షేమమునకు కాగా, మనవారి దృష్టి వ్యక్తిగీత స్వార్థము. ఈ రెండింటికి పొంతన కుదరదు. విశాల భావముతో సమాజాన్ని విజ్ఞాన దాయకముగా 12 సంవత్సరాలు నడిపినందు వల్లనే మన నాయకులుగా చలామణీ అగుచున్నవారు కొంత జ్ఞానమును సంపాదించినారు. దానినట్లే కొనసాగించియుంటే, ఈ రెండున్నర దశాబ్ధముల కాలము నానా అగచాట్లకు గురి కావలసిన అవసరముండెడిది కాదు. కాని ఏమి చేయుదుము ! దుర్విధి ఆడించిన నాటక మిది ! ఏ సమాజము నందైనా ఉత్థాన పతనములుండుట సహజము. ఆ సిద్ధాంతము ప్రకారమే గడ్డిపల్లిలో ఈ దురవస్థ యేర్పడిన దనుకొనుట నిజము కాదా ? గడ్డిపల్లి క్షేత్రమునకున్న విశిష్ట లక్షణమేమనగా జగన్మాత యొక్క సంపూర్ణ అనుగ్రహము ఈ క్షేత్రముపై నిండారుగా తొణికిసలాడు చున్నది. అది శాశ్వతము. ఈ క్షేత్రమును వీడి పోయేది కాదు. మరెందుకు యీ దురవస్థ దాపురించినదని ప్రశ్నించెరు కదా ! దానికి సమాధానము

ఒక్కటే ! ఆ తల్లిని అర్థించి రాబట్టే వారేరి ? డా॥ గోపాలరెడ్డి గారు సాధించినట్లుగా చెప్పబడుచున్న ఈ పనుల నన్నింటిని వారి తెలివి తేటలతో జరిగినవని భ్రమపడుచు, మావల్ల కూడా ఇది సాధ్యము కాగలదని ఆనాడు వారిని ఎదిరించినారు. కాని అది వాస్తవము కాదు ! ఆ పనులన్ని శ్రీ అరవిందాశ్రమ జనయిత్రి సమకూర్చి పెట్టిన పనులు. గడ్డిపల్లి రైతులు, ప్రజలు ఆబాలాదులందరు పని జరుగుచున్న సమయములో శ్రీమాత మహిమలను ప్రత్యక్షముగా దర్శించియున్నారు. 12 సంవత్సరముల పాటు సుఖ జీవనము సంప్రాప్తించి, అన్ని హంగులు అమరిన పిదప అజ్ఞానములో పడి వ్యవస్థను భ్రష్టు పట్టించినారు. కారణం వారిలో పెరిగిన 'అహం' అనక తప్పుట లేదు. ఇంత కఠినముగా వ్రాయుచున్నందుకు పెద్దలు నన్ను క్షమింతురు గాక ! చరిత్రను తెలియచెప్పుటే నా పని గాని, ఏ ఒక్కరినో నిందించుట కాదు. ఆనాటి స్థితి గతులు ఆ విధముగా దొర్లిపోయినవని తెలియుట అవసరము. కావుననే యింత నిష్ఠురముగా తెలుపుచున్నాను. ఇది మరొకరికి పాఠము కావాలి. తప్పులు దొర్లుట సహజము. అది తెలుసుకుని పశ్చాత్తాపము చెంది, భవిష్యత్‌లో వానికి ఆస్కారముండరాదని గ్రహించుట కావాలి.

గడ్డిపల్లి క్షేత్రము, దాని పరిసరములు భగవదాశీర్వాద పుణ్యస్థలి యైన పుడమి. కావుననే ఎన్నో మైళ్ల దూరమున నున్న 'కృష్ణమ్మ' ఆ స్థలములో అడుగిడినది. సస్యశ్యామలంగా ఆ భూమిని సుసంపన్నం చేయుటకు తాను సంసిద్ధంగానే యున్నది. దాని దారి మళ్లించి ఉపయోగపెట్టుటకు ఒక అపర భగీరథుడు రావాలి కదా ! ఆ అపర భగీరథుడే మన గోపాలరెడ్డి గారు. దీనిని సాధించుటకు ఆయన హిమాలయము లకు బదులు, అంతే పవిత్రమైన, మహోన్నతమైన దేశ విదేశాలందలి విశ్వ విద్యాయలము లందు తపస్సు చేసి, అర్హతను సంపాదించి, మెళకువగా కృష్ణమ్మ తల్లిని తమ క్షేత్రములకు మళ్లించాడు. ఈ కార్యము అనితర సాధ్యమనుట ఆశ్చర్య పడవలసినదేమి కాదు. అది అంతే ! వారొక్కరివల్లనే సాధ్యమైనది.

ఈ విధముగా సంసిద్ధపరిచినది వారిని శ్రీమాతయే. అప్పుడు వారి మనస్సు నందు, లిఫ్టు ఇరిగేషన్ బీజము నాటినది. ప్రభుత్వ ఉద్యోగము, విశ్వ విద్యాలయ ఆచార్య పదవి ద్వారా వారికి ట్రేనింగు యిచ్చినది. ఆపైన కార్యరంగములోనికి దింపి, "నేను నీలోనే, నీవెంటే వున్నాను go ahead" అని ధైర్యము చెప్పి, అర్థించినపుడెల్లా అభయ హస్తము నందించినది శ్రీమాత. శ్రీమాతకు విశ్వమంతా తన క్షేత్రమే అయినా, తన విశేష దృష్టిని అచట – గడ్డిపల్లిలో ప్రసరించి ఆశీర్వదించినది.

కావున గడ్డిపల్లి ఆమె క్షేత్రమే, గోపాలరెడ్డి కూడా ఆమె బిడ్డయే. బిడ్డడు అర్థించినపుడు అమ్మ ఇవ్వకుండా మిన్నకుండునా ?

అమెరికాలో వున్నపుడే నిర్మలమైన వారి మనస్సులో జగన్మాతను గురించిన జ్ఞాన బీజము, ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆచార్యులైన ప్రొ॥ వి. మధుసూదనరెడ్డి గారి ద్వారా నాటించినది. ఇట్లు గోపాలరెడ్డిని తన బిడ్డగా, తన పనిముట్టుగా చేసి కొన్నది శ్రీమాత. ఎంతటి క్లిష్ట పరిస్థితి ఏర్పడినా దాని నుండి, అతని ప్రార్థన తోనే కాపాడుచున్నది. శ్రీమాతకు అసాధ్యమైన దేమి కలదు ! ఆరంభము నుండి గడ్డిపల్లి లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించిన అతి క్లిష్ట కార్యములను కూడా తన అనుగ్రహముతో, అవలీలగా అతని చేతనే చేయించినది. ఇదంతా నమ్మశక్యం కాని సత్యము. పాపం ! ఈ విషయాలన్ని ఇక్కడి ప్రజలకేమి తెలియును ? తెలియకనే వారిని దూరము చేసికొన్నారు. సుదీర్ఘకాలము నానా యాతనలు అనుభవించినారు. సామాన్యుల చర్యలు యిట్లే కదా యుండేది !

జగన్మాత అద్భుత లీల :

మనము యిక్కడొక ముఖ్య విషయమును గమనించాల్సి యుంది. అది శ్రీమాత అద్భుత లీల. మనవంటి సామాన్యులకు దుర్గ్రాహ్యము. డా॥ గోపాలరెడ్డి గారు 1969 నుండి 1981 వరకు శ్రీమాత ఆశీస్సులతో, ఆమె నిర్దేశించిన కార్యమందే నిమగ్నులై యున్నారు. ప్రాజెక్టు పనులను ప్రారంభం నుండి ఫలసాయమంది, ప్రజలు సుఖ సంతోషాలతో తులతూగేవరకు, ఒక తపము కాలము, అనగా 12 సం॥ములు అకుంఠిత దీక్షతో ప్రాజెక్టు పనులను సమర్థవంతంగా నిర్వహించినారు. రైతుల దురవస్థ దూరమైనది. వారి స్థితిగతులు మెరుగు పడినవి. వారికి ఆర్థిక పుష్టి చేకూరినది. తక్షణ కర్తవ్యముగా ప్రభుత్వము నుండి సాధించ బడవలసిన పనులేమి లేవు. విశ్వజనని యైన శ్రీమాత డా॥ గోపాలరెడ్డి గారిని, మరొక పనివైపు మళ్లించ దలచినది. ఎక్కడ, ఎప్పుడు, ఎవరితో ఏ కార్యమును చేయించాలన్నది ఆమెకు మాత్రమే ఎఱుక. ప్రాజెక్టు పనులకు దూరము చేసి, గోపాలరెడ్డి గారిని మరో పనిలో ప్రవేశ పెట్టవలసిన ప్రణాలిక సిద్ధమైనది. అయితే వారంతట వారు గడ్డిపల్లి క్షేత్రమును వదిలి రాలేరు. ఆ రైతులు కూడా అనుమతించరు. సుదీర్ఘకాలము పని చేసిన అనుభవముతో జాతీయ స్థాయిలో కూడా వారి ద్వారా పని చేయించదలచినది శ్రీమాత. ఆమె ఈ కార్యము ఎంత ఆశ్చర్యకరముగా సాధించినదో ! అది ఆమె లీల !

రైతాంగములో కొందరి మనస్సులందు గోపాలరెడ్డి గారిపై ద్వేషము కల్గిన తీరును గమనించాము. ఆ కొందరు, మరి కొందరిని కూడ గట్టుకొని, రెడ్డి గారిని ఎదురొడ్డిన కారణముగా, వారు లిఫ్టు బాధ్యతల నుండి తప్పుకున్నారు. రైతాంగములో ఒకరు ఆ బాధ్యతలను తలకెత్తుకున్నారు. ఈ విధముగా డా॥ గోపాలరెడ్డి గార్కి విముక్తి కల్గినది. ఎంతటి ఘనిష్ఠ సంబంధము యేర్పడినా, రెడ్డి గారిని తృటిలో తప్పుకునేటట్లు చేసినది శ్రీమాత సంకల్పమే !

నూతన సేవారంగములలో ప్రవేశము :

లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు పనులకు బాహ్యముగా దూరమైనట్లు కనిపించినా, వారి అంతరంగములో అహర్నిశలు దాని అభివృద్ధినే ఆకాంక్షిచెడివారు. బయట వున్నా, లిఫ్టు కొరకు తాను యింక ఏమి చేయాలి ? అని తపన చెందుచునే యుందురు. వారి బహుముఖ ప్రజ్ఞతో పరిచయమున్న సంస్థలు, వారి సేవలను వినియోగించు కున్నవి. "యూనియన్ బ్యాంకు" వారు, వారిని ఆహ్వానించి తమ బ్యాంకులో డైరెక్టరు పదవిని అంగీకరించుటకు వత్తిడి చేసిరి. నాలుగు సంవత్సరములు ఆ పదవిలో నుండి దానిని సంస్కరించి, ఆర్గనైజేషన్ సెటప్‌లో యేర్పడిన చిక్కులను తొలగించినారు. బ్యాంకు వారు 'స్టాప్ ట్రేనింగ్ కాలేజిని ఏర్పాటు చేసి సిబ్బందికి శిక్షణ యివ్వాలని సూచించి, దానికి తగిన 'ఎకడమిక్ ప్లాన్'ను కూడా యిచ్చి సంస్కరించినారు. ఈ ప్లానును భారతీయ రిజర్వుబ్యాంకు యొక్క ఉన్నతాధికారగణము, ముఖ్యముగా జి.పి. భావే గారు ప్రశంసించినారు.

"నాగార్జున గ్రామీణ బ్యాంకు" డైరెక్టరుగా పది సంవత్సరములు పని చేసినారు. నూతనముగా స్థాపించబడిన ఆ వ్యవస్థకు మార్గనిర్దేశన మొనరించినారు. ఈ విధముగా గ్రామీణ భారత నిర్మాణములో బ్యాంకింగ్ రంగమునకు మార్గనిర్దేశ మొనరించిన మహాయోగి ఆయన. "భారతీయ స్టేటు బ్యాంక్" వారు గడ్డిపల్లి ప్రాజెక్టుపై డాక్యుమెంటరీ ఫిల్మును నిర్మించి, అన్ని జాతీయ, అంతర్జాతీయ రంగములందు ప్రదర్శించినారు. "ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసర్చి" సంస్థ వారు తమకు చెందిన అన్ని సంస్థలందు భాగస్వామ్యమును కల్పించి గౌరవించినది. వారి సేవలను మన రాష్ట్రమే గాక అన్య రాష్ట్రాలవారును, కేంద్ర పరిధిలోని సంస్థలు కూడా వినియోగించు కున్నవి. నిర్మాణాత్మక సూచనలను అందించి ఆయా సంస్థలకు ప్రయోజనమును సమకూర్చి పెట్టినారు. గడ్డిపల్లి ప్రాజెక్టునకు 'కృషి విజ్ఞాన కేంద్రము' (K.V.K.) ను సమకూర్చిపెట్టిన ఘనత వారిది.

★ ★ ★

డా॥ గోపాలరెడ్డి గారి పునరాగమము

డా॥ గోపాలరెడ్డి గారు ఈ విధముగా గడ్డిపల్లి నుండి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలకు ఎదుగుట జరిగినది. వారు తీరిక లేకుండా వివిధ సంస్థలలో సభ్యులుగా, వానిని సంస్కరించుట, కొన్నిటికి దిశా నిర్దేశము చేయుట మొదలగు పనులందు 1981-82 సంవత్సరం నుండి, రెండు దశాబ్దములు పైగా గడ్డిపల్లిలోనే వుంటూ, తమ మాతృసంస్థను చూచుకొనుచు, జాతీయ స్థాయి సంస్థల ఆహ్వానములకు స్పందించుచు, 24 సం॥ల కాలము గడచినది. ఇంతకు ముందు వివరించినట్లు ప్రాజెక్టు పనులు క్షీణదశకు చేరుకున్నవి. ఇట్టి దుస్థితి దాపురించుటకు తమ రైతాంగముదే బాధ్యతగా భావించిన కొందరు, ముఖ్యముగా దూపాడు గ్రామ రైతులు గోపాలరెడ్డి గారినర్థించి, తమ పంట పొలాలలకు దాపురించిన, నీరు అందని దుర్గతిని వివరించి, యంత్రముల దుస్థితిని తెలిపి, కాలువలు కూడా పని చేయుట లేదని, యాజమాన్యము వారు నిర్లప్తముగా, దిక్కుతోచని స్థితిలో వ్యవహరించుచున్నట్లు విశదపరచి, తమరే మాకు దిక్కు అని పరిపరి విధములుగా వేడుకొని, తగు ప్రయత్నము చేయాలని అర్థించినారు.

"ఈమారు, లిఫ్టు ఇరిగేషన్ సొసైటీ ఎన్నికలు సమీపించ నున్నవి. ఈసారి రైతాంగము మిమ్ములనే తిరిగి అధ్యక్ష పదవికి ఏకగ్రీవముగా ఎన్నుకొనెదమని, మా పంట పొలముల సంరక్షణ బాధ్యత మీదేనని కోరినారు. ఎన్నికలలో రెడ్డిగారిని అధ్యక్షులుగా చేసినారు. 24 సం॥ల సుదీర్ఘ విరామం తర్వాత తిరిగి పదవి చేపట్టిన గోపాలరెడ్డి గారి ముందున్న ప్రయత్నం చేయవలసిన గడ్డు సమస్యలు -

1. నూతన లిఫ్టు యంత్రములను, పైపులను అమర్చుట.
2. 6 గ్రామాల మొత్తం ఆయకట్టు 6,600 ఎకరములకు నీరు అందించుటకు ప్రయత్నము చేయుట.

ఈ సమస్యలను వారు ఎట్లు సాధించారో ముందటి అధ్యాయంలో తెలుసుకొందాము.

గడ్డిపల్లి లిఫ్టు ఇరిగేషన్ బాధ్యతలను తిరిగి చేపట్టుట :

డా॥ గోపాలరెడ్డిగారు రెండు తపముల (24 సం॥ల) కాల విరామము తర్వాత గడ్డిపల్లి ప్రాజెక్టు (లిఫ్టు) సహకార సంఘము యొక్క బాధ్యతలను చేపట్టినారు. ఈ మధ్యకాలములో రైతులు నానా యిబ్బందులను అనుభవించినారు. ముఖ్యముగా

లిఫ్టులు పని చేయుటకు యోగ్యతను కోల్పోయినవి. 3000 ఎకరాలకు సునాయాసముగా నీరందించిన ఆ యంత్రములకు సరియైన పోషణ లేక కొంత సిబ్బందికి నెలసరి జీతాలందక కొంత, నిర్లిప్తత యేర్పడిన కారణంగా, నీటి పారకము 500 ఎకరములకే అతి కష్టమైనది. అదే విధముగా సాంఘిక, సామాజిక కార్యకలాపములు కూడా వెనుకడుగు వేసినవి. ఈ దురవస్థ నుండి దూరము చేయువారెవరా ? అని రైతులు కొందరు డాక్టరు గారిపై కినుక పూనని అనుకూల వర్గము వారు, ఆరు గ్రామాల రైతాంగము నడుము బిగించినారు. వీనిలో రైతుల ఇబ్బందులను గూర్చి ఏకరువు పెట్టినారు, మరో ఆలోచన లేదని, గోపాలరెడ్డి గారినే ప్రాజెక్టు బాధ్యతలను స్వీకరించి, పునరుద్ధరించ వలసినదిగా వేడుకున్నారు.

లిఫ్టును బాగు చేయుటకు బదులు, $3^1/_2$ దశాబ్దములుగా పనిచేసిన ఆ యంత్రములు విశ్రాంతి కోరుచున్నవా అన్నట్లు దీనావస్థకు చేరియున్నవి. కావున వీనిని తొలగించుట, వీని స్థానములో నూతన పరికరములనమర్చు పని జరగాల్సి యుంది. ఈ పని కొరకు ప్రభుత్వమును ఆశ్రయించాలి. ఆ పని వరుస తెలిసిన వారెరును లేరు. ఈ ప్రజల పరిధి గ్రామ పొలిమేరకే పరిమితము అయినప్పుడు కార్యసాధన ఎట్లు జరగాలనియే వారందరి తపన. ఈ కార్యమును రాజధాని నగరము నుండి సాధింప బడాల్సి యుంది. కావున, 5 సం॥ల కొకమారు జరిగే ఎన్నికలలో ప్రజలు మన గోపాలరెడ్డి గారినే ఈ సంస్థకు అధ్యక్షులుగా చేసినారు.

నూతన లిఫ్టు యంత్రముల నమర్చుట :

డా॥ గోపాలరెడ్డి గారు అధ్యక్షులుగా ఎన్నికైన వెంటనే, తన దృష్టిని ప్రధానంగా లిఫ్టు యంత్రములపై సారించినారు. ఇరిగేషన్ శాఖలో ప్రధాన కార్యదర్శిగా నున్న వారిని సంప్రదించగా - గడ్డిపల్లి లిఫ్టు ఇరిగేషన్ వ్యవహారములు "నాగార్జున సాగర్ లెఫ్ట్ కెనాల్" యాజమాన్యం వారి అధీనములో నున్నందున తానేమి సహకారమందించ లేనని తెల్పినారు. 'నాగార్జున సాగర్ లెఫ్ట్ కెనాల్' యాజమాన్యాన్ని విచారించినపుడు, గడ్డిపల్లి లిఫ్ట్‌ను రైతులే భరించి బాగుపరచుకోవాలి కాని తామేవిధమైన సహాయము చేయలేమని స్పష్టముగా తెలిపినారు. ఇది రైతుల వలన సాధ్యము కాదని నిర్ణయించుకొన్న మన గోపాలరెడ్డి గారు యోచించి, శ్రీమాతను ప్రార్థించి, 'గడ్డిపల్లి లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు' ఆజమాయిషీ బాధ్యతలను N.S.L.C.వారి నుండి మార్చి, ప్రభుత్వ "ఇరిగేషన్ డెవలప్ మెంట్ కార్పోరేషన్" (I.D.C.) వారి స్వాధీనము లోనికి ప్రజల

క్షేమము దృష్ట్యా మార్చుట జరిగినది. ఆ వెను వెంటనే నూతన యాజమాన్యము వారు యంత్రముల స్థితిగతులను పరిశీలించి, వాని స్థానములో 6 గ్రామాలకు చెందిన మొత్తము ఆయకట్లు, 6,600 ఎకరములకు సరిపడు కెపాసిటీ గల యంత్రములను అనగా ప్రస్తుతమున్న వానికి మూడంతల అధిక శక్తి గలవానిని బిగించాలని సిఫారసు చేసి, అంచనాలను సిద్ధ పరచి, అందుకు సరిపడు ధనము $17^1/_2$ కోట్ల రూపాయలను మంజూరి యిచ్చి, ధనమును విడుదల చేసినది. దానితో మన డా॥ గోపాలరెడ్డి గారు నూతన యంత్ర పరికరములను బిగింప చేసినారు. యిప్పుడు పుష్కలముగా నీరందుచున్నది. అవసరానికి మించిన నీరు రైతుల యిక్కట్లను తొలగించి, తిరిగి అందరిలో నూతన ఉత్సాహమును నింపినది.

అదనపు గోదాముల నిర్మాణము :

డా॥ గోపాలరెడ్డి గారు ప్రధాన సమస్యయైన లిఫ్టు యంత్రముల మార్పిడి తర్వాత అదనపు గోదాముల నిర్మాణమునకుపక్రమించినారు. ఇంతకాలము నుండి పంటలు పూర్తిగా పండలేదు. నూతన యంత్రములందించు సాగు నీరుతో చక్కని పంట రాగలదు. దిగుబడి పెరుగగలదు. అపుడు ఆ పంటలను నిల్వచేయుటకు గోదాములు కావాలిగదా ! ఎప్పుడో అందే పంటకు ఇపుడెందుకు నిర్మాణము చేయుట అని సంకుచితముగా యోచించక, సుదీర్ఘ దృష్టితో - ఇప్పటి నుండి నిర్మాణకార్యమును కొనసాగించిన పంటలు అందేనాటికవి సిద్ధము కాగలవు. ఇక్కడ, ఇప్పుడు తలపెట్టిన నిర్మాణములు వారి దూరదృష్టికి నిదర్శనములు. వారిది ఒక యోగ దృష్టి. నిరంతరం శ్రీమాత ధ్యానయోగములో నిమగ్నులై కార్యములను నిర్వహించువారికి, పూర్వాపరములు కన్నులకు కట్టినట్లుండగలవు. సామాన్యులది ఎప్పటికీ సంకుచిత దృష్టే ! అందుకే వారు మహాత్ముల మార్గదర్శకత్వములో మనుట మంచిదని ఆర్యోక్తి. ఆ విధముగా వారు కూడా ఒకనాటికి నిమ్న ప్రకృతిని వీడి ఉన్నత చేతన లోనికి ప్రవేశించు అర్హత పొందెదరు.

ఆనాటి నుండి నిర్మాణ కార్యము కొనసాగుటతో, నేటికి రెండు పెద్ద పెద్ద గోదాములు సిద్ధమైనవి. మూడవ గోదాము త్వరితగతిలో నిర్మాణములో నున్నది. అది కూడా మార్చినాటికి, పంట వచ్చేవరకు సిద్ధము కాగలదు. ఈ విధముగా డా॥ గోపాలరెడ్డిగారు గడ్డిపల్లి లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు రైతాంగము యొక్క సమిష్టి సంక్షేమమునకు అహర్నిశలు శ్రమ పడుచుచునే యున్నారు. ఆయనకు కావల్సినది పదవి కాదు, అధికారము కాదు, అందరి సంక్షేమమని తేటతెల్లమగుచున్నది.

శ్రీ అరవింద ఇంటగ్రల్ స్కూలు నూతన భవన నిర్మాణము :

డా॥ గోపాలరెడ్డి గారు బహుముఖ ప్రజ్ఞతో భవిష్యత్తులోనికి తొంగి చూచి నపుడు, వారికి భారతదేశము యొక్క భవిష్యత్తు స్పష్టముగా దర్శనమిచ్చి, అది వారిని హెచ్చరించు చున్నది. వత్తిడి చేయుచున్నది. అదేమనగా – "Act. Action itself will provide required sources" అని పదే పదే చెబుతున్నది. శ్రీ అరవిందులు నుడివిన ఈ పలుకులే మన రెడ్డిగారిని "Dynamic personality" గా తీర్చిదిద్దినవి.

రైతాంగము శ్రమపడి వ్యవసాయము చేయుటతోనే తృప్తి చెందక, దానిని విస్తరించి అధిక దిగుబడికి యత్నించుట, కోకొల్లలుగా పంట పండి అతని అవసరములను సంపూర్ణముగా తీర్చుట సహజము. తన అవసరము మేరకు ఆహార ధాన్యమునుంచుకొని అదనపు ధాన్యమును దేశానికందించును కదా ! తద్వారా లభించిన ధనముతో తన కుటుంబ అవసరములను, పిల్లల భవిష్యత్తును బాగు పరచుకొనుటకు ప్రయత్నించును. రైతు జీవితము సుఖప్రదమగును. వారికన్న మెరుగైన వారుగా వారి సంతానము సంసిద్ధము కావలసయును. అపుడే దేశమునకు మంచి పౌరులు, మంచివిద్యావంతులు, మంచి వైజ్ఞానికులు సమాజమునకు అందెదరు. అని కష్టపడతాడు రైతు. అదేవిధముగా మనరైతు బిడ్డ అయిన డా॥ గోపాలరెడ్డి గారు కూడా గడ్డిపల్లి ప్రాజెక్టులోని రైతాంగము యొక్క సంక్షేమము కొరకు, వివిధ సంస్థలను సమకూర్చి పెట్టి, ఈ ఆరు గ్రామాలలో అవిద్యను తొలగించుటకు, అక్షరాస్యతను 100% సాధించు ప్రయత్నములో నిమగ్నులై రానున్న కాలములో ప్రతి విద్యార్థికి అర్హమైన విద్య అందించాలన్న ప్రయత్నములో "శ్రీ అరవింద ఇంటగ్రల్ స్కూలు"ను నడుపుచు, దానిని విస్తరించుటకు మరొక భవనమును నిర్మాణము చేయుటకు తలపెట్టినారు. ప్రస్తుతము ఆ పని జరుగుచున్నది. ఇందులో 2000 మంది బాలబాలికలకు సమగ్ర విద్య లభించగలదు. ఇవి ఎంతో దూరదృష్టితో నిర్వహించు కార్యములు కాని సామాన్యమైనవి కావు.

డా॥ గోపాలరెడ్డి గారు సొసైటీ ప్రారంభకాలము నాటి పద్ధతులను అనగా ప్రతిరైతు తన భూమిలో 10% భూమిని, ప్రతి పంటకు ఎకరమునకు 1 క్వింటాల్ ధాన్యమును రైతులు యిచ్చుటను పునరుద్ధరించి, ఈ అభివృద్ధి కార్యములను కొన సాగించు చున్నారు. ఇది మనకు ఎక్కడా కనరాదు. సామాన్య ప్రజానీకము దృష్టికి యివి భారమైనవి గానే కనపించును కాని, భవిష్యత్ దృష్టి కలవారికి ఈ కార్యములు

భవ్యమైనవిగాను, అభివృద్ధి కరమైనవి గాను కనబడగలవు. ఈ ఆరు గ్రామాలకే కాదు, వీనిని అనుకరించి, అనుసరించినవారు కూడా లాభమును పొందుచున్నారు. ఇది కాదనరాని సత్యమే కదా ! 40 సం॥ల క్రితం వారు చేసిన పని ఇన్ని సంవత్సరములుగా అచటి రైతాంగమునకు సిరులు కురిపించు చుండగా, ఇప్పుడు నిర్వహించే పనులు భావికాలమున లాభము చేయగలవు అనుట స్పష్టము. ఇన్ని మహనీయ పనులను చేయుచున్న మన రెడ్డి గార్కి శ్రీమాత అనుగ్రహము మెండుగా నున్నదనుట, ఇన్నేండ్ల చరిత్రయే చాటుచున్నది. వారి ద్వారా ఆయమ్మ అనుగ్రహము గడ్డిపల్లి, పరిసర ఆరు గ్రామాల ప్రజలపై కూడా కలదు. ఆ జగన్మాత అనుగ్రహమే మనకు శ్రీరామ రక్ష.

దైవకార్యమునకు దిగివచ్చిన ఆత్మలు :

"One soul's ambition lifted up the race" - Savithri.

'సావిత్రి'లో శ్రీ అరవిందులు తెలిపిన మహావాక్యమిది. దీని అర్థం "శక్తి వంతమైన ఒక్క ఆత్మ ఆశయం జాతినే ఉద్ధరించగలదు". ఎవరిదా ఆత్మ అను ప్రశ్నకు సమాధానం – ఉన్నత చైతన్యంతో, తపశ్శక్తితో, సమగ్రతతో ఈ పృథ్విపై అవతరించిన కొందరు వ్యక్తులది. వారి కార్యమేమిటి ? మరొక ప్రశ్న – పృథ్విపై భౌతిక జీవితాన్ని పరివర్తన చేయాలన్న సంకల్పము, దానికి తగిన విధముగా కార్యాచరణ – మరి పరివర్తనని దేనినందురు ? మార్పును, నిమ్న ప్రకృతి స్థాయి నుండి ఉన్నత ప్రకృతికి చేరుటను పరివర్తన లేదా పరిణామమని అందురు. ఈ పరిణామమును ఒక్కొక్క మెట్టుగా పైకి ఎక్కించుటకు ఒక్కొక్క మహానుభావుడు జన్మించుట జరుగును. ఈ విధముగా మనము అవలోకించినపుడు, 1969కి ముందు గడ్డిపల్లి గ్రామము దాని పరిసర గ్రామముల పరిస్థితి యేమిటో, ఈ గ్రంథములో అక్కడక్కడ అనేక మార్లు చెప్పుకున్నాము. ఇంతకూ ఆ స్థితి ఎట్టిది ? దయనీయ మైనది. ఇది ఇలా వుండుటకు వీలు లేదు. ఇది మారాలి, పరివర్తన చెందాలి. వర్షాభావము, దుర్భిక్షము తోనిండినట్టి దయనీయ బ్రతుకులక్కడివి. ఇవన్నీ మారాలి! ఎట్లు ? "శక్తివంతమైన ఒక ఆత్మ ఆశయం జాతినే ఉద్ధరించ గలదు" అని సావిత్రిలో చెప్పబడినది గదా ! ఎవరిదా ఆత్మ ? మన గ్రామములోనే మనతోపాటు జన్మించి, ఉన్నత చైతన్యమును సాధించుటకు విదేశాలలోని విశ్వ విద్యాలయములలో తపస్సు చేసి శక్తివంతుడై స్వదేశమునకు తిరిగి వచ్చిన మన గంటా గోపాలరెడ్డి. శ్రీమాత భక్తుడు. శ్రీ అరవిందుల సిద్ధాంతమును త్రికరణ శుద్ధిగా ఆచరణలో పెట్టిన యోగి.

"ఈ సృష్టి మాయ కాదు. పరమాత్మకు ప్రతిరూపము. మనిషి ఈ పృథ్వినే దివ్య క్షేత్రంగా తలచి, పదార్థంలోనే పరమాత్మను దర్శించాలి" అన్న శ్రీఅరవిందుల మాటలను ఆదర్శంగా తీసికొని, గడ్డిపల్లి స్థితిగతులను సంపూర్ణంగా, ఆర్థికముగా, సాంఘికముగా, విద్యా విషయకంగా, సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా మరియు పర్యావరణ పరంగా అన్ని విధములుగా పరివర్తన చెందించుటకు నడుముకట్టిన నవయుకుడానాడు. ఈ పని వలన గడ్డిపల్లి గ్రామము మరియు పరిసర గ్రామములు అన్నియు, పరిణామ పథములో నడుచుకొనుట తథ్యము.

ఇది దైవ నిర్దేశిత కార్యము. ఈ కార్యమును చేపట్టుటకు వారి వెంట మరి కొందరుండాలి కదా ! మరి వారెవరు ? వారు కూడా మన గ్రామవాసులే. డా॥ గోపాలరెడ్డి గారి భావజాలమునకు స్పందించినవారు. దైవ కార్య నిర్వహణకు, ఉన్నతాత్మకు సహకరించుట కరుదెంచినవారు, వారితోపాటు యిడుములు పడుచు కార్యసాధనలో కృషిని పంచుకొని ధైర్యముతో నిలబడిన వారు. నేనీ చరిత్రను వ్రాయు చున్నపుడు, వారందరిని కూడా వెలుగులోనికి తేవాల్సిన ధర్మమున్నది కావుననే, వారిని ఒక్కొక్కరిని యీ దిగువ పేర్కొనుచున్నాను. డా॥ గోపాలరెడ్డితో బాటు సమాన స్థాయిలో గౌరవార్హత గలిగిన ధన్యులు. వారందరికి శ్రీమాత సకల సుఖముల నందించాలని మనం ఆ జగన్మాతను వేడుకుందాము.

క్ర.సం.	రైతు పేరు	గ్రామము
1.	సర్వశ్రీ జి. రామకృష్ణా రెడ్డి	గడ్డిపల్లి
2.	యస్. బుచ్చయ్య	గడ్డిపల్లి
3.	జి. అంజన్ రెడ్డి	గడ్డిపల్లి
4.	సానం సైదయ్య	గడ్డిపల్లి
5.	కీతా కోటయ్య	ఎల్లికుంట
6.	రామినేని సోమయ్య	ఎల్లికుంట
7.	రామినేని నర్సయ్య	ఎల్లికుంట
8.	రామినేని గురుమూర్తి	ఎల్లికుంట
9.	మేకల లక్ష్మయ్య	మట్టికుంట
10.	మేకల సత్యమయ్య	మట్టికుంట
11.	గార్లపాటి అనంతరెడ్డి	లింగాల
12.	గార్లపాటి గోపిరెడ్డి	లింగాల

క్ర.సం.	రైతు పేరు	గ్రామము
13.	సర్వశ్రీ దాచేపల్లి రాములు	లింగాల
14.	దాచేపల్లి సత్యమయ్య	లింగాల
15.	దాచేపల్లి పెదవెంకయ్య	లింగాల
16.	గార్లపాటి చంద్రారెడ్డి	లింగాల
17.	యడవల్లి రాఘవరెడ్డి	లింగాల
18.	గార్లపాటి మధుసూదన్ రెడ్డి	లింగాల
19.	కట్టా వేంకట్రామయ్య	మేడవరం
20.	అరిబండి పిచ్చయ్య	మేడవరం
21.	అరిబండి శ్రీరామయ్య	మేడవరం
22.	శంకర రావు	మేడవరం
23.	రామినేని అంతయ్య	మట్టికుంట
24.	రామినేని సత్యమయ్య	మట్టికుంట
25.	జి. పెద గోపాలరెడ్డి	గడ్డిపల్లి
26.	జి. అనంతరెడ్డి	గడ్డిపల్లి
27.	జి. రాంరెడ్డి	గడ్డిపల్లి
28.	టి. వేదాంతరావు	గడ్డిపల్లి
29.	చిన్న పుల్లయ్య	గడ్డిపల్లి
30.	షేక్ మదార్	గడ్డిపల్లి
31.	పెదమట్టయ్య	దూపాడు
32.	భిక్షమయ్య	
33.	లక్ష్మీనర్సయ్య	దూపాడు
34.	సత్యమయ్య	దూపాడు
35.	రామమూర్తి	కుతుబ్షాపురము
36.	నంద్యాల పెదకోటిరెడ్డి	పతేపురము
37.	అలుగుబెల్లి మోహనరెడ్డి	పతేపురము

★ ★ ★

"భారతీయ ఆధ్యాత్మిక పార్టీ" ఆవిర్భావము

"The Spiritual Party of India"

శ్రీమాత ఆదేశానుసారము ఆశ్రమంలో "శ్రీ అరవింద కర్మధార" (Sri Aurobindo's Action) అను ఆంగ్ల మాస పత్రిక 1970 సం॥లో ప్రారంభమైనది. దానికి ఆశ్రమంలోని సీనియర్ సాధకులైన శ్రీ ఉదార్ పింటోను సంపాదకులుగా శ్రీమాత నియమించారు. ముందు ఆ సాధకుడు విముఖతను ప్రదర్శించినా, శ్రీమాత ఆదేశమును శిరసావహించి ఆ బాధ్యతను చేపట్టెను. అది నేటికిని సజీవముగా సాగుచున్నది.

1973 సం॥లో శ్రీమాత ఉదార్‌పింటోకు మరొక బాధ్యతను అప్పగించుట కొరకు ఆయనను పిలిచి, "ఈ దేశంకొరకు నీవొక నూతన రాజకీయ పార్టీని నడిపించ వలసి యున్నది" అని సెలవిచ్చెను. అంత అతడు తన అసమర్థతను వ్యక్తం చేయుచు, అట్టి ప్రమాదము నుండి తనసురక్షించవలసినదిగా శ్రీమాతను వేడుకొనెను. అంతట, శ్రీమాత ఆయనకు అభయమిచ్చి, తాను చేయాల్సిందేమి ఉండదని, అంతా నేనే చూచెదనని, ధైర్యము చెప్పి ఒప్పించెను. శ్రీమాత ఆజ్ఞను పాటించి, బాధ్యతలను చేపట్టెను. ఈ విషయమంతా ఉదార్ పింటోచే ప్రచురింపబడుచున్న ఆంగ్ల మాస పత్రిక 'Sri Aurobindo's Action' 1982 అక్టోబర్ సంచికలో ప్రచురింపబడినది. అంతకుముందు అదే పత్రికలో (1982, ఆగస్టు సంచిక) శ్రీమాతకు ఉన్నత భూమికలలో "ఆధ్యాత్మిక దృష్టికి గోచరమైన దర్శనము"ను గూర్చి 'India Today' అను వ్యాసములో వివరించబడినది. కావుననే శ్రీమాత ఈ ప్రస్తావనను తెచ్చినది. ఆమే స్వయముగా "The Spiritual Party of India" (భారతీయ ఆధ్యాత్మిక పార్టీ) అని దానికి నామకరణం చేసినది. దీనికి సంబంధించిన ముఖ్యాంశములను ఉదార్‌కు వివరించి, ఈ నూతన పార్టీ యొక్క 'మానిఫెస్టో' ఏక వాక్య సూక్తి "To serve the Divine" ('దైవమును సేవించుము') తో ప్రారంభింప బడవలయునని తెల్పినది. ఈ పార్టీ ప్రణాళికను మన మనస్సుతో రూపొందించరాదు; ఆ పని దైవానికే వదలినచో, ఆ దైవమే మార్గదర్శనం చేయగలదని సూచించెను. ఈ ఆధ్యాత్మిక పార్టీ యేర్పడి, భవిష్యత్తులో యిది భారతదేశ కళ్యాణానికి మరియు విశ్వకళ్యాణము నకు కూడా బాటలు వేయగలదని శ్రీమాత మాటలుగా ఉదార్ వివరించెను.

'Sri Aurobindo's Action' (శ్రీ అరవింద కర్మధార) మూలముగా విషయము నంతటిని గ్రహించిన మన డా॥ గోపాలరెడ్డి గారు స్పందించినారు. వారు

అమెరికాలో నున్నపుడే, వారి దృక్పథములో భారీ తరహా ప్రణాళికా రచన, భారీ ఎత్తున కార్యక్రమముల నిర్వహణ, యిత్యాది ఆలోచనలు కలవాడు కనుక, తన మాతృభూమి గడ్డిపల్లి, దాని పరిసర గ్రామముల ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయు చున్నాడు. ఇప్పుడు ఈ పార్టీ ప్రస్తావన వలన భారతీయ సంస్కృతీ నాగరికతల పునరుజ్జీవనానికి సంబంధించిన ఆలోచనలు మొదలైనవి.

ఈ సమయంలోనే 'Sri Aurobindo's Action' పత్రికకు అనుబంధంగా, భారతీయ నాగరికతపై అనేకమైన చిన్న చిన్న పుస్తకములు, శ్రీ అరవిందులు, శ్రీమాత గ్రంధముల నుండి సంకలనం చేసి ప్రచురింప బడినవి. అదే వరుస క్రమంలో భారతదేశ భవిష్యత్తునకు సంబంధించినవి, భారతదేశ గమ్యము, భారతీయ ఆధ్యాత్మిక సంపద, సాంస్కృతిక వారసత్వము యిత్యాదుల సాహిత్యము కుప్పలు తెప్పలుగా అందినవి. వీని మూలముగా సాధకుల హృదయములందు నూతన చైతన్యము ప్రజ్వరిల్లినది.

'భారతీయ ఆధ్యాత్మిక పార్టీ' రచన – తొలి అడుగు :

Spiritual Party of India (భారతీయ ఆధ్యాత్మిక పార్టీ)కి సంబంధించిన సమాచారమంతా, శ్రీమాత దీవెనలతో వెలసిన పత్రిక 'Sri Aurobindo's Action' (శ్రీ అరవింద కర్మధార) లో పడిన వార్త, డా॥ గోపాలరెడ్డి గారిని తట్టి లేపినట్లైనది. ఆ పత్రిక సంపాదకులు శ్రీ ఉదార్‌ను వారు ముందు నుండే యెరుగుదురు. తనలోని ఉత్సాహామునకు, తన భావోద్రేకములకు ఒక రూప మివ్వదలచి, వెంటనే పాండిచ్చేరికి చేరుకొని, ఒక మాసము దినములు అచట మకాం వేసి శ్రీమాతారవింద గ్రంధములను అధ్యయనం చేసి, వానిలో The Spiritual Party of India కు అనువర్తించు, అనేక కొటేషనులను, లోకోక్తులను, ఆ గ్రంధముల నుండి సేకరించెను. అట్లే తన ఆలోచనలో గల యితర విషయములకు సంబంధించిన వానిని కూడా ఎన్నుకొని నూతన పార్టీకి ఒక సమగ్రమైన మానిఫెస్టోను రచన చేసెను. ఇది సాధారణ సంకలనము కాదు. మిక్కిలి శ్రమతో కూడిన ఈ సంకలనము డబుల్ డెమీసైజులో 71 పేజీలకు చేరినది. ఇది సాధారణ పుస్తక రూపంలో 150 పేజీలకు చేరును. ఈ వివరములను డా॥ గోపాలరెడ్డి గారు – శ్రీ అరవిందాశ్రమం – ఢిల్లీ బ్రాంచి వారి "Call Beyond" అను ఆంగ్ల మాస పత్రికలో ప్రకటించినారు.

మానిపెస్టో ప్రచురణ - పంపిణీ :

'మానిపెస్టో' రచనా వ్యాసంగము ముగిసిన పిమ్మట ఆశ్రమంలోని తన అభిమానులు - ఉదార్ లాంటి వారితో చర్చించి, శ్రీమాత జన్మదినము 21-2-1983 నాడు డా॥ గోపాలరెడ్డి, డా॥ మన్మోహన రెడ్డి గారలు యిర్వురు, ఈ ఆధ్యాత్మిక పార్టీ యొక్క 'మానిపెస్టో' ప్రతులను దేశములో పలువురు రాజకీయవేత్తలకు, మేధావులకు 1500 కాపీలను పంపించుట జరిగినది. భారతీయ రాజకీయ రంగమున ఆధ్యాత్మిక శక్తికి ప్రవేశము కల్పించు దిశగా వారందరినీ ఆలోచింప జేయుటకు ఉద్దేశింప బడినది.

డా॥ గోపాలరెడ్డి గారి విశ్వాసము మనదేశ రాజకీయ రంగమున ఆధ్యాత్మికత నిండి యున్నపుడే అది ప్రపంచములో రాణించగలదని. ఆ ఆధ్యాత్మికతను రంగ ప్రవేశము చేయించుటకే వారు నిరంతర శ్రమతో ఈ మానిపెస్టో రచన గావించారు. మన దేశానికి స్వరాజ్యమొచ్చి ఆరు దశాబ్దములు నిండినా, అనేక అభివృద్ధి ప్రణాళికలు అమలు జరిగినా, మానవ జీవితంలో ఆధ్యాత్మిక నైతిక, ఆర్థిక విలువలు - ఒక్క మాటలో 'ధర్మబుద్ధి' దిగజారినది. అది పునరుద్ధరింప బడనిదే - మార్గము లేదని గ్రహించిన డా॥ గోపాలరెడ్డి గారు తీవ్రముగా ఆలోచించి మూలమునకు వెళ్లి లోపమును గ్రహించగలిగెను. మనరాజ్యాంగము ఏ మాత్రము అనుకూలముగా లేదు అని గ్రహించినారు. అది భారతీయ సాంస్కృతిక, ఆధ్యాత్మిక నైతిక వారసత్వము నకు ప్రాతినిధ్యము వహించుట లేదు. మన ధర్మశాస్త్రములకు, పురాణేతిహాసములకు, నీతి శాస్త్రములకు, అర్థశాస్త్రములకు, వానిలోని విలక్షణమైన భావసంపుటి కిరణ ప్రసారములకు అందనంత దూరములో నున్నది. ఒక్క మాటలో - అభారతీయము. కావున వారు ఈ మానిపెస్టో రచనకు పూనుకున్నారు. జాతిలోని మేధావులందరిని ఆ దిశగా ఆలోచింప చేసినారు. అందుకు సాధనముగా మంత్ర పూరితములైన శ్రీమాతారవిందుల వాక్యములనే ఎన్నుకొని, వారి గ్రంథరాజముల నుండే సంకలన మొనరించి, వారి భావజాలముతోనే ఈ మానిపెస్టో రచన గావించినారు.

"భారతీయ ఆధ్యాత్మిక పార్టీ" యొక్క లక్ష్యము, "దైవాన్ని సేవించుట" - గా శ్రీ మాతచే నిర్ధారింపబడినది. ఈ గ్రంథమును వారు నాల్గు భాగములుగా - ప్రధానంగా ఆధ్యాత్మికత తదితర అంశములుగా విభజించినారు. ఈ మానిపెస్టోలో విషయ ప్రవేశానికి ముందు శ్రీయుతులు డా॥ గోపాలరెడ్డి మరియు డా॥ మన్మోహన్ రెడ్డి గారలు యిర్వురు కలిసి సమకూర్చిన "ఒక బహిరంగ లేఖ" - రెండవది

ఉస్మానియా విశ్వ విద్యాలయ, తత్త్వ శాస్త్ర ఆచార్యులు ప్రొ॥ మధుసూదన్ రెడ్డి గారి సుదీర్ఘ, భావ స్ఫోరకమైన ముందుమాట, ఈ రెండు ఆ మానిపెస్టోకు మరింత శోభను తెచ్చిపెట్టినవి. వానిని కూడా సంగ్రహంగా యిచట, ఈ రచనకు నిండు తనమును కలిగించుటకు పేర్కొనబడును.

ఆధ్యాత్మిక పార్టీ యొక్క ఆవిష్కరణ :

ముగింపు దిశగా మరొక్కమాట - మిక్కిలి ముఖ్యమైనది, ఆవశ్యకమైనది. డా॥ గోపాలరెడ్డి గారి వ్యక్తిత్వమునకు సంపూర్ణతను సమకూర్చునది. డా॥ గోపాలరెడ్డి గారు ఎంత సమున్నతంగా విషయ లోతులను గూర్చి ఆలోచించెదరో అంతే శ్రద్ధను వాని ఆచరణ యందు కూడా కనబరచెదరు. అందుకే ఆవశ్యకమని పేర్కొనుట జరిగినది.

24-4-1983 నాడు డా॥ గోపాలరెడ్డి గారు గడ్డిపల్లి లోని శ్రీమాతారవిందుల ధ్యానమందిరంలో 12 మంది సాధకులతో కల్సి సమిష్టిగా ధ్యానం చేసిన అనంతరం "ఆధ్యాత్మిక పార్టీ" శాఖను ఆవిష్కరించినట్లుగా బహిరంగ ప్రకటనను చేసినారు. రైతులందరకు దానిని గూర్చి దాని ఆవశ్యకతను గూర్చి వివరించుట జరిగినది. ఆధ్యాత్మిక పరులైన ఆత్మ జ్ఞానులు, భవిష్యత్తులో భారత దేశాన్ని పరిపాలించ నున్నారని ప్రకటించినారు. ఆ తర్వాత, శ్రీ అరవిందుల జన్మదినం, 15-8-1983 నాడు గడ్డిపల్లిలో రెండు దినముల సమావేశాన్ని ఇదే విషయముపై నిర్వహించి, మేధావులను ఆహ్వానించి, ఆహూతులైన వారి నందరిని ఆ దిశగా ఆయత్త పరచినారు. శ్రీ రెడ్డి గారు రూపొందించిన మ్యానిపెస్టోను వారందరు ప్రశంసించారు.

ఈ విధంగా డా॥ గోపాలరెడ్డి గారు భారత దేశ రాజకీయ రంగములో వినూత్న మైన ఆధ్యాత్మిక రాజకీయాలకు ఆద్యులైనారు.

ఒక బహిరంగ లేఖ *(An Open Letter)*

శ్రీ అరవిందులు మన మాతృభూమిని చాలా గాఢముగా ప్రేమించేవారు. కాని వారు కోరునది ఆమె మహోన్నతమైన ఆదర్శములతో, పవిత్రమైన శీలముతో, తన ఔన్నత్యాన్ని ప్రదర్శించేది గాను, విశ్వమందు తాను ఎన్నుకున్న 'మిషన్'కు అర్హురాలుగా మిగిలి ఎదిగి పోవాలని కోరెడివారు. భారతదేశము యొక్క 'మిషన్' ఏమిటి ? అన్నప్పుడు దాని వివరణను శ్రీమాత మాటలలోనే తెలిసి కొనుట మేలు.

"భారతదేశ భవిష్యత్తు చాలా స్పష్టముగా నున్నది. భారతదేశము ప్రపంచానికి గురువు. ప్రపంచ నిర్మాణం యొక్క భవిష్యత్తు భారతదేశంపై ఆధార పడి యున్నది. భారతదేశము సజీవ ఆత్మ. అది విశ్వమందంతటా ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అవతరింప చేయుచున్నది. భారత ప్రభుత్వము ఈ దేశం యొక్క ప్రత్యేకతను గుర్తించి, తదనుగుణంగా ఈ దిశలో తన విధానాలను రూపొందించుకొన వలసియున్నది." అని శ్రీమాత ఈ దేశ మిషన్ ను గూర్చి స్పష్టపరచినది.

శ్రీ అరవిందులు, భారతదేశానికి సంభవించనున్న ఆపదలను, కష్టాలను ముందే గ్రహించి, వానికి పరిష్కారములను చూపినారు. భారతదేశ రాజకీయ, ఆర్థిక సాంఘిక రంగములకు సంబంధించిన తన బోధనలను, ఈ దేశ 'మిషన్'ను గూర్చి విస్తృత ప్రచారము గావించాలని తెల్పినారు. అన్నిటికన్న ముందు, అతి శీఘ్రముగా, తన ప్రయోగాత్మక బోధనలను దేశమునందంతటా వ్యాప్తి చేయాలని, అవి రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో యేర్పడు కష్టములకు పరిష్కారమును చూపగలుగును. అంతేగాక ఈ దేశమునుసుదృఢముగా సంఘటిత పరచి, ఈ దేశము యొక్క 'మిషన్' ను కూడా స్పష్ట పరచగలవు." అని శ్రీ అరవిందులు వివరించినారు.

శ్రీమాతారవిందుల ప్రబోధముల ననుసరించి శ్రీమాత స్వయముగా నామ కరణ మొనరించిన "The Spiritual Party of India" (భారత ఆధ్యాత్మిక పార్టీ) యొక్క రూపురేఖలను స్పష్ట పరచి, దేశ రాజకీయ స్థితి గతులను, వారి దృక్పధానుసారముగా నిర్మించుకొనుటకు, తద్రీత్యా దేశ నిర్మాణమునకు ఆకాంక్షించి, తమ సరస్వమును దేశమాత చరణముల వద్ద సమర్పించుటకు ఆకాంక్షించే, భారతీయ బిడ్డలకు వారి కర్తవ్యమును గుర్తు చేయుట మా లక్ష్యము. ఈ నూతన పార్టీ సాధారణమైన రాజకీయ పార్టీ కాదు. భారతదేశ భాగ్యోదయమునకు మూలము కాగలదు అని తెలుపుచు,

"రండి ! మనమంతా కలిసి నూతన భారతాన్ని శ్రీమాతారవిందుల దృష్టి కోణము ననుసరించి నిర్మించుకుందాం. ఈ భూమండలంపై ఆత్మశక్తి అభివ్యక్త మగునట్లు కృషి చేద్దాం." అని భారతీయులకు పిలుపు నిచ్చారు.

ఇట్లు
డా॥ మధుసూదన రెడ్డి
శ్రీ అరవిందాశ్రమము.

ఇట్లు
డా॥ గోపాలరెడ్డి
గడ్డిపల్లి.

ప్రొ॥ మధుసూదన రెడ్డి గారి ముందుమాట :

ఈ మానిఫెస్టోకు మరింత శోభను చేకూర్చినది ప్రొ॥ మధుసూదన రెడ్డి గారి ముందుమాట. వారు తమ సుదీర్ఘమైన ఈ ముందుమాటలో, శ్రీఅరవిందుల దర్శనాన్ని గంభీరముగాను, అర్థవంతముగాను వివరించినారు. చివరన, ఈ నూతన పార్టీ లక్ష్యములను దిగువ విధంగా తెల్పినారు.

"భారత ఆధ్యాత్మిక రాజకీయ పార్టీ" సాధారణమైన రాజకీయ పార్టీ కాదు. భారతదేశ గమ్యానికి దిశానిర్దేశం చేయగలదు. ఈ దేశ పునరుజ్జీవానికి, పునర్నిర్మాణమునకు యిది ఒక ఫోరం (Forum) వంటిది. భారతదేశ నిర్మాణమునకు, దీక్షా కంకణ ధారులై, అంకితమైన వారికిది ప్రాతినిధ్యము వహించగలదు. అందుకొరకు అందరు రండి. మనమంతా కలిసి పని చేయుదాం ! భారతదేశాన్ని మన కలలకు సారూప్యంగాను, భూమండలంపై ఆత్మ ప్రభుత నెలకొనునట్లు గాను పునర్నిర్మాణ మొనరించుదాం" అని తెలిపినారు.

తర్వాత, డా॥ గోపాలరెడ్డి గారు దీనిలో పేర్కొన్న శ్రీమాత సందేశాలను ఎత్తి చూపినారు -

"రాజకీయములందు నిలకడగా పాల్గొనండి. వానిలో సత్యాన్ని ఆవిష్కరించండి. ఇదే ఆధ్యాత్మిక దిశగా భద్రమైన మార్గము".

"ప్రస్తుత రాజకీయ పార్టీలవారు బహిరంగంగా ఒకరిపై నొకరు బురద చల్లుకొనుచున్నారు. ఈ సాంప్రదాయాన్ని వీడుడు. దానికి బదులుగా భావయుద్ధము సత్యమును ఆవిష్కరించగలదు. కావలసినదది; కాని వ్యక్తుల మధ్య పోరు కాదు."

"భారతదేశ ఔన్నత్యమునకు అందరం కలిసి పాటుపడెదము గాక."

"భారత దేశ భవిష్యత్తు యువకులకు చెందినది. నేటి నూతన యువ ప్రపంచము అభివృద్ధి దిశగా ముందుకు సాగుచున్నది. దీని నిర్మాణమునకు నడుము కట్టవలసినది యువకులే. ఈ నిర్మాణమునకు - సత్యము, ధైర్యము, న్యాయము, నిష్కపటత, విస్తృత ఆకాంక్షలు ఆధారభూతము కావాలి. దీనిలో పిరికిపందలకు, స్వార్థపరులకు, వదరుబోతులకు మరియు అందరి సహకాముతో ముందుకురికి, తర్వాత తన తోటివారిని కష్టాలలో వదిలిపెట్టే వారికి, ఈ భవిష్యత్ ఉద్యమంలో చోటు దక్కరాదు. ఒక ధైర్యవంతుడు, దాపరికం లేనివాడు, పవిత్రహృదయుడు,

సాహసవంతుడు లాంటి ఆకాంక్షాభరితులైన యువత మాత్రమే, భవిష్యత్ జాతి నిర్మాణానికి పునాది కాగలరు."

మనజాతి ప్రకృతి వర్కుషాపు నుండి ఇప్పుడే పుట్టి వచ్చినది కాదు. ఆధునిక పరిస్థితుల నుండి అవతరించినది కాదు. అజేయమైన శక్తి సామర్థ్యములతో, గొప్ప నాగరికత కలిగిన బహు పురాతనమైన జాతి."

మన జాతి సామాన్యమైనదేమి కాదు. మన నదులు, పర్వతాలు ఎంత ప్రాచీన మైనవో మనం కూడా బహు పురాతనమైన వారము. ఈ జాతి నేపధ్యంలో, వివిధ రకములైన ప్రయోజనాలు గల చరిత్ర యున్నది. మనము గొప్ప నియమ నిష్ఠలతో తపస్సొనరించిన వారి సంతతి వారము"

"మనము ఎన్నుకున్న కార్యము, యాంత్రికమైన దేమి కాదు. అది నైతికము, ఆధ్యాత్మిక మైనది. మనము ప్రభుత్వాన్ని ఏదో రూపములోనికి మార్చుటకు కోరుట లేదు. మన ధ్యేయం జాతి నిర్మాణము. అందుకు రాజకీయాలు ఒక అంశము మాత్రమే."

"మన ధ్యేయం మానవత్వం కొరకు, నవభారత నిర్మాణమునకు సహక రించుట. ఇదే జాతీయత యొక్క జీవ లక్షణం. అనాదిగా మనము యిదే వచించు చున్నాము. ఇదే ఆచరించు చున్నాము."

"వైభవోపేతమైన భారతీయ గతమంతా, ఆమెయొక్క సజీవ ఆత్మ సహాయం తోను, రానున్న భవిష్యత్ కాలములో ఆవిష్కరింప బడు గాక."

"దైవ శక్తి మాత్రమే భారత దేశాన్ని రక్షించ గలదు. మనము విశ్వాసమును ఐక్యతను దేశంలో నిర్మించిన యెడల మరే యితర మానవ నిర్మిత శక్తి కన్న మిక్కుటముగా సహాయ పడగలదు."

"ఆంకాంక్ష యనునది దైవం కొరకు పిలుపు. అట్టి ఆకాంక్ష విశ్వంలో సత్యమును అవతరింప చేయుటకు అసత్యముపై విజయమును సాధించుటకై యుండాలి. మన సంపూర్ణ సత్తాతో 'స్వయం వ్యక్తత'ను శీఘ్రంగా అరుదెంచి తన కార్యాన్ని పూర్తి చేయాలని ఆకాంక్షించాలి."

"క్రమశిక్షణ అనుల్లంఘనీయము. బాహ్యాచర్యలు మరియు దానిలోని ఆత్మ మార్పు చెందాలి. నీయొక్క బాహ్య ఆలోచనలు మరియు చర్యలు దైవం కొరకే వుండాలి." నీలో స్వయం నిగ్రహము, సత్య సంధత, దైవమునకై నిరంతరం తీవ్ర ఆలోచన వుండాలి. నిమ్న ప్రకృతిని మార్చుటకిదే సరియైన మార్గము. నీయొక్క నిరంతర స్వయం సమర్పణ, క్రమశిక్షణ వలన శక్తి అవతరించి, బాహ్య విషయాలను మార్చాలి. ఎవరేని, ఎప్పుడైనా క్రమశిక్షణకు అంటిపెట్టుకుని యుండలేరో వారు జీవితములో శాశ్వతమైన కార్యాలను దేనిని చేయలేరు."

ఆధ్యాత్మిక పార్టీకి తాను వ్రాసిన ముందుమాటలో ఈ విధమైన సందర్భోచిత కొటేషన్స్‌లను డా॥ గోపాలరెడ్డి గారు సమకూర్చిన వానిని, ఎత్తిచూపి వాని విశిష్టతను వివరించినారు, ప్రొ॥ మధుసూదన రెడ్డి గారు.

మానిఫెస్టో పై ప్రశ్నోత్తరములు :

భారతీయ ఆధ్యాత్మిక పార్టీ మానిఫెస్టో యొక్క ద్వితీయార్థమున డా॥ గోపాలరెడ్డి గారు 40 ప్రశ్నలను సంధించి, వారే దానికి ఆలోచనాపూర్వక సమాధానా లిచ్చి, పాఠకలోకానికి విషయమును సుబోధకము గావించారు. ఇవి ఆ మానిఫెస్టోలో 34వ పేజీ నుండి 71 వరకు వున్నవి. భారతదేశ పునరుత్థానికి సంబంధించిన విషయములు అనేకము దీనిలో కూర్చబడినవి. యావద్భారత దేశమును తన కార్యక్షేత్రము గావించుకొని విస్తృత స్థాయిలో ప్రశ్నలను రూపొందించు కున్నారు. ఉదాహరణ పూర్వకముగా వానిలో నుండి కొన్నిటిని యిక్కడ పేర్కొంటున్నాము.

ప్రశ్న - 1 : భారతదేశములో అనేక రాజకీయ పార్టీలుండగా, "The Spiritual Party of India" అను కొత్త పార్టీని సంఘటిత పరచవలసిన అవసరమేమి కలదు ?

సమాధానము : మనకు నేటి అవసరాల కనుగుణంగా కావల్సినది మరొక కొత్త రాజకీయ పార్టీ కాదు, కాని మన దేశ పునరుజ్జీవనానికి నూతన రాజకీయ ఉద్యమము కావాలి. అది కూడా మన సంస్కృతి మరియు ఆధ్యాత్మిక వారసత్వముపై ఆధారపడినదిగా, మనకు ఆధ్యాత్మిక భవిష్యత్తు మరియు నవభారత నిర్మాణమును సిద్ధింప చేయునదిగా ఉండవలయును.

ప్రశ్న - 2 : నేటి పార్టీ రాజకీయములను మరియు నాయకత్వమును సక్రమముగా పని చేయకుండా భ్రష్టుపట్టించు చున్న రోగము కాని దుర్గుణము కాని ఏమై యుండును ?

సమాధానము : నేటి రాజకీయములు మెజారిటీ ప్రాతిపదికగా నిర్వహించ బడు చున్నవి. అవి నడిచే తీరు అసత్యము, చిత్తశుద్ధి లేమి, మోసము, దురాశ, ప్రబలమైన వాంఛ, దురుసుతనము, అసూయ, పగ, ద్వేషము, సత్యముపై శతృత్వము, బంధుప్రీతి, సంకుచిత బుద్ధి, లంచగొండితనము, ఆశ్రిత పక్షపాతము, అధికార దుర్వినియోగము, అహంకారము మరియు స్వార్ధబుద్ధి యిత్యాదుల ప్రేరణతో నిండి యున్నవి. అది ప్రాణిక శక్తుల ప్రభావముచే నడుప బడుచున్నవి. అంతేగాక ఆధ్యాత్మిక శక్తుల పట్ల అనుమానము, అపనమ్మకములను కలిగి, రాజకీయములందు ధన ప్రవాహమునకు అధిక ప్రాధాన్యత నిచ్చినవి. వ్యక్తిగత ఆర్జన, వ్యక్తిగత వైభవము, వ్యక్తిగత అభివృద్ధితో ఆత్మ సంతృప్తి చెందుటకు అలవాటు పడి, అధిక సంఖ్యాకుల సంక్షేమాన్ని బలిపెట్టి తాము పైకి ఎదుగుట పరిపాటైనది. ఈ విధమైన ప్రస్తుత పరిస్థితులలో రాజకీయాలందు విజయము పొందుటకు దంబాచారము, రెండు నాల్కల ధోరణి, పరులను నొప్పించుట, అంతులేని కోరికలు కలిగి యుండుట సాధనము లైనవి.

ప్రస్తుత కాలపు పార్టీ రాజకీయాలు, అవి ముందు ఊహించి రూపొందించి, నిర్వహించి, ఆచరించుచున్న వాని లక్ష్యములు, ఉద్దేశ్యాలలో ఏ రకమైన బేధములు కలిగి వున్నా, అవి మాత్రము తమ ఆలోచనలందు, పద్ధతులందు, మానసిక ప్రేరణలందు, అరువు తెచ్చుకున్న ప్రభావములను కలిగి ఉన్నవే, విదేశీయుల ప్రభావము నకు లోనైనవే, ఆయా దేశాల నుండి అరువు తెచ్చుకున్నవే అయి వున్నవి. ఈ రకమైన ఆలోచనలు, భావములు కేవలము మనస్సు, ప్రాణము, శరీరములకే ప్రాధాన్యత నిచ్చి, ఆత్మ సూత్రాన్ని ఆవలకు నెట్టును.

ప్రశ్న - 2 : ఈ నూతన రాజకీయ పార్టీ, ప్రస్తుతమున్న పార్టీల కన్న ఏ విధమైన భేదమును కల్గి యుండును ?

సమాధానము : నూతనముగా రూపొందింపబడు రాజకీయ పార్టీ, అది రాజకీయాలను నిజమగు అర్థములో గ్రహించి, మానవ సమూహాలను సంఘటిత పరచుట కొరకే రాజకీయములున్నవని నిరూపించును. ప్రభుత్వానికి సంబంధించిన అన్ని వివరములను సేకరించి, సామూహిక జీవనానికి సంబంధించిన విధివిధానములను రూపొందించును. అట్లే ఒక దేశము మరొక దేశముతో సత్సంబంధాలను కల్గియుండుటకు, సమరస వాతావరణాన్ని నెలకొల్పడం జరుగను. మానవ సమగ్రాభి వృద్ధి, మానవులందరకు అవకాశాలను లభింప చేయడం యిత్యాదు లను అన్నింటిని చిత్తశుద్ధితో చేయును. వీనిని సాధించుటకు రాజకీయాలను ఆధ్యాత్మీకరించే అవశ్యకత యేర్పడు చున్నది.

నూతనంగా సంఘటిత పరచబడు ఈ పార్టీ ప్రజాస్వామిక సూత్రములను, పద్ధతులను పాటించి, స్వేచ్ఛ, సమానత్వము, సౌభ్రాతృత్వములను వాస్తవిక రీతిలో సామరస్య పరచి, వాని ఆధ్యాత్మిక విలువలను కనుగొని, వాని సంస్థాపనకు కృషి చేయును.

ఈ నూతన పార్టీ మనయొక్క ఆధ్యాత్మిక వారసత్వ బలముపై, ఆవశ్యకముగా ఆధారపడి యుండుటే గాక, భావ పూర్ణమైన అంతర్దృష్టితో, భవ్యమైన భవిష్యత్తును దర్శించిన ఆధునిక ఆధ్యాత్మిక వేత్తలలో అగ్రగణ్యులైన స్వామి వివేకానంద, శ్రీ అరవింద మహర్షి దర్శనములను కూడా పరిగణన లోనికి గైకొనబడును. నూతన రాజకీయ పార్టీ యొక్క ఉద్దేశ్యము, భారతదేశ ఆధ్యాత్మిక గమ్యమును పరిపూర్తి చేయుట, మరియు ఒక సమగ్ర నాయకత్వమును, ప్రపంచంలో సమకూర్చుట కాగలదు.

భారత దేశము ప్రపంచానికి ఆధ్యాత్మిక గురువుగా దైవము చే నిర్దేశింప బడినది. ఈ పార్టీ దేశములోని రాజకీయ పార్టీలతో కలిసి, వారి సహకారముతో అన్ని పార్టీలు భాగస్వాములుగా నుండే జాతీయ ప్రభుత్వ స్థాపనకు సమాయత్తము చేయును.

ప్రశ్న - 4 : ఆధ్యాత్మిక పార్టీ యొక్క ఉద్దేశ్యమేమి ?

సమాధానము : "దైవమును సేవించుట" - భారతీయ ఆధ్యాత్మిక పార్టీ సత్యము నందే ప్రవర్తించును. ప్రయోగాత్మకముగా, సత్యమనగా - అహం కారమును వీడుట కాగలదు. అప్పుడు గాని దైవము ప్రభవించి ఆవిష్కరింప బడ గలదు.

ప్రశ్న - 5 : ఏ విధముగా పెద్ద నగరముల, పట్టణముల తీవ్రమైన పెరుగుదలను నిరోధించి, నూతనంగా పుట్టుకొస్తున్న జనాభాను చిన్న తరహా నగరములు, పట్టణములకు పంపించగలదు ?

సమాధానము : 'భారతీయ ఆధ్యాత్మిక పార్టీ' ఉనికిలోకి వచ్చిన పిమ్మట, నగర జనాభాను అరికట్టుట దిశగా, 30వేల నూతన తరహా గ్రామీణ పట్టణములు రమారమి 6 వేల జనాభా నివాసముండునట్లు నిర్మింప బడును. సకల సౌకర్యములు సమకూర్చబడును. ఈ విధముగా నగర, పట్టణ పెరుగుదలను అరికట్ట వచ్చును.

ప్రశ్నోత్తరములపై ఒక అభిప్రాయము :

డా॥ గోపాలరెడ్డి గారు బహుముఖ ప్రజ్ఞ గలవారు కావడం వలన జాతీయ సమస్యలపై ప్రశ్నలను సంధించి, వారే సమాధానములు యిచ్చిన విధము చాలా అద్భుతముగా నున్నది. వారికి గ్రామీణ సమస్యలపై సంపూర్ణ అవగాహన కలదు. వారు తగిన పరిష్కారములను కూడా తెలియపరచ గల ధీశాలి. అవి కూడా శ్రీ అరవిందుల సమగ్ర భారతీయ ఆధ్యాత్మిక పునరుజ్జీవన వెలుగులోనే ... వారి యొక్క విద్వత్తునకు నేను ఆశ్చర్యముతో కదిలి పోయినాను. అన్ని విధములుగా వారు సుప్రసిద్ధులైన నాయకాగ్రణియే కాని, సామాన్య స్థానిక లీడర్ కాదు. ఈ ప్రశ్నలకు వారు పొంగిపొరలే ప్రేమతో, భారతీయ ఆధ్యాత్మిక నేపధ్యంలో, వారిచ్చిన సమాధానములు మిక్కిలి సంతృప్తికరముగా నున్నవి. వారు భారత దేశమును, శ్రీ అరవిందుల వెలుగులో ఆధునీకరించ దలిచారు. వీరికి గల విజ్ఞానము, భవిష్యదృష్టి, మరొకరిలో నేను చూడలేదు. వారి పని ప్రస్తుతము గడ్డిపల్లి దాని పరిసర ప్రాంతాలకే పరిమితమైనా, వారి దృష్టి మాత్రము చాలా విశాలమైనది. భవిష్యత్తులో భారత సమగ్ర పునరుజ్జీవన మహోద్యమంలో, వారు అగ్రగాములుగా పేర్కొనబడుదురనుట అతిశయోక్తి కాజాలదు.

ఆధ్యాత్మిక పార్టీ - మానిపెస్టోను ఆధునీకరించుట :

డా॥ గోపాలరెడ్డి గారికి విలువైన మిత్రుడు మరియు అభిమాని, మన డా॥ మన్మోహన్ రెడ్డి గారు. వీరు గోపాలరెడ్డి గారికి చాలా సన్నిహితుడగుట వలన వారి భవిష్య దృష్టిని క్షుణ్ణంగా తెలిసినవాడు. ప్రస్తుత మానిపెస్టో 1982 సం॥లో రూపొందింప బడినది. చాలాకాలము గడచి పోయినది. ఆనాడు, 1982లో దేశ పరిస్థితులు యింతగా దిగజారి పోలేదు. రాజకీయ విలువలు మెరుగుగానే యుండెను. కాలక్రమంలో 1982- 2010 మధ్యకాలంలో దిగజారిన పరిస్థితుల మధ్య విలువలు అన్ని రంగములందు అంతరించి, రాజకీయ వాతావరణము వర్ణించరానంతగా కలుషిత మైనవి. దేశ రాజకీయవేత్త మొదలు గ్రామ వార్డుమెంబరు వరకు, ప్రతివారు లంచావతారులైనారు. ఈ దేశములోని శాఖలన్నిటిలో, ఈ దుర్నీతి తారాస్థాయికి చేరుకున్నది.

మనదేశ పరిశ్రమల పనితీరును పరిశీలించినపుడు, దేశప్రతిష్టను దిగజార్చిన వనే చెప్పాలి. అవి ఉత్పత్తి ప్రమణాలకు తిలోదకాలిచ్చి, లాభాల పేరాశలో నకిలీ వస్తువులను సృష్టిస్తున్నవి. బడా వ్యాపారవేత్తలు సహితము భారీ ఎత్తున లంచాలకు ఎగబడుచున్నారు. నకిలీనోట్ల ముద్రణ, చలామణి, సజీవముగా సాగుచున్నది. నిత్యం పాలవ్యాపారి నీళ్లలో పాలు కలుపుకు వస్తున్నాడు. ప్రస్తుత పరిస్థితులు ప్రమాద కరముగా మారినవి. ఎవరికి ఎవరు ? ఎవరు ఎవర్ని పట్టుకోవాలి ? అందరికందరు కలుషితమైనపుడు, అందరికందరు దోషులైనపుడు, ఒక్క రాజకీయ నాయకులను, పారిశ్రామిక వేత్తలను, బడా వ్యాపార వేత్తలను విమర్శించి లాభమేమిటి ?

పరిష్కారమేమిటి ? :

శ్రీ అరవిందుల దర్శనానుసారము మానవుడు మధ్యంతర జీవి. పరిణామము కొనసాగుతూనే వున్నది. దివ్యమానవ జాతి అవతరణ పర్యంతం యిది యట్లే కొనసాగును. ఈ ప్రస్తుత మానవుడు అపరిపక్వప్రాణి. అందుకే అతడు సృష్టించిన నాగరికత కూడా ఆ విధమైనదే. ఈ దశలో లోపరహిత మానవుడు రాలేదు. సంపూర్ణ కౌశలం కల్గిన, స్వచ్ఛమైన మానవున్ని, ఈ స్థితిలో మనము ఆశించుట పొరపాటే అగును. ఈ రహస్యమును మనకు తేటతెల్లమొనరించిన మహనీయులు శ్రీమాతారవిందులు.

ఈ మానిఫెస్టో రచనా కాలము 1982 సం॥ము. రెండున్నర దశాబ్దములు దాటినవి. ఒక 'తరము' కాలమన్నమాట. డా॥ గోపాలరెడ్డి గార్కి ఆనాటి రాజకీయ నాయకుల పట్ల కొంత సదభిప్రాయముండెను. అందుకే దీని రచనను సాగించి, అందరికి పంపించి, ఇది అమలు జరుప బడగలదన్న ఆశాభావమును, ఆకాంక్షను కలిగి యుండిరి. వారు రచించిన కాలము నాటి నాయకుల సదవగాహనపై వారికెంతో విశ్వాసముండెను. ఆనాటి ఎం.పి.లు దొడ్డగుణము గలవారు. కాని నేటి స్థితిగతులు పూర్తిగా భిన్నము. వీరు ఎంతటి భావోన్నతితో భారతదేశ రాజకీయాలకు దిశా నిర్దేశం చేయ తలపెట్టినారో, అది నేటి రాజకీయ పరిస్థితుల దృష్ట్యా అసంభవమని తేలిపోయినది. దిగజారిన దేశ రాజకీయ వాతావరణమే అందుకు కారణం. శ్రీమాత సంకల్ప జనితమైన నూతన "భారతీయ ఆధ్యాత్మిక పార్టీ" శ్రీమాతచే నామకరణము చేయబడి, సునిశిత మేధావి, బహుముఖ ప్రజ్ఞాశాలిచే తగిన విధముగా, తలమానిక మైన మానిఫెస్టోను రూపొందించుకున్న ఈ నూతన పార్టీ తెరమీదికి రానున్న దెపుడో? ఎవరెరుగుదురు !

ఆదర్శ భారత నిర్మాణము ఆధునిక మానవునికి సాధ్యమా ?

ప్రస్తుత మానవుడు స్వార్థపరుడు; అసంపూర్ణుడు అని యిదివరకే గ్రహించుట జరిగినది. ఇది ఈనాటి హిందూ, ముస్లిం, క్రైస్తవులకు అందరకీ వర్తించేమాట. పరిణామ క్రమంలోని ప్రస్తుత దశలో మనకన్న మరీ నీచమానవు లుండబోరని, తలచుట తప్పు కాదు. ప్రస్తుత మానవులంతా నిమ్నస్థాయికి చెందినవారే. ఈ సమయంలో మేలైన మనిషిని పొందుట దుష్కరమే కాగలదు. కావుననే డా॥ మన్మోహన రెడ్డి గారు, డా॥ గోపాలరెడ్డి గారు రచించిన మానిఫెస్టోను ప్రస్తుత కాలానికి అనుగుణముగా, అవగాహనా సౌలభ్యంగా, సంక్షిప్తంగా రూపొందించారు. అట్లని, రచయిత నింపిన భావజాలమునకు గాని, ప్రేరణాశక్తికి గాని, భంగము రానీకుండా మానిఫెస్టో లోని జీవశక్తిని (spirit) యదాతథంగా కాపాడినారు. ఈ రచన బహుచిన్నదే అయినా, మొత్తము మానిఫెస్టోలోని మర్మమును, సారమును తనలో నింపుకొన్నది. దీనిని చదువుటకు పట్టే కాలము నిమిషాలు మాత్రమే. ఇంత సంక్షిప్తముగా యుండుట వలన మూలములోని భావము లుప్తమై యుండవచ్చునను సందేహము కలుగుట సహజమే. కాని అది సరికాదు.

ఉన్నత జీవుల ఆగమనము – ప్రతీక్ష :

డా॥ మన్మోహన్ రెడ్డి గారి సమగ్ర ఆలోచనానుసారము, ఉన్నత ప్రాణులు ఉద్భవించి ఉనికిలోనికి వచ్చినపుడు మాత్రమే, ప్రస్తుత సంక్లిష్ట సమస్యలకు పరిష్కారము సాధింపబడ గలదు. మన దేశములో సంపద, పదార్థరూపములో పుష్కలము. దానిని సద్వినియోగ పరచవలసిన బాధ్యత మనపై గలదు. మానవ నైజం మారుట దుస్తరము. అందుకే, ఉన్నత చైతన్య జీవుల ఆవిర్భావమునకు ఆకాంక్ష యుక్త ప్రతీక్ష మనవంతు. పాశ్చాత్య దేశాల్లో సంపద చాలినంత వున్నా – శాంతిని స్థాపించి, సకల దేశాలలో సుభిక్షమైన స్థితిని నెలకొల్పుటలో విఫలమైనవి. లోపమెక్కడ కలదు ? అని తరచి చూడగా, అది మానవునిలోనే వున్నదంటున్నారు దాదాజీ. మానవునికి మానవత్వము నుద్ధరించే శక్తి శూన్యమని తేలిపోయినది. ఇక మార్గమేది ? మనమేమి చేయగలం? సామూహికంగా, మనమంతా దైవమును వేడుకొనుటకు మించి, మరేమి లేదు.

"ఓ దైవమా ! మా అందరి ఆకాంక్షాభరిత విన్నపమును మన్నించి, యీ మానవుల దురవస్థను దూరము చేయుటకు, ధరణి నుద్ధరించుటకు శీఘ్రముగా "ఉన్నత జీవులను" (Higher Beings) పంపించవలసినదిగా ప్రార్థించుచున్నాము."

క్రిందటి పేజీలో పేర్కొనిన సంగ్రహ మానిఫెస్టో
డా॥ మన్మోహన రెడ్డి గారు వ్రాసిన ఆంగ్ల పాఠమును
యిక్కడ చేర్చుచున్నాను – గమనించ ప్రార్థన.

21-7-2010

THE SPIRITUAL PARTY

(Its Manifesto)

At present we have All-India Political parties and state political parties. Where is the need of this spiritual party ? It's aim is quite different from the existing political parties. The present political parties are devoid of the spiritual component. That is the reason why we have iducted the component of spirituality into the corpus of polity. The following are its aims and objects :

1) It is neither a formal political party nor a vote-bank political party.

2) It will not enter into periodical election fray.

3) Its main aim is to awaken the people of India to the teachings of Sri Aurobindo.

4) Its aim is to announce the teachings of Sri Aurobindo by a beat of drums. It will play the part of a street announcer.

5) Its aim is to analyse the present Indian political scenario without any prejudice and to indicate the patent solution for the stalemate.

6) Its aim is to post-mortem the present western civilization and show the imperfections in it.

7) Its aim is multi-dimensional. It takes into account the part played by all the political, social and economic philosophies.

8) Lastly its aim is to indicate the importance of technology in enriching the present civilization.

What are the contents of the teachings of Sri Aurobindo ?

Destiny of the Individual (destiny of the humanity)

Individual is a transitional being, evolution will be going on (without our cognition) till the emergence of the perfect beings. The present man is an imperfect being. He has not yet reached the stage of perfection. Man has divisive consciousness. At present Nature has created colossal diversities. How can man with his divisive consciousness unite the present contradictory diversities ? So, Nature has discovered one more faculty (dimension) of the Divine known as the supramental consciousness (unity-consciousness). It is the highest Shakti (force) of The Divine and is armed with "unity-consciousness". In future when the evolution reaches its apex point (unity-consciousness), then the supramental beings will be born on this earth. With the advent of such unity-consciousness beings, all the present contradictory diversites will be harmonized. In short, this is the epitome of Sri Aurobindo's teachings.

Present Indian Political Scenario

Our present constitution is borrowed from the West. We have borrowed multiparty Parliamentary Denocracy, Periodical elections, etc. Day by day, our democracy is becoming mobocracy. Elections have become farce. We have created unending conflicts. According to the present standard, man is a perfect politician, perfect industrialist etc. There is no being beyond man. But according to Sri Aurobindo, man is an imperfect being. So, the present imperfect being is unable to solve all the chronic conflicts of the existing civilization. The present civilization is a product (built) of the imperfect man. Then how an imperfect man can solve the conflicts of an imperfect civilization ? Due to many imperfections in the present civilization, a stalemate is precipitated.

Drastic Changes in the Present Polity

We have borrowed each and every component of the western civilization. We have borrowed its political philosophy, its industrial philosophy, its economic philosophy. Even after 62 years of Independence, all our problems are still pending. So, we have to draft our new constitution suited to the Indian ethos. There should be one party (all-party) government. We have to abolish the periodical elections, and decentralise the present highly centralised administration.

Stop Imitating the West

No doubt the credit of making the present civiliztgion most modern goes to the west. The west has built a highly sophisticated, mega urbanized civiliztion. As a result, the west has become a role model civilization for all the developing countries. We are blindly imitating all the institutions of the West. Our standard of life is raised and deadly diseases are eradicated. The west has forgotten the aim of life, spirituality, due to its busy schedule. The west has given us a highly developed material component. But spiritually, it is almost a non-entity. As a result, the present western civilization has become highly militarized. We have endangered the very existence of the world.

The Western Civiklization is X-rayed

In the beginning, the west used the modern technology constructively. Railway lines were laid, bridges were constructed over the rivers and roads were laid. All kinds of industries were started. In short, the west became affluent. New discoveries of the continents were made.

But in the second phase, technology is being used destructively in manufacturing the deadly weapons. At present a major portion of nation's energies are spent in manufacturing nuke weapons. This is due to the imperfect infrastructure of man. Man has no positive capacity to use the technology. Even the most sophisticated nations are still making nuke bombs. Man is a paranoid. At any time, he can blow up the entire world. The present world is not safe in his hands.

Nature's intention in inducting technology into the corpus of the present civilization

During the Mediaeval Ages, 90% of the population used to work in the fields to cater to the needs of 10% kings and feudal lords. Nature entrusted these kings to build great castles, forts, Chinese Walls, Taj Mahals, temples, etc. Now these monuments have become the wonders of the world. At present Nature wants to take all the modern comforts to the remaining 90% population. All haves and have-nots are the fostered children of Nature. So Nature's intention in inducting the technology into the modern civilization is to take all the modern facilities to the have-nots. But the present man (as he stands now) is an imperfect being. He is a selfish one. All our industrialists are utilizing the resources of Nature, using all the labourers and are producing immense material wealth. Markets are flooded with all sorts of comfort items. Our industrialists are paying the scheduled wages to the workers and pocketing the remaining profits. Besides this, he is going to the 5-star hotels and spending recklessly the hard-earned money over performing expensive functions. A reaction is set in in the minds of the labour. This is leading to the growth of the extreme leftist parties. This dangerous trend can be effectively stopped with the advent of the supramental beings (New Race).

No criticism of any institution, religion, political philosophy or Economic philosophy.

We are not criticizing any politician or industrialist. All the present institutions of the civilization are the products of the present imperfect man. We know the place where imperfection is located. Man is the main centre of all the imperfections of the world. At this particular level of evolution (at present), there cannot be any being other than the present imperfect man. Imperfection is a global phenomenon. There is no point in criticizing anybody. All are sailing in the same boat of imperfection.

Man occupies the pivotal position

We have come to know the place (location) of imperfections. All our institutions are good, our technology is a wonderful instrument, our planners are experts. But our implementers of all the projects are imperfect beings. So, imperfection has become a global phenomenon.

What should be done now ?

We are not called upon to single out the imperfections of the present man who himself is a transitional being. He has not yet reached the zenith of perfection. So, we have to upgrade the consciousness of the present man. (We have to do tapasya). We should collectively aspire for the advent of the New Race Beings. Man has come from the animal, the future New Race Beings will come from the transformation of the present imperfect man. When our aspiration is intense, Nature would be glad to sent the New Race Beings to the earth. This is a two pronged drive __ from below we have to sincerely aspire, from above Nature would respond.

by Dr. V. Man mohan Reddy

"ఆధ్యాత్మిక పార్టీ" రచనపై డా॥ గోపాలరెడ్డి గారిని గూర్చి ఒక అభిప్రాయము - అవగాహన

నేను చరిత్రను బోధించే కళాశాల అధ్యాపకుడను. బహుముఖ ప్రజ్ఞా దురంధరులైన మీ ముందు నేనొక సామాన్యవక్తిని. మనము శ్రీమాత సహ-భక్తులము. మన యిర్వురకు, శ్రీమాతారవిందుల బోధనలను తెలియబరచు, ఉద్యమంతో జత పడినాము. మీ వ్యక్తిత్వమును అంచనా వేయుట చాలా కష్టతరమైన కార్యము. నాకున్న శక్తి, జ్ఞానములు కొదువే; అయినా పరిమిత జ్ఞానంతో మిమ్ములను అంచన వేయ సాహసించుట కేవలము శ్రీమాత అనుగ్రహమే. ఆ దివ్యమాత కారణంగానే మన మధ్య పరస్పర సంబంధమేర్పడినది. ఈ విధంగా మిమ్ములను పొగడ్తలతో ముంచెత్తినందుకు, సాహసము చేసిన నన్ను మన్నింతురు గాక.

మీరు రచించిన "ఆధ్యాత్మిక పార్టీ" యొక్క 'మానిఫెస్టో' మహా విలువైన డాక్యుమెంట్. ఒక సామాన్యుడు, ఉన్నత విద్యావంతుడైనా, దీనిని అర్థం చేసికొనుట కష్టమే కాగలదు. ఇది అతనికి గ్రీకు, లాటిన్ లాంటివి. భారతదేశములో శ్రీమాత ప్రభుత్వము యేర్పడినచో ఈ మానిఫెస్టో పాఠ్యగ్రంథము కాగలదు. ముఖ్యముగా శిక్షణార్థులైన రాజకీయ నాయకులకు, మీరు మనోరూపాలను దృగ్గోచరమొనరించు కొనుటలో మిక్కిలి సమర్థులు. భారతదేశము యొక్క ఉజ్వల భవిష్యత్తును మానిఫెస్టోలో మీరు దర్శింప చేసిన విధము ప్రశంసనీయం. శ్రీమాతారవిందుల మహిత సూక్తులను - కొటేషన్స్‌ను అందులో చేర్చినారు. ఈ మానిఫెస్టోకు భవిష్యత్తులో, ఏదో ఒకనాడు, 'డిమాండ్' ఏర్పడ గలదు. శ్రీమాతరవిందుల విజన్‌ను మీరందులో దర్శింప చేసినారు. ప్రస్తుత మేధావులు సహితము, అందులోని విషయాలను అర్థం చేసికొని ప్రశంసించ లేరు. మీ సంకలనం సంపూర్ణం. ఏ ఒక్క అంశం కూడా వదిలి వేయబడలేదు. సంపూర్ణమైన, భవ్యమైన భారత భవిష్యత్తును అందులో దర్శింప చేసినారు. ప్రస్తుత కాలపు రాజకీయ నాయకులు దీనిని ఆదరించ లేరు. ఇది చాలా విచిత్రము, ఉత్కృష్టము, సమున్నతమైనది. కాని శ్రీ అరవింద తత్వ సాధకులకు, భక్తులకు విలువైన చార్టర్. శ్రీమాత ప్రభుత్వము ఢిల్లీలో యేర్పడుట తూర్పున సూర్యోదయ మగుటంత సత్యము. భారతదేశ గమ్యము శ్రీమాతారవిందుల బోధనలతో సంబంధపడి యున్నది.

మనము యిక్కడొక మారు గతమును పరిశీలించాల్సి యున్నది. అదేమనగా,

భారతదేశ స్వాతంత్ర్యదినము 15, ఆగస్టు నాడే, అనగా శ్రీ అరవిందుల జన్మదినము నాడే సంభవించుట, కాకతాళీయము కాని సంఘటనాత్మకము కాని కాదు; ఇది దైవము నిర్దేశించిన వరప్రసాదము.

ఇక దీనిని ముగించుటకు ముందు - ఒక సహభక్తునిగా, మీరు సంకలన మొనరించిన అద్భుతమైన ఈ మానిఫెస్టోను చూచిన తర్వాత తమకు నా శుభాకాంక్షలు తెలుపుట నావిధిగా భావించినాను. మీ జీవిత చరిత్ర వ్రాయుచున్న ప్రతి సందర్భంలో నేను నిరంతరం శ్రీమాత నుండి ప్రేరణను పొందుచున్నాను. నా మిత్రులు, సహ భక్తులైన డా॥ మన్మోహన రెడ్డి గారు ఎప్పుడూ నన్ను ప్రోత్సాహపరుస్తూ, త్వరగా ముగించుటకై సూచించు చున్నారు. చివరగా, నేను శ్రీమాతను, మీకు సుదీర్ఘమైన ఆయుష్యాన్ని ప్రసాదించాల్సిందిగా ప్రార్థించుచు, ఈ ధరిత్రపై దివ్యమాత ప్రబోధము లను కార్యరూపము లోనికి అనువదించుటకు కావలసిన శక్తిని తమకు ప్రసాదించా ల్సిందిగా వేడుకొనుచున్నాను. శ్రీమాత ప్రభుత్వములో ప్లానింగ్ కమీషన్ సభ్యులుగా బాధ్యతలు చేపట్టవలసిన దను ఆహ్వానమును భవిష్యత్తులో మీరు అందుకోవలసిన రోజు ఒకటి రాగలదు. చివరగా, భారత ప్రభుత్వము, తమకు విశిష్టమైన 'పద్మభూషన్' పురస్కారము ప్రసాదించి, తనను తాను గౌరవించుకోవాల్సిందిగా ఆకాంక్ష.

★ ★ ★

డా॥ గంటా గోపాలరెడ్డి గారి
మహనీయ వ్యక్తిత్వము - సమీక్ష

ఇంతవరకు డా॥ గోపాలరెడ్డి గారికి వివిధ సంస్థలతో గల సంబంధాలను తెలపడం జరిగింది. ఇక వారు వ్యక్తిగా ఎంత ఔన్నత్యం కలవారో చూడాల్సి వుంది. అప్పుడు గాని వారి సమగ్ర వ్యక్తిత్వాన్ని దర్శించలేం.

డా॥ గోపాలరెడ్డి ఒక రైతుబిడ్డగా జన్మించినారు. రైతు కుటంబానికి చెందిన వాడగుట, సహజంగా వారికి వ్యవసాయమందు అభిరుచి మెండుగా యుండుటచే, వ్యవసాయ శాస్త్రాన్ని అధ్యయనం చేయాలన్న పట్టుదలతో 'అలహాబాద్ వ్యవసాయ విశ్వవిద్యాలయం'లో చేరినారు. వ్యవసాయ శాస్త్రాన్ని ఆమూలాగ్రం చదివి, ఉన్నత ప్రమాణంలో ఉత్తీర్ణులై B.Sc (Agril) డిగ్రీ పుచ్చుకొని సగర్వంగా స్వంత రాష్ట్రానికి తిరిగి వచ్చారు. తాను నూతన ఉత్సాహంతో తాను చదివిన చదువుకు సార్ధకత కలిగించాలని, స్వంత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ వ్యవసాయ శాఖలో ప్రవేశించి, ఉద్యోగ బాధ్యతలను నిర్వహించారు. వ్యవసాయ రంగంలో నూతనమైన పద్ధతులను ప్రవేశపెట్టి, రైతులకు దానిని ప్రయోగాత్మకంగా చూపించి, అభ్యుదయ పద్ధతి ఫలాలను వారికందించారు. కాని వారిలోని జ్ఞాన పిపాసకు సంతృప్తి కలుగలేదు. ఉద్యోగ బాధ్యతలు నిర్వహించుచునే, తమదృష్టిని అమెరికాదేశములోని మేలైన వ్యవసాయ విజ్ఞానాన్ని పొందాలని ప్రయత్నించారు. పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, పరిశోధనా రంగంలో కూడా ప్రవేశాన్ని పొంది, "భూసార శాస్త్రము" (Soil Science) నందు Ph.D. పట్టాను పొందుటతో వారి తృష్ణ తీరినది. స్వదేశానికి తలెత్తుకొని తిరిగి వచ్చినారు.

విద్యను అభ్యసించుట ఒక పక్షమైతే, దాన్ని ఆచరణలో పెట్టి దాని ఫలాలను సమాజానికందించుట మరొక పక్షము. అందుకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆచార్య పదవిని చేపట్టినారు. ఈ పదవిలో వారు తమ శిష్యుల్లో కొందరిని తమంతవారుగా తీర్చిదిద్దినారు. అభ్యుదయ దేశాలందు ఆచరణలో గల వ్యవసాయ విధానాన్ని మన వారికందించి, వారి ద్వారా దేశాభ్యుదయానికి తోడ్పడిన సంతృప్తిని చెందారు. మహోన్నతమైన ఆం.ప్ర. విశ్వవిద్యాలయంలో ఆచార్య పీఠాన్ని అధిరోహించి హాయిగా వుండవచ్చును కదా ! కాని వారి జీవితం అలా సాఫీగా సాగలేదు.

ఆచార్యత్వములో చిత్తశుద్ధిని ప్రదర్శించి తమ విద్యార్థులకు ఆ శాస్త్రములోని మెళకువలను వారికందించి వారిని సంతృప్తి పరచగలిగినారు, కానివారు తమ అంతరంగము నందు ఏదో కొరత వున్నట్లు, తాము చేయాల్సిన కార్యమిది కాదని మరేదో వున్నట్లు ఒక ప్రేరణ పొడచూపినదే గాని, నిర్దుష్టమైన గమ్యమేదో అంతు పట్టలేదు. ఇదొక అనిశ్చితస్థితి. ఉస్మానియా విశ్వవిద్యాలయ తత్వశాస్త్ర ఆచార్యులైన డా॥ వి. మధుసూదన రెడ్డి గారి ప్రేరణతో వారికి దిశానిర్దేశము అమెరికాలో జరిగినది. శ్రీ మాతారవిందుల తత్త్వానికి చేరువగుట జర్గినది. శ్రీ అరవిందాశ్రమాన్ని సందర్శించి శ్రీ దివ్యమాత అనుగ్రహాన్ని పొందినారు. దివ్యమాత దర్శనము వల్ల అపారమైన శాంతి సంతృప్తులను పొందినారు. ఈ విధంగా ఆధ్యాత్మిక రంగప్రవేశం డా॥ గోపాల రెడ్డి గారి జీవితమందొక గొప్ప మలుపు.

గడ్డిపల్లి, గోపాలరెడ్డి గారి జన్మభూమి. వర్షాలు లేక మరొక ఆధారం లేక రైతులంతా అనేక కష్టాలననుభవించుట అనాదిగా పరిపాటి. నాగార్జున సాగరం యొక్క ఎడమ కాలువ గడ్డిపల్లి భూముల గుండా ప్రవహించి దిగువ ప్రాంతాలను సస్య సంపన్నం చేయుచున్నది. కాని మనకట్టి భాగ్యము లేదాయెనని వగచు రైతుల యిక్కట్లు తీర్చు టెట్లాయని యోచించినారు. ఆ కాలువ నీటిని ఎత్తి పోసినచో మన భూములకు కూడా భాగ్యమబ్బ గలదని, తనమదికి నిశ్చయమైనది. ఈ విషయాన్ని రైతులందరికి అర్థము చేయించి, ఈ కార్యసాధనకు అందరు సంఘీభావముతో సహకరించు నట్లు వారిని సంసిద్ధులను చేయుటలో కృతకృత్యులైనారు. ఒక సంఘటిత శక్తి అచట ఆవిష్కరించింది. ఆశ్రమానికి వెళ్ళి యీ విషయాన్ని 'అమ్మ'కు నివేదించుట జరిగినది. మానవ ప్రయత్నానికి దైవానుగ్రహం తోడైనది. దైవ ముహూర్తంలో మనం చేయు ఆలోచనలకు, సంకల్పాలకు బలం చేకూరి కార్యరూపం పొందగలవన్నది యిదే కాబోలు ! శ్రీమాత అనుగ్రహవర్షం గడ్డిపల్లిపై కురిసింది. వ్యవసాయ విప్లవానికి తెర లేచింది. నాగార్జున సాగర్ ఎడమ కాల్వపై నీటిపంపులను బిగించి నీరు తోడిపోయుట ద్వారా వ్యవసాయాన్ని కొనసాగించ వచ్చునని, ప్రభుత్వాన్ని కూడా అంగీకరింప చేసి, "లిఫ్టు ఇరిగేషన్ సహకార సంఘం - గడ్డిపల్లి" అను సంస్థను రూపొందించి, తాను అధ్యక్షులుగా, రైతులకు వెన్నుదన్నుగా నిలిచారు డా॥ గోపాల రెడ్డి గారు.

గడ్డిపల్లిలో వెలసిన చైతన్యం, గడ్డిపల్లి పరిసర గ్రామాలకు పాకింది. దక్షత గల డా॥ గోపాలరెడ్డి గారి నాయకత్వ లక్షణం అందరిని ఆకట్టుకొంది. (6) గ్రామాల

వారు ఏకమైనారు. వారి భూములను శాస్త్రప్రకారం సమతలం చేయుట, లిఫ్టు వద్ద నుండి పంట పొలాల వరకు ప్రణాళికా బద్ధంగా కాలువలను త్రవ్వుట, సమతలమైన భూముల్లోకి నీటి ప్రవాహం అందుటతో సాగు ప్రారంభింప బడిన ఘనత గోపాలరెడ్డి గారికే దక్కుతుంది. ఈ పథకము విజయవంతమగుటతో తదితర గ్రామాల రైతులు కూడా సహకారాన్ని కోరగా, మరో 17 లిఫ్టులు, 'లిఫ్టు ఇరిగేషన్ సంఘాలు' వెలసినవి. మొత్తం 45 వేల ఎకరాల సాగులోకి వచ్చినవి. ఇదంతా వారి ముందుచూపుకు నిదర్శనం. ప్రభుత్వాన్నుండి అన్ని విధాలైన సహకారాన్ని డిమాండ్ చేసి ప్రజలకు ఫలసాయం పొందుటకు మార్గదర్శనం చేసిన మహనీయ వ్యక్తిత్వము వారిది. పల్లె ప్రజలు కనీ వినీ ఎరుగని భారీయంత్రాలు వారి ముందు ప్రత్యక్షమై, అవి నిర్వహించు కార్యాలకు అబ్బుర పడినారువారు. ఈ విధంగా అచటి వ్యవసాయ పనులు, ఆది నుండి అత్యంత అధునాతన యంత్రముల ద్వారా నిర్వహింపబడుట, గతంలో వారి తాతలు, తండ్రులు పండించలేనంత పంటలు వారి స్వంత మైనందులకు, వారు శ్రీమాతారవిందులకు తమ కృతజ్ఞతలను తెలుపుకొని, పరిపూర్ణ నమ్మకంతో మెదలినారు.

డా॥ గోపాలరెడ్డి గారు శాంత స్వభావులు. మృధుమధుర భాషణులు, ప్రేమ స్వరూపులు; యింత మంది జనంలో అప్పుడప్పుడు తలెత్తే చిటపటలను సామరస్య పూర్వకంగా పరిష్కరించి అందరిపట్ల సమతా భావాన్ని ప్రదర్శించారు. అందుకే వారు అందరికీ చేరువైనారు. అందరి సమస్యలను తనవిగానే చూచి పరిష్కారం చేసేవారు, పక్షపాత రహితమైన వారి ప్రవర్తన ప్రశంసనీయమైనది. ఇన్ని గ్రామాల రైతుల సమస్యలను తీర్చినందువలన అందరికి ఆపద్బంధువైనారు. క్లిష్టపరిస్థితులు కాని, నూతన పథకాల ప్రారంభము కానీ మరేదైనా జటిల సమస్యలు ఎదురైతే, శ్రీ అరవిందాశ్రమ జనయిత్రికి విన్నవించుకొని, యేర్పడిన క్లిష్టతను తొలగించేవారు. ఇంతకాలంగా తాను నిర్వహించుచున్న, లేదా తన ద్వారా నిర్వహింపబడుచున్న కార్యక్రమాలకు అధినేత్రి "అమ్మ" యని ఆమె చలువ వల్లనే అసాధ్యమైనవి కూడా సుసాధ్యమైనట్లుగా భావించి, పరిపూర్ణ విశ్వాసంతో శ్రీమాతను సేవించే సుగుణం వారిది. ఈ తాత్వికతనే వారు ప్రజలకందించి, శ్రీమాతపట్ల వారి నమ్మకమును యినుమడింప చేసినారు.

తాత్వికపరంగాను, వ్యావహారికంగాను, అధ్యాత్మి కంగాను, అన్ని విధాలుగా ఆలోచనల నందించే డా॥ వి. మధుసూదన రెడ్డి గారు, కుడిభుజం వలె డా॥ గోపాలరెడ్డి గార్కి తోడుగా వున్నారు. విశాలమైన వారి కార్యక్షేత్రమందుత్పన్నమగు అనేక సమస్య

లను ఎదుర్కొని సకాలంలో పరిష్కారం చేయగలిగిన సమర్థత గలవారు మరొక్కరు అవసరమని కాబోలు ! "అమ్మ"యే స్వయంగా డా॥ వి. మన్మోహనరెడ్డి గారిని, గోపాలరెడ్డితో పాటు గడ్డిపల్లియందు పని చేయాల్సిందని ఆదేశించారు; వ్రాత పూర్వకంగా. ఎంతటి ధన్యులు వీరంతా ! అందుకే డా॥ వి. మన్మోహన రెడ్డి గారు శ్రీ అరవిందాశ్రమం నుండి, గడ్డిపల్లి కరుదెంచి మరో భుజము రీతిగా గోపాలరెడ్డి గారికి బాసటగా నిలిచారు. కర్మక్షేత్రంలో ఎదురయ్యే సమస్యలన్నింటిని ఉత్తర క్షణంలోనే అవలీలగా తేల్చివేసే వారు మన మన్మోహన రెడ్డి గారు. వారికి గల అపార వ్యవసాయ క్షేత్రములో కొంత కాలము పనిచేసిన అనుభవంతోనే వారు గడ్డిపల్లిలో గోపాలరెడ్డి గారికి తోడుగా వుండినారు.

1972 సం॥ ప్రవేశము జరిగినది. ఇది శ్రీ అరవిందుల శతజయంతి సంవత్సరము. ఆగస్టు 15, వారి జన్మదినము. వారి జన్మదినం నాడే భారతదేశానికి స్వాతంత్ర్యము సిద్ధించినది. దేశమంతటా వారి శతజయంతి వేడుకలు ఘనంగా జరుగనున్నవి. ఈ సందర్భంగా గడ్డిపల్లి ప్రజలను ఆశ్రమములో జరిగే వేడుకలను దర్శింప చేయుటకు పాండిచ్చేరి తీసుకవెళ్లాని సంకల్పించుట - 4 బస్సుల నిండా జనాన్ని తీసుకవెళ్లి, అచటి విశేషాలను దర్శింప జేయుట ద్వారాను, ముఖ్యముగా శ్రీమాతను దర్శింప చేయుట ద్వారా వారిలో శ్రీమాత పట్ల ప్రేమ, భక్తి శ్రద్ధలను యినుమండిప చేసినారు. శ్రీమాత అనుగ్రహానికి పాత్రులైన వారిలో ఒక విశేషమైన నమ్మకము - శ్రీమాత తమను అన్ని విధాలుగా ఉద్ధరించగలదను భావము దృఢమైనది. ఈ భావమే వారిని సర్వవేళల సుసంఘటితముగా కార్యములను నిర్వహింప చేసినది.

డా॥ గోపాలరెడ్డి గారు, ప్రజలలో శ్రీమాత పై కల్గిన భక్తి భావాన్ని అభివృద్ధి పరచుటకు పెద్దలచే ముఖ్యముగా శ్రీ కె.యస్. భాస్కరరావు, శ్రీ నర్సింహం, శ్రీ కె.వి.ఆర్. సంజీవరావు గారలచే సత్సంగాలను నిర్వహింప జేసెడివారు. వారి ప్రవచన ప్రబోధాల వలన రైతాంగము యొక్క నమ్మకము బలపడి, వారి యందు భక్తి విశ్వాసాలు పెంపొందినవి. ఈ కారణంగానే శ్రీమాతారవిందుల ధ్యానమందిర నిర్మాణము జర్గినది. ఆశ్రమం నుండి శ్రీ అరవిందుల అవశేషాలను తెచ్చి ప్రతిష్ఠించు కొన్నారు. ప్రతి సంవత్సరం శ్రీమాత పండుగను ఘనంగా చేసుకుంటున్నారు.

డా॥ గోపాలరెడ్డి గారికి సన్నిహిత సహచరులు, మిత్రులైన మరొక వ్యవసాయ శాస్త్రవేత్త డా॥ టి. సత్యనారాయణ గారు. వీరు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వ

విద్యాలయములో హార్టీకల్చర్ ప్రొఫెసరుగా పని చేసినారు. గడ్డిపల్లి ప్రాజెక్టు పనిలో రైతాంగానికి బాసటగా నిలిచినారు. బయో టెక్నాలజీ రంగాన్ని రైతులకు పరిచయం చేసి ముందు ముందు విత్తన గింజలు లేకుండా మొక్కలను పెంపొందించు ప్రయోగ శాలను యేర్పాటు చేసినారు. ఆ రంగమందు ఉత్సాహమున్న యువతకు శిక్షణ యిస్తున్నారు. విజ్ఞాన శాస్త్రరంగంలో యిదొక అద్భుతమైన ముందడుగు. భవిష్యత్తులో 'బయో టెక్నాలజీ ఇన్స్టిట్యూట్' ను ఈ ప్రాంతంలో నెలకొల్పి వారు తమ పూర్తి కాలాన్ని, దాని అభివృద్ధికి కేటాయించ దలచినారు. అందుకవసరమగు నిధులను, సాంకేతిక సహకారాన్ని సమకూర్చుకొనుటకు, వారు విదేశీ ప్రభుత్వములతో సంప్రదించు చున్నారు. వారి కృషి త్వరగా ఫలించి శ్రీమాతారవిందుల అనుగ్రహంతో వారికి సంకల్పసిద్ధి కలగాలని ఆకాంక్ష

గడ్డిపల్లి, పరిసర గ్రామాల రైతులకు, వారి కుటుంబాలకు చేతినిండా సరిపడ పని చేకూరినది. ప్రతి నిత్యం, వారంతా తమ తమ వ్యవసాయ క్షేత్రములందు నిమగ్నులై యుండుట, దానికి తగిన కృషి చేయుట ద్వారా వ్యవసాయ రంగము బలపడి దిగుబడి పెరిగినది. రైతాంగము యొక్క సంతానమును కూడా తీర్చిదిద్ద వలసిన బాధ్యత కూడా యున్నందున గ్రామాలందు ప్రాథమిక విద్యను బలోపేతం చేసి గడ్డిపల్లిలో "శ్రీ అరవింద హైస్కూల్"ను స్థాపించారు. వేరు వేరు కారణాల వల్ల గ్రామాల్లో స్కూలు చదువుతో ఆగిపోయిన అభ్యర్థులకు సాంకేతిక శిక్షణను సమకూర్చుటకు కేంద్ర ప్రభుత్వం నుండి 25 లక్షల గ్రాంటును సాధించి, "శ్రీ అరవింద కృషి విజ్ఞాన కేంద్రం"ను స్థాపించారు. దీనికి 100 ఎకరాల భూమి సమకూర్చి పెట్టినారు. ఈ విధంగా విద్యాలయాలను నెలకొల్పి, గ్రామీణ యువతను సరియైన మార్గంలో నడిపించిన ఘనత వారిదే. శ్రీమాత దయగల వారికి లోటుండునా !

మహిళల అభ్యున్నతికి వృత్తి శిక్షణా కేంద్రాలు, పొదుపు సంఘాలు వెలసినవి. శ్రీ మాతారవిందుల అనుగ్రహంతో అందరికి అన్నిరకాలైన పనులు సమకూరినవి. జీవన విధానము మెరుగైనది. జీవితానికావల్సిన సౌకర్యాలు అందరికి సమకూరినవి. ప్రజలు సుఖశాంతులతో నున్నారు.

గ్రామీణ భారత నిర్మాణానికి, స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన మన గోపాలరెడ్డి గారి సమగ్ర వ్యక్తిత్వానికి నిలువెత్తు నిదర్శనంగా "గడ్డిపల్లి" చరిత్రలో నిలబడింది.

"సర్వేజనా సుఖినో భవంతు" - అను ధ్యేయాన్ని సాధించుటకు, భారతీయ

పరిపాలనా వ్యవస్థ యందు సమూల మార్పులను చేయాల్సి యున్నదని, విశాల దృక్పథంతో వారు కోరుట జరిగినది. దేశపాలనకు అనువైన విధానాన్ని, దివ్యమాత ఆదేశానుసారం వారు రూపొందించారు. ఈ రూపకల్పన శ్రీమాత ఆదేశానుసారము జరిగినది. దానికి ఆమె "Spritual Party of India" (భారతీయ ఆధ్యాత్మిక పక్షము) అని నామకరణం చేసారు. దాని విధివిధానాలను కూడా వివరించారు 'అమ్మ'. దానికనుగుణంగా ఈ ఆధ్యాత్మిక పక్షము యొక్క మ్యానిఫెస్టోను రూపొందించి, డా॥ వి. మన్మోహన రెడ్డి గారితో కల్సి విడుదల చేసి దేశంలోని మేధావులందరకు పంపించి, ఈ దిశకు వారి ఆలోచనా సరళిని మళ్లించారు.

డా॥ గోపాలరెడ్డి గారు, గడ్డిపల్లిని లక్ష్యంగా చేసుకొని, మానవ జీవన గమనాన్ని, గ్రామీణ పరిధిలో సుఖవంతం చేయుటకు సంకల్పించి, నిరంతర కృషి సల్పినారు. అట్లే దేశమందలి వివిధ (రాజకీయ) ప్రభుత్వ, ఆర్థిక, సాంఘిక సంస్థలను పౌరులకు సన్నిహితముగా నుండుటకు తగిన సంస్కరణములను ఎత్తి చూపిన పిదప దేశమందలి పౌర పరిపాలనా వ్యవస్థను ఆధ్యాత్మిక సత్తాతో నిర్వహింప బడునట్లు, దానికి తగిన మానిఫెస్టో రచన చేసి విడుదల చేసినారు.

ఒక వ్యక్తి, తన లక్ష్యసాధనకు కావలసిన చిత్తశుద్ధి, పట్టుదల, నమ్మకం, కృషి అను నాలుగు మూలాలను కల్గి యున్నపుడే అతడు విజయపథంపై పయనించ గలడు. ఈ సుగుణ సంపుటిని కల్గియున్నందు వల్లనే డా॥ గోపాలరెడ్డి గారు గడ్డిపల్లి ప్రాంత రైతాంగము యొక్క నొసటి వ్రాతనే మార్చి వేసి వ్యవసాయ విప్లవాన్ని సృష్టించారు. 'ధైర్యే సాహసే లక్ష్మి' అని ముందడుగు వేసి ఆ ప్రాంత రైతు బాంధవు డైనారు. దీనికి తోడు వారికి గల శాంత స్వభావం, సమదృష్టి, విశుద్ధాచరణం, భూతదయ తోటి వారిని మిత్రులుగా భావించే వారి మహనీయమైన వ్యక్తిత్వము మూలంగానే యిన్ని ఘనకార్యాలు వారు సాధించారనుటలో అతిశయోక్తి వుండదు గాబోలు ! ఈ కార్యాలన్నిటి వెనుక శ్రీమాత అమృత హస్తమున్నది. ఆ తల్లి యొక్క అనుగ్రహ, ఆశీర్వాదముల వల్లనే ఈ కార్యము సిద్ధించినవి.

★ ★ ★

నవ్య సమాజం దిశగా ..... గడ్డిపల్లి

"భూమిపై ఈ మానవ జీవితం బాధల గాథలమయం. ఇక్కడ విధి వలయంలో చిక్కిన మనిషి తన జీవితాన్నే తాను పాలించుకోలేడు. తెలియని దేదో అతడిని నడిపిస్తుంది. అతడు విధివిధానంలో ఒక పావు ... ఇక్కడ 'అవచేతన' రాజ్యాన్ని పాలిస్తున్నది. అదే ఇక్కడి నియమావళి. దాన్ని తప్పించుకోవడం మానవులకు సాధ్యం కాదు. ఏదో ఒక దివ్యశక్తి అడ్డుకుని తన ఆత్మశక్తితో ఈ సర్వ నియమాలను మార్చి మానవాళికి మార్గదర్శనమైన నూతన బాటను వేయాలి. అపుడే మనకు మహోదయం".

ఈ మాటలను సావిత్రి గ్రంథంలో వివరించి మానవుని గమ్యాన్ని నిర్దేశించినారు శ్రీ అరవిందులు. జన్మజన్మల చక్రంలో యిరుక్కుపోయిన మనిషి జీవితాన్ని రూపాంతరం చేసి, చైతన్యాభివృద్ధి సాధించి, దైవం యొక్క నిజమైన బిడ్డలుగా తయారు కావడం నిన్నటి కన్న నేడు, నేటి కంటె రేపు, దిన దిన ప్రవర్ధమానమై, జన్మ నుంచి జన్మకు జ్ఞాన చైతన్యాలను వికసింప చేసుకుని, దివ్యజీవనం వైపుసాగిపోవడం మానవ జన్మకు నిజమైన అర్థం. దానినే మానవ జన్మ సాధించవలసి వుంది.

సామాన్య మానవుడు ప్రకృతి శక్తులను, దైవ నియమాన్ని ఉల్లంఘించలేడు. ఒక దివ్య అవతార శక్తి మాత్రమే. ఆ విశ్వచక్రాన్ని అడ్డగించి, అజ్ఞానమును, అంధకారమును నిర్మూలించి, నూతన సృష్టికి నాందిపలుక గలదు. ఇది విధి విధానమును మార్చి, నూతన మానవున్ని, నవ్య సమాజాన్ని సృష్టించుటకే శ్రీ అరవిందాశ్రమ మాతృశ్రీ అవతరించినది. ఆ 'తల్లి' అనుగ్రహము వల్లనే గడ్డిపల్లిలో పరిణామము ప్రారంభమైనది. స్వల్పాతి స్వల్పమైన మార్పునకు పునాదులు పడినవి. దీనితోనే మనం సంతృప్తి పడలేము. ఇంకా ఎంతో మార్పు రావాలి. "ఎప్పుడైతే మార్పు అనివార్యమగునో, అపుడు కొందరి బలమైన ఆకాంక్ష దైవాన్ని దిగివచ్చేటట్లు చేస్తుంది" ఈ సూక్తి సావిత్రిలో శ్రీ అరవిందులు ప్రవచించినదే. గడ్డిపల్లి ప్రజలందరి బలమైన ఆకాంక్ష వల్ల శ్రీమాత అనుగ్రహం దిగి వచ్చి వారందరు ఆకాంక్షించిన లక్ష్యసాధనలో శ్రీమాత విజయాన్ని కల్గించినది. అక్కడి ప్రజలకు అన్నీ సుఖములు అమరినవి. అయినను వారు శ్రీమాతను మరువకుండా, యింకా ఆకాంక్షను తీవ్రముగా కొనసాగించి, సమిష్టిగా నవ్యసమాజం వైపు అడుగులు వేయవలసివున్నది. అందు కొరకు ఏమి చేయాలి ?

గతములో శ్రీమాత అనుగ్రహంతో సాధింప బడిన వానిని పునశ్చరణ చేసికొని, ముందు సాధించవలసిన కర్తవ్యమును చూద్దాం !

లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు :

1969 నాడు రైతు జనమంతా ఒక్కటై అనేక శ్రమలకోర్చి శ్రీమాత అద్భుత మహిమలతో సాధించుకున్న అపురూపమైన ప్రాజెక్టు. ఆనాడు 6 గ్రామాలందున్న ఆయకట్టు మొత్తానికి (6,600 ఎకరములు) నీరందించ లేక కేవలము 3,000 ఎకరములకే పరిమితమైనాము. కారణం విద్యుచ్ఛక్తి కొరత - 1100 హెచ్.పి. గల మోటార్లకే తృప్తి పడినారు. 50% భూములు పడావ పడియున్నవి. కొందరకు అసంతృప్తే. 40 సంవత్సరాల తర్వాత, నేడు అభివృద్ధి చెందిన భారతావనిలో, పరిస్థితులు మెరుగైన కారణంగా గడ్డిపల్లి ప్రాజెక్టు I & II లిఫ్టులకు 3,300 హెచ్.పి. శక్తి గల మోటార్లను అమర్చి అందరికి సంతృప్తి కల్గించుట జరిగినది. మొత్తము ఆయకట్టు 6,600 ఎకరములకు నీరు పుష్కలముగా అందుచున్నది. నీరు యింకా మిగిలి పోవుచున్నది. అందరు ఆనందంగా వున్నారు.

విద్యా ప్రాంగణము (Educational Township) :

శ్రీ అరవింద పాఠశాల (Sri Aurobindo's School)

'శ్రీ అరవింద పాఠశాల' గడ్డిపల్లి - దీనిని 2001 A.D. సం॥లో "శ్రీ అరవింద విద్యా ఎకాడమీ & సొసైటి" అధీనంలో నిర్వహించుటకు, ఆం.ప్ర. పబ్లిక్ సొసైటీస్ చట్టము 2001 ప్రకారము నెం. 35/2001 రిజిష్టరు చేయబడినది. దీనిని నల్లగొండ జిల్లా, గరిడేపల్లి మండలములోని 'గడ్డిపల్లి' గ్రామములో నెలకొల్పుట జరిగినది.

పూర్వ చరిత్ర :

1969 సం॥లో గడ్డిపల్లిలో లిఫ్టు ఇరిగేషన్ సహకార సొసైటి స్థాపింప బడినపుడు రైతుల సమగ్ర అభివృద్ధి కొరకు ఆర్థిక, సాంఘిక, విద్యా, సాంస్కృతిక, ఆధ్యాత్మిక రంగములందభివృద్ధి సాధించుటకు ఉద్దేశించ బడినది.

1971 సం॥లో కాలువలకు నీరు వదిలిన తర్వాత పాండిచ్చేరి శ్రీ అరవిందాశ్రమ దివ్యమాత ఆశీర్వాదముతో, గడ్డిపల్లిలో ప్రారంభించ దలచిన

పాఠశాలకు ఒక పేరును సూచించుటకు శ్రీమాతను అర్థించగా, "Sri Aurobindo's School, Gaddipally" అని పేరును వ్రాసి, ఆశీస్సులను కూడా అందించినది. ఆ విధముగా గడ్డిపల్లి, ఎల్లకుంట, మల్లికుంట మూడు గ్రామాలకు గాను గడ్డిపల్లిలో ఆ స్కూలును ప్రారంభించి 1వ తరగతిలో పిల్లలను చేర్చుకొని క్రమముగా సంవత్సరమున కొక తరగతిని పెంచుతూ 10వ తరగతి వరకు ఉన్నత పాఠశాలను చేయుట జరిగినది. ఆ తర్వాత మారిన పరిస్థితుల దృష్ట్యా, రైతులు నిర్వహణా భారమును భరించలేక ప్రభుత్వమునకు స్వాధీన పరచనైనది. ఆనాటి నుండి అది జిల్లా పరిషత్ స్కూలుగా ప్రభుత్వముచే నిర్వహింపబడుచున్నది.

శ్రీ అరవింద విద్యాలయము పునః ప్రారంభము :

1971 నాడున్న పరిస్థితులలో మార్పు వచ్చినది. ఎంతో అభివృద్ధి జరిగినది. 2010 సం॥లో ప్రాజెక్టు గ్రామాలలో సర్వే చేసినపుడు, 6 గ్రామాలలో సుమారుగా 250 మంది పిల్లలు ఇంగ్లీషు మీడియంలో విద్య నేర్చుకొనుటకు సమీప గ్రామాలకు, పట్టణాలకు వెళ్లుచున్నారు. ఆర్థిక స్థితిగతులు మెరుగు పడినందున తమ పిల్లలకు మంచి విద్య కావాలని, అది కూడా శ్రీ అరవిందుల విద్యావిధానములో, ఆంగ్ల మాధ్యమములో నిర్వహించాలని డా॥ గోపాల రెడ్డి గారిని రైతులు కోరినారు. శ్రీ అరవిందుల విధానములో శారీరక విద్య, ప్రాణిక విద్య, మానసిక విద్య, ఆధ్యాత్మిక విద్యలుగా 4 అంశములతో కూడి యుండును. ప్రస్తుత ప్రభుత్వ విధానములలో, మూడు అంశముల - శారీరక విద్య, ప్రాణిక విద్య, మానసిక విద్యలకే పరిమిత మైనది. ఆధ్యాత్మిక విద్య లేమి వల్లనే సమాజములో సుఖశాంతులు కరువైనవి, నైతిక విలువలు అడుగంటినవి. భగవద్భక్తి, సాంప్రదాయముల పట్ల అనాసక్తి పెరిగి ఆస్తిక్య భావమంతరించినది. కావున రైతుల అభ్యర్థన కనుగుణముగా 14 జులై, 2010 నాడు శ్రీ అరవిందుల విద్యా విధానమునననుసరించి, అన్ని హంగులతో పాఠశాల ప్రారంభించబడినది.

విద్యాతత్త్వ దర్శనము :

ఈ విద్యా విధానంలో బిడ్డల చేతనను ఆ దివ్యచేతనకు అనుసంధానం చేసేదిగా వుండాలి. విద్యార్థులందు, సహజముగా నున్న సంపదను వెలికి తీసి వానికి పదును పెట్టాలి. మానవ చేతనలోని ముఖ్య విభాగాలు శారీరక, ప్రాణిక, మానసిక, చైత్యాత్మిక, ఆధ్యాత్మిక అంశాలన్నీ సమగ్రంగా వికసించాలి. ఇదే శ్రీ

అరవిందుల సమగ్ర విద్యావిధానం. ఇందులో ఎదిగిన బిడ్డలు అంతరాత్మ మార్గ నిర్దేశంలో జీవిస్తారు. ఇక్కడ స్థాపింపబడిన విద్యాలయం వ్యాపార దృష్టితో గాక, దైవ కార్యంగా కొనసాగాలి.

ఉపాధ్యాయుల పాత్ర :

ఉపాధ్యాయులు పాఠశాలకు ఆత్మవంటివారు. విద్యార్థులలో దాగి వున్న చైతన్యమును తను అనుభవములో, విద్యార్థి యొక్క స్వభావాన్ని పరిశీలించి, అతని లోని నైజమున కనుగుణముగా ఆ ప్రత్యేక విభాగముపై ప్రత్యేక శ్రద్ధను కనబరచాలి. బాలునికి అతడు సహాయకునిగా ఉండాలి. బోధకుడుగా గాదు, అంటే తానే విషయాన్ని విద్యార్థిలోకి క్రుక్కుట కాదు. విద్యార్థికి విషయము పట్ల అవగాహన కలిగించి వదిలి వేసి వారేమి చేయుదురో, ఎట్లు చేయుదురో పరిశీలించాలి. అందుకైవారు ఉన్నత విద్యావంతులై శిక్షణ పొందిన వారై వుండాలి. ఆ దృష్టితోనే గడ్డిపల్లి పాఠశాలలో ఎక్కువగా M.A., B.Ed. వారినే నియమించారు. 9 మందిలో 7 గురు వీరు కాగా, మిగతా యిద్దరు B.A., B.Ed. వారున్నారు. ప్రస్తుత విద్యార్థుల సంఖ్య 134 మంది బాలబాలికలు - ఇక్కడి ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:20 గా నున్నది.

పాఠ్య ప్రణాళిక :

గడ్డిపల్లి పాఠశాల వారు, 1-7 వ తరగతి వరకు వారి స్వంత ప్రణాళికనే అనగా వివిధ వ్యవస్థల వాని నుండి మేలైన పాఠ్యాంశములను ఎన్నుకొందురు. 8వ తరగతి నుండి ఆం.ప్ర. రాష్ట్ర ప్రణాళికలను అమలు పరిచెదరు. నర్సరీ సెక్షన్ నుండి 10వ తరగతి వరకు ప్రతిదినము ఉదయం యోగా, ప్రార్థన, ధ్యానము, శారీరక వ్యాయామము దినచర్యగా నుండును. సంగీతమును కూడా నేర్పించు చున్నారు. ఇవి గాక ప్రతిరోజు 40 నిముషములు శారీరక వ్యాయామము నేర్పెదరు. తల్లిదండ్రుల నుండి చందాలు స్వీకరించబడును. ఉదయము, సాయంకాలము "ఓం నమో భగవతే శ్రీ అరవిందాయ" ప్రార్థనను చేయించి ప్రతివారు దానిని 20-25 మార్లు వ్రాయు నియమమును ఏర్పాటు చేయబడినది.

క్రమశిక్షణతో కూడిన విద్య విద్యార్థుల కందుచున్నది. విద్యార్థులను నవ్య సమాజము దిశగా నడిపింపబడుచున్నది.

శ్రీ అరవింద విద్యా విధానము :

2010లో పున ప్రారంభింపబడిన పాఠశాల పెరిగి పెద్దదై పరిసర గ్రామాల వారి సంతానమునకు విద్యనందించగలదు. విద్యార్థులు నివసించుటకు వసతి కలిగి యుండుట అవసరము. రాను రాను వారి సంఖ్య కూడా పెరుగ గలదు. అప్పుడు చిక్కులు చూచుట కాక, ముందే వారికి ప్రణాళికా బద్ధమైన ఏర్పాటుండాలి. వారి సంఖ్య కూడా అధికము కాగలదు. అందుకే 2000 మంది విద్యార్థులకు సరిపడు పాఠశాల భవనము, హాస్టలు భవనములను దూరదృష్టితో నిర్మించుటకు పనులు ప్రారంభమైనవి. ఆ తర్వాత అవసరానుగుణముగా యితర సంస్థలు కూడా వెలయు నున్నవి. ఈ విధముగా విద్యా సంబంధ సంస్థలన్నీ ఒకే చోట వెలసినపుడిది "సరస్వతీ ప్రాంగణం"గా యుండగలదు. భవిష్య సమాజ ఉన్నతి కొరకు మానవశక్తిని తయారు చేయు ఈ ప్రాంగణము రూపకల్పనను గూర్చి, డా॥ గోపాలరెడ్డి గారు తలపెట్టిన ప్రణాళికను ప్రజలందరు విశాలదృష్టితో అవగాహన పరుచుకొని, అనువైన విధముగా సహకరించవలసి యున్నది. వారి ఆలోచనకు, కార్యాచరణకు దోహద పడుట గడ్డిపల్లి ప్రాంతములోని అన్నిగ్రామాల ప్రజల అవశ్యకర్తవ్యము. అపుడే నూతన జాతి అభ్యుదయమునకు, విశ్వమానవ కళ్యాణమునకు మన సహకారమును కూడా జోడించిన వారము కాగలము. విద్యాప్రాంగణము అభివృద్ధి కొరకు మనమంతా మరొక్కమారు కాదు, నిరంతరము ఆకాంక్షించాలి. భవిష్య నవ్య సమాజమునకు స్వాగతం పలకాలి.

నూతన సృష్టి (New Creation) :

సమాజములో నేడు జరుగుచున్న అభివృద్ధి సమతౌల్యమును కోల్పోయి, గ్రామీణ, పట్టణ అభివృద్ధిలో అగాధమేర్పడినది. ఇది రాను రాను క్షేమకరము కాదు. కావున దీనిని సవరించవలసిన సత్వర అవసరమేర్పడినది. దానికి అనుగుణముగా చర్యలు చేపట్టవలసిన అవసరమున్నది.

పట్టణములకు, పల్లెల నుండి వలసలు పెరిగిన కారణముగా మురికి వాడలు పెరిగినవి. వసతులు సరియైన విధముగా లేకుండా జనము వత్తిడి పెరుగుచున్నది. అనారోగ్యము పాలు పడుచు, అనేక కష్టములను ప్రజలు అనుభవించు చున్నారు. పట్టణములో మురికివాడలు అధికమగుచున్నవి. పల్లెలు ఖాళీ అగుచు కళావిహీనము లైనవి.

పల్లెపట్టులందు కనీస అవసరములపై శ్రద్ధ తగ్గినది. విద్యావసతులు, ఆరోగ్య వసతులు సేవా సంస్థలు మృగ్యము. మనుష్యుల జీవితము పేద వాలకముగా కొనసాగుచున్నది. అందరిది ఒకేవృత్తి - వ్యవసాయము. ఇది కూడా సరియైన విధముగా నిర్వహింపబడుట లేదు. ఆ వృత్తికి చెందిన నైపుణ్యము కొరత, కలిసి పని చేసుకుందామను భావన లేదు. చిన్న చిన్న కమతాలతో వ్యవసాయము సానుకూలము కాక, ప్రజలకు మరోవృత్తి లేక, పేదరికమును అనుభవించుచున్నారు.

వీనికి పరిష్కారములను డా॥ గోపాలరెడ్డి గారు శాస్త్రీయ పద్ధతిలో ప్రణాళికను రూపొందించినారు. దీనిని అచరించుటకు ప్రభుత్వమువారు ఆలోచించాలని కోరుతు, సమగ్రమైన ఆ ప్రణాళికను ప్రభుత్వమున కందచేసినారు.

అందరికి పని :

"మన దేశాభివృద్ధికి ఆర్థిక దృక్పథము రీత్యా భారీ యంత్రముల ద్వారా ఉత్పత్తిని పెంచే ప్రయత్నము చేయకూడదు. అది పోటీ రంగమైనా, సహకార రంగములో నైనా తగదు. మనిషి యొక్క స్వభావమున కనుగుణంగా పని యివ్వ బడినపుడది ఆనందకరముగా యుండును. వారి అంతర్గత అభివృద్ధి కొరకు తగినంత విరామము కూడా అవసరమగును. ప్రజల జీవితమునకు అవసరమగు వసతులతో కూడిన సంపన్నత్వము, ఆనందకరమగు జీవితమును అందరికి అందించ వల్సి యుండును" - శ్రీ అరవిందులు.

అందరకు పని అందించుటెలా ?

ప్రప్రథమమున పౌరులందరకు విద్యా విజ్ఞానములతోపాటు వృత్తి నైపుణ్యము లను కలిగించాలి. వారికి నాల్గు రకములైన నైపుణ్యములనందించాలి.

1. 5,000 జనాభా కల్గిన గ్రామములకు వలయు వసతులను సమకూర్చాలి.
2. 15,000 జనాభాతో గ్రామీణ పట్టణములను ఉన్నత వసతులతో సమకూర్చాలి.
3. 50,000 జనాభాతో అధునిక ఉన్నత వసతులతో పట్టణములను రూపొందించాలి.
4. 2 లక్షల జనాభాతో మెగా పట్టణములలో కల వసతులతో నగరములను ఏర్పాటు చేయాలి.

ఈ విధముగా నివాస ప్రాంతాలను ఏర్పరచినపుడు జనులు ఈ నాల్గు ప్రాంతములలో తమకు తగిన దానినెన్నుకొని నివసించి సుఖముగా యుండగలరు.

పౌరులకు కలిపించే పనులు వారికి తగినంత ఆదాయమును, కుటుంబ పోషణను దృష్టిలో నుంచుకోగలిగినపుడే అతడు పనిలో శ్రద్ధను చూపగలడు. ప్రాథమిక అవసరములు తీరునట్లుండాలి. పోషక విలువలు కల్గిన ఆహారము, సలక్షణమైన ఆరోగ్యం గృహవసతి, సమగ్ర విద్య అందరకు లభించాలి. పచ్చని పర్యావరణము వర్ధిల్లాలి. పౌరులకు సాంస్కృతిక, ఆధ్యాత్మిక విలువలతో కూడిన అవసరములు తీరాలి. పని అనునది ఆనందమునకు మూలము కావాలి. వ్యక్తి యొక్క సమగ్రాభి వృద్ధికి పని దోహదపడాలి. బాహ్యాంతరంగములందు వ్యక్తుల జీవితములను వృద్ధి చెందించాలి.

పట్టణములో గల సౌకర్యములను పల్లెలలో కలిగించించాలి. ఆధునిక సౌకర్యములు పల్లెలలో అమరినపుడు, పల్లెవాసులు పట్నమునకు ఎగబడరు. పల్లెలను, దాని సంస్కృతిని పోషించి నపుడే భారతదేశము బల సంపన్నము కాగలదను సత్యమును విస్మరించరాదని డా॥ గోపాలరెడ్డి గారు హెచ్చరించినారు. నూతన సృష్టి ప్రణాళికలో వ్యవసాయ రంగమును జనాభాలో 25% ప్రజలే చేపట్టాల్సి యుండును. మిగిలిన 75% జనాభా సర్వీసు రంగము, ఉత్పత్తి రంగములలో పనిచేసినపుడే అభివృద్ధి సమతూకముగా కొనసాగగలదు. అందరూ వ్యవసాయానికే ఎగబడిన వారికి గిట్టుబాటు గాక, దేశానికి ఉత్పత్తి పెరుగక రెండు విధములుగా నష్టముండును. కనుక ఆ వ్యవసాయాన్ని కూడా గడ్డిపల్లిలో వలె సహకార రంగమున నిర్వహించిన ఉభయతారకముగా నుండ గలదు.

సహకార వ్యవసాయము - రైతుల జీవనాభివృద్ధికి మార్గము ఒక పరిశీలన :

భారత ప్రభుత్వము, గత ఏబది సం॥రాలుగా రైతుల జీవనాభివృద్ధికి, వ్యవసాయక కార్యక్రమాలను మొదలెట్టినది. కాని అవి ఏవీ కూడా ఆశించిన ఫలముల నందించలేదు. వ్యవసాయ ఉత్పత్తి మెరుగైనా, గ్రామీణ ప్రాంతములందు అవకాశములు పెరిగినా G.D.P. వృద్ధిరేటు మాత్రము పడిపోయినది.

నేడు జనాభాలో 70% ప్రజలు వ్యవసాయదారులే వారి ఆర్థిక ఉత్పత్తి కేవలము 18% జాతీయ G.D.P. స్థాయిలో స్వల్పమే. చిన్న, సన్నకారు రైతులు

మొత్తము వ్యవసాయ కమ్యూనిటీలో 20% భాగమును కల్గియున్నారు. భూమి లేని కూలీజనం, వీరే జనాభాలో అధిక శాతముగా నున్నా, వారు యీ లెక్కలలో చేరసేలేదు.

ప్రస్తుతము చలామణిలో గల కార్యక్రమాలు ఏవి కూడా ఉపయోగకరముగా లేవు. కారణం అవి అసంపూర్ణంగా వున్నవి. అది గాక అవి మూలములోనికి వెళ్లి, గ్రామీణభారతములో స్థగితమైన స్థితిని తడుముట లేదు.

గ్రామీణ ప్రాంతములలో లభ్యమగు మానవ మరియు నైసర్గిక వనరులను ఉపయోగపరచుటకు రైతుల జీవనాన్ని మెరుగు పరచుటకు మనము అవలంభించు మార్గమునే మార్చి సమగ్రాభివృద్ధి దిశగా అభివృద్ధిని సాధించు మార్గమును ఎన్నుకొన వలసియుండును.

లక్ష్యములు :

శ్రీ అరవింద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, లాభార్జన లక్ష్యము లేనట్టి సంస్థ, అది గత 30 సం॥ల నాడు గడ్డిపల్లిలో వెలసి, ఆ ప్రాంతములోని (6) గ్రామాలు పదివేల ఎకరములలో వ్యాపించి యున్న వానిలో మానవ సమగ్రాభివృద్ధి సాధనకు కృషి చేయుచున్నది. అనగా రైతుల ఆర్థిక, సాంఘిక, విద్యా, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యావరణపరమైన అభివృద్ధిని సాధించుట, తద్వారా సామరస్యమైన, అందమైన, శాంతియుత, సంపన్నమైన జీవనమును ఆరు గ్రామాల వారికి అంద జేయుట దాని లక్ష్యమై యున్నది.

ప్రస్తుత కాలమున రైతులు ఎదుర్కొనుచున్న సమస్యలు :

రైతుల భూవతి స్వల్పము. చిన్న కమతాలతో సాగుచేయుట అసౌకర్యముగా నుండును. వారి పెట్టుబడి కూడా చాలినంత యుండక, అరకొరగానే వుండును. ఏదో కొంత పండించుకొందామన్న నీటి వసతి కూడా నమ్మజాలనిదే. రైతుకు కావలసిన విత్తనములు, ఎరువులు, పురుగు మందులు కూడా సరియైన సమయానికి దొరికే నమ్మకము లేదు. ఎట్లో అట్లు కష్టపడి, అవరోధముల నెదుర్కొని, పండించిన పంటను నిలువచేయుటకు సరియైన గోదాములు కూడా అందుబాటులో వుండవు. ఆధునిక కాలమున అధిక భాగము వ్యవసాయానికి యంత్రములను వాడుచు త్వరలో కార్యమును పూర్తి చేయుచున్నారు. రైతులకు యంత్ర పరికరములకు సంబంధించిన సాంకేతిక జ్ఞానము లేదు. దానిని కూడా సంపాదించుకొని వానిని ఉపయోగించు

కుందామని తలచినా, వాని ధరలు రైతులకు అందుబాటులో లేవు. ఇన్ని రకముల సమస్యలతో రోజు రోజుకు అన్నదాత బక్కచిక్కి అతని ఉనికే ప్రశ్నార్థక మగుచున్నది.

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ పరిష్కార చర్యలు :

ఆం.ప్ర. ప్రభుత్వము వారు రైతు సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కార దిశగా "సహకార వ్యవసాయ పద్ధతిని" ప్రవేశ పెట్టినది. రాష్ట్రములోని ప్రతి జిల్లాలో రెండేసి చొప్పున ప్రయోగాత్మక ప్రాజెక్టులను చేపట్టి, వాని అభివృద్ధి ఫలమును రైతాంగమునకు ప్రదర్శించుట వలన, అది గమనించిన రైతులు సహకార సేద్యమువైపు ఆకర్షింప బడెదరు. అని ప్రయోగాత్మక ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వము పూనుకున్నది. సహకార సేద్యమునకు రైతులు తమ భూమిని యివ్వవలసి యుండును. ఆ భూమికి సమాన విలువగల ధనమును ప్రభుత్వము వారు, అట్టి సహకర సంఘమున కందిచెదరు. తద్వారా సాగును కొనసాగించవచ్చును.

రైతుల స్పందన :

ప్రభుత్వము సహకార సేద్య ప్రణాళికను ప్రకటించిన నాటి నుండి ఏ జిల్లా రైతులు ముందుకు రాలేదు. ఈ నూతన ప్రయోగములో చిక్కుకున్నచో ఏ ప్రమాదము మూడునో యని రైతులు మూగతనమునే ప్రదర్శించుట జరిగినది. వారు తమ భూములపై యాజమాన్య హక్కులను వదులు కొనుటకు సంసిద్ధముగా లేరు.

సహకార సేద్యమునకు గడ్డిపల్లి రైతులు సంసిద్ధత :

నల్లగొండ జిల్లాలోని గడ్డిపల్లి సహకార సంఘము రైతులు, ఆరు గ్రామాల వారు తమ స్వాదీనములోని 10,000 ఎకరముల ఆయకట్టు భూములను సహకార పద్ధతిలో సేద్యమును కొనసాగించుటకు, ప్రభుత్వ ప్రకటనకు స్పందించినారు. 25-30 సంవత్సరముల సుదీర్ఘకాలమునకు, తమ పంట పొలాలలను సొసైటికి లీజుకు యిచ్చుటకు, ప్రభుత్వ నియమానుసారముగా సంసిద్ధతను ప్రకటించినారు.

సహకార సేద్యమునకు గడ్డిపల్లి ఆదర్శప్రాయము; ఎందుకు ? :

గడ్డిపల్లి సహకార సేద్యమునకు 40 సం॥ల సుదీర్ఘ చరిత్ర కలదు. అక్కడి సొసైటి 1969లో "మహాత్మాగాంధి శతజయంతి సంవత్సరము, అక్టోబర్ 2వ తేదీన" యేర్పడినది. ఈ ఉద్యమ నేపధ్యము దానికి సంపూర్ణముగా నున్నది. దానికి

తోడుగా, ఆనాటి నుండి అది అన్నిరంగములలో సమగ్రాభివృద్ధిని సాధించినది. భారత ప్రభుత్వ వ్యవసాయ శాఖవారు ప్రసాదించిన, నల్లగొండ జిల్లాకు చెందిన "కృషి విజ్ఞాన కేంద్రము" (K.V.K.) ను తన ఒడిలో చేర్చుకొని, ఆనాటి నుండి యువశక్తిని తీర్చిదిద్దినది. యంత్ర సహాయము ద్వారా చేయు సేద్యమునకు, సాంకేతిక జ్ఞానము నందించే ఈ సంస్థ ఉనికి కీలక పాత్రను పోషించు చున్నది. మరొక విశేషమేమనగా యిచటి రైతాంగము నందధిక శాతము ప్రజలు BC / SC / ST తెగలకు చెంది, చిన్నకమతాల భూవసతి గలవారు. మరొక ముఖ్య అంశమేమనగా - గడ్డిపల్లి గ్రామమునకు నలువైపులా, జిల్లాకు చెందిన నాలుగు ప్రధాన పట్టణములున్నవి. అవి సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడ - ఇన్ని విధములుగా గడ్డిపల్లి రైతులు సహకార సేద్యమునకు సంసిద్ధతను ప్రకటించుట జరిగినది.

గడ్డిపల్లి లిఫ్టు ఇరిగేషన్ కాంప్రహెన్సివ్ ఇంటిగ్రేటెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్ - ఆశయములు లక్ష్యములు :

సంఘములోని సభ్యులందరకు సామరస్యపూరిత, సౌందర్యాత్మక, శాంతియుత సంతోషదాయక, సుసంపన్న జీవితము సంప్రాప్తము కావాలి. సమాజము సమగ్రాభి వృద్ధిని సాధించాలన్న ఆశయమును కలిగియున్నది. సమగ్ర అభివృద్ధి అనగా - మానవ జీవితమునకు కావలసిన అన్ని రంగములందు అభివృద్ధి జరగాలి. అనగా ఆర్థిక రంగము, సాంఘిక రంగము, విద్యారంగము, సాంస్కృతిక రంగము, ఆధ్యాత్మిక రంగము మరియు పర్యావరణ (Environmental) రంగములు - ఈ ఆరు రంగములందు సమతౌల్యముగా అభివృద్ధి జరిగినపుడు, సంఘములోని వారి జీవనము సుఖ శాంతిమయము కాగలదు. ఇపుడిక రైతుల జీవితాలను బాగు పరచుటకు ప్రస్తుత వ్యవస్థలో కొన్ని మార్పులు తీసుకరాక పుదు. యింతవరకు వారు వ్యక్తిగతముగా సాధించిన పనులు మోతాదు బ్రతుకులకే పరిమితమైనవి. ఆధునిక వనరులను ఉపయోగించు కొనుటకు సమిష్టి జీవన విధానమును అనుసరించక తప్పదు. నిజమైన మార్పును రైతుల జీవనములో తేవాలనుకున్నచో, వ్యవసాయ ఉత్పత్తిని పునర్విభజన చేసి నిర్వహించాల్సి యుంటుంది. చిన్న తరహా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను నెలకొల్పాలి. వ్యాపారమును, మార్కెటింగ్ వ్యవస్థను కూడా మన వశంలోకి తీసికొనుట అవసరమగును. ఈ మార్పు రావాలని వుంటే, మనము వ్యక్తిగత దృక్పధమును వీడి మరొకరిని తోడు తీసుకొని సాగవలసి యుండును. అప్పుడిక వ్యక్తి బలముతోపాటు

సమిష్టి బలమును కూడా జతపరచినట్లు కాగలదు. అదే సమిష్టి జీవన విధానమునకు దారి తీసి సహకార పద్ధతిని బలపరచగలదు. సభ్యులంతా సంకుచిత వ్యక్తిగత భావనను వీడక తప్పదు. సమిష్టి విధానంతో ప్రయోజనం పొందుటకు రైతులందరు జతకట్టక తప్పదు. ఇదే యుగ ధర్మము.

వ్యవసాయ ఉత్పత్తి పునర్ సంఘటన :

1. ప్రస్తుత పనిశక్తిలో 25% ను వ్యవసాయ పనిలో పెట్టుట.
2. మిగతా 75% ను శిక్షణ యిచ్చి వ్యవసాయేతర కార్యములందు, సేవారంగము, వ్యవసాయాధారిత పరిశ్రమలందు, వ్యాపారమునందు వినియోగించాలి.
3. సమగ్రమైన, మిశ్రితమైన వ్యవసాయ విధానము నవలంభించి, 50 ఎకరము లకు 1 యూనిట్‌గా వ్యవసాయమును చేపట్టి ఒకదాని నుండి వచ్చే వ్యర్థము రెండవ దానికి ఎరువుగా ఉపయోగపెట్టినచో పెట్టుబడి ఖర్చు తగ్గగలదు.
4. వ్యవసాయమును యంత్రముల సహాయంతోనే నిర్వహింప చేయాలి. సమయము మరియు శ్రమ రెండూ వృధాకాకుండా యుండగలదు.

వ్యవసాయ పరిశ్రమలను వ్యవసాయానికి చెందిన వస్తువుల, వ్యాపార సంస్థలను నెలకొల్పుట.

వ్యక్తి & సమిష్టి యిర్వురు లాభపడుటకు ఒక వేదికను ఏర్పాటు చేయాల్సి యుండును. దానికై "శ్రీఅరవింద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంటు" గడ్డిపల్లి సంస్థ ఒక ప్రతిపాదనను ముందుపెట్టెను. దాని ప్రకారము రైతులు, వాటాధారులుగా ఒక కంపెనీని నెలకొల్పవలెను. ఆ కంపెని దిగువ చర్యలను చేపట్టవలెను.

సహకార సేద్య సంఘము సభ్యులు తమ వాటాధనముతో స్థాపించ దలచిన కంపెనీకి మొదట కావలసిన హంగులను, అనగా - బిల్డింగులు, గోదాములు ఏర్పాటు చేయుకొనవలయును.

ఆ కంపెనీకి పెట్టుబడులను, నిపుణులను అవసరమగు వనరులను అన్నింటిని సమకూర్చుకొన వలసియుండును.

కంపెనీకి ధనము ఎప్పటికీ అవసరమగును కావున దానిని సమకూర్చు కొనుట మాత్రమే కాదు, దానిని సరియైన విధముగా వినియోగించవలెను.

కంపెనీ ద్వారా కమ్యూనిటి సౌకర్యములను అనగా విద్య, ఆరోగ్యము, వినోద కార్యక్రమములను కలిగించ వలయును.

సహకార సేద్యము వలన రైతుకు కలిగే లాభములు :

సహకార సేద్యము వలన కలిగే లాభములు చాలనే వున్నవి. రైతు తన భూమిని సహకార సొసైటికి లీజుకు యివ్వడము వలన దాని నుండి కొంత ఆదాయము సమకూరగలదు.

భూమి కిరాయకు యిచ్చినాము కదా యని రైతులు పనిచేయక మిన్నకుండ రాదు. ఏదో ఒక పని చేయాల్సి యున్నందున దాని వలన కూడా కొంత ఆదాయము రాగలదు.

సహకార సేద్యరైతుల పెట్టుబడితో యేర్పాటు చేసిన పరిశ్రమలు, వాణిజ్య సంస్థల నుండి కూడా కొంత ఆదాయమును పొందవచ్చును. పరిసరములు పచ్చని చేలతో నిండి, పర్యావరణ సదుపాయములు కలిగించును.

దీనివలన రైతులు తమ వాటాధనమువలన తాము లాభపడుటతో పాటు సమిష్టికి కూడా లాభమును సమకూర్చుదురు. చిత్తశుద్ధితోను, విశాల దృక్పధము తోను, అందరికి క్షేమము, లాభము సమకూరాలని దృష్టియందుంచుకొన్నపుడు సహకార సేద్యము సమిష్టికి లాభదాయకము.

ప్రభుత్వము ప్రకటించిన "సహకార సేద్య" విధానమునకు రైతులు, ఏ జిల్లా నుండి స్పందించుట లేదని చెప్పుకున్నాము. నల్లగొండ జిల్లాలోని ఒక గడ్డిపల్లి గ్రామ రైతులు మాత్రమే స్పందించినట్లు మొదట విన్నవించియుంటని. దానికి ప్రధాన కారణము రైతును తన భూమిపై యాజమాన్య హక్కులను వదులు కొనవలసినదిగా చట్టములో పేర్కొన్నారు. దీని కారణముగానే రైతులు స్పందించుట లేదు. దీనికి ప్రభుత్వము ఎంతో జాగ్రత్తగా తమ రైతుల మేలు కోరి సహకార వ్యవసాయ పద్ధతిని ప్రవేశపెట్టినది; చట్టము చేసినదని చెప్పుకొనుటకు మాత్రమే సరిపోయినది. కాని ఆచరణకు రావడము లేదు. కావున దానిలోని లొసగులను పసికట్టి, రైతు సంఘములతో చర్చించి, వానిని సరిచేసినపుడు ప్రజల స్పందన లభ్యమగును. చట్టము అమలగును. కావున ప్రజలు సమిష్టిగా ప్రభుత్వము నుండి ఏమి కోరుచున్నారు ? అనునది తెల్పుకోవాలి.

1. సహకార సేద్య పద్ధతి లోనికి సమిష్టి వ్యవసాయము నిర్వహించుటకు ప్రతి రైతు తన భూమిని 25-30 సం॥ల వరకు సొసైటీకి లీజుకు యిచ్చినా, తన భూమిపై యాజమాన్య హక్కును వదులు కోవలసిన అవసరము లేదు, అని చట్టాన్ని సవరించాలి.
2. ప్రభుత్వము. ఈ క్షేత్రములలో జరుగుచున్న పనులను దానికి సహకరించు వారిని ఆజమాయిషీ చేయుటకు ప్రభుత్వ సెక్రటరీ హోదా కల్గిన అధికారిని నియమించాలి.
3. ఈ సొసైటీ ద్వారా చిన్న, సన్నకారు రైతులకు ఆర్థిక సహాయాన్ని అందించాలి.
4. సహకార సొసైటీ భూముల విలువలకు సమానమైన ధనమును ప్రభుత్వము యివ్వాలి.

ఈ విధముగా ప్రభుత్వము సహకరించినపుడు సహకార ఉద్యమముతో సమాజములో సౌభ్రాతృత్వ, సమానత్వ భావన పెరిగి, సుఖశాంతులతో సమాజము అందులోని ప్రజలు మనగలరు. నవ్యసమాజ నిర్మాణదిశగా ఒక అడుగు ముందుకు వేసిన వారమగుదుము.

నవ్య సమాజ దిశగా నూతన ప్రణాళికా సృష్టి :

మానవుని పురోభివృద్ధి, నవ్య సమాజ దిశగా నిర్దేశింప బడినపుడు, సమాజాంతర్గత వ్యవహారముల నన్నిటిని నూతనముగా సృష్టించు కొన్నపుడే, సమాజ గమనము ఆదర్శమైన విధముగా పురోగమించగలదు. కాని యెడల పాత పద్ధతులకే అంటిపెట్టుకొని అభివృద్ధికి దూరమగుదుము. సమాజము నవ్యదిశగా నడచినపుడు ఆదర్శవంతముగా నుండాలి కదా !

డా॥ గోపాలరెడ్డి గారు తమ ప్రణాళికలో అనేక విషయములను పేర్కొన్నారు. కాని అందులో నుండి (3) అంశములను మాత్రమే స్వీకరించి ఉదాహరణ పూర్వకముగా తెలియబరచు చున్నాను. అవి.

1. జాతీయ లక్ష్యము.
2. నూతన జనావాసములు.
3. సమగ్ర విద్య.

1. జాతీయ లక్ష్యము :

ఒక జాతి సర్వాంగ సుందరముగా రూపొందవలెనన్న జన జీవనము సుఖ ప్రదముగాను, అభివృద్ధి పరము గాను ముందుకు సాగవలెను. మానవ జీవనము నకు అవసరమైన రంగములందు, అభివృద్ధి సాధింప బడవలయును. అందుకై వారు "ఆరు ముఖముల" అభివృద్ధి ప్రణాళికను పేర్కొనినారు.

1. ఆర్థికాభివృద్ధి,
2. సాంఘికాభివృద్ధి
3. విద్యాభివృద్ధి,
4. సాంస్కృతిక వికాసము
5. ఆధ్యాత్మిక చైతన్యాభివృద్ధి,
6. పర్యావరణ పరిరక్షణ

ఈ ఆరు రంగములు సమతౌల్యముగా ముందుకు సాగినపుడు జాతి ఉద్ధరణ సంభవము కాగలదు. ఇందులోని ఏ ఒక్కటి కూడా నిర్లక్ష్యము చేయబడకుండా, శ్రద్ధను కనబరచి నపుడు, జాతి సంపద పెరుగగలదు. ప్రజాజీవనము సుఖవంత మగును. దేశము సౌభాగ్యవంతంగా, ఆదర్శప్రాయముగా శోభిల్ల గలదు.

2. నూతన జనావాసముల రచన :

ప్రస్తుత గ్రామములు గాని, పట్టణములు గాని, మన వద్ద క్రమపద్ధతి ననుసరించి పెరుగుట లేదు. బజారులు ఇరుకుగాను, వంకర టింకరగా నుండుట, మురుగు కాల్వలు లేక అనారోగ్యకరమైన వాతావరణం నెలకొన్నది. ఇది మారి పోవాలి. ఇకనుండి నిర్మాణమగు గృహములు, గ్రామములు ఇంజనీరింగ్, వాస్తు విద్యలకు అనువుగా అందంగా వుండాలి. ఎక్కువ జన సమర్ధము కాకుండా, ధనిక పేద తారతమ్యముపై కాక, ఆరోగ్యకరమైన విధంగా గృహముల రచన యుండాలి.

డా॥ గోపాలరెడ్డి గారు జనావాసములు నాలుగు రకములుగా యుండుటకు నిర్ణయించినారు.

జనావాసము	జనాభా	విస్తీర్ణము
1. ఆదర్శ గ్రామము	5,000	4 హెక్టార్లు
2. ఆదర్శ గ్రామీణ పట్టణము	15,000	40 హెక్టార్లు
3. ఆదర్శ పట్టణము	50,000	100 హెక్టార్లు
4. ఆదర్శ నగరము	2,00,000	250 హెక్టార్లు

ఒక దేశ జనాభాలో బాలలు, బాలికలు మొదలు స్త్రీలు, పురుషులు మొదలు వృద్ధుల వరకు అన్ని వయస్కుల వారుందురు. అర్హత ననుసరించి అందరకు పని కల్పింపబడ వలయును, వారి జీవనమునకు వలయు సౌకర్యములను సమకూర్చు బడవలయును. అప్పుడు గాని 'జాతీయ లక్ష్యము' నెరవేర గలదు. వారు నిర్వచించిన జాతీయ లక్ష్యము –

"ప్రతి పౌరుని యొక్క సమగ్రాభివృద్ధి, సామరస్యపూర్వక,
సౌందర్యాత్మక, శాంతియుత, ఆనంద, అభివృద్ధి కరమైన
జీవితము ద్వారా కొనసాగబడవలయు" నని పేర్కొని యున్నారు.

విద్యాపరమైన అంశములు :

దేశములోని బాల బాలికలు వికసించి, ఉత్తమ పౌరులుగా రూపొందుటకు వారికి కావలసినది, ప్రధానమైనది విద్య. ఇది వ్యక్తికి అంతర్నేత్రము. ఈ విద్య ఏదో ఒక విషయమును గ్రహించిన చాలదు. ఇది "సమగ్రమైనది"గా యుండ వలయును. అందుకే శ్రీమాతారవిందుల పద్ధతిలో "సమగ్ర విద్య"కే ప్రాధాన్య ముండును. ఇది నాల్గు రకములుగా వారు పేర్కొన్నారు.

1. శారీరక విద్య – (Physical Education)
2. ప్రాణిక విద్య – (Vital Education)
3. మానసిక విద్య – (Mental Education)
4. ఆధ్యాత్మిక విద్య – (Spiritual Education)

ఈ నాల్గు రకముల విద్యను విద్యార్థికి ఏకకాలమునందే గరపబడ వలయును. అవుడుగాని అన్ని రంగములందు వికాసము సంభవించగలదు. (Allround Development) గడ్డిపల్లిలో ఈ రకమైన విద్యకు గట్టి పునాదులు పడినవి.

డా॥ గోపాలరెడ్డి గారి ధ్యేయము – "గ్రామాభ్యుదయము ద్వారానే దేశాభ్యు దయము సిద్ధించును" అను వారి ఆకాంక్ష, సుదృఢమై శ్రీ మాతారవిందుల అనుగ్రహం ఆశీస్సులతో, సత్వరముగా దేశమందు ఆచరణలోనికి రావాలని, గ్రామీణ భారతమునకు 'గడ్డిపల్లి ఆదర్శము' మార్గదర్శనము చేయాలని ఆకాంక్షించుచు, మనమందరము శ్రీమాతారవిందుల చరణ కమలములకు, సభక్తి ప్రణామములు చేయుదము.


★ ★ ★

జాతీయ లక్ష్యము

ప్రతి పౌరుని యొక్క సమగ్రాభివృద్ధి సామరస్య పూర్వక, సౌందర్యాత్మక, శాంతియుత, ఆనంద, అభివృద్ధి కరమైన జీవితము.

ఆరు ముఖముల అభివృద్ధి

1.	ఆర్థికాభివృద్ధి	2.	సాంఘికాభివృద్ధి
3.	విద్యాభివృద్ధి	4.	సాంస్కృతిక వికాసము
5.	ఆధ్యాత్మిక చైతన్యాభివృద్ధి	6.	పర్యావరణ పరిరక్షణ



★ ★ ★

నూతన జనావాసాల రచన

అభివృద్ధి పరచు విధానము
అందు నివసించువారికి పనులను, సేవలను
సౌకర్యములను కలిగించుట.

1. గ్రామ సముదాయములు – ఒక్క గ్రామము, 5000 జనాభాకు పరిమితము. వారికి అన్ని హంగులు కల్గియుండును.
2. గ్రామీణ పట్టణములు – ఒక్కొక్క దానిలో 15,000 జనాభా – మెరుగైన స్థాయిలో సౌకర్యములుండును.
3. పట్టణములు – ఉన్నత స్థాయి సౌకర్యములతో 50,000 జనాభా కల్గియుండును.
4. మధ్యరకపు నగరములు – మెగా నగర స్థాయి సౌకర్యములు కలిగి, 2 లక్షల జనాభా కల్గియుండును.

★ ★ ★

ఆదర్శ గ్రామము

(5000 జనాభా)

ఒక ఆదర్శ గ్రామములో ఉండవలసిన సౌకర్యములు :-

1. ఉన్నత పాఠశాల (తెలుగు & ఇంగ్లీషు మీడియం).
2. పారిశ్రామిక కాంప్లెక్స్ (చిన్న తరహా).
3. కొనుగోలు కేంద్రముల (అంగళ్ళ) కాంప్లెక్స్.
4. ఆరోగ్య & పశువైద్య కేంద్రములు.
5. క్రీడా మైదానము.
6. కమ్యూనిటి హాల్.
7. బహిరంగ థియేటర్
8. టెలిఫోన్ టవర్
9. వినోదాత్మక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కావలసిన సౌకర్యములు.
10. గృహ సముదాయము.
11. గ్రామీణ గ్రంధాలయము.

★ ★ ★

ఆదర్శ గ్రామీణ పట్టణము

(15,000 జనాభా)

ఆదర్శ గ్రామములో గల అన్ని సౌకర్యములతోపాటు, అదనముగా
ఈ దిగువ సౌకర్యములు కూడా కలిగి వుండవలెను.

1. వివిధ ప్రభుత్వ సంస్థలకు కావలసిన పాలక భవనముల సముదాయము
2. అన్ని శాఖలతో కూడిన 50 పడకల ఆసుపత్రి.
3. విజ్ఞాన శాస్త్ర, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, వివిధ రకములైన క్రీడలకు సౌకర్యములు కలిగి యుండాలి.
4. గ్రామీణ పరిశ్రమల కాంప్లెక్సు,
5. గ్రామీణ బ్యాంకు.

★ ★ ★

ఆదర్శ పట్టణము

(50,000 జనాభా కల్గియుండును)

గ్రామములోని సదుపాయము & గ్రామీణ పట్టణము (Rural Town) లలో
కల్గించిన సౌకర్యముల కన్న అధికముగా
ఈ దిగువ సౌకర్యములను “ఆదర్శ పట్టణము”లో కల్గించ వలయును.

1. డిగ్రీ కళాశాల – వృత్తి విద్యా కోర్సులతో,
2. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన పరిపాలక భవనముల సముదాయము.
3. వైద్యమునకు సంబంధించి వివిధ శాఖలతో కూడిన వైద్య సేవలందించు 100 పడకల ఆసుపత్రి.

★ ★ ★

ఆదర్శ నగరము

(2 లక్షల జనాభా కల్గియుండును)

ఆదర్శ గ్రామములో గల సౌకర్యములు, ఆదర్శ గ్రామీణ - పట్టణములోని సౌకర్యములు, ఆదర్శ పట్టణములలో కల్పించబడిన వసతులకు, అధనముగా ఈ దిగువ సౌకర్యములు కల్పించబడవలయును.

1. విశ్వ విద్యాలయము.
2. 200 పడకల ఆసుపత్రి - వివిధ వైద్య విధానములకు చెందిన అనగా అల్లోపతి, ఆయుర్వేద, హోమియోపతి, యూనాని, ప్రకృతి యోగ, చికిత్సా పద్ధతుల సౌకర్యము కలిగి యుండవలయును.
3. భారీ తరహా & మధ్య తరహా పరిశ్రమలు, యూనిట్‌లు నెలకొల్పబడ వలయును.
4. పెద్దదైన కేంద్రీయ పార్కు.
5. సాంస్కృతిక, ఆధ్యాత్మిక మ్యూజియంలు.
6. అంతర్జాతీయ స్థాయి కల్గిన క్రీడా స్టేడియంలు.
7. స్థానిక అవసరములను తీర్చెడి విమానాశ్రయము.


★ ★ ★

సమగ్ర విద్య (Integral Education)

అంశములు

(విలువ ఆధారిత విద్య)

1. శారీరక విద్య
2. ప్రాణిక విద్య
3. మానసిక విద్య
4. ఆధ్యాత్మిక విద్య



ఈ నాలుగు రకములుగా నున్న విద్య అభివృద్ధి జరిగినపుడు వ్యక్తి వికాసము జరుగును.

★ ★ ★

Dr. Gopal Bhai, as I see him :

He is a living Valcano. He is always emits waves of contagious energy. His perseverence and doggedness are proverbial. He is indefatiguable. He knows no depression.

He has been working in Gaddipally for the last 40 years. I have yet to see another Gopal Bhai.

- Dr. V. Manmohan Reddy

Sri Aurobindo Ashramam,
Pondicherry.

నాగార్జున సాగర్ ఎడమ కాల్వ క్రింద క్రొత్తగా స్థాపించబడిన
11 లిఫ్టు యిరిగేషన్ సహకార సంఘాల వివరాలు

వరుస నెంబర్	1	1
స్కీము పేరు	2	మహాత్మాగాంధి
స్కీము నెంబర్	3	R - 8
సొసైటి రిజిష్టరు నెంబర్	4	158 / TP
సొసైటి హెడ్ ఆఫీసు	5	గడ్డిపల్లి
తాలూకా	6	హుజూర్‌నగర్
లాభము పొందు గ్రామములు	7	మేడవరం, ఫతేపూర్, జొన్నలదిన్నె
ప్రెసిడెంటు పేరు	8	డా॥ గోపాలరెడ్డి
స్థలము, మైలు నెం.	9	56-2898.65
లాభం పొందే వారి సంఖ్య	10	92
సముద్ర మట్టము	11	447.85
తొట్టెలో తక్కువగా నుండు నీటి మట్టము	12	457.13
నీరు ఎత్తవలసిన అడుగులు	13	23.27
లిఫ్టు అంచెలు	14	1
పంపు సెట్టు నెంబర్	15	2
మొత్తము హార్సుపవరు	16	160
నీటి పారుదల క్యూసెక్కులు	17	14.85
సగటు	18	495

నాగార్జున సాగర్ ఎడమ కాల్వ క్రింద క్రొత్తగా స్థాపించబడిన
11 లిఫ్టు యిరిగేషన్ సహకార సంఘాల వివరాలు

1	2	3
2	తిరుమల శ్రీనివాస	సీతారామ
3	L - 11 & L - 12	L - 14
4	41 / THH	31 / THH
5	గోగువారిగూడ	వేములపల్లి
6	మిర్యాలగూడ	మిర్యాలగూడ
7	అవంగాపూర్, అన్నపరెడ్డి గూడెం, గోగువారిగూడ, దేవంపల్లి, ఐలాపూర్, నంది పహాడ్.	వేములపల్లి, బుగ్గబావిగూడెం, తోపచెర్ల, తిమ్మారెడ్డిగూడెం, గుండ్లవారిగూడెం
8	ఆర్. వెంకయ్య	సి. చంద్రారెడ్డి
9	34-1747.00	36-1908.00
10	196	230
11	462.33	460.30
12	471.82	469.79
13	33.18	52.21
14	2	2
15	3	3
16	590	645
17	45.00	64.55
18	1500	2155

1	4	5
2	ఆదర్శ	జై కిసాన్
3	L - 15 & L - 16	L - 17, L - 18 & L - 19
4	33 / THH	38 / THH
5	సేథిపాలెం	సల్కనూర్
6	మిర్యాలగూడ, సెట్టిపాలెం	మిర్యాలగూడ, సెట్టిపాలెం
7	తిమ్మారెడ్డిగూడ, ముండ్లపాడు, మలకపట్నం, వేములపల్లి, తోపచెర్ల, నరసింహులగూడ, తడకమళ్ల, ఊట్లపల్లి	తడకమళ్ళ, మలకపట్నం, సల్కనూర్, బొమ్మకల్, సెట్టిపాలెం
8	సి. శ్రీనివాస రెడ్డి	ఎం. జనార్ధన్ రెడ్డి
9	39-2053.00	44-231.00
10	138	410
11	458.84	456.29
12	468.33	465.78
13	50.67	54.22
14	2	2
15	4	3
16	460	1300
17	76.86	128.64
18	2562	4288

నాగార్జున సాగర్ ఎడమ కాల్వ క్రింద క్రొత్తగా స్థాపించబడిన
11 లిఫ్టు యిరిగేషన్ సహకార సంఘాల వివరాలు

1	6	7
2	రామలింగేశ్వర	నాగార్జున
3	L - 21	L - 25 & L - 26
4	42 / THH	774 / THH
5	అమన్‌గల్	అన్నారం
6	మిర్యాలగూడ, సెట్టిపాలెం	సూర్యాపేట
7	అమన్‌గల్, తిమ్మారెడ్డిగూడెం, చలిచీమలపాలెం, రావల్‌పెంట	అన్నారం, కల్లూరు, పోతల పహాడ్, దాచారమ్
8	కె. నరసయ్య	ఎన్. కోటయ్య
9	46-2407.00	50-2614.00
10	290	185
11	454.21	450.55
12	457.11	462.83
13	89.30	53.17
14	4	4
15	5	5
16	1015	705
17	61.77	84.33
18	2059	2811

నాగార్జున సాగర్ ఎడమ కాల్వ క్రింద క్రొత్తగా స్థాపించబడిన
11 లిఫ్టు యిరిగేషన్ సహకార సంఘాల వివరాలు

1	8	9
2	జై భారత్	నవభారత్
3	L - 30 & L - 31	L - 33
4	36 / THH	35 / THH
5	కొక్కిరేని	మునగాల
6	హుజూర్‌నగర్	హుజూర్‌నగర్
7	వెలిదండ, కొక్కిరేని, బేతోలు	మునగాల, తాడువాయి, సైద్ ముజ్‌వార్ పేట్
8	ఎ. శంకరరావు	యు. కాంతారెడ్డి
9	65-3400.40	72-3738.00
10	285	212
11	443.13	489.89
12	451.92	448.18
13	40.08	44.82
14	3	3
15	4	4
16	270	628
17	36.00	57.18
18	1200	1906

1	10	11
2	అల్వాల్	కల్పలత
3	R - 1	L - 13
4	40 / THH	34 / THH
5	అల్వాల్	వేములపల్లి
6	మిర్యాలగూడ	మిర్యాలగూడ
7	అల్వాల్, కొత్తపల్లి, శ్రీరామ్‌పల్లి, తిరుమల్‌గిరి	వేములపల్లి, అభంగాపూర్, కుక్కడం, బుగ్గబావిగూడెం
8	జి. నాగయ్య	వి. వీరయ్య
9	6-305.80	36-1860.00
10	205	130
11	481.98	461.20
12	491.88	470.69
13	41.32	51.31
14	2	2
15	3	3
16	590	460
17	55.20	39.54
18	1840	1318

మొత్తం 40 గ్రామాలలో 4 గ్రామాలు 2-3 స్కీముల ద్వారా లాభం పొందుచున్నవి.


లాభము పొందే వారి మొత్తం సంఖ్య 2375 .... సగటు 22134





మహాత్మాగాంధి లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు, గడ్డిపల్లి నిర్మాణమునకు 1969 నుండి 1971 వరకు
అంకిత భావముతో, అకుంఠిత దీక్షతో కృషిచేసి కార్యసాధనకు తోడ్పడిన మిత్రులు.


L-27 L.I.SCHEME STAGE-I


1. NAME OF THE SCHEME
2. SOURCE
3. LOCATION
4. ESTIMATED COST
5. CONTEMPLATED AYACUT
6. DATE OF COMMISSIONING 25-07-1971
7. LWL IN SUMP WELL
8. PUMP AXIS LEVEL
9. FLOAT FORM LEVEL
10. TOTAL SUCTION HEAD INCLUDING LOSSES 4.56 MTS
11. TOTAL DELIVERY HEAD INCLUDING LOSSES 20.07 MTS
12. TOTAL DELIVERY HEAD INCLUDING LOSSES 25.05 MTS
13. PRESSUREMAIN
14. HP OF AND NO OF PUMPS AND MOTORS
15. TYPE OF PUMP
16. TYPE OF MOTOR
17. TOTAL DISCHARGE OF THE SCHEME 26 CUSECS
18. NO OF VILLAGES COVERED : 6 NOS
1. MEJARAM-1500 ACS
2. FATHPUR-686 ACS
3. GADDIPALLY-2500 ACS
4. DOCPAHAD-562
5. LINGALA
6. PONDUGULA
19. NO OF BENEFICIARIES
20. SOCIAL STATUS OF BENEFICIARIES































HITACHI


























గడ్డిపల్లి ధ్యానమందిరమును సందర్శించిన
పూజ్య మహర్షి చంపక్‌లాల్, శ్రీ అరవిందాశ్రమము.





మహా మంత్రము

1938లో ఒక సాధకుడు శ్రీ అరవిందులను, మీది మరియు శ్రీమాత పేర్లతో కూడిన ఒక మంత్రమును వ్రాసి పంపమని కోరగా ఈ క్రింది చిన్న ప్రార్థనతో కూడిన మంత్రమును వ్రాసి పంపిరి.

" ఓం శ్రీ అరవిందో మీరా !

నా మనస్సును, నా హృదయమును, నా జీవితమును,
నీ దివ్య కాంతికొరకు, నీ దివ్య ప్రేమ కొరకు, నీ దివ్య శక్తి కొరకు
ఎల్లప్పుడు తెఱచి యుండునట్లు అనుగ్రహించుము.
అన్ని వస్తువులందును, అంతటా నిన్నే ఎల్లవేళల
దర్శించునట్లు అనుగ్రహించుము."

ఈ మంత్రయుక్త ప్రార్థనను పంపుతూ ఇట్లు అనుగ్రహించిరి. ఎవరైతే ఈ మంత్రయుక్త ప్రార్థనను నిత్యము పఠింతురో, జపింతురో వారికి ఎలాంటి ఆపదలు గాని, బాధలుగాని కలుగవు. వారి అంతరంగము ఎల్లప్పుడు పరమచైతన్యముతో నుండును.

★ ★ ★

A MANTRA

In 1938 I had asked Sri Aurobindo for a brief prayer with His and the Mother's names to use as a mantra. Sri Aurobindo sent the following :

"Om Sri Aurobindo Mira

Open my mind, my heart, my life to your Light, your love, your power. In all things may I see the divine"

While sending this mantra, Sri Aurobindo wrote :

"I have written for you a brief prayer with the names in the form of a mantra. I hope it will help you to overcome your difficulty and get an inner foundation".

Sri Aurobindo

Dt : 16-07-1938

★ ★ ★

SITARAM JINDAL FOUNDATION

Honours 27 Awardees for exemplary contributions to the Societ

Selected by the juries comprising very eminent persons.

S R Jindal Prize - Rs.25 lakhs each

For Rural Development & Poverty Alleviation



Dr. Ghanta Gopal Reddy

Winner ofS R Jindal Prize - 2011 for Rural Development And Poverty

Dr. G. Gopal Reddy established Mahatama Gandhi Lift Irrigation Society in Gaddipalli villag
recurrent drought problem of his village. He provided leadership for this successful effort l
cooperation of all the farmers who contributed 10% of their land for common purpose. This
7700 farmers to irrigate 6600 acres of land. He also motivated the villagers to take up othe
works like establishment of a Krishi Vigyan Kendra, establishment of Sri Aurobindo Institut
Development, education and health facilities, self help groups and animal husbandry facili

**'S R Jindal Prize – 2011' for 'Rural Development and Poverty Alleviation' with a cash pri
is awarded to Dr. G. Gopal Reddy jointly with Lok Biradari, Prakalp, for his dedicated wo
development of Gaddipalli Village of Andhra Pradesh.**

Rs. 1 Crore

Honorary Award

SR Jindal Prize Rs. 25 Lakhs

SR Jindal Prize Rs. 10 Lakhs

SR Jindal Prize Gallantry

A mass leader of social and rural development

Know more

Vivekananda Mission, Barrackpore

Welfare of needy women and children, their protection and education is their mission

Know more

Sankara Eye Care Institutions India

Provides quality eye care for millions of poor people at their door step

Know more

SANKARA

Utthan

Promotes social justice through economic empowerment of peop

Know more

Dr. Ghanta Gopal Reddy

Agriculture Scientist, Nalgonda A.P Works to uplift villagers through improved farming, education and health

Know more

Lok Biradari Prakalp

Service to tribals in health, educa and agriculture

Know more

SITARAM JINDAL PRIZE

WHY THE PRIZE

Social service has traditionally been a part of the Indian culture. Several selfless workers have been working silently and have over the years rendered considerable servi
towards welfare of the people.

It is imperative that the society acknowledges their contribution and honours them with the amount of respect they deserve, so that others are inspired to take the cause a

It is with this objective in view that the Foundation has decided to institute the
"Sitaram Jindal Prize". Focus of the venture is more on the direct service rendered by one towards mitigating hardships of Indian Citizens, than limiting it to honoring a gen







DR. GHANTA GOPALREDDY


Sitaram Jind


SRI AUROBINDO
KRISHI VIGYAN KENDRA
FARM SCIENCE CENTRE
GADDIPALLY
NALGONDA
508201
ICAR


KRISHI














Congratulations





ఘంటాకు జిందాల్ ఫౌండేషన్ అవార్డు

గరిడేపల్లి, న్యూస్‌టుడే:బీడు భూములు, సాగునీటి వనరులలేమి, నిరక్షరాస్యత, ఉపాధి కరవై వలస జీవనం సాగిస్తున్న తరుణం. ఇది 1969కు ముందు మండల పరిధిలోని గడ్డిపల్లి ప్రాంత ప్రజల జీవన విధానం. నేడు చాలా వరకు అభివృద్ధి పథంలో నడుస్తూ పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ ఘంటా గోపాల్‌రెడ్డి తీసుకున్న పలు కీలక నిర్ణయాలు, తన జీవిత లక్ష్యాలు. అవే నేడు ఆయన చేసిన, చేస్తున్న పలు గ్రామీణ సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపు తెచ్చాయి.

డాక్టర్ ఘంటా గోపాల్‌రెడ్డి 1932 ఫిబ్రవరి 14న జన్మించారు. ఆయన తల్లిదండ్రులు గంటా అనంతరెడ్డి, వెంకటనర్సమ్మ. అలహాబాద్‌లో వ్యవసాయ పట్టభద్రుడినిగా విద్యాభ్యాసం చేసి ప్రభుత్వ ఉద్యోగం పొందారు. అమెరికాలో మెన్నెసోటా విశ్వవిద్యాలయంలో భూశాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ చేసి అసోసియేట్ ప్రొఫెసర్‌గా చేరారు. అనంతరం వివిధ హోదాలలో పనిచేశారు. 1973లో సొంత గ్రామం వచ్చి ఇక్కడ పరిస్థితులు చూసి చలించిపోయారు. ఎక్కడ చూసినా బీడుభూములు, ఉపాధి లేక అవస్థలు, నిరక్షరాస్యత ఇవన్నీ చూసి తాను పుట్టిన వూరుకు ఏదో ఒకటి చేయాలని సంకల్పించారు. 1973లో శ్రీ అరబిందో గ్రామీణాభివృద్ధి సంస్థను స్థాపించారు. చిన్న చిన్న ఉపాధి శిక్షణావకాశాలను యువతకు కల్పించాలని, వందల మందికి వివిధ వ్యవసాయ అనుబంధ అంశాలపై శిక్షణనిచ్చారు. యువత కొంత వరకు అదే రంగంలో వివిధ ప్రాంతాలలో స్థిరపడ్డారు. రైతుల జీవన స్థితిగతులను కొంతైనా మెరుగు పరచాలని ఆలోచించి సాగర్ ఎడమ కాల్వపై ఎత్తిపోతల పథకాన్ని 1969లో ఏర్పాటు చేశారు. సుమారు 6000 ఎకరాల బీడు భూములను సాగులోకి తేవడానికి కృషిచేశారు. బ్యాంకు నుంచి రుణం తీసుకుని దీన్ని ఏర్పాటు చేశారు. ఇప్పుడు దాన్ని పునరుద్ధరించి జిల్లాలోనే తొలి ఆధునికీకరణ ప్రాజెక్టుగా తీర్చిదిద్దారు.

కె.వి.కె ఏర్పాటు1973లో శ్రీఅరవిందో గ్రామీణాభివృద్ధి సంస్థను స్థాపించి ఈ ప్రాంత ప్రజలకు అందిస్తున్న వ్యవసాయ సేవలను గుర్తించిన జాతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ న్యూఢిల్లీ(కేంద్ర ప్రభుత్వ సంస్థ)వారు కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం ద్వారా వర్మికంపోస్టు, టిష్యూకల్చర్, పట్టుపరిశ్రమ, జీవన ఎరువుల తయారీ కేంద్రం, భూసారపరీక్షా కేంద్రం, పాలదిగుబడులు పెంచడానికి నెదర్లాండ్ ప్రభుత్వం వారి ఆర్థిక సహకారంతో పలు ప్రాజెక్టులను చేపట్టారు. ఇప్పుడు పెన్‌పహాడ్, నంద్యాలగూడెం తదితర ప్రాంతాలలో కేంద్రం మంజూరుచేసిన పలు ప్రాజెక్టులను సమర్థవంతంగా చేపట్టి విజయవంతంగా నడిపిస్తున్నారు. దీంతో వందలాది మంది ఉపాధి పొందుతున్నారు.

rize.org/srjindalprize-25lks.htm

arc Go Find Software Privacy

GO Find Videos Get Video N/A Music DJ

Download Newsletter

SITARAM JINDAL PRIZE

AN OVERVIEW | THE PRIZE | AWARDEES | THE JURY | NOMINATION FORMS | GALLERY | FAQS | ARCHIVES | NE

Awardees

AWARDEES

Jindal Prize Rs. 1 Crore

SR Jindal Prize Rs. 1 Crore

Honorary

SITARAM JINDAL FOUNDATION
Honours 27 Awardees for exemplary contributions to the Society
Selected by the juries comprising very eminent persons.

S R Jindal Prize - Rs.25 lakhs each

For Rural Development & Poverty Alleviation

Anna Hazare

A mass leader of social and rural development.

Know more

Ramakrishna Vivekananda Mission, Barrackpore

Welfare of needy women and

ery.php

Go Find Software Privacy

GO Find Videos Get Video N/A Music DJ

Download Newsletter

SITARAM JINDAL PRIZE

AN OVERVIEW | THE PRIZE | AWARDEES | THE JURY | NOMINATION FORMS | GALLERY | FAQS | ARCHIVES

allery

GALLERY

Jindal Prize Launch
22nd February 2011
VIEW GALLERY

Award Ceremony
Jindal Prize & S.R. Jindal Prize 2011
VIEW GALLERY


SR Jindal Prize
2011
Rural Development
& Poverty Alleviation
Dr G Gopal Reddy

